

ఈనాడు



హైదరాబాద్ 9-1-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 150

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




తాళం స్మార్ట్‌గా

అమెరికాలోని లాస్‌వెగాస్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సృజన ప్రదర్శన వేదికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అత్యాధునిక తాళం ఇది. యజమాని చేతి వేలి ముద్రలు సరిపోలితేనే తెరుచుకోవడం దీని ప్రత్యేకత. వినియోగదారులకు ఉపయుక్తమయ్యే ఎన్నో సృజనాత్మక ఆవిష్కరణలు ప్రస్తుతం ఇక్కడ కొలువుదీరాయి.



టమాటా చిన్నగా

వ్యవసాయరంగంలో అద్భుత ఆవిష్కరణలకు పెట్టింది పేరైన ఇజ్రాయెల్‌లో కెడ్మా అనే సంస్థ అతిచిన్న టమాటాలను అందించే వంగడాన్ని సృష్టించింది. 'డ్రాప్ టమాటా'గా దీన్ని పిలుస్తున్నారు. ఈ టమాటాలు బ్లూబెర్రీ పరిమాణంలో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా సాగవుతున్న టమాటా వంగడాల్లో 'డ్రాప్ టమాటా'యే అతిచిన్నదని చెబుతున్నారు.



అదృష్టం లాటరీగా

దుబాయ్‌లో నివసిస్తున్న భారత సంతతి వ్యక్తి హరికృష్ణన్ నాయర్(42) భారీ జాక్‌పాట్ కొట్టేశారు. లాటరీలో రూ.20 కోట్ల 32లక్షల 23వేలు గెలుచుకున్నారు. 'బిగ్‌టికెట్' డ్రాలో ఇంత పెద్ద మొత్తం లభించిందంటూ ఫోన్‌రాగానే నోటమాట రానంత ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయారు. భార్య, ఏడేళ్ల కుమారుడితో కలిసి ప్రపంచయాత్ర చేస్తానని చెప్పారు.

రైతుకు భరోసా!



పంటకు కనీస మద్దతు ధర లభించేలా కొత్త పథకం

- విపణిలో తక్కువకే పంటను విక్రయించుకోవాల్సి వస్తే ఆదుకునే యోచన
- మధ్యప్రదేశ్‌లో ఇప్పటికే అమలులో ఉన్న భవంతర్ భుగతాన్ యోజన
- వచ్చే బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం
- దేశమంతటికీ వర్తింపజేసే యత్నంలో కేంద్రం

ఈనాడు - దిల్లీ

ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కూడా తమ పంటలకు లభించక రైతులు నష్టపోవాల్సి వస్తున్న పరిస్థితుల్లో వారిని ఆదుకునేందుకు సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే బడ్జెట్ (2018)లో ఈ పథకాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో ఎఫ్‌సీఐ లేదా ఇతర సంస్థల ద్వారా వరి, గోధుమ పంటలను మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేసే(ధాన్యం సేకరణ) విధానం ఉంది. అయితే, ఇతర పంటల ధరలు మద్దతు ధర కన్నా పడిపోయినప్పుడు రైతులను ఆదుకునే వ్యవస్థలేవీ లేవు. ఈ పరిస్థితిని తొలగించి రైతు ఆదాయానికి భరోసానిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ విధానాలను అధ్యయనం చేసింది. వాటిల్లో మధ్యప్రదేశ్‌లోని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వం అమలుచేస్తున్న భవంతర్ భుగతాన్ యోజన(బీబీవై-వ్యత్యాసం చెల్లింపు పథకం) మెరుగైనదిగా గుర్తించింది. మద్దతు ధర కన్నా దిగువ స్థాయికి విపణిలో ధర పడిపోయినప్పుడు ఆ రెండిటికీ మధ్యనున్న వ్యత్యాసాన్ని బీబీవై ద్వారా మధ్యప్రదేశ్ రైతులకు చెల్లిస్తోంది. ఒక పంట నమూనా ధర(ఎం.ఆర్)ను ఖరారు చేయటానికి సొంత రాష్ట్రంలోని విపణి ధర, ఆ పంట పండించే మరో రెండు రాష్ట్రాల్లో విపణి ధరలను పరిశీలించి నిర్ణయిస్తున్నారు. గత ఏడాది జూన్‌లో మధ్యప్రదేశ్ రైతులు గిట్టుబాటు ధరల కోసం ఉద్యమించటం, హింసాయుత ఘటనలకు దారితీసిన నేపథ్యంలో బీబీవైని శివరాజ్‌సింగ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రైతుల ఆందోళన ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుకుంది. బీబీవైని ప్రవేశపెట్టినప్పటి నుంచి 22 లక్షల మంది రైతులు ఆ వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. సోయాబీన్, కంది, మినుములు, పెసలు, వేరుసెనగ, నువ్వులు, మొక్కజొన్న, గడ్డినువ్వులు పంటలకు ఈ విధానాన్ని అమలుచేస్తోంది.

బీబీవై ఎలా పనిచేస్తుందంటే...

- విపణిలో పంటల ధరలు వాటి ప్రకటిత మద్దతు ధరల కన్నా దిగువకు పడిపోయినప్పుడు నమూనా ధర(మోడల్ రేట్)ను ప్రామాణికంగా తీసుకుని ఈ వ్యత్యాన్ని రైతులకు చెల్లించటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం
- పంట ధర తక్కువగా ఉన్న రాష్ట్రం, ఆ పంటను అధికంగా పండించే మరో రెండు రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్లలో విపణి ధరలను పరిశీలించి కేంద్ర వ్యవసాయ మంత్రి శాఖ నమూనా ధరను ఖరారు చేస్తుంది.
- ఉదాహరణకు సోయాబీన్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ ధర క్వింటాకు రూ.3050 అనుకుందాం. విపణిలో ఆ పంటకు రైతుకు రూ.2580 మాత్రమే లభిస్తే కేంద్ర ప్రభుత్వం (3050-2580) క్వింటాకు రూ.470 చొప్పున అతని బ్యాంకు ఖాతాకు జమచేస్తుంది.

రైతు చేయాల్సింది ఏమిటంటే...

తొలుత బీబీబై వెబ్‌సైట్ (మిగతా 2లో)



కరీంనగర్‌లో ఐటీ టవర్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఈటల, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి తదితరులు

కావాలోయ్... ఉద్యోగ సృష్టికర్తలు

- ప్రపంచవ్యాప్త ఆవిష్కరణలు చేయాలి
- విభిన్న రంగాల్లో ఉపాధికి యత్నం
- అన్ని రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- కరీంనగర్‌లో ఐటీ టవర్స్‌కు శంకుస్థాపన

ఈనాడు, కరీంనగర్: ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్.. ఇవన్నీ న్యూటన్ వంటి మేధస్సు ఉన్న వాళ్లు కనుగొన్నవి కావు. మనలాంటి వారే ప్రత్యేక శ్రద్ధతో ఆవిష్కరించినవి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వాటిని వినియోగిస్తున్నారు. ఆవిష్కర్తలు రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.. మనం కూడా వారిలాగే ప్రపంచవ్యాప్త ఆవిష్కరణలు చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. కరీంనగర్‌లో రూ.25 కోట్లతో నిర్మించనున్న ఐటీ టవర్స్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి (మిగతా 2లో)

సేవ చేయని సర్పంచిపై ఇక చర్యలు

- సర్పంచులకు మరిన్ని అధికారాలు
- ఇక వెంటవెంటనే గ్రామ సభలు
- పంచాయతీలకు నిధులు
- మంత్రివర్గ ఉపసంఘం తొలి భేటీ
- అయిదు రోజుల్లో ముసాయిదా బిల్లు

11లో

ఇక రిజర్వు బ్యాంకు దయ..!

- ఎకరానికి రూ.4 వేల పథకంపై మల్లగుల్లాలు
- రైతుకు నగదు ఇవ్వాలంటే పచ్చనోట్ల కొరత
- రాష్ట్రానికి జూన్‌లో రూ.6 వేల కోట్లు నగదు అవసరం
- అందులో 20 శాతం కూడా రావడం లేదన్న బ్యాంకర్లు
- దిల్లీకి వెళ్లి కేంద్రానికి విన్నవించాలని రాష్ట్రం నిర్ణయం

2లో

బడ్జెట్ భారీగానే

- 15 - 18 శాతం పెరుగుదల!
- రాబడిలో 19 శాతం వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో డిసెంబరు నాటికి అమ్మకం పన్ను సహా ఇతర రాబడులు పెరిగిన నేపథ్యంలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 15 శాతం నుంచి 18 శాతం పెరుగుదల ఉండే అవకాశం ఉందని ఆర్థికశాఖ ప్రాథమికంగా విశ్లేషించింది. ప్రభుత్వ శాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను సోమవారానికి సిద్ధంచేశాయి. ఆ ప్రతిపాదనల ఆధారంగా ఆర్థిక శాఖ బడ్జెట్ తయారీ కసరత్తుకు శ్రీకారం చుట్టనుంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,49,446 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

రాబడి పెరిగింది ఇలా: తెలంగాణలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో అమ్మకంపన్ను రాబడిలో 19 శాతం (మిగతా 2లో)



ఆరు నెలల్లోనే 'తుమ్మిళ్ల'

2లో

ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

- ఎత్తిపోతల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు వెల్లడి

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న ఆలంపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్. చిత్రంలో మంత్రులు లక్ష్మారెడ్డి, కృష్ణారావు తదితరులు

ఇదీ సంగతి!



ఒక్కో పోస్టుకు 31 మంది పోటీ

- ఎస్జీటీలో అత్యల్పం, ఎస్ఏ(పీఈ)లో అధికం
- స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు 1.45 లక్షల దరఖాస్తులు
- టీఆర్‌టీ దరఖాస్తులో దొర్లిన తప్పులను సరిచేసుకునేందుకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు పోటీ అత్యల్పంగా ఉంది. ఒక్కో పోస్టుకు సగటున 16.46 మంది అభ్యర్థులు మాత్రమే పోటీపడనున్నారు. టీఆర్‌టీకి రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టీఎస్‌పీఎస్సీ వెలువరించిన 8,792 పోస్టులతో కూడిన ప్రకటనకు అక్టోబరు నుంచి జనవరి 7 వరకు దరఖాస్తులు స్వీకరించారు. టీఆర్‌టీ (మిగతా 2లో)

బీసీలకు రెండు

రాజ్యసభ స్థానాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు

- ఒకటి యాదవులకు ఖరారు
- మూడో స్థానం సన్నిహితునికి!

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి సారించారు. సామాజిక సమీకరణాలను పరిగణనలోనికి తీసుకొని రెండింటిని వెనకబడిన తరగతులకు ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిసింది. గత జూన్‌లో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మరణం అనంతరం ఆ స్థానం ఖాళీగా అయింది. ఏప్రిల్ 2న రాపోలు ఆనంద్‌భాస్కర్ (కాంగ్రెస్), సీఎం రమేశ్ (తెదేపా) పదవీ విరమణ చేయనున్నారు. రమేశ్ ఏపీకి చెందిన వారైనా విభజన సమయంలో ఈ స్థానం తెలంగాణ కోటాలోకి చేరింది. ఇలా ఏప్రిల్ నాటికి మూడు స్థానాలు తెలంగాణకు వస్తాయి. మజ్లిస్ మద్దతు కూడా ఉన్నందున (మిగతా 2లో)



ఆరు నెలల్లోనే తుమ్మిళ్ల ఎత్తిపోతల

ఈనాడు డిజిటల్-గద్వాల, నాగర్ కర్నూల్:

రాత్రిళ్లు ప్రాజెక్టుల వద్ద బసచేస్తూ... సాగునీటి పథకాలను పూర్తిచేయిస్తున్నామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించామన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లాలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పైలాన్‌ను మంత్రి ఆవిష్కరించి, పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- ‘‘ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇక్కడ పాదయాత్ర చేసినప్పుడు... ఆర్డీఎస్ ద్వారా స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించారు. అందుకే రూ.783 కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపడుతున్నాం. ఆరునెలల్లో పనులను పూర్తిచేసి, ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభిస్తాం. 55వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం’’ అన్నారు. ఆర్డీఎస్ ఆధునికీకరణ, తుమిళ్ల ఎత్తిపోతల పథకంతో అలంపూర్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మరి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ మంద జగన్నాథం, జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్, తెరాస రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుమ్మిళ్ల సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నిర్ణీత కాలంలో ‘పాలమూరు’ను పూర్తిచేస్తాం

అంతకుముందు నాగర్‌కర్నూల్ జిల్లా కోడూరు, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల శివార్లలో జరుగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను మంత్రులు పరిశీలించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ...‘‘పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను నిర్ణీతకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

తాగు, సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషిచేస్తున్నారు. రాష్ట్ర సాధన ఫలాలను ప్రజలకు అందించే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ చోట్ల చేపడుతున్న ప్రాజెక్టులను ఆపేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయి’’ అన్నారు. ఏదుల జలాశయం, సొరంగం పనులు పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద సొరంగంగా గుర్తింపు పొందుతుందన్నారు. ఈ జలాశయ నిర్మాణంలో 4లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి పనులు మిగిలాయనీ, మార్చి నాటికి పూర్తిచేస్తామన్నారు.

ఈ జలాశయ నిర్మాణం కారణంగా ముంపునకు గురయ్యే రెండు గ్రామాలవారికి పూర్తిస్థాయిలో పరిహారమిచ్చి, పునరావాసం కల్పించిన తర్వాతే ఖాళీ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం కింద మొత్తం ఐదు జలాశయాలుంటే, నాలుగింటి పనులు కొనసాగుతున్నాయన్నారు. మిగిలిన ఉదండాపూర్ జలాశయ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

ఇక రిజర్వు బ్యాంకు దయ..!

ఈనాడు – హైదరాబాద్

రైతులకు పెట్టుబడి సమకూర్చే పథకానికి రిజర్వు బ్యాంకు సహకారమే కీలకమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నోట్ల రద్దు పరిణామం తర్వాత రాష్ట్రానికి కొత్త నగదు నోట్లు గతంలో మాదిరిగా బ్యాంకులకు రిజర్వు బ్యాంకు పంపడం లేదు. ఇటీవలి కాలంలో కార్డుల వినియోగం పెరగడం వల్ల నగదు చలామణి సైతం గతంలోకన్నా కొంత తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే జూన్‌లో రైతులకు పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4 వేలను నగదు రూపంలో అందించడం ఎలా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. రాష్ట్రంలో 1.42 కోట్ల ఎకరాల సాగు భూములున్నాయి. ఎకరానికి రూ.4 వేల చొప్పున జూన్‌లో ఒకేసారి రూ.5,680 కోట్లను రైతులకు నగదు రూపంలో అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఒకే నెలలో ఒకేసారి ఇంత నగదు ఇవ్వాలంటే బ్యాంకుల్లో నోట్ల కొరత ఏర్పడుతుందని, రైతులు క్యూలు కట్టి నిరసనలకు దిగే అవకాశాలున్నాయని ప్రభుత్వం దృష్టికి బ్యాంకర్లు తాజాగా తీసుకొచ్చారు. జూన్‌లో ఖరీఫ్ కోసం ఒకసారి, తిరిగి అక్టోబరులో యాసంగి కోసం మరోసారి ఇంత భారీగా నోట్ల నగదు తప్పనిసరిగా ఇవ్వాలంటే ఈ విషయంపై ముందే కేంద్ర ఆర్థిక మంత్రికి చెప్పి రిజర్వు బ్యాంకు నుంచి నోట్లను రాష్ట్ర బ్యాంకులకు తెప్పించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని బ్యాంకర్లు, ఆర్థికశాఖ అధికారులు ప్రభుత్వానికి వివరించారు. రాష్ట్రానికి సాధారణంగా నెలకు రూ.1000 కోట్లకు మించి నగదు నోట్లు రావని అంచనా. పైగా ప్రతీ నెలా ఇన్ని నోట్లు వస్తాయనేది లేదు. ఏ నెలకానెల బ్యాంకుల లావాదేవీలను బట్టి, ఇతర రాష్ట్రాల అవసరాలను బట్టి నోట్లను రిజర్వుబ్యాంకు ఎప్పటికప్పుడు సర్దుబాటు చేస్తోంది. ఒక్కోసారి బ్యాంకులు అడిగినా నోట్లు రావడానికి కొంత సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో జూన్‌లో తొలకరి వర్షాలు పడగానే రైతుల చేతికి నేరుగా నగదు నోట్లు పంపిణీ చేయడం సాంకేతికంగా సాధ్యం కాదని తాజా అంచనా. ఈ సమస్యపై ముందుగా ఒక అవగాహనకు రాకుండా నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశాలున్నాయని సైతం అధికార వర్గాలు ప్రభుత్వానికి సూచించాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక, వ్యవసాయశాఖల మంత్రులను దిల్లీకి పంపి కేంద్ర ఆర్థికమంత్రికి విన్నవించి నగదు నోట్ల పంపిణీకి రిజర్వుబ్యాంకు నుంచి హామీ పొందాలని తాజాగా నిర్ణయించారు.

ఏఈఓలకు నగదు వద్దు..: రైతులకు సమీపంగా ఉండే వ్యవసాయ విస్తరణ అధికారులకు(ఏఈఓ) రూ.2 కోట్ల చొప్పున నగదు ఇచ్చి పంపిణీ చేయిస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. కానీ దీనికి వ్యవసాయ, ఆర్థికశాఖలు అంగీకరించలేదని సమాచారం. ఏఈఓ పోస్టులు ఇటీవలే భర్తీ చేశామని, కొత్తగా వ్యవసాయ డిప్లమో చదివి బయటికొచ్చిన 20 నుంచి 25 ఏళ్లలోపు యువత ఉద్యోగాల్లో చేరారని వీరికింకా గ్రామాలపై పట్టురానందున వీరి చేతికి రూ.2 కోట్ల నగదు ఇస్తే దుర్వినియోగానికి అవకాశమేర్పడుతుందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. నగదు వ్యవసాయాధికారుల చేతికి వచ్చే ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లో పరిశీలించకూడదని తెగేసి చెప్పారు. రిజర్వు బ్యాంకు నగదు నోట్లను రాష్ట్ర బ్యాంకులకు పంపడానికి అంగీకరిస్తే చెక్కులు పంపిణీ చేయడం లేదా తపాలా కార్యాలయాల ద్వారా పంపిణీ మేలైన మార్గంగా చెబుతున్నారు. ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మాత్రం టీవ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు వీలుగా గిఫ్ట్‌కార్డు లేదా ప్రీలోడెడ్ కార్డు ఇస్తే మేలని ప్రభుత్వానికి సూచించారు.

బజ్జీల బండికీ అనుమతి

- ఆహార విక్రయాలన్నింటికీ తప్పనిసరి
- చిరు దుకాణాలకూ వర్తింపు
- ఆన్‌లైన్‌లోనే అనుమతులు, పర్యవేక్షణ, ఫిర్యాదులు
- వైద్య కార్యదర్శుల భేటీలో కీలక నిర్ణయాలు
- నేడు ఆమోదించనున్న ఆరోగ్య మంత్రుల సమావేశం

ఈనాడు – హైదరాబాద్

రోడ్డు పక్కన ఇడ్లీ, మిర్చీ బండి, ఇంటి పక్కన చిన్న దుకాణంలో కారం పొడి, కంది పొడో తయారు చేయడం.. ఇలా ఆహారానికి సంబంధించిన ఏ వ్యాపారమైనా అనుమతి తప్పనిసరి చేయాలని జాతీయ ఆరోగ్య పరిరక్షణ నాణ్యత ప్రమాణాల సంస్థ (ఏఎఫ్ఎస్ఎస్ఏ) నిర్ణయించింది. అన్ని రకాల ఆహార వ్యాపారాల్లో నాణ్యత మెరుగుపరిచి ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఆహార వ్యాపారంలో అనుమతులు, పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణ కూడా ఆన్‌లైన్‌లోనే చేపట్టాలని యోచిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శులతో సోమవారం దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మంగళవారం అన్ని రాష్ట్రాల వైద్య, ఆరోగ్య, శాఖ మంత్రుల భేటీలోనూ వీటిపై చర్చించి ఆమోదించనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

కీలక నిర్ణయాలివి..

- ప్రతి 1000 ఆహార వ్యాపార సంస్థలకూ ఒక ఆహార పర్యవేక్షణాధికారి ఉండాలని 2014లో కేంద్రం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సిఫార్సు చేసింది. 10 శాతం కంటే తక్కువమంది ఆహార పర్యవేక్షణాధికారులున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుండడం గమనార్హం. తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో 2 శాతం, బిహార్‌లో 3 శాతం, హిమాచల్‌ప్రదేశ్ 4 శాతం, ఆంధ్రప్రదేశ్, సిక్కిం 7 శాతం, ఒడిశాలో 8 శాతం కంటే తక్కువ పర్యవేక్షణాధికారులు ఉన్నారు. అత్యవసరంగా సంఖ్యను పెంచాలి.
- దేశంలో మొత్తం 72 ఆహార ప్రయోగశాలలు పనిచేస్తున్నాయి. తెలంగాణలో ప్రయోగశాల సహా ఏడింటికే జాతీయ ప్రయోగశాలల గుర్తింపు సంస్థ గుర్తింపు ఉంది. అంటే దాదాపు 90 శాతం ఆహార ప్రయోగశాలల్లో ఫలితాల నాణ్యతపై విశ్వసనీయత లేదు. అందుకే అన్ని ఆహార ప్రయోగశాలల్ని ఆధునీకరించాలి. ఇందుకోసం కేంద్రం రూ.481.95 కోట్లు కేటాయించింది.
- సంచార ఆహార ప్రయోగశాలలను నెలకొల్పాలని నిర్ణయించింది. ఇప్పటికే దేశంలో 62 మంజూరు చేశారు. 30 సంచార పరీక్ష కేంద్రాలకు పరికరాలు కూడా అందజేశారు. ఒక్కోదాని ఖరీదు రూ.39 లక్షలు, నిర్వహణ వ్యయం రూ.5 లక్షలు.
- 29 ఎలక్ట్రానిక్ పాల కల్తీ పరీక్ష కేంద్రాలను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా 1,662 నమూనాలు సేకరించి ఈ పరికరాల ద్వారా పరీక్షించగా ఉత్తమ ఫలితాలే నమోదయ్యాయి.
- నమూనాల సేకరణపై ఆహార పర్యవేక్షణాధికారులకు ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించాలి. ప్రాంతీయ భాషల్లోనూ శిక్షణ ఇవ్వాలి.
- రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో పర్యవేక్షణ కమిటీల పనితీరు లోపభూయిష్ఠం.
- ‘ఆహార పరిరక్షణలో అత్యవసర చర్యల’పై మన దేశంలో ఆలోచనే చేయలేదు. దీనిపై కేంద్ర ఆహార పరిరక్షణ నాణ్యత ప్రమాణాల సంస్థ నమూనా ప్రణాళికను రూపొందించింది.
- వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్, సహాయ కేంద్రాల నంబర్లు, ఈ మెయిల్, వాట్సప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌గ్రామ్.. తదితర రూపాల్లో చర్యలు చేపట్టాలి.
- ఆన్‌లైన్‌లో వ్యాపారికి అనుమతివ్వడానికి ముందే.. ఆహార పరిరక్షణ నిబంధనలను పాటిస్తున్నారా? శుభ్రత ప్రమాణాలు ఎలా ఉన్నాయనేవి పరిశీలిస్తారు.
- తనిఖీలను కూడా ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా మొబైల్ ట్రాకింగ్ వ్యవస్థ అమలు చేయాలి.
- ఆహార పరిరక్షణ సంస్థకు రాష్ట్ర స్థాయిలో స్వయంప్రతిపత్తి కల్పించాలి. అనుమతుల రుసుములు, జరిమానాల ద్వారా వచ్చే ఆదాయంతో నిర్వహణ వ్యయాన్ని సమకూర్చుకోవాలి.
- ఆహార పరిరక్షణపై వినియోగదారులు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

ఒక్కో పోస్టుకు 31 మంది పోటీ

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులో అభ్యర్థుల వ్యక్తిగత వివరాల్లో దొర్లిన తప్పులను సరిచేసేందుకు ‘ఎడిట్’ ఆప్షన్ ఇస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సవరణకు ఒకసారి మాత్రమే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అత్యధికంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు 1,45,158 దరఖాస్తులు వచ్చాయి.

ఆ తరువాత స్థానంలో ఎస్జీటీ పోస్టులకు 89,149 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. టీఆర్‌టీ కింద వెలువరించిన 8,792 ఖాళీలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ఒక్కో పోస్టుకు సగటున 31.57 మంది చొప్పున పోటీపడుతున్నట్లు తెలుస్తోంది.

కేటగిరీ	పోస్టుల సంఖ్య	దరఖాస్తులు సగటున	ఒక్కో పోస్టుకు అభ్యర్థుల పోటీ
స్కూల్ అసిస్టెంట్	1941	1,45,158	74.78
సెకండరీ గ్రేడ్ టీచర్	5415	89,149	16.46
భాషాపండితులు	1011	24,219	23.95
స్కూల్ అసిస్టెంట్ (పీఈ)	9	2,177	241.88
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	416	16,871	40.55

నేడు వెబ్‌సైట్లో ప్రాథమిక కీ

ఈనాడు, హైదరాబాద్: మహిళాశిశు సంక్షేమ శాఖలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, అదనపు సీడీపీవో పోస్టుల భర్తీకి ఈ నెల 4న నిర్వహించిన రాతపరీక్ష ప్రాథమిక కీ మంగళవారం నుంచి వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటుందని టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు ఈ నెల 11 నుంచి 17 వరకు కీపై అభ్యంతరాలు నమోదు చేయవచ్చని పేర్కొంది. ఈ నెల 17 తరువాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

బీసీలకు రెండు

(మొదటి పేజీ తరువాయి)

తెరాస అన్నింటినీ తేలిగ్గానే గెలుస్తుందనే చెప్పాలి. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ఒక స్థానాన్ని యాదవులకు ఇస్తామని ఆయన ప్రకటించారు. మరో స్థానాన్ని కూడా బీసీ వర్గాలకే ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. తెరాసకు మద్దతుగా ఉండే సామాజికవర్గం నుంచి ఒకరిని ఎంపిక చేయాలని భావిస్తున్నారు. బీసీలపై సుదీర్ఘ, సంపూర్ణ అవగాహన గల నాయకుని పేరు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మూడో స్థానాన్ని అత్యంత సన్నిహితులైన వారికి కేటాయించాలని భావిస్తున్నారు. రాజ్యసభ స్థానాన్ని ఎవరైనా మంత్రి ఆశిస్తే అవకాశం ఇచ్చి మరొకరిని మంత్రివర్గంలోకి తీసుకునే వీలుంది. ఖాళీ అయ్యే స్థానాల ఎన్నికలకు నెలన్నర ముందే ఎన్నికలు జరగాల్సి ఉన్నందున త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది.

కక్ష్యలోకి అమెరికా రహస్య ఉపగ్రహం

మయామీ: అమెరికా ప్రభుత్వానికి చెందిన జుమా అనే ఒక రహస్య ఉపగ్రహం కక్ష్యలోకి చేరింది. స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్ దీన్ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం దేనికోసమన్నది వెల్లడి కాలేదు. అమెరికా ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు నార్త్‌రప్ గ్రుమన్ సంస్థ దీన్ని రూపొందించింది. దీన్ని భూ దిగువ కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు మాత్రమే ఆ సంస్థ తెలిపింది. ఇతర వివరాలను వెల్లడించలేదు. నిజానికి ఈ ఉపగ్రహాన్ని గత నవంబర్‌లోనే ప్రయోగించాల్సింది. అయితే రాకెట్‌పైన ఉండే కోన్ భాగంలో ఏవైనా సమస్యలు ఉన్నాయోమో మరింత నిశితంగా పరిశీలించేందుకు వీలుగా ప్రయోగాన్ని వాయిదా వేశారు. ఉపగ్రహాన్ని ఈ కోన్ భాగంలోనే అమరుస్తారు. అంతటి అసాధారణ రక్షణ, గోప్యత ఎందుకన్నది అంతుచిక్కకుండా ఉంది. స్పేస్‌ఎక్స్ సంస్థ లోగడ అనేక నిఘా ఉపగ్రహాలను ప్రయోగించింది.

కావాలోయ్... ఉద్యోగ సృష్టికర్తలు

(మొదటి పేజీ తరువాయి)

ఈటల రాజేందర్‌తో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. మేధో ప్రపంచంలో పోటీ పడాలంటే మనం ఆ స్థాయిలోనే తర్ఫీదు పొందాలని అప్పుడే ఇతర ప్రాంతాలు.. దేశాల వారితో పోటీలో నిలవగలమన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు మన ఐటీ ఎగుమతుల విలువ రూ.56 వేల కోట్లుంటే 2020 నాటికి రెట్టింపు చేస్తామని చెప్పామని.. మూడేళ్లు తిరిగేసరికి రూ.87 వేల కోట్లకు పెంచామన్నారు. హైదరాబాద్‌తో పాటు టైర్-2 నగరాలైన వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌ల్లో ఐటీ పరిశ్రమలకు శంకుస్థాపనలు చేశామని, ఆలస్యమైనా ఇప్పుడు కరీంనగర్‌లో ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నామన్నారు. తొలి రోజే ఎనిమిది కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నామని.. వెయ్యి ఉద్యోగాలకు అవకాశం కలిగిందన్నారు. మరో టవర్ నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాలు సృష్టించాలనుకునే వారికోసం.. ఉద్యోగాలు చేయాలనుకునే వారి కోసం టీ-హబ్, టాస్క్‌లను ఇక్కడ నెలకొల్పుతామని చెప్పారు. ఏ ప్రభుత్వమైనా ఏడాదికి లక్ష ఉద్యోగాలను మించి ఇవ్వలేదని.. ఈ మూడేళ్లలో ఐటీలో ప్రత్యక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించామన్నారు.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు దక్కించుకునేందుకు వీలుగా శిక్షణ ఇస్తున్నామని.. శాటిలైట్ ద్వారా విద్యా, నిపుణ ఛానెళ్లతో ఐఐటీ, గ్రూప్స్, సివిల్స్ వంటి వాటికి పైసా ఖర్చు లేకుండా శిక్షణ తీసుకునే అవకాశం కల్పించామన్నారు. కేసీఆర్ వంటి ముఖ్యమంత్రి దొరకడం తెలంగాణ ప్రజల అదృష్టమని కేంద్ర మంత్రులు పొగుడుతున్నారని.. ఇక్కడ భాజపా నాయకులు గల్లీల్లో అర్థం లేని ఆందోళనలు చేస్తున్నారన్నారు. 24 గంటల కరెంటు సరఫరాను హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ స్వాగతిస్తూ లేఖ రాశారని.. కొందరు నాయకులు మాత్రం ఇష్టారీతి విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో నీళ్లు.. నిధులు.. నియామకాల నినాదాన్ని తీసుకొన్నామని.. నిధులు మన చేతిలో ఉన్నాయని... నీళ్లు తెచ్చే ప్రక్రియ తుది దశకు చేరిందని.. ఇప్పుడు నియామకాల ప్రక్రియ ఆరంభమైందన్నారు. ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలి, పార్లమెంటు చర్చల్లో తెలంగాణ ముద్ర వేశామని.. యువ తరం తమ ఆలోచనలు.. ఆవిష్కరణలతో ప్రపంచంపై తెలంగాణ ముద్రవేయాలని కోరారు.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో ఐటీ టవర్స్ పూర్తి చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సభలో సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్సీలు టి.భానుప్రసాదరావు, నారదాసు లక్ష్మణరావు, జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, టీఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎండీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు..


ఐటీ టవర్‌కు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు, విద్యార్థులు.. మాట్లాడుతున్న ఐటీ మంత్రి కేటీఆర్

ఆర్పీలకు వేతనాల పెంపు ఐటీ టవర్స్ శంకుస్థాపన, బహిరంగ సభ అనంతరం మంత్రులు కేటీఆర్, ఈటల కరీంనగర్‌లో కరీంనగర్ సిటీ రెన్నోవేషన్ (కేసీఆర్) కింద రూ.250 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులు, నగరపాలక కార్యాలయంలో పౌర సేవా కేంద్రం, రూ.25 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులు, ఓపెన్ జిమ్, శానిటేషన్ న్యాప్‌కిన్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మహిళా సంఘాల్లోని రీసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) వీఆర్ఏలతో సమానంగా వేతనాలు ఇచ్చే బాధ్యత తమపై ఉందన్నారు... రాష్ట్రంలో 4,800 మంది ఆర్పీలకు ఇది శుభవార్త అన్నారు. మెప్మాలో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన హెచ్‌ఆర్ పాలసీ త్వరలోనే వర్తింపజేస్తామని.. పురపాలక శాఖ సంచాలకురాలు శ్రీదేవి ఆదేశాలు జారీ చేస్తారని తెలిపారు. పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగేందుకు వార్డు, ఏరియా కమిటీలు వేయాలన్నారు. ఇందులో ఎన్జీవోలు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, సీఠర్పీలు భాగస్వాములుగా ఉండాలన్నారు. వెంటనే అమలు జరిగేలా చూడాలని పురపాలక శాఖ సంచాలకురాలు శ్రీదేవికి ఆదేశాలు జారీ చేశారు.

పిటిషనర్లను టీఆర్‌టీ రాసేందుకు అనుమతించండి

- టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీలో 45 శాతం(ఓపెన్ కేటగిరీ), 40 శాతం(ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విభాగాలు) మార్కులు పొంది న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్లను ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) రాసేందుకు అనుమతించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. వారి దరఖాస్తులను స్వీకరించాలని స్పష్టం చేసింది.

ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు డిగ్రీలో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు తప్పనిసరి అని పేర్కొంటూ నిబంధనలు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ 30 మంది హైకోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది.

గ్రహం అనుగ్రహం

9–1–2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
అష్టమి: రా. 8-51 తదుపరి నవమి
హస్త నక్షత్రం: ఉ. 6-41 తదుపరి చిత్త
అమృత ఘడియలు: రా. 12-44 నుంచి 2-22 వరకు
వర్జ్యం: మ. 2-55 నుంచి 4-33 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-47 నుంచి 9-32 వరకు
తిరిగి రా. 10-48 నుంచి 11-40 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-37; సూర్యాస్తమయం: సా.5-37

పొదుపు పథకాలకూ ఆధార్ అనుసంధానం

- మార్చి 31 వరకు గడువు పొడిగింపు: కేంద్రం

దిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకం కిసాన్ వికాస్ పత్రాలు కొనుగోలు చేసిన వారు, పోస్టాఫీసు ఖాతాల్లో డబ్బు మదింపు చేసుకున్న వారు తమ ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసుకునే గడువును మార్చి 31 వరకూ కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. తొలుత ప్రకటించిన ప్రకారం 2017 డిసెంబరు 31తో గడువు ముగిసింది.

ఆయా పథకాల్లో చేరే సమయాల్లో ఆధార్ సంఖ్యను తమ దరఖాస్తుల్లో జత చేయని వారందరూ గడువు పొడిగింపు అవకాశాన్ని వినియోగించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. బ్యాంకు ఖాతాలు, మొబైల్/సిమ్ కొనుగోళ్లు, గ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ, ప్రజా పంపిణీ వ్యవస్థ తదితరాల్లో లబ్ధిదారుల ఆధార్ అనుసంధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. 35 మంత్రిత్వ శాఖల పరిధిలోని 135 పథకాల లబ్ధిదారులు తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకునేందుకు తాజా గడువు పొడిగింపు అవకాశం కల్పిస్తుంది.

రైతుకు భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా తనపేరు, ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా, భూమి, సమీపంలోని వ్యవసాయ విపణి వివరాలు తెలియజేయాలి.

- పంట కొనుగోలు చేసినట్లుగా వ్యాపారి నుంచి పత్రం, విక్రయించిన పంట తూకం, చెల్లించిన ధర వివరాలు(వ్యాపారి, రైతు సంతకాలతో) సమర్పించాలి.
- రైతు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో వ్యత్యాస మొత్తం నేరుగా జమ అవుతుంది.
- ఒకవేళ కనీస మద్దతు ధర కన్నా రైతుకు విపణిలో అధిక ధర లభించినట్లయితే ప్రభుత్వం ఎలాంటి చెల్లింపులు జరపదు.
- పంటల వారీగా వ్యత్యాస ధరల లెక్కింపు జరుగుతుంది.
- దేశంలోని వ్యవసాయ విపణులన్నీ ఆన్‌లైన్ ద్వారా అనుసంధానమైతే బీబీవై అమలు మరింత సులభమవుతుంది. ఆన్‌లైన్ అనుసంధానం(ఇ-మార్కెట్) వేగిరపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఒక్కో వ్యవసాయ విపణికి నిధుల కేటాయింపును ప్రస్తుత రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే.

బడ్జెట్ భారీగానే

(మొదటి పేజీ తరువాయి)

వృద్ధి రేటు నమోదైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ తాజాగా పన్ను రాబడిని విశ్లేషించింది. ఎక్సైజ్ డ్యూటీ లేకుండా అమ్మకం పన్నులో గత ఏడాదికంటే వృద్ధిరేటు 8 శాతం నమోదు కాగా ఎక్సైజ్ డ్యూటీని అమ్మకం పన్నులో చేరిస్తే వృద్ధిరేటు 19 శాతంగా ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకం పన్ను, మద్యం ద్వారా వచ్చిన పన్ను (వ్యాట్ రాబడి), వస్తుసేవల పన్ను (జీఎస్టీ) రాబడితో బాటు కేంద్రం ఇచ్చిన జీఎస్టీ పరిహారంతో కలిపి అమ్మకం పన్నుగా గణించారు. డిసెంబరు నాటికి రాష్ట్రంలో ఎక్సైజ్ డ్యూటీతో కలిపి పన్నురాబడి రూ. 29,811.30 కోట్లు వచ్చింది.

డిసెంబరు నాటికి అమ్మకం పన్ను రాబడి

అంశం	పన్ను రాబడి (రూ.కోట్లలో)
వ్యాట్ ద్వారా	19,404.54
జీఎస్టీ పరిహారం	169.00
ఎస్జీఎస్టీ	3,969.93
ఐజీఎస్టీ	3,438.88
మొత్తం	26,982.35

గత ఏడాది డిసెంబరు వరకూ పన్నురాబడి: రూ. 24,977.70 కోట్లు
ఎక్సైజ్ డ్యూటీ సర్దుబాటు చేయకుండా ఈ ఏడాది రాబడి: రూ. 26,982.35 కోట్లు
ఎక్సైజ్ డ్యూటీ సర్దుబాటు అనంతరం మొత్తం రాబడి: 29,811.30 కోట్లు

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.3	29.0
మెదక్	11.5	32.8
కరీంనగర్	12.0	30.0
హన్మకొండ	12.5	29.0
రామగుండం	13.0	29.2
హైదరాబాద్	14.0	27.7
విశాఖపట్నం	14.2	28.6
శ్రీకాకుళం	14.5	30.5
తిరుపతి	14.6	29.4
నిజామాబాద్	15.0	30.0
గుంటూరు	15.0	31.0
మహబూబ్‌నగర్	15.7	30.2
ఖమ్మం	18.0	31.0
సూర్యాపేట	20.0	32.0

విత్తన పత్తిపై కత్తి!

- నాసిరకం అని తేలిన వాటిని ధ్వంసం చేయాలి
- కంపెనీలు తిరిగి రైతులకు ఇవ్వరాదు
- విత్తన పంటల ఒప్పందాలను ముందే ఇవ్వాలి
- దేశమంతా అమలుకు మార్గదర్శకాలు జారీచేయండి
- కేంద్రానికి తెలంగాణ వ్యవసాయశాఖ సిఫార్సులు
- దళారులు, కంపెనీల నియంత్రణకు కలెక్టర్లకు ఆదేశాలు



ఈనాడు, హైదరాబాద్: విత్తన పత్తి పంట సాగు, అమ్మకాలు, నాణ్యతపై కొత్త మార్గదర్శకాలు జారీచేసేందుకు తెలంగాణ వ్యవసాయశాఖ రంగం సిద్ధం చేసింది. ఇంతకాలం దేశవ్యాప్తంగా విత్తన పత్తి పంటపై ఎలాంటి నియమాలూ లేకపోవడంతో ప్రైవేటు కంపెనీలు ఆడింది ఆటగా సాగుతోంది. వీటికి అడ్డుకట్ట వేసేందుకు నేరుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా విత్తన పంటల నియంత్రణకు నూతన మార్గదర్శకాలు జారీచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ తాజాగా సిఫార్సు చేసింది. కొత్త మార్గదర్శకాలను తయారుచేసి కేంద్రానికి పంపుతూ వాటిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు సైతం పంపి అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరింది. మరో 4 నెలల్లో బీటీ పత్తి విత్తనాల అమ్మకాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కంపెనీలకు ముకుతాడు వేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పలు జిల్లాల్లో విత్తన పత్తి పంట సాగుచేయిస్తున్నవారిపై ఐటీ దాడులు జరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ కూడా అప్రమత్తమైంది. ఈ పంటను ఎవరు సాగుచేయిస్తున్నారు? రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నదెవరు? తిరిగి పంటను ఎవరు కొంటున్నారనే అంశాలపై ఇంతవరకూ ఎలాంటి రికార్డులూ వ్యవసాయశాఖ వద్ద లేవు. విత్తనాలు తయారుచేసే కంపెనీలకు, రైతులకు మధ్య కొందరు దళారులు(ఆర్గనైజర్లు) కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరే రైతులతో నేరుగా ఒప్పందాలు చేసుకుంటూ పంటలు సాగు చేయిస్తున్నారు. కొందరు రైతులకు ఇష్టం లేకున్నా రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తెచ్చి పంట వేయిస్తున్నారని, ఇలాంటి వాటిని అడ్డుకోవాలని కలెక్టర్లను కోరింది. కంపెనీలిస్తున్న సొమ్ము మొత్తం రైతులకు ఇవ్వకుండా మధ్యలో కొంత దళారులు మింగేస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో పలువురు రాజకీయ నాయకులు వారి అనుచరులనే దళారులుగా పెట్టి రైతులతో ఒప్పందాలు చేయిస్తూ లక్షలార్జిస్తున్నారు. వీరిని నియంత్రించేందుకు జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఇకనుంచి దళారులు లేకుండా నేరుగా రైతులతోనే ఒప్పందాలు చేసుకోవాలని కంపెనీలను వ్యవసాయశాఖ కోరింది.

నాసిరకంతో అసలైన ముప్పు

విత్తన పంట పండిన తర్వాత కంపెనీ ప్రయోగశాలలకు తీసుకెళ్లి నాణ్యత, మొలకశాతాన్ని పరీక్షిస్తున్నారు. జన్యుమార్పిడి కారణంగా బీటీ పత్తి విత్తనాల్లో మొలక శాతం, నాణ్యత సరిగా లేక తిరిగి వాటిని కొని నాటిన రైతులు నష్టపోతున్నారు. ప్రధాన కంపెనీలు ఇలా నాణ్యత, మొలకశాతం సరిగా లేని విత్తనాలను ప్రయోగశాల దశలోనే తిరస్కరించి తిరిగి రైతులకు ఇస్తున్నాయి. కొన్ని కంపెనీలు మాత్రం రైతులకు ఇవ్వకుండా ప్యాక్‌చేసి అమ్మకాలకు పంపేస్తున్నాయి. అన్నదాతలకు ఇచ్చినా వారు తిరిగి ఇతర చిన్న కంపెనీలకు అమ్మేస్తున్నారు. అవే తిరిగి మరుసటి సీజన్‌లో వేర్వేరు పేర్లతో అమ్మకాలకు వస్తున్నాయి. ఇలాంటి వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ తాజాగా ఆదేశించింది. వీటిని తీసుకుని ఎక్కడికక్కడ తగులపెట్టాలని, ప్రతి కంపెనీ ప్రయోగశాలలో నాణ్యత పరీక్షల్లో ఎన్ని తిరస్కరించారనే వివరాలు తీసుకోవాలని జిల్లా కమిటీలకు సూచించింది. కానీ ఈ ఆదేశాన్ని ఈ సీజన్‌లోనే అమలుచేయడం సాధ్యం కాదని విత్తన కంపెనీలు, రైతులు తెగేసి చెప్పడం గమనార్హం. వచ్చే ఏడాది నుంచి మాత్రమే అమలు చేయగలమని చెప్పారు. అంటే ఇప్పుడు నాసిరకం అని గుర్తించిన వాటిని వచ్చే జూన్ నుంచి ప్రారంభమయ్యే కొత్త సీజన్‌లో అమ్మకానికి పంపుతారని అర్థం. ఇవి మార్కెట్‌లోకి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లకు పలు సూచనలిచ్చింది. వీటిని అరికట్టడానికి దేశవ్యాప్తంగా వర్తించేలా విత్తన పంటల నియంత్రణకు మార్గదర్శకాలు జారీచేయాలని కేంద్రాన్ని కోరినట్లు వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి 'ఈనాడు'కు చెప్పారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన ప్రదీప్, తదితరులు

నాలా ఇంకెవరూ తప్పు చేయొద్దు

బుల్లితెర వ్యాఖ్యాత ప్రదీప్

గోషామహల్, న్యూస్‌టుడే: తెలిసో తెలియకో నేను తప్పు చేశాను. నాలా ఇంకెవరూ తప్పు చేయొద్దని వేడుకుంటున్నా.. న్యాయస్థానం ఏ శిక్ష విధించినా అందుకు నేను కట్టుబడి ఉన్నానని బుల్లితెర వ్యాఖ్యాత ప్రదీప్ అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31న మద్యం సేవించి డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ప్రదీప్ వారం తర్వాత సోమవారం గోషామహల్‌లోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు తన తండ్రితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం మద్యం తాగవద్దని నేను చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుందని... కానీ ఇప్పుడు నేనే ఈ తరహాలో పట్టుబడటం ఎంతో బాధగా ఉందన్నారు. మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపవద్దని వేడుకుంటున్నానని పేర్కొన్నారు. నాకు ఇచ్చిన తేదీ, సమయం ప్రకారం ఇక్కడకు వచ్చాను తప్ప నేను ఎక్కడికీ పారిపోలేదన్నారు. తదుపరి చర్యలకు సైతం తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కౌన్సెలింగ్‌లో ప్రదీప్‌తోపాటు మరో వంద మంది పాల్గొన్నారు.

మేడారం జాతరకు మహారాష్ట్ర గవర్నర్, సీఎం

తెలంగాణ భాజపా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజనులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే మేడారం సమ్మక్క-సారక్క జాతరకు హాజరుకావాలని మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను తెలంగాణ భాజపా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆహ్వానించారు. తెలంగాణ సరిహద్దురాష్ట్రాల గవర్నర్లు, సీఎంలను ఆహ్వానించడంలో భాగంగా భాజపా నేతలు మహారాష్ట్ర వెళ్లారు. ఈ జాతరకు వస్తామని గవర్నర్, సీఎం తెలిపారని లక్ష్మణ్ వివరించారు. గవర్నర్‌ను కలిసినవారిలో రాజేశ్వర్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగయ్య దొర, ఎస్టీ మోర్చా జాతీయ కార్యదర్శి అమర్‌సింగ్ పవార్, మాజీ ఎమ్మెల్యే ఒన్నాల శ్రీరాములు తదితరులు ఉన్నారు.

సాయిలును హత్య చేసింది ఇసుక మాఫియానే

టీమాస్ ఫోరం రాష్ట్ర కమిటీ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇసుక మాఫియాకు ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీమాస్ ఫోరం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. నేరెళ్ల ఘటన మరువక ముందే తాజాగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాం గ్రామంలో వీఆర్‌ఏ సాయిలును ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిందని ఆరోపించింది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో బాధిత కుటుంబీకులతో కలిసి టీమాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ విలేకరులతో మాట్లాడారు. సాయిలు వీఆర్‌ఏ అని మృతి చెందిన రోజే స్థానిక ఎస్‌ఐ విచారణ జరిపి ప్రకటించారని గుర్తుచేశారు. మృతుడి భార్యకు ఉద్యోగం, రూ.25 లక్షల నష్టపరిహారం, మూడెకరాల సాగు భూమి, రెండు పడక గదుల ఇల్లు ఇవ్వాలన్నారు. మృతుడి భార్య సాయవ్వ మాట్లాడుతూ.. తన భర్త విధి నిర్వహణలోనే హత్యకు గురయ్యారన్నారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఆర్.సుధాభాస్కర్ మాట్లాడుతూ..8 నెలలుగా సాయిలు వీఆర్‌ఏగా పని చేస్తున్నారని, హత్యకు గురైన రోజూ విధుల్లో ఉన్నట్లు ఆయన మెడలో ఉన్న రెవెన్యూ గుర్తింపు బిళ్లనే సాక్ష్యమన్నారు. వీఆర్‌ఏ సంఘం నేత ఒంగూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో విరసం రాష్ట్ర మహాసభలు: వరవరరావు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: విరసం 26వ రాష్ట్ర మహాసభలను మహబూబ్‌నగర్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు విప్లవ రచయితల సంఘం తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లో విరసం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విరసం నేత వరవరరావు మాట్లాడారు. దేశంలో కుల, వర్గ వ్యవస్థలు అసమానతలకు కారణమవుతున్నాయన్నారు. ప్రధాని మోదీ సర్కారు అన్ని రంగాలను కాషాయీకరిస్తోందని, దేశ సంపదను బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. మనుస్మృతి ప్రతుల దహనానికి కారణమైందనే నెపంతో శాతవాహన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై భాజపా శక్తులు మానసిక దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు.

'పద్మావత్'పై రాజస్థాన్‌లో నిషేధం

జైపుర్: వివాదాస్పదమైన 'పద్మావత్' చిత్రం 'కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి' నుంచి అనుమతి పొందినా దానిని రాజస్థాన్‌లో మాత్రం ప్రదర్శించనీయబోమని ముఖ్యమంత్రి వసుంధర రాజె ప్రకటించారు. 'రాణీ పద్మావతి చేసిన త్యాగం గొప్పది. రాజస్థాన్ కీర్తి ప్రతిష్ఠలు, గౌరవం దానితో ముడిపడి ఉన్నాయి. మా గౌరవానికి ఆమె చిహ్నం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమె హుందాతనానికి భంగం వాటిల్లనివ్వం' అని ఆమె పేర్కొన్నట్లు సీఎం కార్యాలయం తెలిపింది.

త్వరలో కాంగ్రెస్ బస్సు యాత్ర

- సంక్రాంతి తర్వాత కొత్త పీసీసీ, ప్రచార, మేనిఫెస్టో కమిటీలు
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గాంధీ భవన్‌లో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద, ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, కమలాతాయ్, అనిల్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో త్వరలో పీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బస్సు యాత్ర ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు మూడు చొప్పున మొత్తం 119 నియోజకవర్గాల్లో పర్యటన కొనసాగుతుందన్నారు. మేడారం జాతరకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వచ్చే అవకాశం ఉందని, కుదరకుంటే వరంగల్‌లో ఆయన ముఖ్య అతిథిగా బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఓయూలో రాహుల్ గాంధీ సభకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, అనుమతి ఇస్తే నిర్వహిస్తామన్నారు. రాహుల్ పర్యటనలో రైతులు, ఓయూ విద్యార్థులతో భేటీ ఉంటుందన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత పీసీసీ కమిటీతో పాటు.. ప్రచార కమిటీ, మేనిఫెస్టో కమిటీలను కూడా ప్రకటిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీలో తెలంగాణ నుంచి తప్పనిసరిగా ప్రాతినిధ్యం ఉంటుందని తనకు సమాచారం ఉందన్నారు. త్వరలోనే తెరాసతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరతారన్నారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'తెరాస మునిగిపోయే నావ' అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై పార్లమెంటులో బిల్లు పెడితే పార్టీ నిర్ణయం ప్రకటిస్తామన్నారు. పునర్విభజన కోసం తెరాస ఒత్తిడి తెస్తోందన్నారు. సర్పంచ్ ఎన్నిక నేరుగా జరగాలనేదే తన వ్యక్తిగత అభిప్రాయమని ఉత్తమ్ చెప్పారు.

రాహుల్‌కు ధన్యవాదాలు

పీసీసీ అధ్యక్షునిగా తనను రెండోసారి కొనసాగించాలని నిర్ణయించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పదవి కొనసాగిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత తొలిసారి సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. రాహుల్ నాయకత్వంలో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామన్నారు.

కాంగ్రెస్‌లో మహిళలకు మంచి అవకాశాలు

కాంగ్రెస్ పార్టీలో రాబోయే రోజుల్లో మహిళలకు మంచి అవకాశాలు వస్తాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన సోమవారం గాంధీభవన్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. మహిళలకు, సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిచ్చేది కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. వచ్చే కౌన్సిల్‌లో నేరెళ్ల శారదకు అవకాశం రావొచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యుడు ఆర్సీ కుంతియా, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క, జాతీయ మహిళా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి జనరల్ కుమార్ వ్యవహారే, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ్‌ను కలిసిన సాయిలు కుటుంబ సభ్యులు

కామారెడ్డి జిల్లా కారేగావ్ గ్రామంలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సాయిలు భార్య సాయవ్వ, తల్లిదండ్రులు, పిల్లలు సోమవారం గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. సాయిలు జీతం తీసుకున్న రశీదులను చూపించారు. న్యాయం జరిగే వరకు కుటుంబానికి అండగా ఉంటామని ఉత్తమ్ వారికి భరోసా ఇచ్చారు.

ఐటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : పొంగులేటి

ఐటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్‌కు మండలిలో విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి సోమవారం లేఖ రాశారు. ఐటీ ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



నల్గొండ జిల్లా చివ్వెంల మండలంలోని కుడకుడ తపాలా కార్యాలయం ఎదుట పింఛన్‌దారుల అవస్థలు

పండుటాకుల పడిగాపులు..!

అసలే ముదిమి వయస్సు.. ఇక దివ్యాంగులకు శరీరం సహకరించని స్థితి. కుటుంబాల పోషణకు సర్కారు అందజేసే పింఛన్ సొమ్మే ప్రధాన ఆధారం. . ఆ డబ్బులను తీసుకునేందుకు మాత్రం వారికి కష్టాలు తప్పడంలేదు. సంబంధిత మొత్తాన్ని ఏ నెలకానెల ఠంఛన్‌గా చెల్లించాల్సి ఉన్నా.. అధికారుల ఉదాసీనత శాపంగా మారింది. కాళ్లు అరిగేలా తిప్పించుకొన్న తర్వాతే వారికి నగదు ముట్టచెపుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో రెండు మాసాలకు కలిపి ఒకేసారి ఇస్తుండటంతో పండుటాకులు, దివ్యాంగుల పరిస్థితి వర్ణనాతీతం. నల్గొండ జిల్లా చివ్వెంల మండలంలోని కుడకుడ తపాలా కార్యాలయంలో.. కొన్నేళ్లుగా పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇది.. స్థానిక అధికారి డబ్బులు చెల్లించడానికి ముందే పింఛన్‌దారుల నుంచి సంతకాలు సేకరించి పాసుపుస్తకాలూ తన వద్దే ఉంచుకుంటారు. ఇది నిబంధనలకు విరుద్ధమైనా ఆయన పట్టించుకోరు.. ప్రతి నెలలోనూ పలుమార్లు తిప్పించుకున్న అనంతరమే పింఛన్ డబ్బులు చెల్లిస్తారు. దీంతో నిత్యం సమీప గ్రామాల ప్రజలు పింఛన్ల కోసం తపాలా కార్యాలయం ముందు ఇలా పడిగాపులు పడాల్సిన పరిస్థితి. తాగు నీరు సహా కనీస వసతులూ అక్కడ లేకపోవడంతో ప్రస్తుతం వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి తమ పింఛన్లను సక్రమంగా చెల్లించేలా చూడాలని వృద్ధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

—ఈనాడు, సూర్యాపేట

ఏఎస్ఐ మోహన్‌రెడ్డి అనుచరులు బెదిరిస్తున్నారు!

- మంత్రి కేటీఆర్‌తో బాధితురాలి ఆవేదన

కరీంనగర్, న్యూస్‌టుడే: 'ఏఎస్ఐ మోహన్‌రెడ్డి అనుచరులు బలవంతంగా భూమి లాక్కున్నారు. ఇదెక్కడి న్యాయమని అడిగితే బెదిరిస్తున్నారు. మీరే న్యాయం చేయాలి. లేకుంటే చావే శరణ్యం' అని రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్‌కు ఓ మహిళ విన్నవించారు. సోమవారం కరీంనగర్‌లో ఐటీ టవర్ శంకుస్థాపన అనంతరం తిరుగుపయనంలో హెలిప్యాడ్ వద్ద ఉన్న మహిళను అమ్మా ఏంటీ సమస్యంటూ కేటీఆర్ అడగ్గా స్వప్న తన ఆవేదనకు వెలుబుచ్చి..పరిష్కారం చూపాలని వేడుకున్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఏఎస్ఐ మోహన్‌రెడ్డి అక్రమ వడ్డీ వ్యాపారంలో నిందితునిగా ఉండి, వరంగల్ కారాగారంలో ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బాధితురాలి వివరాల మేరకు... చిగురుమామిడి మండలం నవాబ్‌పేటకు చెందిన కాంతాల స్వప్నకు గ్రామంలోని 466/బి, 647/బి, 646/బి, 795/సీలో మొత్తం 7.04 ఎకరాల భూమి ఉంది. డబ్బులు అవసరమవడంతో మోహన్‌రెడ్డి అనుచరులు రంగప్రవేశం చేశారు. రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, స్వరూపలు రూ.5 లక్షలు అప్పు ఇప్పించారు. భూమిని తనఖా పెట్టించి బలవంతంగా బాండ్ పేపర్లపై సంతకాలు చేయించారు. న్యాయం చేయాలని పోలీసులు, రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఎవరూ పట్టించుకోలేదు. 2016లో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేశానని వివరించారు. అప్పు ఇప్పించిన వారు ఆ భూమి తమదేనని పాస్‌బుక్‌లు సృష్టించారని, పొలం వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. మంత్రి కేటీఆర్‌తోనైనా తన సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్వప్న ఆశాభావం వ్యక్తంచేశారు.



బాధితురాలు కాంతాల స్వప్న

పంచాయతీలకు ప్రత్యక్ష ఎన్నికలు పెట్టాలి

- తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీలకు ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించాలని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ డిమాండు చేశారు. తెదేపా మండల స్థాయి నేతల రెండో బృందానికి శిక్షణ తరగతులను సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పదేళ్ల పాటు దోచుకున్న కాంగ్రెస్‌కు, గత మూడున్నరేళ్లుగా హామీలను తుంగలో తొక్కి రాష్ట్రాన్ని దోచుకుంటున్న తెరాసకు సమదూరాన్ని తెదేపా పాటిస్తోందని ఆయన చెప్పారు. పంచాయతీ ఎన్నికలపై కేసీఆర్ కొత్త వ్యూహంతో వస్తున్నారని, ఈ ఎన్నికల కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘంలో ఒక్కరైనా బీసీ, ఎస్సీ, ఎస్టీ మంత్రి ఎందుకు లేరని ఆయన ప్రశ్నించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో ఉన్న తెదేపా నేడు తెలంగాణలో లేదని కొందరు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. తరగతుల్లో రావుల, లక్ష్మణ్ నాయక్ రామావత్, బొట్ల శ్రీనివాస్, బీఎన్‌రెడ్డి పాఠాలు చెప్పారు.

మందకృష్ణకు ఒక్కరోజు మధ్యంతర బెయిలు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మరణించిన తన బావ (అక్క భర్త) జూపాక బాబు అంత్యక్రియల్లో పాల్గొనడానికి గానూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు సికింద్రాబాద్ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం సోమవారం షరతులతో కూడిన ఒక రోజు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు జైలు నుంచి విడుదలైన మందకృష్ణ సాయంత్రం వరంగల్ అర్బన్ జిల్లా న్యూశాయంపేటలో జరిగిన బావ సమాధి క్రతువులో పాల్గొన్నారు. అంతకుముందు ఆయన్ను జైలులో కాంగ్రెస్ శాసనసభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, మాజీ శాసనసభ్యుడు లింగయ్య, మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి తదితరులు పరామర్శించారు. వర్గీకరణ విషయంలో మందకృష్ణకు కాంగ్రెస్ మద్దతు పలుకుతుందన్నారు.

అరెస్టు దారుణం: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అరెస్టు దారుణమని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియాహాలులో విలేకరులతో మాట్లాడుతూ.. మందకృష్ణను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల కరెంటుతో భూగర్భ జలాలు దారుణంగా పడిపోతున్నాయని, బోర్లు ఎండిపోతున్నాయని, రైతులు 12 గంటల విద్యుత్‌ను కోరుకుంటున్నారనీ, ఈ పథకాన్ని పునఃసమీక్షించాలన్నారు.

ప్లాట్‌ఫారం టిక్కెట్ ధర రూ.20

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్లాట్‌ఫారాలపై రద్దీని నియంత్రించేందుకు రూ.10 ఉన్న ప్లాట్‌ఫారం టిక్కెట్ ధరను రూ.20కి పెంచింది. ఈనెల 11 నుంచి 17వతేదీ వరకూ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయని ద.మ.రైల్వే సీపీఆర్‌వో ఉమాశంకర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలనే ఉద్దేశంతోనే పెంచినట్టు ఆయన స్పష్టం చేశారు. ఇది సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు మాత్రమే వర్తిస్తుందన్నారు.

ఏడుగురికి 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డులు

అంకితభావంతో, అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండి సమయస్ఫూర్తిని ప్రదర్శించిన ఏడుగురు ఉద్యోగులను దక్షిణ మధ్య రైల్వే అవార్డులతో సత్కరించింది. 'మ్యాన్ ఆఫ్ ది మంత్' పురస్కారాన్ని వీరికి ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సోమవారం రైలు నిలయంలో జరిగిన సమావేశంలో అందజేశారు. తొలుత ద.మ.రైల్వే పరిధిలో భద్రత, సమయపాలన, సరకు రవాణా అంశాలపై 6 డివిజన్ల రైల్వే మేనేజర్లతో పాటు ఉన్నతాధికారులతో సమీక్షించారు. వెల్డింగ్ వైఫల్యాలు, రైలుపట్టాలు తప్పడం, లెవెల్‌క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని జీఎం సూచించారు. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈనాడు


సైబరాసురులపై ఉక్కుపాదం

పెద్దనోట్ల రద్దు దరిమిలా దేశంలో క్రమేణా జోరందుకున్న డిజిటల్ లావాదేవీల మాటున సైబర్ నేరాసురులు అంతకంతకు బుసలు కొడుతున్నారు. 'డిజిటల్ ఇండియా'ను అవతరింపజేసే లక్ష్యంతో నగదు రహిత చెల్లింపులకు కేంద్రం సమధిక ప్రాధాన్యం కల్పిస్తుండగా- ఆ చొరవను చిన్నబుచ్చేలా ఆన్‌లైన్ మోసాలు, చీటింగ్ బాగోతాలు పెచ్చరిల్లడం తీవ్రంగా కలవరపరుస్తోంది. తాజాగా ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించిన అధికారిక సమాచారం ప్రకారం, 2016 నవంబరులో నమోదైన డిజిటల్ చెల్లింపుల సంఖ్య 91 కోట్లు. 2017 అక్టోబరులో అవి 153 కోట్లకు విస్తరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంలో ఆ రాశి 18 వందల కోట్లకు మించనుందని అంచనా. ఇది నాణానికి ఒక పార్శ్వం. రెండోవైపున, సైబర్ నేరాల ఉద్ధృతి నివ్వెరపరుస్తోంది. ఎస్సీ ఎస్టీలపై దాష్టీకాలు, వృద్ధులూ మహిళలపై దాడుల పెంపుదల శాతాన్ని తలదన్నుతూ దేశంలో సైబర్ నేరాలు ఆరు శాతానికిపైగా 'వృద్ధి' నమోదు చేసినట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. భారత్‌లో జాతీయ సైబర్ భద్రత విధానమన్నది ప్రత్యేకంగా కొలువుదీరినా, కార్యాచరణ బాధ్యత వేర్వేరు విభాగాలకు సంస్థలకు దఖలుపడింది. డిజిటల్ వ్యవస్థ ఆవిష్కరణలో ప్రతిబంధకాలను అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్థాయీసంఘం తన నివేదికలో ఈ కీలకాంశాన్నే స్పృశించింది. అంతర్జాల నేరాలు ఇంతలింతలవుతున్న తరుణంలో, భిన్న విభాగాలూ సంస్థల మధ్య మెరుగైన సమన్వయం నెలకొనాల్సి ఉందంటూ అది పిలుపిచ్చింది. డిజిటల్ సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న తరుణాన ఆన్‌లైన్ లావాదేవీల విశ్వసనీయతకు, వ్యక్తిగత సమాచార భద్రతకు ఎక్కడా ఎటువంటి ముప్పు వాటిల్లకుండా కాచుకోవాల్సిన బృహత్తర బాధ్యత ప్రభుత్వాల భుజస్కంధాలపైనే ఉంది!

నిరుడు 'షాడో బ్రోకర్స్' అనే ముఠా తలపెట్టిన 'వాన్నా క్రై' భీకర దాడి సుమారు 175 దేశాల్ని గడగడలాడించింది. మరో భయానక దాడి తథ్యమన్న నిపుణుల అంచనాలు రెండు వారాల వ్యవధిలోనే నిజమై నిశ్చేష్టపరచాయి. నాటి 'వాన్నా క్రై' సైబర్ దాడి ఉత్తర కొరియా పాతకమేనని అమెరికా హోం ల్యాండ్ భద్రతా విభాగం మూడు వారాల క్రితమే నిర్ధారించింది. 'వాన్నా క్రై'ని తలపించే 'బ్యాడ్ రాబిట్' మూడు నెలల నాడు రష్యా, ఉక్రెయిన్, అమెరికా, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో పెనుసంచలనం సృష్టించింది. 2018లో ఈ దూకుడు మరింత పెరగనుందన్న విశ్లేషణలు- విండోస్, లైనక్స్, ఏపిల్ సహా ప్రధాన ఆపరేటింగ్ వ్యవస్థలు వేటినీ భద్రంగా భావించే వీల్లేదంటున్నాయి! దేశీయంగా మూడేళ్ల కాలవ్యవధిలో బ్యాంకులు సగటున గంటకు రూ.88 వేలకు పైగా నష్టపోవడం, సైబర్ చోరుల కళాప్రావీణ్యాన్ని కళ్లకు కట్టేదే. ఎస్‌బీఐ సహా వివిధ బ్యాంకులకు చెందిన దాదాపు 32 లక్షల డెబిట్ కార్డుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిక్కిందన్న కథనాలు ఆ మధ్య గగ్గోలు పుట్టించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ బ్రోకరేజీ సంస్థ, ఇ-కామర్స్ కంపెనీ, కేంద్రప్రభుత్వానికి చెందిన వెబ్‌సైట్లు సైబర్ దాడికి గురయ్యాయి. తత్కాల్ కోటా జారీ మొదలయ్యాక క్షణాల వ్యవధిలో భారీయెత్తున టికెట్లు గుప్పిట పట్టే అక్రమ సాఫ్ట్‌వేర్ రూపొందించి తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన సీబీఐ ఉద్యోగి బాగోతం- ఆన్‌లైన్ దందాల్లో కొత్తకోణాన్ని ఆవిష్కరించింది. అమాయకులపై ప్రలోభాల వల విసిరి బినామీలు, అద్దె ఖాతాల సాయంతో లక్షలకు లక్షలు గుంజేస్తున్న సైబర్ నేరగాళ్ల దోపిడీకాండ నిర్ఘాంతపరుస్తోంది. ఝార్ఖండ్, పశ్చిమ బంగ పరిసర ప్రాంతాల్లో తిష్ఠవేసిన వేలమంది అటువంటి సైబర్ నేరాల్లో ఆరితేరినవారని పోలీసు నివేదికలే చాటుతున్నాయి. ఈ మహోత్పాతాన్ని సమర్థంగా నిలువరించే పటిష్ఠ కార్యాచరణ పట్టాలకు ఎక్కడంలో జాప్యం జరిగేకొద్దీ జాతికి నష్టమే!

సింగపూర్, నెదర్లాండ్స్ ప్రభృత దేశాలు అరవై శాతానికి పైగా నగదు రహిత లావాదేవీలతో అబ్బురపరుస్తున్నాయి. ఆ వరుసలో చోటుదక్కించుకోవడమే దేశీయ డిజిటల్ విప్లవ ధ్యేయమని నినదిస్తూ ఏడాది క్రితం 'భీమ్' (భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ) పేరిట ప్రత్యేక యాప్‌నొకదాన్ని కేంద్రం విడుదల చేసింది. సైబర్ దాడుల నివారణకు సంబంధించి సన్నద్ధత పరంగా మాత్రం ఇండియా ఇప్పటికీ వెనకబడే ఉంది. అంతర్జాలమే కార్యక్షేత్రంగా విరుచుకుపడే సైబరాసురుల్ని కట్టుదిట్టంగా నిలువరించడంలో ముందున్న అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఒమన్, ఇస్తోనియా వంటి తొలి పది దేశాల జాబితాలో భారత్ పేరు లేదు! ప్రతి పది నిమిషాలకొక సైబర్ నేరం సంభవిస్తున్న గడ్డమీద భద్రతా చర్యల పరిపుష్టీకరణలో భాగంగా, నూట [illegible] దేశాల క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రధాని మోదీ ఇటీవల ప్రతిపాదించారు. హ్యాకింగుకు ఆస్కారం లేని క్వాంటమ్ అంతర్జాల సృష్టిలో చైనా పురోగతి, సైబర్ సైనికుల ఆవిష్కరణలో ఇజ్రాయెల్ ఒరవడి, చిన్న వ్యాపారుల శ్రేయంకోసం ఆస్ట్రేలియా సరికొత్తగా రూపుదిద్దిన రక్షణ చట్రం- భారత్ సహా ఎన్నో దేశాలకు విలువైన గుణపాఠాలు. విస్తృత స్థాయి డిజిటల్ విప్లవాన్ని అభిలషిస్తున్న ఇండియా- సవాళ్లను అవకాశాలుగా మలచుకొంటూ, 2025నాటికి ఇంటాబయటా లక్షల సంఖ్యలో అవసరమయ్యే సైబర్ యోధుల రూపకల్పనకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి. డెబిట్, క్రెడిట్ కార్డుల మోసాలు, ఆన్‌లైన్ నేరాలే కాదు- కీలక వ్యవస్థలను చెరపట్టేంతగా చెలరేగుతున్న సైబరాసుర తండాల్ని కుమ్మి కూలగొట్టే సుదృఢ యంత్రాంగాల నిర్మాణం నేటి అవసరం. ఆ మేరకు ఉమ్మడి ప్రణాళిక చురుగ్గా పట్టాలకు ఎక్కితేనే- అంతర్జాల ఉగ్రవాదానికి కోరలు తుంచేది, పౌర సమాజంలో డిజిటల్ అగాధాన్ని పూడ్చగలిగేది!

మేధో లబ్ధికి మేలు బాటలు



నేడు ప్రవాసీ భారతీయ దివస్

విశ్వ సాంకేతిక వేదికపై భారతదేశ ప్రభ వెలిగిపోతోంది. మన అంకుర పరిశ్రమలు వాణిజ్యపరంగా అద్భుత విజయాలు సాధించడమే కాకుండా సామాజిక నవీకరణకు ప్రబల ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. మేధోవలస ఇప్పుడు పెద్ద సమస్య కాదు. మేధో లబ్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. మన ప్రతిభా సంపద పశ్చిమ దేశాలకు తరలిపోతోందని ఇన్నాళ్లూ ఆందోళన చెందాం. మన దేశం నుంచి దూరతీరాలకు వెళ్లిన నిపుణులు ఇప్పటికే తమ సామర్థ్యాలు చాటుకొంటున్నారు. సిలికాన్ వ్యాలీ, వాల్‌స్ట్రీట్‌లలోని బోర్డు రూములు భారతీయుల విజయగాథలతో ప్రతిధ్వనిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్యమ స్థాయిలో చేపట్టిన డిజిటల్ ఇండియా, వజ్ర (విజిటింగ్ అడ్వాన్స్‌డ్ జాయింట్ రీసెర్చి) వంటి పథకాలతోపాటు అంకుర పరిశ్రమలకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల దన్ను కారణంగా ఇప్పుడు పరిస్థితి వేగంగా భారత్‌కు అనుకూలంగా మారుతోంది. హెచ్-1బీ వీసాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొంటున్న చర్యలూ మున్ముందు భారత్‌కు సానుకూలంగానే పరిణమించనున్నాయి. అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్‌కార్డు) కోసం ఎదురుచూస్తున్నవారి హెచ్-1బీ వీసాలను పొడిగించరాదన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం అమలులోకి వస్తే అయిదు లక్షలకుపైగా నిపుణులైన భారతీయ ఉద్యోగులు స్వదేశానికి తిరిగి రావలసిన పరిస్థితులు ఏర్పడవచ్చు. ఇది వృత్తిపరంగా, కుటుంబాలపరంగా వారికి తీవ్ర కలవరం కలిగించేదే. భారతదేశం ఇప్పటికే పెను ఉద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అయినప్పటికీ, కారుచీకట్లో కాంతిరేఖ కనిపిస్తోంది. దేశంలోని దాదాపు అన్ని పెద్ద నగరాల్లోనూ అంకుర పరిశ్రమలు విరివిగా ఏర్పాటవుతున్నాయి. సులభ వాణిజ్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల అవి మరింతగా వెల్లివిరుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిపుణత కలిగిన భారతీయ ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చినప్పటికీ ఇబ్బంది ఉండకపోవచ్చు. వారికి ఆలంబన దొరకడమే కాకుండా, వారి కారణంగా భారత వ్యాపార వాణిజ్యాలకు ఊతం లభిస్తుంది.

అంకురాలకు ఊతం

సంస్కరణలకు కట్టుబడిన భారత ప్రభుత్వం అండదండగా నిలుస్తున్నందువల్లే దేశంలో అంకుర పరిశ్రమలు పరిఢవిల్లుతున్నాయి. సులభ వాణిజ్యానికి సంబంధించి ప్రపంచ బ్యాంకు ర్యాంకుల్లో భారతదేశం ఎకాయెకిన 30 స్థానాలు పైకి ఎగబాకడానికి కారణమిదే. భారత వ్యాపారవేత్తలు అమెరికాలో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. అక్కడి భారతీయులు సొంతంగానో లేదా భాగస్వామ్యంతోనో నూరు కోట్ల డాలర్లకుపైగా విలువచేసే 87 అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అమెరికాలోని అంకుర పరిశ్రమల్లో నాలుగోవంతుకు పైగా (26 శాతం) భారతీయులు సొంతంగా ఏర్పాటు చేసినవే. అక్కడి నిపుణుల్లో ఏ కొద్దిమంది తిరిగివచ్చినా భారత వ్యాపార, వాణిజ్య రంగం కొత్త నెత్తుటితో ఉరకలేస్తుంది. వాస్తవంలో విదేశాల్లో చదువులకోసం ఏటా వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య ప్రభుత్వం చెబుతున్నదానికన్నా ఎంతో ఎక్కువగా ఉంటుంది. 'మదద్' (సహాయం) పోర్టల్ ద్వారా ఈ విద్యార్థులతో అనుసంధానానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వారు ఈ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకొని, విదేశంలో తమ బాగోగులు, భద్రత గురించి తెలియజేయవచ్చు. 2017లో 10 దేశాల్లో భారతీయ విద్యార్థుల వేధింపులు, వారిమీద దాడులకు సంబంధించి 21 సంఘటనలను ఈ పోర్టల్ సహాయంతో కనుగొన్నారు.

ప్రపంచస్థాయిలో ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు తమదేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచింది విదేశీ విద్యార్థులేనన్న వాస్తవాన్ని మరచిపోయిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇప్పుడు విదేశీయుల రాకమీద ఆంక్షలు విధించేందుకు సిద్ధపడ్డారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వ ఉన్నత విద్యా బడ్జెట్ రూ.30,000 కోట్లు. మన విద్యార్థులు ఒక్క అమెరికాలో వ్యయం చేసిందే రూ.40,000 కోట్లు. అమెరికాలో ఉన్న విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే. అదేస్థాయిలో వారు అక్కడ వ్యయాలూ చేస్తున్నారు. అంతర్జాతీయ విద్యాసంస్థ 'ఓపెన్ డోర్స్' అమెరికా విద్యావిభాగం కలిసి నిర్వహించిన సర్వే ప్రకారం- అమెరికాలో 10 లక్షల విద్యార్థుల్లో దాదాపు సగం భారతీయులు, చైనీయులే. అక్కడి మొత్తం విదేశీ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య 17.3 శాతం. అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకొంటున్న విదేశీ విద్యార్థులు 2016-17లో ఆ దేశానికి 3,690 కోట్ల డాలర్ల మేరకు లబ్ధి చేకూర్చారు. వారిలో 4.5 లక్షలమంది ఉద్యోగాలు చేస్తూ అక్కడ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తోడ్పడుతున్నారు. మరోవైపు మనదేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత



'భారతదేశం మీ కోసం ఎదురు చూస్తోంది'
- క్యాలిఫోర్నియాలో ప్రధాని మోదీ

విద్యాసంస్థల్లో చదువుకొంటున్న విద్యార్థుల సంఖ్యా బాగా పెరుగుతోంది. అది 2010-11లో 2.75 కోట్ల నుంచి 2016-17లో 3.57 కోట్లకు చేరింది. 2010-11లో 19.4 శాతంగా ఉన్న స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్), 2016లో 25.2 శాతానికి పెరిగింది. దేశీయ విశ్వవిద్యాలయాల్లో పరిస్థితులు మెరుగుపడుతుండటం, అంకుర పరిశ్రమలు వృద్ధిచెందుతున్న ఫలితంగా మేధో లబ్ధికి మార్గం సుగమమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అమెరికా పర్యటనలో భాగంగా క్యాలిఫోర్నియాలో భారతీయ సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ- మేధో వలస భారత్‌కు మేధో లబ్ధి చేకూర్చే తరుణం వచ్చిందన్నారు. మరోవైపు, దేశీయ పరిశోధన, అభివృద్ధి వ్యవస్థలోకి ప్రతిభావంతులైన విదేశీయులను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'వజ్ర' పథకం సత్ఫలితాలు ఇస్తోంది. విదేశీ శాస్త్రవేత్తల నుంచి 260 దరఖాస్తులు అందగా, గత ఏడాది ఆఖరు నాటికి వారిలో 70మందిని ఎంపిక జాబితాలో చేర్చారు. శాస్త్ర సాంకేతిక విభాగం నిరుడు మేలో ప్రారంభించిన ఈ ప్రయోగాత్మక పథకం కింద ఏటా వెయ్యిమంది శాస్త్రవేత్తలను ఎంపిక చేయాలని తలపెట్టారు. ఆయా రంగాల్లో నిపుణత, అనుభవం ఆధారంగా శాస్త్రవేత్తలను ఎంపిక చేయనున్నారు. 'వజ్ర' పథకం కింద ఎంపికైన శాస్త్రవేత్తలు కనీసం నెలరోజులు, గరిష్ఠంగా మూడు నెలలపాటు ఇక్కడ ఉండి బోధించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న విద్యాసంస్థలు, జాతీయ ప్రయోగశాలల్లో 'వజ్ర' ఫ్యాకల్టీలు ఉంటాయి. విదేశాల్లో ఉంటున్న భారత సంతతి శాస్త్రవేత్తలు, విద్యావేత్తలను ఈ 'వజ్ర' పథకం విశేషంగా ఆకట్టుకోగలదన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అదే జరిగితే భారతదేశంలో ఉన్నతవిద్య అభ్యసిస్తున్న, పరిశోధన సాగిస్తున్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పరిశోధనను పెంపొందించడానికి ఈ పథకం కింద భారీగా వ్యయం చేయాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. విదేశాల నుంచి బోధన లేదా పరిశోధనకు వచ్చే విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు ఒక ఏడాది కాలంలో తొలి నెల రోజులు ఇక్కడ ఉంటే 15,000 డాలర్లు, తరవాత నెలకు 10,000 డాలర్లు వేతనంగా అందించాలని నిర్ణయించారు. దీనికి మంచి స్పందన వస్తోందని అంటున్నారు.

భవిష్యత్తు బంగారం

ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా 1.6 కోట్ల భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రవాస భారతీయుల సంఖ్య భారతదేశ జనాభాలో ఒక్కశాతంకన్నా కొంచెం ఎక్కువగా ఉంటుంది. భారతదేశ అభివృద్ధిలో వీరంతా కీలకపాత్ర పోషిస్తున్నారు. విదేశాల్లోని భారతీయులే అత్యధిక మొత్తాలను స్వదేశానికి పంపిస్తున్నారని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. తరవాతి స్థానాల్లో చైనా, ఫిలిప్పీన్స్, మెక్సికో, నైజీరియా ఉన్నాయి. ప్రవాస భారతీయులు భారీగా డబ్బు పంపడమే కాకుండా, అనేక విధాలుగా మాతృభూమికి సేవలు అందజేస్తున్నారు. వారు పంపుతున్న మొత్తాలు డాలర్ల రూపంలో ఉంటున్నందువల్ల, విదేశ మారక ద్రవ్యపరంగా దేశంమీద ఒత్తిడి తగ్గుతోంది. విదేశాల నుంచి ముడిచమురు, యంత్ర పరికరాల వంటి దిగుమతులకు ఆ డాలర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. భారత విదేశాంగ విధాన రూపకల్పనలోనూ ప్రవాస భారతీయుల పాత్ర ఉంది. అమెరికాలోని భారత రాజకీయ కార్యాచరణ సమితి వంటివి ఉభయదేశాల సంబంధాల మెరుగుదలకు కృషి చేస్తున్నాయి. ప్రవాస భారతీయులు స్వదేశంలో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. దేశం నుంచి సాంకేతిక ఎగుమతుల ద్వారా విదేశ మారకద్రవ్యం ఆర్జించేందుకు తోడ్పడుతున్నారు. దేశంలో అంకుర పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న మోదీ ప్రభుత్వం, విదేశాల్లోని భారతీయుల పెట్టుబడులపై ఇప్పుడు దృష్టి కేంద్రీకరిస్తోంది. అంకుర పరిశ్రమలకు రకరకాల ప్రోత్సాహకాలు అందజేస్తోంది. దీనివల్ల సత్ఫలితాలు చేకూరుతున్నాయి. అమెరికా, యునైటెడ్ కింగ్డమ్ (యూకే), జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, న్యూజిలాండ్ తదితర దేశాల్లో ప్రవాస భారతీయులు నిర్వహిస్తున్న అంకుర పరిశ్రమల నుంచి సాంకేతిక పరిజ్ఞానం పొందేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. దేశంలోనే అనేక గవాక్షాలు విచ్చుకొంటున్న సమయమిది. మేధో వలస కాస్తా ఇప్పుడు మేధోలబ్ధిగా మారే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. గడచిన మూడేళ్లలోనే వెయ్యిమందికి పైగా భారతీయ శాస్త్రవేత్తలు ఇక్కడ పనిచేయడానికి తిరిగి వచ్చారు. భవిష్యత్తు అంతా బాగానే ఉంటుందన్న ఆశాభావాన్ని ఇలాంటి పరిణామాలు అంకురింపజేస్తున్నాయి.

– నీరజ్ కుమార్

అంతరాల అగాధం


నేటి ప్రపంచంలో అత్యధిక సంపద కొద్దిమంది లక్ష్మీపుత్రుల పరమవుతుంటే పేద, మధ్యతరగతి ఆదాయాలు రోజురోజుకు దిగనాసిల్లుతున్నాయి. ప్రపంచ జనాభాలో మహా సంపన్నుల సంఖ్య ఒక్క శాతమే అయినా 1980-2016 మధ్యకాలంలో ప్రపంచ ఆదాయంలో 23 శాతం వారికే దక్కిందని, 50 శాతం జనాభా 12 శాతంతో సరిపెట్టుకోవలసి వచ్చిందని 2017 ప్రపంచ అసమానతల నివేదిక వెల్లడించింది. 2017లో 500మంది అపర కుబేరుల సంపద నిరుటికన్నా అదనంగా అమాంతం లక్ష కోట్ల డాలర్ల (రూ.64 లక్షల కోట్ల) మేర పెరిగిపోయిందని ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ సంస్థ బ్లూమ్ బర్గ్ తాజా అంచనా. అమెజాన్ అధినేత జెఫ్ బెజాస్ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. 2016లో మహా ధనికుల సంపద కేవలం రూ.15.17 లక్షల కోట్ల మేరకు పెరిగిందని గుర్తుంచుకుంటే, ఇది ఎంతటి విపరీత పెరుగుదలో అర్థమవుతుంది.

సంపద వెల్లువ

పాశ్చాత్య దేశాలతోపాటు భారత్, బ్రెజిల్, పశ్చిమాసియా దేశాల్లోనూ ఆదాయపరమైన అసమానతలు పెరిగిపోతున్నాయి. బ్లూమ్‌బర్గ్ తాజాగా వెలువరించిన 500 మంది అంతర్జాతీయ కుబేరుల జాబితాలో ఇరవై ముగ్గురు భారతీయులు ఉన్నారు. అంతర్జాతీయ జాబితాలో 20వ స్థానంలో నిలిచిన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ నికర విలువ ఒక్క ఏడాదిలోనే అమాంతం 76.3 శాతం (1,704 కోట్ల డాలర్లు) పెరిగి 4,001 కోట్ల డాలర్లకు చేరింది. ఆయన తరవాత అత్యధిక పెరుగుదల గౌతమ్ అదానీ నికర విలువలో కనిపించింది. బ్లూమ్‌బర్గ్ భారతీయ సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ తరవాతి స్థానాలను వరసగా లక్ష్మీ మిత్తల్, అజీం ప్రేమ్ జీ, పలోంజీ మిస్త్రీ, శివ నాడార్, దిలీప్ షంఘ్వీ, గౌతమ్ అదానీ ప్రభృతులు ఆక్రమించారు. కుబేరుల సంపద చుక్కలను తాకడానికి కారణం స్టాక్ మార్కెట్ల విజృంభణే అని బ్లూమ్‌బర్గ్ విశ్లేషించింది. ఈ విజృంభణతో లబ్ధి పొందినది మాత్రం ధనికులే. 2016లో అమెరికాలో 84 శాతం స్టాక్‌లు (షేర్లు) కేవలం 10 శాతం సంపన్న కుటుంబాల సొంతమని న్యూయార్క్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఎడ్వర్డ్ ఉల్ఫ్ పరిశోధన తేల్చింది. స్టాక్‌లు, ఇతర పెట్టుబడులు, స్థిరాస్తులు తెచ్చిపెట్టే ప్రతిఫలాలు, అద్దెల మీద ఆధారపడిన అతి సంపన్న వర్గాన్ని 'రెంటియర్' తరగతి అంటారు. వారి దృష్టి అంతా ఆస్తులు కూడబెట్టడం, వాటిమీద వచ్చే ఆదాయాన్ని మరింత పెంచుకోవడం మీదే ఉంటుంది తప్ప నవీకరణ సాధించాలని, కొత్త పరిశ్రమలు, వ్యాపారాలు చేపట్టాలనే తపన ఈ వర్గంలో కనిపించదు. అందువల్ల వారి నుంచి కొత్త ఉద్యోగాలను ఆశించలేం. నేడు కోట్లకు పడగలెత్తిన టెక్నాలజీ కంపెనీలు సృష్టిస్తున్న ఉద్యోగాలు కూడా చాలా స్వల్పం. టెక్నాలజీ మారినప్పుడల్లా పాతవారి ఉద్యోగాలు ఊడిపోవడం రివాజు అయిపోయింది.

బ్లూమ్‌బర్గ్ అధ్యయనం ప్రకారం 2017 డిసెంబరు నాటికి సంపదను విపరీతంగా పెంచుకున్న కుబేరుల్లో అత్యధికులు టెక్నాలజీ రంగానికి చెందినవారే. తదుపరి స్థానాలను పారిశ్రామిక ఉత్పత్తి, వినియోగ వస్తు తయారీ, స్థిరాస్తి రంగాలకు చెందినవారు ఆక్రమిస్తున్నారు. టెక్ దిగ్గజాలైన అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, గూగుల్, అలీబాబా, టెన్సెంట్ కంపెనీల అధినేతలతోపాటు బిట్‌కాయిన్ బిలియనీర్లూ నేడు పసిడి కొండలపై ఆశీనులయ్యారు. అంతర్జాలం, సాఫ్ట్‌వేర్, స్మార్ట్‌ఫోన్ల సాయంతో వారు తమ ఉత్పత్తులను, సేవలను ప్రపంచమంతటా విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తారు. నేడు ఏపిల్ వంటి సంస్థల ఆదాయం కొన్ని దేశాల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కన్నా చాలా ఎక్కువ. అంతర్జాతీయ స్థాయిలో ఒక్క ఏడాదిలో నికర సంపదను పెంచుకున్నవారిలో అగ్రగణ్యుడు అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజాస్. ఆయన సంపద గత ఏడాదితో పోలిస్తే ఒక్కసారిగా 3,402 కోట్ల డాలర్లు పెరగడంతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్‌ను రెండో స్థానానికి నెట్టి ప్రపంచ సంపన్నుడిగా అవతరించారు. గత ఏడాది డిసెంబరులో బెజాస్ నికర విలువ 9,906 కోట్ల డాలర్లు. గేట్స్ విలువ 9,013 కోట్ల డాలర్లు. బ్లూమ్‌బర్గ్ జాబితాలోని 500 మందిలో గేట్స్, బెజాస్ వంటి టెక్ దిగ్గజాలు 57 మంది ఉండగా- వారి సంపద మరే ఇతర రంగంకన్నా మిన్నగా 35

2017లో సాంకేతిక పరిజ్ఞానానిదే అగ్రస్థానం



ఆధారం: బ్లూమ్‌బర్గ్ ప్రపంచ సంపన్నుల సూచీ

అసమానతలపై సాగాలిక యుద్ధం

శాతం పెరిగి 26,200 కోట్ల డాలర్లకు చేరింది. బ్లూమ్‌బర్గ్ జాబితాలోని 500 మంది సంపన్నుల నికర విలువ 2016 డిసెంబరు 27న 4.4 లక్షల కోట్ల డాలర్లైతే 2017 డిసెంబరు 27 నాటికి అది 5.3 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది కేవలం ఒక్క ఏడాదిలో లక్ష కోట్ల డాలర్ల పెరుగుదల.

టెక్ సంస్థల ఆదాయం నానాటికీ పెరిగిపోతుంటే పేద, సంపన్న దేశాల్లో ప్రజల తలసరి ఆదాయాలు రోజురోజుకూ తరిగిపోతున్నాయి. దీన్ని చూసి ఆదాయ అసమానతలకు అధునాతన సాంకేతికత, ప్రపంచీకరణలే కారణమనే భావన బలం పుంజుకొంది. అది అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ విజయానికి, ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి బ్రిటన్ నిష్క్రమణకూ కారణభూతమైంది. ఇతర దేశాలవారి వలసలను, అంతర్జాతీయ వ్యాపారాన్ని వ్యతిరేకించేవారికి ఇతర సంపన్న దేశాల్లోనూ బలం పెరుగుతోంది. ట్రంప్ అయితే అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వల్ల తమకు నష్టం; చైనా, మెక్సికో, భారత్ వంటి దేశాలకు లాభం ఒనగూడిందంటున్నారు. ఇకనుంచి ద్వైపాక్షిక ఒప్పందాలను మాత్రమే కుదుర్చుకొంటానంటున్నారు. ట్రంప్ వాదం వర్ధమాన దేశాలకు విద్దూరంగా ధ్వనించడంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచీకరణకు తెరతీసిన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వంటి సంస్థల స్థాపనకు చొరవ తీసుకున్నది అమెరికాయే. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) వంటి బహుళపక్ష వాణిజ్య ఒప్పందాలకూ ప్రాణం పోసింది. ఈ ఒప్పందాల అజెండాను తెరవెనక రూపుదిద్దినది బహుళజాతి సంస్థలే. ప్రపంచంలో 500 దిగ్గజ వ్యాపార సంస్థల్లో సగానికి పైచిలుకు అమెరికన్ బహుళజాతి సంస్థలేనని మరచిపోకూడదు. వాణిజ్య ఒప్పంద సూత్రాలను ఈ కంపెనీలు తమకు లాభదాయకంగా; కార్మికులు, సాధారణ పౌరులకు నష్టదాయకంగా రచించాయని నోబెల్ బహుమతి గ్రహీత అయిన ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ విమర్శించారు. అందుకే నేడు కంపెనీలు, వాటి అధినేతల లాభాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

ఉపాధికల్పన అంతంత మాత్రం

అధునాతన సాంకేతికత వల్ల నేడు కొద్దిమంది కార్మికులు, ఎక్కువ యంత్రాలతో అత్యధిక ఉత్పత్తి సాధిస్తున్నందువల్ల పారిశ్రామిక ఉద్యోగాలు హరించుకుపోతున్నాయి. అదే సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పాదక శక్తి పెరిగి కంపెనీలు సంపదను విపరీతంగా పెంచుకొంటున్నాయి. ఐక్యరాజ్య సమితికి చెందిన అంక్టాడ్ 56 దేశాల్లోని ఆర్థికేతర కంపెనీలపై జరిపిన పరిశీలనలో ఈ అంశం నిర్ధారణ అయింది. 1995-2000 మధ్య 100 అగ్రశ్రేణి కంపెనీలు సాధించిన లాభాలు 16 శాతం నుంచి 40 శాతానికి పెరిగాయి. 1995-2015 మధ్య ఈ కంపెనీల మార్కెట్ మూలధనీకరణ విలువ నాలుగు రెట్లు పెరిగినా, వాటిలో ఉద్యోగాలు కనీసం రెండు రెట్లు కూడా పెరగలేదు. ఈ సంస్థల్లో రోబోలు, కృత్రిమ మేధ, త్రీడీ ముద్రణ, అంతర్జాలం వల్ల సాధారణ కార్మికుల ఉద్యోగాలు పెద్దయెత్తున గల్లంతవుతుంటే- కొద్ది సంఖ్యలో మాత్రం హైటెక్ ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఈ ఉద్యోగాలన్నీ ఉత్పత్తి స్థానంలోనే ఉండనక్కర్లేదు. ప్రపంచంలో ఎక్కడినుంచైనా వీటిని నిర్వహించవచ్చు. ఇది ప్రపంచీకరణ వ్యాప్తికి, బహుళజాతి సంస్థల ఆదాయాలకూ మరింత ఊపునిస్తుందే తప్ప తగ్గించదు. కొత్త ఉద్యోగాలను పుట్టించదు. 1979లో జనరల్ మోటార్స్ సంస్థ ఒక్క అమెరికాలోనే 8,50,000 మంది ఉద్యోగులను నియమించగా, నేడు మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా నియోగించిన ఉద్యోగుల సంఖ్య లక్ష మాత్రమే. గూగుల్‌లో 50,000 మంది, ఫేస్‌బుక్‌లో 5,000 మంది పనిచేస్తున్నారు. మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం ఈనాటి అంతర్జాతీయ కార్మిక బలగంలో 15 శాతం (40 కోట్ల) మంది 2030కల్లా ఉద్యోగాలు కోల్పోతారు. ఈ గండాన్ని ఎదుర్కోవాలంటే ప్రపంచీకరణను కొనసాగిస్తూనే దానివల్ల కార్మికులు, సాధారణ పౌరులు దెబ్బతినిపోకుండా సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలి. పాత ఉద్యోగాల నుంచి కొత్త హైటెక్ ఉద్యోగాలకు మారడానికి శిక్షణ ఇవ్వాలి. ఆదాయ అసమానతలను తొలగించాలంటే అన్ని దేశాలూ అనుసరించాల్సిన మార్గమిదే!

– వరప్రసాద్

చల్లని తల్లి

దుష్టులకు దూరంగా ఉండాలని ఆర్యోక్తి. 'దుష్ట దూరా, దురాచార శమనీ...' అని జగజ్జననిని అర్చిస్తారు భక్తులు. దుష్టులకు దూరంగా ఉండటం, దురాచారాల్ని శమింపజేయటం ఆ భగవతి లక్షణాలుగా భావిస్తారు. దుష్ట దూరం అంటే, దుష్టులకు ఆమె దూరంగా ఉంటుందని అర్థం చేసుకోవచ్చు. సర్వ సృష్టికర్త అయిన జగన్మాతకు సమస్త ప్రాణికోటీ సంతానమే కాబట్టి, ఆ ప్రేమమయికి ఎవరూ దుష్టులుగా కనిపించరు, అనిపించరు. వచ్చిపోయే వ్యాధిలా దుష్టత్వమూ నయమవుతుందని ఆమె నమ్ముతుంది. అంతేగాని తాను వారికి దూరంగా ఉండాలని, వారు తనకు దూరం కావాలని అదేపనిగా అనుకోదు.

ఆ నమ్మకం వాస్తవ విరుద్ధమేమీ కాదు. సకల సద్గుణ సమన్వితుడైన సర్వేశ్వరుడి సృష్టిలో, ఎవరి దుష్టత్వమైనా అంతరించాల్సిందే! పరిస్థితుల ప్రభావం, ప్రలోభం, అజ్ఞానం- ఏ కారణం వల్లనైనా మధ్యలో వచ్చేది మధ్యలోనే సమసిపోతుంది. దుష్ట భావాలు మనిషిని ఎప్పుడూ ఒకే విధంగా అంటిపెట్టుకొని ఉండవు. క్రౌర్యం, దుర్బుద్ధి, క్రోధావేశం వంటివి ఏ మనిషికీ శాశ్వతమైన లక్షణాలు కావు. క్షణికమైన అవివేకం, ఉద్వేగ తీవ్రత వల్ల అతణ్ని దుష్టత్వం ఆవహిస్తుంది. మనసు, బుద్ధి సవ్యంగా పనిచేస్తూ స్వాధీనంలో ఉన్నవాడు ఎన్నడూ దుష్టత్వానికి ఒడిగట్టడు. దుష్ట కార్యాలతో సత్ఫలితాలు ఒరిగి పడతాయని ఏ స్థిరచిత్తుడైనా ఎందుకు పొరబడతాడు? కామక్రోధాదుల మత్తులో, పాప పుణ్య విచక్షణ మరచిన స్థితిలో మానవుడు దానవుడిగా మారుతున్నాడు.

దుర్మార్గాలకు గురై నానా యాతనలు పడే ఏ బాధితుడైనా, అలాంటి దుష్టత్వాన్ని ఇతర

అంతర్యామి

కోణం నుంచి చూడలేడు. అంతటి సంయమనం కనబరచడం మహాత్ములకు తప్ప లోకంలో మరెవరికీ సాధ్యం కాదు. బాధితుడికి తనను దుర్మార్గంగా బాధిస్తున్నవాడు 'మూర్తీభవించిన దుర్మార్గం'లా కనిపిస్తాడు.



అది వ్యాధిక్రిమిలా అతడికి తాత్కాలికంగా సంక్రమించిన అవలక్షణమని బాధితుడు గుర్తించలేడు. జ్ఞానమూర్తి అయిన జగన్మాత అత్యంత పరిపూర్ణ. దుష్టత్వం అంటే ఆమె నిర్వచనం వేరు. దుష్టత్వాన్ని ఆమె గర్హిస్తుంది. దాన్ని తన దరికి చేరనివ్వదు.

తీరం వదిలి వెళ్లే నావకు, తీరానికి మధ్య దూరం పెరుగుతుంటుంది. అంతమాత్రాన, నావ దూరం కావడానికి కారణం తీరం కాదు. అది అక్కడే ఉంటుంది. కదిలి వెళుతూ, నావ చివరికి ఆ తీరానికి దూరమైపోతుంది. అలాగే దుష్టులు తమ తత్వం వల్ల దివ్యత్వానికి దూరమవుతారు. ఆ దుష్టత్వాన్ని వారు ప్రయత్నపూర్వకంగా వదిలించుకొంటే, మళ్ళీ దివ్య తత్వానికి చేరువ కాగలరు. తల్లి కటాక్ష వీక్షణాలు అటువంటి వారిపైనా ప్రసరిస్తాయి.

శ్రీమాత దుష్టదూర మాత్రమే కాదు. ఆమె నిరంతర దురాచార శమని. దురాచారాల్ని, దుర్మార్గాల్ని ఆ తల్లి నశింపజేస్తుంది. దురాచారాన్ని శమింపజేయడం అంటే- అతణ్ని దుష్టత్వానికి దూరం చేసి, సదాచారం వైపు మళ్లించడం! తనకు పట్టిన దుష్టత్వ జాడ్యాన్ని వదిలించుకోవాలన్న దృఢ సంకల్పం మనిషిలో కలగాలి. అప్పుడే భగవతి చల్లని చూపులకు అతడు పాత్రుడవుతాడు. దుర్మార్గానికి దూరంగా, ఇహపర శ్రేయస్సుకు చేరువగా తన జీవనయానం సాగిస్తాడు. 'అమ్మ' కరుణ ఒక్కటే ఎటువంటి మనిషినైనా తరింపజేస్తుందని పురాణ గాథలు చెబుతాయి!

– మల్లాది హనుమంతరావు

సరికొత్త వాతావర్ణం



'ప్రత్యూష్' సూపర్ కంప్యూటర్

- వాతావరణ శాఖకు సరికొత్త సామర్థ్యం
- పుణె, నోయిడాల్లో సూపర్ కంప్యూటర్లు
- యూకే, జపాన్, యూఎస్‌ల సరసన భారత్

మన దేశం మరో ముందడుగు వేసింది.. దేశంలో వాన రాకడను చెప్పలేని పరిస్థితి ఉండదిక.. మూడువైపులా సముద్రం ఉన్న ద్వీపకల్పమైన మనదేశానికి తుపాన్లు, వాయుగుండాల ముప్పు సర్వసాధారణం. ముఖ్యంగా సెప్టెంబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో బంగాళాఖాతంలో అనూహ్యమైన వాతావరణ మార్పులు చోటుచేసుకుంటాయి. వాటిని ముందుగానే పసిగట్టి తగిన జాగ్రత్తలు తీసుకోగలిగితే భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగే అవకాశం ఉంటుంది. లేని పక్షంలో అంతులేని నష్టం సంభవిస్తుంది. వాతావరణ మార్పులను ముందుగానే పసిగట్టటానికి వాతావరణ కేంద్రాల్లో అధునాతన కంప్యూటర్లు ఉండటం ఇప్పుడు తప్పనిసరి అవసరంగా మారిపోయింది. కేవలం కంప్యూటర్లు ఉండటమే కాకుండా వాటిని అత్యధిక సామర్థ్యం ఉండాలి. అవి దాదాపుగా 'సూపర్ కంప్యూటర్లు' అయి ఉండాలి. గతంతో పోల్చితే మనదేశంలోని వాతావరణ శాస్త్ర కేంద్రాలు వాతావరణ ముప్పుపై ముందుగానే హెచ్చరికలు జారీ చేయగలుగుతున్నాయి. కొన్నేళ్ల క్రితం బంగాళాఖాతంలో సునామీని ముందుగానే పసిగట్టిన ఫలితంగా నష్టాన్ని చాలా వరకూ తగ్గించుకునే అవకాశం ఏర్పడింది. కానీ మనదేశంతో పోల్చితే అభివృద్ధి చెందిన యూకే, యూఎస్, జపాన్‌లోని వాతావరణ శాస్త్ర కేంద్రాల్లో కంప్యూటింగ్ సామర్థ్యం ఎంతో ఎక్కువగా ఉంది. ఆ దేశాల సరసన చేరే అవకాశం ఇప్పుడు మనదేశానికి లభించింది.

సామర్థ్యం పెరిగింది...

- వాతావరణ పరిశోధనలకు వినియోగించే కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెటాఫ్లాప్స్‌లో కొలుస్తారు. మన దేశానికి ప్రస్తుతం 1.0 పెటా ఫ్లాప్స్ (ఫ్లాప్స్- ఫ్లోటింగ్ పాయింట్ ఆపరేషన్స్ పర్ సెకండ్) సామర్థ్యం ఉంది.
- కొత్తగా పుణెలోని సమశీతోష్ణ వాతావరణ విభాగం (ఐఐటీఎం)లో 'ప్రత్యూష్' హెచ్‌పీసీ (హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్) సూపర్ కంప్యూటర్‌ను ప్రారంభించారు. మరొకదానిని నోయిడాలోని జాతీయ మధ్యస్థాయి వాతావరణ పరిశోధన కేంద్రం (ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్)లో ఏర్పాటు చేస్తారు.



- దీనివల్ల పుణె కేంద్రంలో ఉన్న కంప్యూటింగ్ సామర్థ్యం 4 పెటా ఫ్లాప్స్‌కు చేరుతుంది. నోయిడా కేంద్రంలో 2.8 పెటా ఫ్లాప్స్ సామర్థ్యం ఉంటుంది.
- పెరిగిన సామర్థ్యంతో మనదేశానికి వాతావరణ పరిశోధనల్లో ఉన్న కంప్యూటింగ్ సామర్థ్యం 6.8 పెటా ఫ్లాప్స్‌కు చేరనుంది. తద్వారా మనదేశం ఈ విభాగంలో ఇప్పుడున్న 7వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకోనుంది. మనదేశం కంటే ముందువరసలో యూకే, జపాన్, యూఎస్ ఉంటాయి.

విపత్తులపై ముందు హెచ్చరికలు

- రెండేళ్ల క్రితం చెన్నై నగరాన్ని వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. అనూహ్యమైన రీతిలో విరుచుకుపడిన వరదలతో చెన్నై ప్రజలు తల్లడిల్లిపోయారు. అపార నష్టం వాటిల్లింది. ఈ విషయమై వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో కొంతమేరకైనా జాగ్రత్తపడే అవకాశం ఏర్పడింది.
- 2013లో కేదార్‌నాథ్ వరదలు, అంతకుముందు ముంబయి నగరాన్ని వరదలు ముంచెత్తబోతున్నాయనే విషయాన్ని ముందుగానే వాతావరణ శాస్త్రవేత్తలు కనిపెట్టగలిగారు. అయితే వాతావరణ పరిశోధనా సామర్థ్యం ఇంకా ఎక్కువగా ఉంటే ఇలాంటి ఉపద్రవాలను ఇంకా కచ్చితంగా ఎంతో ముందుగా గుర్తించి దిద్దుబాటు చర్యలకు సిఫార్సు చేసేందుకు అవకాశం ఉంటుంది.
- కేవలం వరదలు, తుపాను హెచ్చరికలకే పరిమితం కాకుండా రైతులకు మేలు చేసేలా రుతుపవనాల కదలికలు, వర్షపాతం వివరాలను చెప్పగలుగుతారు.

ప్రత్యూష్ సూపర్ కంప్యూటర్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. 25,000 పర్సనల్ కంప్యూటర్లకు ఎంత 'ర్యామ్' అవసరమో.., అంత ర్యామ్ ప్రత్యూష్ సూపర్ కంప్యూటర్‌లో ఉంటుంది. అంతేగాకు 8,600 కంప్యూటర్లకు ఉన్నంత స్టోరేజీ సామర్థ్యం కలిగి ఉండటం దీని ప్రత్యేకత. అత్యాధునిక 'ఇంటెల్ గ్జెనాన్' ప్రాసెసర్లను ఇందులో వినియోగించారు. ప్రత్యూష్ హెచ్‌పీసీ సూపర్ కంప్యూటర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ. 450 కోట్లు వెచ్చించింది. దీనివల్ల సూర్యకాంతి, వేడి, వాతావరణంలో తేమ శాతం, సముద్రాల్లో మార్పులు, రుతుపవనాల గమనం.. తదితర ఎన్నో అంశాలను స్పష్టంగా గుర్తించగలిగే సామర్థ్యం మనదేశంలోని వాతావరణ శాస్త్రవేత్తలకు లభిస్తుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఇప్పటి వరకూ వాతావరణ శాస్త్ర కేంద్రాల్లో అత్యధిక కంప్యూటింగ్ సామర్థ్యం ఉన్న దేశాలు (పెటా ఫ్లాప్స్‌లో...)	యూకే	జపాన్	యూఎస్	కొరియా	ఫ్రాన్స్	చైనా	భారత్
	20.4	20.0	10.7	4.8	4.4	2.6	1.0*

* (కొత్తగా ప్రారంభించిన 'ప్రత్యూష్' సూపర్ కంప్యూటర్‌తో భారతదేశం సామర్థ్యం 6.8 పెటా ఫ్లాప్స్‌కు చేరింది)

నేడు దిల్లీలో ఆరోగ్య మంత్రుల సమావేశం

ఎయిమ్స్‌పై కేంద్రమంత్రికి లక్ష్మారెడ్డి విన్నపాలు

ఈనాడు, హైదరాబాద్: ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాలపై అన్ని రాష్ట్రాల ఆరోగ్య మంత్రులతో మంగళవారం దిల్లీలో సమావేశం జరగనుంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నడ్డా నేతృత్వం వహించనున్న ఈ సమావేశంలో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్రంలో ఆహార పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలును మంత్రి ఈ భేటీలో వివరిస్తారు. అనంతరం మంత్రి నడ్డాతో సమావేశమవుతారని.. రాష్ట్రానికి ఎయిమ్స్ మంజూరు.. వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు.. రాష్ట్రానికి రావాల్సిన జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు.. తదితర అంశాలపై కేంద్ర మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తారు. మూడేళ్లుగా ఎయిమ్స్ మంజూరు కోసం తెలంగాణ ప్రభుత్వం వినతిపత్రాలిస్తున్నా.. నిధులు కేటాయించలేదు. కేంద్ర మంత్రితో లక్ష్మారెడ్డి భేటీలో ఈ అంశాన్ని ప్రస్తావించనున్నారు. ఆహార పరిరక్షణపై సోమవారం అన్ని రాష్ట్రాల వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శులతోనూ కేంద్రం సమావేశాన్ని నిర్వహించగా తెలంగాణ తరపున ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ సంచాలకులు డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

గవర్నర్ల వ్యవస్థలో సంస్కరణలు

- ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌లతో భేటీ కానున్న రాష్ట్ర గవర్నర్

ఈనాడు, హైదరాబాద్: గవర్నర్ల వ్యవస్థలో సంస్కరణల కోసం రూపొందించిన నివేదికను తెలంగాణ, ఏపీ ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ మంగళవారం దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సమర్పించనున్నారు. దీనికోసం సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయల్దేరి దిల్లీకి చేరుకున్నారు. ఈ పర్యటనలో ఆయన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో భేటీ కానున్నారు. గత అక్టోబరులో దిల్లీలో రాష్ట్రపతి అధ్యక్షతన రెండు రోజుల గవర్నర్ల సదస్సు జరిగింది. గవర్నర్ల వ్యవస్థలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఇందుకోసం గవర్నర నరసింహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ మూణ్నెల్ల పాటు అధ్యయనం చేసి నివేదికను రూపొందించింది. దీన్ని గవర్నర్ రాష్ట్రపతికి సమర్పిస్తారు. అనంతరం ప్రధానిని కలిసి రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై నివేదిక ఇవ్వనున్నారు. వాటి ప్రగతి, విభజన సమస్యలు, పరిష్కారాలు, ఇతర విషయాలను వివరిస్తారు. తర్వాత రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి తొమ్మిది, పదో షెడ్యూళ్లోని సంస్థల విభజన గురించి వివరిస్తారు.

నటుడు నితిన్‌పై కేసు కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: సినీనటుడు నితిన్‌తోపాటు సోదరి నిఖితారెడ్డిలపై మల్కాజిగిరి కోర్టులో నడుస్తున్న క్రిమినల్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. 'అఖిల్' సినిమాకు సంబంధించిన హక్కులు ఇస్తామంటూ రూ. 50 లక్షలు తీసుకుని, ఇవ్వకుండా మోసం చేశారంటూ సికింద్రాబాద్‌కు చెందిన జి. సత్యనారాయణ అనే వ్యక్తి మల్కాజిగిరి కోర్టులో ఫిర్యాదు చేశారు. ఇందులో నితిన్‌తోపాటు సోదరి నిఖితారెడ్డి, తండ్రి సుధాకర్‌రెడ్డిలను, శ్రేష్ఠ్ మూవీస్‌ను నిందితులుగా పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన 20వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ వేర్వేరుగా నితిన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఇటీవల విచారణ చేపట్టారు. ఈ వ్యవహారం చెక్కులకు సంబంధించిన సివిల్ వివాదమని, క్రిమినల్ కేసు పెట్టడం సరికాదని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఏప్రిల్ 22 నుంచి ఏపీ ఎంసెట్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. ఏపీ ఎంసెట్(ఇంజినీరింగ్)ను ఏప్రిల్ 22 నుంచి 25వరకు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఆరు విడతలుగా (సెషన్స్) ఈ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తారు. ఎంసెట్(బైపీసీ) పరీక్షను ఏప్రిల్ 26న రెండు విడతలుగా నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి విడతకు కనిష్ఠంగా 115, గరిష్ఠంగా 150 కేంద్రాల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష నిర్వహించిన 7 రోజుల నుంచి 10 రోజుల్లోపే ఫలితాలు వెల్లడిస్తారు. విద్యార్థులకు గతేడాదిలాగే ఈసారీ నమూనా పరీక్ష(మాక్‌టెస్ట్)ను నిర్వహించనున్నారు. దీన్ని సీడీలుగా రూపొందించి గ్రామీణ ఇంటర్మీడియట్ కళాశాలలకు అందజేస్తారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాదీ అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి ఎంసెట్‌ను రెండు రోజులు ముందుగానే నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ కలిపి మొత్తం 1,36,790 సీట్లు ఉండగా అందులో గతేడాది కేవలం 84,478 సీట్లు మాత్రమే భర్తీఅయ్యాయి.

మైన్‌స్వీపర్ యుద్ధనౌకల ప్రాజెక్టు రద్దు

దిల్లీ: భారత నౌకాదళం కోసం 12 మైన్‌స్వీపర్ యుద్ధనౌకల కొనుగోలు ప్రక్రియను మళ్లీ తాజాగా ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.32వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు విషయంలో గోవా నౌకానిర్మాణ కేంద్రం, దక్షిణ కొరియా కంపెనీ మధ్య సంప్రదింపులు నిలిచిపోవడంతో ఈ చర్యను చేపట్టింది. దేశ కీలక సముద్ర మార్గాలను రక్షించడానికి మైన్ స్వీపర్లు అవసరం. తొలుత ప్రతిపాదన ప్రకారం గోవా షిప్‌యార్డ్, దక్షిణ కొరియాకు చెందిన కంగనమ్ కార్పొరేషన్‌లు 12 మైన్‌స్వీపర్ నౌకలను భారత్‌లో నిర్మించాలి. 9 ఏళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలి. సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి సంబంధించిన విధివిధానాలపై రెండు సంస్థల మధ్య విభేదాలు రావడంతో చర్చలను నిలిపివేయాలని గోవా షిప్‌యార్డ్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుపై 'ఆసక్తి వ్యక్తీకరణ'ను త్వరలో జారీ చేస్తామని పేర్కొంది.

ఓర్సి నిర్దోషి

- వీవీఐపీ హెలికాప్టర్ల విక్రయ ఒప్పందం కేసులో ఫిన్‌మెకానికా మాజీ అధ్యక్షుడికి ఊరట
- భారత్‌లో దర్యాప్తుపై ప్రభావం పడదు: సీబీఐ

మిలాన్, దిల్లీ: భారత్‌కు రూ.3,600 కోట్ల విలువైన వీవీఐపీ హెలికాప్టర్లను విక్రయించే ఒప్పందంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఇటలీలో నమోదైన కేసులో రక్షణ, గగనతల ఉత్పత్తుల దిగ్గజ సంస్థ ఫిన్‌మెకానికా మాజీ అధ్యక్షుడు గియుసెపె ఓర్సికి ఊరట లభించింది. ఈ కేసులో ఓర్సితోపాటు ఫిన్‌మెకానికా అనుబంధ సంస్థ అగస్టా వెస్ట్‌లాండ్ మాజీ సీఈవో బ్రూనో స్పాగ్నొలినిలను అప్పీళ్ల కోర్టు సోమవారం నిర్దోషులుగా తేల్చింది. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఓర్సి, స్పాగ్నొలిని భారత్‌లో ముడుపులు ముట్టజెప్పారంటూ ఆరోపణలు వచ్చిన సంగతి గమనార్హం. 2012లో వారిపై దర్యాప్తు ప్రారంభమైంది. అంతర్జాతీయ అవినీతి, భారత్‌లో ముడుపులు ముట్టజెప్పేందుకు తప్పుడు ఇన్‌వాయిస్‌ల సృష్టి అభియోగాలు దాఖలయ్యాయి. అంతర్జాతీయ అవినీతి ఆరోపణల విషయంలో నిర్దోషులుగా తేలినప్పటికీ.. తప్పుడు ఇన్‌వాయిస్‌లను సృష్టించినందుకుగాను వారికి కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఇటలీలో అప్పీళ్ల కోర్టు విచారణ పూర్తయితేనే శిక్షపై స్పష్టత వస్తుంది. వారిద్దరూ అప్పీళ్ల కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ కేసును మిలాన్‌లోని 3వ అప్పీళ్ల కోర్టు పరిశీలించి.. ఓర్సి, స్పాగ్నొలినిలను నిర్దోషులుగా తేల్చింది. వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ ఆరోపణలు రావడంతో అగస్టా వెస్ట్‌లాండ్‌తో ఒప్పందాన్ని భారత్ 2014 జనవరిలో రద్దు చేసుకున్న సంగతి గమనార్హం. ప్రస్తుతం ఫిన్‌మెకానికా పేరును లియోనార్డోగా మార్చారు. ఇటలీలో ఓర్సి, స్పాగ్నొలిని వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందంలో ముడుపుల ఆరోపణలపై అరెస్టవ్వడంతో భారత రక్షణశాఖ సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. భారత వైమానికదళ మాజీ చీఫ్ ఎస్పీ త్యాగి, మరో 9 మందిని నిందితులుగా పేర్కొంటూ సీబీఐ గతేడాది అభియోగపత్రం దాఖలు చేసింది. అగస్టా వెస్ట్‌లాండ్ ముడుపుల వ్యవహారంలో ఓర్సి, స్పాగ్నొలినిలను ఇటలీ కోర్టు నిర్దోషులుగా తేల్చినప్పటికీ.. దాని ప్రభావం భారత్‌లో కేసు దర్యాప్తుపై పడదని సీబీఐ పేర్కొంది.

వీవీఐపీ హెలికాప్టర్ల ఒప్పందానికి సంబంధించి నగదు అక్రమ చెలామణీ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో తనపై బెయిలుకు వీలులేని అరెస్టు వారెంట్‌ను రద్దు చేయాలని విన్నవిస్తూ దుబాయ్‌కి చెందిన యూహెచ్‌వై సక్సేనా, మాట్రిక్స్ హోల్డింగ్స్ సంస్థల డైరెక్టర్ రాజీవ్ సక్సేనా దాఖలు చేసిన దరఖాస్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వ్యతిరేకించింది. సక్సేనా తమ దర్యాప్తునకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడని దిల్లీలోని న్యాయస్థానానికి ఈడీ తెలియజేసింది.

ఎగువ కాఫర్ డ్యాం పనులు ప్రారంభం

- అన్ని పనులపై పూర్తి స్పష్టత వచ్చింది
- ఏపీ సీఎం చంద్రబాబు
- పోలవరం పనుల పరిశీలన

ఈనాడు, ఏలూరు: పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్‌డ్యాం నిర్మాణ పనులకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అడ్డంకులన్నీ తొలగిపోయాయని, పనులు మరింత వేగవంతమవుతాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న 9జిల్లాలు కొద్దిపాటి హెచ్చుతగ్గులు తప్ప ఒకేరీతిలో ఉన్నాయని సాగుకు, పరిశ్రమలకు నీరు సమృద్ధిగా ఇవ్వగలిగితే రాష్ట్రం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను సోమవారం ముఖ్యమంత్రి పరిశీలించారు. గేట్ల నమూనాను పరిశీలించి.. ఎగువ కాఫర్‌డ్యాం పనులను ప్రారంభించారు. స్పిల్‌వే నిర్మాణ ప్రాంతంలో ఆయన మాట్లాడుతూ.. నాగావళి, వంశధార, పెన్నా, కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసి వృథాగా సముద్రంలోకి పోతున్న నీటిని వినియోగించుకుంటే రాష్ట్రం సస్యశ్యామలమవుతుందన్నారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పని 62 శాతం జరిగిందన్నారు. స్పిల్‌ఛానల్ మట్టి తవ్వకం పనులు 2018 మే నాటికి పూర్తిచేస్తారని, గేట్ల తయారీ 55 శాతం పూర్తయిందని, మొదటి గేటును జనవరి నెలాఖరులోపుగా ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దిగువ కాఫర్‌డ్యాం జెట్‌గ్రౌటింగ్ పనులు 85 శాతం పూర్తయ్యాయని సీఎం వివరించారు. ఎగువ కాఫర్‌డ్యాం నిర్మాణం 2,300 మీటర్ల పొడవున జరగాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు ప్రతీ పనిపై ఇప్పుడు ఒక స్పష్టత వచ్చిందని, ఇక వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండు అగ్రిగేటు చిల్లింగ్ ప్లాంట్లలో ఒకటి ప్రారంభించామని, రెండో దానిని 20న ప్రారంభించగలిగితే రోజుకు 5వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని జరుగుతుందన్నారు. ఇప్పటికే కాఫర్‌డ్యాం నిర్మాణం పూర్తిచేసి ఉంటే ఈ ఏడాది గ్రావిటీ ద్వారా నీరు తీసుకువెళ్లగలిగేవారమని.. అయినప్పటికీ శాయశక్తులా కృషిచేస్తామన్నారు. ఓ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తున్నారని, ఎవరికోసం ఈ యాత్ర చేస్తున్నారో వారే చెప్పాలన్నారు. ఇంకో పార్టీ కేంద్ర నుంచి పోలవరం ప్రాజెక్టుకు మొదటి అంచనాల ప్రకారం రూ.16 వేల కోట్లలో అందించాల్సిన సాయం అందిందని, ఇంకా కొంతవరకూ రావాల్సిఉందని, రెండోదశలో తిరిగి అంచనాలు రూపొందించి పంపామని సీఎం వెల్లడించారు. కేంద్రం సాయం చేసే దిశగా నడుస్తోందని.. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ సంక్రాంతి తర్వాత వస్తారని వెల్లడించారు.



పోలవరంప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

చంద్రబాబుతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది: బిల్‌గేట్స్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ పేర్కొన్నారు. వ్యవసాయంలో రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని చంద్రబాబుకు రాసిన లేఖలో ప్రస్తావించారు. భూసార పరీక్షల మ్యాపింగ్, వ్యవసాయ విధానాలను రైతులకు చేరవేసేందుకు సహకారం అందిస్తామన్నారు. ఆరోగ్యరంగంలో చేపడుతున్న సంస్కరణలు, పౌరుగు సేవల విధానంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు కితాబిచ్చారు. అధికశాతం ప్రజలకు బీమా సౌకర్యం కల్పించడంలో ఏపీ భారత్‌లోనే ముందంజలో ఉన్న విషయాన్ని తెలుసుకున్నానన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు ఏపీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

తితిదే ఛైర్మన్‌గా సుధాకర్ యాదవ్!

సంక్రాంతి తర్వాత పాలకవర్గ నియామకం



ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ ఛైర్మన్‌గా పుట్టా సుధాకర్‌యాదవ్ నియామకం దాదాపు ఖరారైంది. పాలక మండలి సభ్యుల నియామకంపైనా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. భాజపా సూచించిన ముగ్గురు సభ్యులకు పాలకవర్గంలో చోటు లభించనుంది. ఈ మేరకు నియామక ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ప్రారంభించింది. సంక్రాంతి తర్వాత ఉత్తర్వులు వెలువడనున్నాయని అత్యంత విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

మూడు నెలల క్రితమే నిర్ణయం

కడప జిల్లాకు చెందిన తెదేపా నేత సుధాకర్‌యాదవ్‌ను తితిదే ఛైర్మన్‌గా నియమించాలని మూడు నెలల క్రితమే ప్రభుత్వం నిర్ణయించినా.. పలు కారణాలతో ఆలస్యమవుతూ వచ్చింది. సుధాకర్‌యాదవ్ క్రైస్తవ కూటమిలో పాల్గొన్నారన్న విమర్శలు రావడంతో.. ప్రభుత్వం పరిశీలన చేపట్టింది. ఎలాంటి ఇబ్బందులు లేవని నిర్ధరణకు వచ్చాక తుది నిర్ణయం తీసుకుంది.

ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులకు పరకామణి సేవ భాగ్యం: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి భక్తకోటి సమర్పించే హుండీ కానుకలను లెక్కించే అవకాశం ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులకు తితిదే విస్తరించింది. ఇప్పటివరకు 35 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయసు లోపు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి, విశ్రాంత ఉద్యోగులకు, దక్షిణాదిలోని జాతీయ బ్యాంకుల్లో పనిచేసే వారికి పరకామణి సేవకు అనుమతి ఉంది. తమకూ అవకాశం కల్పించాలని ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులు చేసిన విజ్ఞప్తి మేరకు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అనుమతించారు. మంగళవారం రాత్రి 7 గంటల నుంచి భక్తులు తితిదే వెబ్‌సైట్ http://www.tirumala.org ద్వారా 'శ్రీవారి సేవ సర్వీసెస్' అనే లింకులో 'పరకామణి సేవ సర్వీసెస్' క్లిక్ చేసి నమోదు చేసుకునే అవకాశం కల్పించింది.

బాహుబలి కలశాలకు భలే డిమాండు!

ఫిబ్రవరి 17 నుంచి గోమతేశ్వరుడి మహామస్తకాభిషేకాలు

ఈనాడు-బెంగళూరు: కర్ణాటకలోని హాసన జిల్లా శ్రవణ బెళగొళ పట్టణంలోని వింధ్యగిరిపై కొండపై వెలసిన మానవతా మూర్తి- బాహుబలి- గోమతేశ్వరుడి మహామస్తకాభిషేకాలు వచ్చే నెల 17 నుంచి 25 వరకూ జరగనున్నాయి. ఈ అభిషేకాల్లో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జైన భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు. ప్రతి పన్నెండేళ్లకోమారు అంగరంగ వైభవంగా నిర్వహించే మహామస్తకాభిషేకోత్సవంలో బాహుబలి మూర్తిని వివిధ ద్రవ్యాలతో అభిషేకించిన వారు జన్మ ధన్యమైనట్లు భావిస్తారు. గోమతేశ్వరుడి వైభవోపేత విగ్రహాన్ని అభిషేకించే పవిత్ర జల కలశాలకు ఎనలేని గిరాకీ. దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని మఠ నిర్వాహకులు మత ప్రచారంతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. ఫిబ్రవరి 21న స్వామి అభిషేకాన్ని ప్రవాస భారతీయులకు పరిమితం చేశారు. ఫిబ్రవరి 17న-తొలిరోజు 108 కలశాలతోనే పూజ చేస్తారు.



శ్రవణబెళగొళ ఉత్సవ చిహ్నం

ఐటీఐ విద్యకు చట్టబద్ధత

- నియంత్రించాల్సిన సమయం ఆసన్నమైంది
- కేంద్రానికి పార్లమెంటు స్థాయీ సంఘం సూచన

ఈనాడు, దిల్లీ: పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటీఐల) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్న 'నిపుణ పనివారి శిక్షణ పథకం' (క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీం)నకు చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీనికింద దేశవ్యాప్తంగా 13,353 ఐటీఐలు నడుస్తున్నాయి. వీటిలో 11వేల ఐటీఐలు ప్రైవేటు రంగంలో ఉన్నాయి. పథకం చట్టబద్ధంగా మొదలుకాలేదని స్థాయీసంఘం గుర్తించింది. దాన్ని పర్యవేక్షించడంతోపాటు, వృద్ధిని నియంత్రించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. ఐటీఐలకు గుర్తింపునివ్వడంలో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో పథకానికి చట్టబద్ధమైన కోరలు ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలనీ, తగిన చట్టం తీసుకురావాలనీ పేర్కొంది.

అవినీతి 'గుర్తింపు'

ఐటీఐలకు గుర్తింపు ఇవ్వడంలో భారత నాణ్యత మండలి (క్యూసీఐ) రాజీపడినట్లు కమిటీ పేర్కొంది. భవనాలు, మౌలిక వసతులు, సౌకర్యాలు, రక్షణ, యంత్రాలు, బోధనా సిబ్బంది లాంటి విషయాలను గుర్తించడంలో నిబంధనలు పాటించలేదని పెదవి విరిచింది. చాలా రాష్ట్రాల్లోని ఐటీఐల్లో నాణ్యత పూర్తిగా కొరవడిందని తెలిపింది. 2014-16 మధ్యకాలంలో ఐటీఐలకు క్యూసీఐ ఇచ్చిన గుర్తింపుపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందినట్లు ప్రస్తావించింది. ఎక్కడా పెద్దగా తనిఖీలే చేయలేదంది. ఇప్పటివరకూ ఫిర్యాదులు అందిన 263 కేసులను పునఃపరిశీలించడంతోపాటు, క్యూసీఐ అక్రిడిటేషన్‌కోసం ప్రతిపాదించిన 6729 కేసులను తప్పనిసరిగా పునఃసమీక్షించాలని సిఫార్సు చేసింది. పిల్లల భవిష్యత్తు దెబ్బ తినకుండా సంస్థలపై చర్యలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

వచ్చే ఏడాదికల్లా 15 లక్షలమందికి అప్రెంటిస్ శిక్షణ

దేశంలో పారిశ్రామిక శిక్షణ తీసుకున్న అప్రెంటిస్‌ల సంఖ్య 2018-19 నాటికి 15 లక్షలకు చేరేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థాయీసంఘం సిఫార్సు చేసింది. వచ్చే ఏడేళ్లలో 40 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని పేర్కొంది. 2018 ఆగస్టుకల్లా దేశవ్యాప్తంగా ఉన్న ఐటీఐల్లో 3,500ని రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తనిఖీచేసి అక్కడి పరిస్థితులను మెరుగుపరచాలని సూచించింది. ఏడేళ్లలో 40 కోట్ల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అనువైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సిఫార్సు చేసింది. 1980ల్లో కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున ఐటీఐలు ఏర్పాటుచేయడంవల్ల గల్ఫ్ దేశాల్లో భారీగా ఉపాధి అవకాశాలు లభించినట్లు స్థాయీసంఘం అభిప్రాయపడింది.

సామాజిక మాధ్యమాలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

పోలీసు ఉన్నతాధికారులకు ప్రధాని సూచన



టెకాన్‌పూర్‌లో డీజీపీలు, ఐజీల సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

టెకాన్‌పూర్ (మధ్యప్రదేశ్): సామాజిక మాధ్యమాల ద్వారా కలుగుతున్న సమస్యలు, సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఇక్కడి బీఎస్ఎఫ్ అకాడమీలో జరుగుతున్న డీజీపీలు, ఐజీల వార్షిక సదస్సులో రెండో రోజైన సోమవారం ఆయన ప్రసంగించారు. పై రెండు అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సైబర్ నేరాలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అక్రమ ఆర్థిక లావాదేవీలపై సమాచారం పంచుకోవాలన్న భావన ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమవుతోందని, ఈ లక్ష్య సాధనలో భారత్ కీలక పాత్ర పోషించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ప్రాంతీయ భాషలను ఉపయోగిస్తే ప్రభావం అధికంగా ఉంటుందని అన్నారు. తీవ్రవాదంవైపు యువత ఎందుకు మళ్లుతున్నారో గమనించాలని, ఇందుకుగల కారణాలను స్పష్టంగా గుర్తించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కోరారు. దేశం ఒక ఏకీకృత వ్యవస్థ అని, అన్ని రాష్ట్రాల వారూ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. పారదర్శకతకు ప్రపంచవ్యాప్తంగా ఆమోదం లభిస్తోందని, భద్రత విషయాల్లో రాష్ట్రాలు కూడా దీనిని పాటించాలని కోరారు. భద్రత ఏ ఒక్కరి వల్లనే సాధ్యం కాదని, సమాచారాన్ని మార్పిడి చేసుకోవడం ద్వారానే అందరికీ రక్షణ కల్పించవచ్చని చెప్పారు. దిల్లీ బయట ఇలాంటి సమావేశాలు నిర్వహించడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని అభిప్రాయపడ్డారు. చర్చనీయాంశాల విస్తృతి, చర్చల్లో నాణ్యత పెరిగిందని చెప్పారు. ఇందుకు కృషి చేసిన అధికారులను ప్రశంసించారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఇలాంటి సదస్సుల ప్రాధాన్యం పెరిగిందని తెలిపారు. సాధించాల్సిన లక్ష్యాలు, సవాళ్లను ఎదుర్కోవడంపై పోలీసు బలగాలు, అధికారులకు స్పష్టత ఏర్పడిందని చెప్పారు. తీసుకున్న నిర్ణయాలు అమలయ్యేలా ఎప్పటికప్పుడు అనుశీలన చేయాలని కోరారు. కార్యాచరణలో యువ అధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరోలో విశేష సేవలు చేసిన అధికారులకు 'రాష్ట్రపతి పోలీసు పతకాల'ను మోదీ బహూకరించారు.

సిమెంటు కంపెనీల ఇష్టారాజ్యం

- ధరలు పెంచడానికి కృత్రిమ కొరత
- బస్తాకు రూ. 50 వరకు పెంపుదల
- దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో ఇదే పరిస్థితి
- రెండు మూడు నెలలకోసారి ఇదే తీరు

ఈనాడు, హైదరాబాద్: సిమెంటు కంపెనీలు నిర్మాణదారులతో ఆటాడుకుంటున్నాయి. చీటికి మాటికి ధర పెంచడం.. ఇందుకోసం తాత్కాలిక కొరత సృష్టించడం.. పెంచిన ధరకు తలొగ్గితే సరఫరా చేయడం.. ఇదీ సిమెంటు ధరల కథ. ఇటీవల వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకే పరిమితమైన ఈ జాడ్యం ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు కూడా పాకిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది ఇలా కృత్రిమ కొరత సృష్టించి ధర పెంచిన సిమెంటు కంపెనీలు జనవరిలో మళ్లీ అదేబాట పట్టాయి. ప్రస్తుతం బస్తాకు రూ. 50 వరకు పెంచాయి. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనే సిమెంటు కంపెనీలు అధికంగా ఉన్నాయి. అయినా ఇలాంటి పరిస్థితి నెలకొనడం విచిత్రం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నీటిపారుదల పథకాలతోపాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో గృహనిర్మాణ పథకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. తెలంగాణలో కాళేశ్వరం, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా సిమెంటుకు గణనీయమైన డిమాండు ఉంది. తెలంగాణలో రెండు పడకల ఇళ్లు, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ నగర్ పేరిట పేదలకు గృహ నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతున్న విషయం తెలిసిందే. వీటిని దృష్టిలో పెట్టుకుని కంపెనీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలపైనా, ప్రభుత్వంపైనా కూడా భారం పడుతోంది.

కంపెనీల కుమ్మక్కు

ధరల పెంపుదల కోసం సిమెంటు కంపెనీలన్నీ ఒకే మాటపై నిలుస్తున్నాయి. సరకు ధరను అవే నిర్ణయించుకుంటున్నాయి. ధర పెంచే ముందుకు మూడు నాలుగు రోజుల పాటు సరఫరా ఆపేస్తున్నాయి. డీలర్ల వద్ద ఉన్న నిల్వలు నిండుకోగానే కొరత ఏర్పడుతుంది. అప్పుడు పెంచిన ధరను అమలు చేస్తున్నారు. కంపెనీల ప్రతినిధులు తరచుగా సంప్రదింపులు నిర్వహించుకుని మరీ ధరల పెంపును నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇందుకోసం అవసరమైతే ఉత్పత్తిని కూడా తగ్గించేస్తున్నాయంటే వీటిది ఎంత ఇష్టారాజ్యంగా తయారైందో అర్థమవుతుంది.

సిమెంటు బస్తా సగటు ధరలు (రూపాయల్లో..)

రాష్ట్రం	గత నవంబరు	జనవరి
తెలంగాణ	220-230	280-290
ఆంధ్రప్రదేశ్	230-240	290-300
తమిళనాడు	250-270	340-360
కర్ణాటక	260-260	330-340

ప్రభుత్వంపైనా భారం...

సిమెంటు ధరల పోటుతో సామాన్యులతోపాటు ప్రభుత్వంపై కూడా గణనీయంగా భారం పడుతోంది. ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా సిమెంటు, స్టీలు ధరల్లో పెరుగుదలలో ఓ నిబంధన (ఎస్కలేషన్) ఉంటుంది. ఆ ప్రకారం ధరల పెరుగుదలను బట్టి ప్రభుత్వం గుత్తేదారులకు అదనపు మొత్తాన్ని చెల్లించాలి. అంటే ధరల పెరుగుదల ప్రభావం గుత్తేదారులపై ప్రభావం ఉండదు. ఆ భారమంతా ప్రభుత్వంపైనే పడుతోంది. ఇక సామాన్యుల సంగతి చెప్పనక్కరలేదు.

ఇంటికో ఉద్యోగమిస్తామని సీఎం చెప్పలేదు: తలసాని

తాండూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని సీఎం కేసీఆర్ ఎక్కడా చెప్పలేదని, రాజకీయ నిరుద్యోగులే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో సోమవారం రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే రాష్ట్రం ఏర్పాటైన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆ దిశగా ఫలితాలు అందేలా చూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3.50 లక్షల ఉద్యోగాలకు.. ఇప్పటికే 35 వేల నుంచి 40 వేల ఉద్యోగాలకు నేరుగా నియామకాలు జరిగాయన్నారు. వెనుకబడిన తరగతుల్లోని 103 కులాల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం బ్యాంకులతో సంబంధం లేకుండా వృత్తుల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందివ్వనున్నదన్నారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీలున్న 542 ఉద్యోగాలకుఅభ్యర్థులు పరీక్షలు రాశారు. ఫలితాలు వెల్లడి కాగానే నియామకాలు చేపడతామన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర వైద్య, మౌలిక వసతుల ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, విద్యా మౌలిక వసతుల ఛైర్మన్ నాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల హేతుబద్ధీకరణ

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి • త్వరలో ఆచార్యుల భర్తీకి ప్రకటనలు

ఈనాడు, హైదరాబాద్: "రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కాలేజీల సంఖ్య వెయ్యి. కొన్ని మండలాల్లో జూనియర్ కళాశాలల కంటే డిగ్రీ కళాశాలలే ఎక్కువ. దీంతో ఏటా 1.80 లక్షల డిగ్రీ సీట్లు మిగిలిపోతున్నాయి. ఈ కారణంగా వాటి మధ్య అనారోగ్యకర పోటీ పెరుగుతోంది. తమ కళాశాలలో చేరితే హాజరే అవసరం లేదనేవి కొన్నయితే.. ప్రాక్టికల్, అంతర్గత పరీక్షల్లో ఊరికే మార్కులు వేయిస్తామని కొన్ని చెబుతున్నాయి..ఇక ప్రభుత్వం చెల్లించే బోధనా రుసుంలో కొంత తిరిగి ఇచ్చేస్తామని చెబుతున్నవి మరికొన్ని.. పలు కళాశాలలు పాల్పడుతున్న అనైతిక చర్యలివి.." స్వయంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పిన విషయాలివి..గణాంకాలను పరిశీలిస్తే భవిష్యత్తులోనూ ఇంటర్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం కనిపించడం లేదని, అందువల్ల రాష్ట్రంలో 350 - 400 డిగ్రీ కళాశాలలు సరిపోతాయని చెప్పారు. అందుకే డిగ్రీ విద్యలో నాణ్యత పెంచేందుకు కళాశాలల హేతుబద్ధీకరణకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఉన్నత విద్యామండలి పాలకవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై ఆయన విలేకర్లకు వివరించారు. హేతుబద్ధీకరణలో భాగంగా ఒకేచోట ఎక్కువ కళాశాలలు ఉంటే వాటిని విలీనం చేసుకోవాలని యాజమాన్యాలకు చెబుతున్నామని, సంక్రాంతి తర్వాత హేతుబద్ధీకరణపై ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కళాశాలల యాజమాన్యాలు విలీనమైతే వ్యయ భారం తగ్గుతుందని, దాన్ని నాణ్యమైన బోధనకు ఖర్చు చేస్తే ఫలితాలు ఉంటాయన్నారు.

సంక్రాంతి తర్వాత ప్రకటనలు: గత అక్టోబరులో గవర్నర్ నరసింహన్ నిర్వహించిన ఉపకులపతుల సమావేశంలో ఆరు నెలల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆదేశించారని, ఆ మేరకు సంక్రాంతి తర్వాత విశ్వవిద్యాలయాల వారీగా ప్రకటనల జారీ ఉంటుందని పాపిరెడ్డి చెప్పారు. మొత్తం 1,061 ఖాళీల భర్తీ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాల్లోని ఒప్పంద అధ్యాపకులకు పెంచిన వేతనాలను గత నవంబరు నుంచి వర్తింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పరిశోధనలు పెంచేందుకు 10-12 మందికి ఉత్తమ పరిశోధక ఆచార్యులుగా పురస్కారాలను అందజేయాలని నిర్ణయించామన్నారు.

మండుతున్న చమురు నౌక పేలిపోయే ప్రమాదం!

బీజింగ్: సముద్రంలో ప్రమాదానికి గురై మండుతున్న ఓ చమురు నౌక ఏ క్షణమైనా పేలిపోయే అవకాశం ఉందని నిపుణులు భయపడుతున్నారు. ఇదే జరిగితే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడడమే కాకుండా సిబ్బంది ప్రాణాలకు, జలచరాలకూ ముప్పు వాటిల్లుతుందనే ఉద్దేశంతో... కాలంతో పోటీపడి సహాయక చర్యల్ని చేపడుతున్నారు. తూర్పు చైనా తీరంలో ఇరాన్ చమురు ట్యాంకరు ఓ చైనా సరకు రవాణా నౌకను ఈ నెల 6న ఢీకొంది. ఆ తర్వాత 32 మంది నావికుల ఆచూకీ గల్లంతయింది. ఒక మృతదేహం మాత్రమే లభ్యమయింది. ఇరాన్ నుంచి దక్షిణ కొరియాకు వెళ్తున్న నౌకలో 1,36,000 టన్నుల తేలికపాటి చమురు (కండెన్సేట్ క్రూడాయిల్) ఉంది. దీనికి మంటలు అంటుకున్నాక మొదలైన దట్టమైన నల్లని పొగలు తగ్గడం లేదు. ట్యాంకరు నుంచి ఇంకా చమురు బయటకు వస్తుండడంతో అది పేలిపోయి, చుట్టుపక్కల ప్రాంతమంతటా పెద్దఎత్తున చమురు తెట్టు పేరుకుపోయే అవకాశం ఉందని అధికారులు, పర్యావరణ నిపుణులు భావిస్తున్నారు. దీని నివారణపై దృష్టి సారించారు.

పరిస్థితులు ప్రతికూలం

ప్రమాదస్థలికి చైనా అనేక నౌకల్ని పంపించినా అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేవు. గల్లంతైన సిబ్బంది అన్వేషణకు, సముద్రాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడడానికి చేపట్టిన చర్యలకు విఘాతం కలుగుతోంది. సాధారణ రకంతో పోలిస్తే తేలికపాటి ముడిచమురుకు విస్ఫోట గుణం ఎక్కువ. సాంద్రత తక్కువ. పైగా విషపూరితమైనది. చమురు ట్యాంకరు పేలిపోతే కొన్ని దశాబ్దాల కాలంలో జరిగిన పెను ప్రమాదాల్లో ఒకటిగా నిలిచిపోవచ్చు.

గవర్నర్ తీరుపై న్యాయపోరాటం అవకాశాలను పరిశీలిస్తున్నాం: కుంతియా

జడ్చర్ల గ్రామీణం, బాలానగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గవర్నర్ నరసింహన్ కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నారని కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్‌సీ కుంతియా అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక మాఫియా విషయంలో ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ నేతలు గవర్నరు వద్దకు వెళ్తే ఆయన ప్రభుత్వ పెద్దలు, ఇసుక మాఫియాకు అనుకూలంగా వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలపై న్యాయపోరాటం చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఏకఛత్రాధిపత్యం వహిస్తున్న ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లకు వ్యతిరేకంగా ఎన్నికల పోరాటానికి కార్యకర్తలను సంసిద్ధులను చేస్తామన్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీలు మల్లురవి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగం!

- గుజరాత్ విధానం అమలుకు రాష్ట్రాల యోచన
- సులువైన మార్గాలపై కేంద్రం అధ్యయనం
- ఎన్నికల ఖర్చు తగ్గి.. పోలింగ్ పెరిగే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: పోలింగ్ కేంద్రానికి వెళ్లనవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకొనే విధానంపై ఇప్పుడు తెలంగాణతో సహా కొన్ని రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇటీవల అన్ని రాష్ట్రాల ఎన్నికల సంఘాల కమిషనర్లు భేటీ అయినప్పుడు గుజరాత్ మునిసిపల్ ఎన్నికల్లో అమలు చేసిన 'ఇంటివద్ద నుంచే ఓటు వినియోగించుకునే' పద్ధతిని ఇతరులూ అనుసరించాలనే అభిప్రాయం వ్యక్తమయింది. తొలుత రక్షణ దళాలవారికి, ఎన్నికల విధులలో ఉండే ఉద్యోగులకు, ప్రవాసభారతీయులకు వర్తింపజేయాలనే భావనతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో ఏర్పాటు చేసిన కమిటీ తాజాగా కొన్ని సూచనలు చేసినట్లు తెలిసింది. బ్యాలెట్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఓటును వేసిన తర్వాత తిరిగి దాన్ని అప్‌లోడ్ చేయటం లేదా పోస్టులో పంపటం అనేది ఒక పద్ధతి. గుజరాత్‌లో ఈ-ఓటింగ్ విధానం ఎలా పనిచేస్తుందంటే.. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకునే వారినే ఓటర్లుగా నిర్ధారిస్తారు. అనంతరం యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అతని సెల్‌ఫోన్‌కు వస్తాయి. పోలింగ్ రోజున ఓటరు తన అకౌంట్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్‌లో డిజిటల్ పేపర్ ద్వారా ఓటు వేయాలి. అంతకు ముందు అకౌంట్‌ను తెరవటానికి ఏదైతే కంప్యూటర్‌ను వినియోగించారో దాన్ని మాత్రమే పోలింగ్ రోజున ఉపయోగించాలి. అదనపు తనిఖీలో భాగంగా ఎస్ఎంఎస్ ద్వారా పాస్‌కోడ్ వస్తుంది. ఇది 5 నిముషాలు మాత్రమే పనిచేస్తుంది. అది రెండో సారీ విఫలమైతే ఇక ఓటు వేయటానికి ఆస్కారం ఉండదు. ఓటు వేసిన తర్వాత రశీదు వస్తుంది. ఒక సారి ఈ-ఓటును వేసిన తర్వాత మళ్లీ తదుపరి ఎన్నికల వరకు అకౌంట్ పనిచేయదు. బీహార్, మహారాష్ట్ర తమ తదుపరి స్థానిక ఎన్నికల్లో దీన్ని ప్రవేశపెట్టేయోచనలో ఉండగా.. మొబైల్ ఫోనునే ఒక పోలింగ్ బూత్‌గా మార్చే విధానంపై దృష్టి సారిస్తే ఉత్తమంగా ఉంటుందనేది ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదన. కొన్ని దేశాల్లో ఈ-ఓటింగ్ విధానం ఉంది. దీని వల్ల వృద్ధులు సులువుగా ఓటు వేయవచ్చు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలు ఉండవు. ఎన్నికల ఖర్చూ తగ్గుతుంది.

అసెంబ్లీ ఎన్నికల్లోనూ మార్పులు: కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల విధానాల్లో కొన్ని మార్పులు తెచ్చే యోచనలో ఉంది. ఇవి రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల ఎన్నికలకూ ఉపయోగపడతాయని అధికారవర్గాలు తెలిపాయి. వివిధ డేటాబేస్‌లను ఓటర్ల పేర్లకు అనుసంధానం చేయటంపై ఎన్నికల సంఘం కసరత్తును చేపట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి. డేటాబేస్‌లో ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, జనాభావివరాలు వంటివి ఉంటాయి. ఈ అనుసంధానం వల్ల ఓటరును ఇట్టే గుర్తించొచ్చు. జీఐఎస్ అప్లికేషన్‌నూ ఎన్నికలసంఘం రూపొందిస్తోంది. దీనివల్ల పోలింగ్‌కేంద్రాలు గల ప్రాంతాలు ఇట్టే తెలుస్తాయి.

విద్యావనాల్లో విషవలయాలు

- ఉపాధ్యాయుల అనుచిత ధోరణులు
- టీచర్లు తిట్టారని ఇద్దరు విద్యార్థుల అఘాయిత్యం
- సహవిద్యార్థుల హేళనతో మరో బాలిక ఆత్మహత్య



జ్యోతి ప్రశాంత్ (పాతచిత్రం)

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: విద్యావనాలు విషవలయాలుగా మారుతున్నాయి.. పవిత్ర, ప్రశాంత వాతావరణం చెదిరిపోతోంది.. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య సంబంధాలు గాడితప్పుతున్నాయి. దీంతో నిత్యం ఏదో ఒకచోట విద్యార్థులు అర్ధంతరంగా నేల రాలిపోతున్నారు. వరసగా చోటుచేసుకుంటున్న ఇలాంటి సంఘటనలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అలా వేర్వేరు జిల్లాల్లో చోటుచేసుకున్న మూడు సంఘటనలివి.. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం కేసుపల్లికి చెందిన ప్రశాంత్(16) ఖమ్మం నగరం గోపాలపురంలోని శ్రీవిద్యానికేతన్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అక్కడే ఇద్దరు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. వారిలో రమేష్(48) అనే ఉపాధ్యాయుడు విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సోమవారం ఉదయం సదరు ఉపాధ్యాయుడికి తరగతి గదిలో ఓ విద్యార్థిని కడుపునొప్పిగా ఉందని తెలిపింది. వెంటనే అతడు సహ విద్యార్థి ప్రశాంత్ వైపు చూసి.. ఆమె అనారోగ్యానికి నువ్వే కారణమా అంటూ అపహాస్యం చేశాడు. ప్రశాంత్, అతని స్నేహితులు అతడి వ్యాఖ్యలను గట్టిగా ఖండించారు. వసతి గృహంలోనూ సదరు ఉపాధ్యాయుడు తమపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలిసిన పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ అక్కడకు చేరుకుని ప్రశాంత్, అతని స్నేహితులను తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రశాంత్ వసతి గృహానికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పాఠశాల యాజమాన్యం అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసులు, ఎంఈవో శ్రీనివాస్ వసతి గృహ విద్యార్థులను ఇళ్లకు పంపించి విచారణ చేపట్టారు. దీనిపై ప్రిన్సిపల్ గోపాలకృష్ణను వివరణ కోరగా విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియవని చెప్పారు. ఉపాధ్యాయుడు విద్యార్థులను వేధిస్తున్న విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలోని మాధవన్‌జీ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకురాలు మందలించిందని ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థుల మధ్య తరచూ వివాదం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం విద్యార్థులు, అధ్యాపకులు పరస్పరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అక్కడ పోలీసులు.. ఇరువర్గాలతో మాట్లాడుతుండగానే కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థిని ఒకరు అధ్యాపకురాలు మందలించారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెకు ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. ఓ అధ్యాపకురాలు తమపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆమె వల్లనే గతంలోనూ ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిందని విద్యార్థులు తెలిపారు. తాజా ఉదంతానికి కూడా ఆమే కారణమన్నారు. పోలీసులు ఇరువర్గాలను విచారిస్తున్నామన్నారు.

9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య



లావణ్య

గుమ్మడిదల, న్యూస్‌టుడే: తోటి విద్యార్థుల సూటిపోటీ మాటలు భరించలేక ఓ విద్యార్థిని తనువు చాలించింది. ఈ సంఘటన ఆలస్యంగావెలుగు చూసింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలోని ప్రగతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లావణ్య (14) ఈనెల 2న కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి ఆమె మృతి చెందింది. ఇద్దరు సహవిద్యార్థుల అసభ్య ప్రవర్తనే దీనికి కారణమని తల్లితండ్రులు పుణ్యమ్మ, శ్రీశైలం ఆరోపించారు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులకు, యజమాన్యానికి తెలిపినా, పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

- ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త నిర్లక్ష్యమే కారణం!



మృతి చెందిన కృప

నిజాంసాగర్, న్యూస్‌టుడే: రెండ్రోజులుగా అనారోగ్యంతో ఉన్నా ఉపాధ్యాయులు, ఆరోగ్యకార్యకర్త పట్టించుకోకపోవడంతో ఓ గురుకుల విద్యార్థిని ఆదివారం రాత్రి కన్నుమూసింది. సహచర విద్యార్థినులు తెలిపిన ప్రకారం..సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ గ్రామానికి చెందిన కృప(17) కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. తనకు ఒంట్లో బాగాలేదని, తలనొప్పి.. కడుపునొప్పి, వాంతులు వస్తున్నాయంటూ శనివారం ప్రిన్సిపల్‌తో పాటు ఆరోగ్య కార్యకర్తకు తెలిపింది. ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్న మాత్రలు అందించగా వాటికి తగ్గలేదు. ఆదివారం ఉదయం నాటికి తీవ్ర అనారోగ్యానికి గురికాగా ఆ సమయంలో ప్రిన్సిపల్, ఆరోగ్య కార్యకర్త గురుకులంలో లేరు. విద్యార్థుల ఒత్తిడితో ఉపాధ్యాయులు పెద్దకొడప్‌గల్ ఆరోగ్య కేంద్రానికి.. అక్కడి నుంచి పిట్లం తరలించారు. వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఈ విషయం తెలిసిన ఇతర విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్త మెడ కోసిన భార్య

- అక్కడికక్కడే మృతి
- వేములవాడ ఆలయ పరిసరాల్లోనే ఘటన
- వివాహేతర సంబంధమే కారణం
- మృతదేహంతో బంధువుల ధర్నా





మృతుడు బాలయ్య (పాత చిత్రం) ● నిందితురాలు నర్సవ్వ

వేములవాడ, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వస్వామి ఆలయ పరిసరాల్లోనే భార్య..తన భర్త మెడకోసి దారుణంగా హత్య చేసింది. ఆదివారం రాత్రి జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా నంగనూర్ మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన బండి బాలయ్య(37), భార్య నర్సవ్వతో కలిసి ఆదివారం రాజన్న దర్శనార్థం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ వెళ్లారు. స్వామి దర్శనానంతరం ఆలయ సమీపంలోని పార్కింగ్ స్థలంలో రాత్రి వంట చేసుకుని తిన్నారు. అక్కడే నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో నర్సవ్వ..వెంట తెచ్చుకున్న కత్తితో మద్యం మత్తులో ఉన్న భర్త మెడ కోసింది. బాధితుడి ఆర్తనాదాలు విన్న సమీపంలోని భక్తులు అక్కడికి రావడంతో అక్కణ్నుంచి పరారైంది. బాలయ్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నర్సవ్వకు ఘన్పూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండేదని.. ఆ క్రమంలోనే భర్తను పథకం ప్రకారం హత్య చేసిందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే..మృతుని బంధువులు నిందితురాలి ప్రియుడి ఇంటి ఎదుట సోమవారం పొద్దుపోయాక మృతదేహంతో ఆందోళనకు దిగారు.

ఇండియన్ బ్యాంక్ మాజీ సీఎండీకి మూడేళ్ల జైలు

దిల్లీ: బ్యాంకుకు రూ. 18.10 కోట్ల మేర నష్టం కలిగించిన కేసులో ఇండియన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎం. గోపాలకృష్ణన్‌కు, మరో ఇద్దరు అధికారులకు సీబీఐ ప్రత్యేక కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. నేరగాళ్లకు జైలు శిక్షతో పాటు రూ. 30వేల నుంచి రూ. లక్షా నలభైవేల వరకూ జరిమానా విధించింది. 1989-1993 మధ్య షణ్ముగసుందరం, సతీష్‌కుమార్, గోపాలకృష్ణన్ అనే ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు దిల్లీకి చెందిన స్కాన్‌టెల్ ప్రైవేట్ లిమిటెడ్, అలైడ్ ఎక్విప్‌మెంట్ అండ్ సర్వీసెస్ లిమిటెడ్ డైరెక్టర్లతో కుమ్మక్కై ఆ సంస్థలకు రూ. 18.08 కోట్ల పరపతి (క్రెడిట్) సదుపాయాన్ని కల్పించారు. అయితే, ఆ మొత్తాన్ని చెల్లించకుండా సంస్థల డైరెక్టర్లు బ్యాంకును మోసం చేశారని సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. 25ఏళ్ల క్రితం జరిగిన నేరానికి సంబంధించి తీర్పు సోమవారం వెలువడింది.

పౌరుల నైపుణ్యాలపై జాతీయస్థాయి సర్వే

ఈనాడు, దిల్లీ: దేశ పౌరుల నైపుణ్యాలపై జాతీయ స్థాయిలో మొదటిసారిగా సర్వే నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నెలాఖరున మొదలై నాలుగు నెలల్లో ముగిసే ఈ సర్వేలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 1.60 లక్షల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారు. వృత్తిపరమైన అవసరాల నిమిత్తం నైపుణ్యాలను పొందడానికి ఎంత ఖర్చు చేస్తున్నారనే ప్రశ్నతో సర్వే మొదలవుతుంది. నైపుణ్యంపై ప్రజల దృక్కోణం ఏమిటి? నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ఉన్న అవగాహన స్థాయి ఏమిటి? యువత ఏయే రంగాల్లో నిపుణతను కోరుకొంటోంది?.... ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుంటారు. ఈ సర్వేను జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, భారతీయ ఆర్థిక రంగ పర్యవేక్షణ కేంద్రం- సంయుక్తంగా చేస్తాయి.

తాను దొంగనే అయితే భాజపాలో ఉండేవాడినే గానీ జైల్లో మాత్రం కాదని ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ అన్నారు.

ఓ చిక్కుముడితో మొదలుపెడదాం!

చాలా చిన్న ఇరుకు గది..
నాలుగ్గోడలతో పూర్తిగా మూసేసి ఉంది.
ఆ గది మధ్యలో ఒక మోటరు పంప్.
అది రోజంతా ఆడుతూనే ఉంటుంది.
కాలం నడిచిపోతోంది, అంతా బానే ఉంది.
కానీ కొన్నేళ్లకు ఆ మోటారు..
మొరాయించటం మొదలెట్టింది.

అప్పుడు మనమేం చేస్తాం?

దానికి ఏం మరమ్మతు చెయ్యాలన్నా
గోడ పగలగొట్టాలి.. లోపలకు వెళ్లాలి.
రిపేరు చేసి మళ్లీ గోడ మూసెయ్యాలి.
దానికి పెద్ద ఆలోచనేం అక్కర్లేదు.
చాలాకాలంగా ఆ పనే చేస్తున్నాం!



డా॥ గోపీచంద్ మన్నం
చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్
ఎండీ, స్టార్ హాస్పిటల్స్
హైదరాబాద్

కానీ గోడ మొత్తం
పగలగొట్టకుండా..
ఒకచోట చిన్న రంధ్రం చేసి..
దాని గుండానే మోటరు
రిపేరు మొత్తం పూర్తి
చెయ్యగలిగితే?

పెద్ద సవాలే!

కానీ దాన్ని చాలావరకూ సుసాధ్యం చేసింది
మన ఆధునిక వైద్యరంగం!

మనం చెప్పుకొంటున్న ఆ ఇరుకు గది మన
ఛాతీ అయితే.. ఆ లోపలి మోటర్ మన
ప్రాణ సమానమైన గుండె!
ఇప్పుడు అర్థమైందిగా..
ఆ మరమ్మతు ఎంత కీలకమైనదో!

క్లిష్టమైన గుండె సమస్యలను కూడా మొత్తం ఛాతీ అంతా తెరవాల్సిన అవసరం లేకుండా చిన్నకోత నుంచే మరమ్మతు చేసే ఈ ఆధునిక విధానాన్నే 'మిక్స్' అంటారు!

గుండె సర్జరీల్లో పెద్ద మార్పు తెచ్చిన ఈ విధానంతో రోగులకు ఎంతో ప్రయోజనం. అందుకే దీనికి సంబంధించిన వివరాలను మీ ముందుకు తెస్తోంది ఈ వారం సుఖీభవ!!

బిగ్ సర్జన్స్ మేక్ బిగ్ కట్స్..

ఒకప్పుడు తలపండిన సర్జన్లంతా గొప్పగా చెప్పుకున్న సిద్ధాంతం ఇది! పెద్దపెద్ద కోతలు పెట్టి సర్జరీలు చెయ్యటం తమ శక్తిసామర్థ్యాలకు గీటురాయి అనీ, బెరుకుబెరుకుగా చిన్నచిన్న కోతలు పెట్టాల్సిన పని తమకు లేదనీ, అంత పెద్ద కోత పెట్టినా తాము రోగిని బతికించి బాగుచెయ్యగలమనీ గొప్పగా చెప్పుకుంది మొన్నటి సర్జన్ల తరం. అప్పటికి అదే గొప్ప.

కానీ ఇప్పుడు కాలం మారిపోయింది!!

ఇప్పుడు ఎంత చిన్న కోతతో పని పూర్తి చెయ్యగలిగితే అంత మేలు! ఒంటి మీద పెద్దపెద్ద కోతలు పెట్టి.. అవి మానటానికి చాలా కాలం పట్టి.. మధ్యలో రకరకాల సమస్యలు తలెత్తి.. కోలుకోవటానికి బోలెడన్ని వారాలూ, నెలలూ పట్టి.. ఈ ఇబ్బందులన్నీ ఉండొద్దనుకుంటే... ఒంటి మీద కోత వీలైనంత సూక్ష్మంగా ఉండాలి, సర్జరీ దాన్నుంచే పూర్తి అయిపోవాలి! ఇదీ నేటి ఆధునిక వైద్యరంగాన్ని నడిపిస్తున్న సూత్రం! ఎంత పెద్ద సర్జరీ తర్వాతైనా రోగులు తేలికగా లేచి తిరిగేలా చేస్తున్న సర్జరీ సూక్ష్మం కూడా ఇదే

గుండెలోని రక్తనాళాలు పూడుకుపోయి.. గుండెనొప్పి, గుండెపోటు ముప్పు ముంచుకురావచ్చు. లేదూ గుండెలో గదుల మధ్య రెక్కల తలుపుల్లా ఉండే చిన్నచిన్న కవాటాలు బాగా గట్టిబడి లేదా బాగా వదులైపోయి రక్తప్రవాహం మొత్తం అస్తవ్యస్తం కావొచ్చు. గుండెకు సంబంధించినంత వరకూ ఈ రెండూ చాలా కీలకమైన, చాలా ఎక్కువగా చూస్తుండే ప్రధానమైన సమస్యలు. వీటన్నింటినీ కూడా ఒక దశ వరకూ సర్జరీ అవసరం లేకుండా రకరకాల ఆధునిక విధానాల్లో సరిచెయ్యొచ్చు. కానీ వీటిలో ఏ సమస్య అయినా.. ఒక స్థాయి దాటితే మాత్రం సర్జరీ అనివార్యమవుతుంది.

ఎందుకో, ఏమిటో కాస్త వివరంగా చూద్దాం.

గుండె రక్తనాళాల్లో కొవ్వు వంటివి చేరి అవి పూడుకుపోయాయనుకుందాం. అప్పుడు వాటిలో రక్తప్రవాహానికి ఆ పూడిక పెద్ద అడ్డంకిగా తయారవుతుంది. దీంతో గుండె గోడలకు రక్తం సరిగా అందక.. గుండె నొప్పి మొదలై.. గుండెపోటుకు దారి తీస్తుంది. రక్తనాళాల్లోని ఈ పూడికలు ఓ మోస్తరుగా ఉన్నా.. వీటి సంఖ్య తక్కువగా ఉన్నా.. ఇప్పుడు ఆ పూడిక దగ్గర స్టెంట్ల వంటివి అమర్చి.. మళ్లీ రక్తప్రవాహాన్ని పునరుద్ధరించొచ్చు. అయితే.. పూడికలు మరీ పెద్దగా ఉన్నా, ఎక్కువ చోట్ల పూడుకున్నా.. వాటన్నింటినీ స్టెంట్లు అమర్చి సరిచెయ్యటం కష్టం. అందుకోసం.. పెద్ద సర్జరీ చేసి.. ఆ పూడుకున్న ప్రాంతాన్ని తప్పిస్తూ.. పైనా కిందా మరో కొత్త రక్తనాళాన్ని అతికించి.. రక్తప్రవాహాన్ని పునరుద్ధరించాల్సి వస్తుంది. తరచుగా మనం వింటుండే 'బైపాస్' సర్జరీ ఇదే!


రెండోది- గుండె గదుల మధ్యనా, అలాగే గుండె నుంచి రక్తం బయటకు వచ్చే ప్రధాన రక్తనాళాల దగ్గరా.. చిన్నచిన్న కవాటాలు ఉంటాయి. రెక్కల తలుపుల్లాంటి ఈ కవాటాలు క్రమబద్ధంగా తెరుచుకుంటూ మూసుకుంటూ.. రక్తం బయటికి, లోపలికి ఒక పద్ధతి ప్రకారం ప్రవహించేలా చూస్తుంటాయి. కానీ కొందరికి రకరకాల కారణాల రీత్యా ఈ కవాటాలు దెబ్బతింటాయి. అప్పుడు వీటిని సరిచేయటమో, లేక కృత్రిమ కవాటాలు అమర్చటమో తప్పనిసరి అవుతుంది. దీనికోసం కూడా పెద్ద సర్జరీ అవసరమవుతుంది. ఈ రెంటికీ కూడా గుండెకు పెద్ద సర్జరీ తప్పదు!

పెద్ద సర్జరీ!


గుండెకు పెద్ద సర్జరీ అవసరమైనప్పుడు.. సాధారణంగా ఛాతీ ఎదురొమ్ము ఎముకను మధ్యలో పైనుంచి కిందికి దాదాపుగా 25-26 సెంటీమీటర్లు కట్ చేసి.. ఛాతీ మొత్తం తెరిచి.. గుండెను పట్టుకుని.. దానికి మరమ్మతు పూర్తి చేసి.. మళ్లీ ఛాతీని మూసేస్తుంటారు. కొన్ని దశాబ్దాలుగా చేస్తున్న సంప్రదాయ సర్జరీ విధానం ఇది. అయితే ఛాతీ మధ్యలో.. ఎదురొమ్ము ఎముకను అంత పెద్దగా కట్ చేస్తుండటం వల్ల పెద్ద గాయం, నొప్పి బాధ, అది మానటానికి ఎక్కువ కాలం పట్టటం వంటి ఇబ్బందులన్నీ తప్పటం లేదు.

దీనికి ప్రత్యామ్నాయం లేదా?

పొట్టకు సంబంధించిన సర్జరీల్లో 'ల్యాప్రోస్కోపీ' పెద్ద విప్లవం! అంటే పెద్ద కోతతో పొట్ట మొత్తం తెరిచి.. లోపల మరమ్మతు చెయ్యాల్సిన అవసరం లేకుండా.. పొట్ట మీద కేవలం రెండు మూడు చిన్నచిన్న రంధ్రాలు మాత్రమే చేసి, వాటి ద్వారా లోపలికి పరికరాలు పంపించి.. వాటితోనే సర్జరీ చేసి.. చివరికి ఆ రంధ్రాలను మూసేస్తే పని పూర్తయిపోతుంది. దీనివల్ల పొట్టకు సంబంధించిన చాలా రకాల సర్జరీలు ఇప్పుడు పెద్దపెద్ద కోతల అవసరం లేకుండానే పూర్తయిపోతున్నాయి. మరి ఇలాగే గుండెకు కూడా చెయ్యొచ్చా? చిన్నచిన్న రంధ్రాల ద్వారానే గుండెకూ మరమ్మతు చేసే ప్రయత్నాలు జరిగాయిగానీ.. ల్యాప్రోస్కోపీ సర్జరీ చేసే ముందు పొట్ట లోపల పరికరాలు తేలికగా అటూఇటూ ఆడటానికి వీలుగా పొట్టలోకి కార్బన్‌డైఆక్సైడ్ వంటి వాయువులను లీటర్ల కొద్దీ లోపలికి ఎక్కిస్తారు. దీనివల్ల పొట్ట పెద్ద తిత్తిలా ఉబ్బి.. లోపల స్పష్టంగా చూస్తూ, పరికరాలను ఉపయోగించేందుకు వీలైనంత స్థలం లభిస్తుంది. కానీ పొట్టలో ఉన్నంత విశాలమైన స్థలం ఛాతీలో ఉండదు. ఛాతీని రొమ్ము ఎముకలు దృఢంగా పట్టి ఉంచుతాయి. పైగా లోపల గుండె, ఊపిరితిత్తుల వంటి కీలకమైన అవయవాలన్నీ దగ్గరదగ్గరగా ఇరుక్కుని ఉంటాయి. అందుకని సాధారణ ల్యాప్రోస్కోపీ విధానాలు గుండె ఆపరేషన్లకు వీలుపడటం లేదు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని.. పెద్దకోతకు ప్రత్యామ్నాయంగా వచ్చిందే.. మిక్స్! అంటే 'మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ'. ఛాతీ మీద పెద్దకోత బదులు.. లోపల సర్జరీ ఎక్కడ అవసరమో.. పైన సరిగ్గా అదే ప్రదేశంలో చిన్న కోత పెట్టి.. బయటి నుంచి గుండెను చూస్తూ.. ఆ కాస్త ప్రదేశంలో సర్జరీ పూర్తి చెయ్యటం! ఈ విధానంలో రోగులు చాలా త్వరగా కోలుకుంటారు కాబట్టి ఇటీవలి కాలంలో ఇది బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది.



కోత చిన్నది! లాభం పెద్దది!!



సర్జన్లకు శ్రమ ఎక్కువైనా.. రోగికి ప్రయోజనం!

దశాబ్దాలుగా చేస్తున్న 'ఓపెన్ హార్ట్ సర్జరీ'ల్లో... ఛాతీ మొత్తం తెరుస్తారు కాబట్టి గుండె, ఆ చుట్టుపక్కల అవయవాలన్నీ వైద్యులకు కళ్ల ముందు స్పష్టంగా కనబడుతుంటాయి. వాటిని కావాల్సిన విధంగా చకచకా మరమ్మతు చేసి, మళ్లీ ఛాతీని మూసేసే వీలుంటుంది. కానీ చిన్నకోత గుండె ఆపరేషన్లు ఇలా కాదు. చనుమొనల కింద.. పక్కటెముకలను ముట్టుకోకుండా వాటి మధ్య ఉండే ప్రదేశంలోనే, కేవలం 4-7 సెంటీమీటర్ల కోత మాత్రమే పెడతారు. దానిలో నుంచే గుండెను నేరుగా చూస్తూ ఆ భాగాన్ని సరి చేస్తారు. ఆ ఇరుకు కోత నుంచే లోపలికి పరికరాలు పంపి, సర్జరీ చెయ్యాలి కాబట్టి సర్జన్లకు చాలా నేర్పు, ఓర్పు, ప్రత్యేక నైపుణ్యం, ముఖ్యంగా ఎంతో పూర్వ అనుభవం అవసరమవుతాయి. ఈ రూపేణా వైద్యులకు శ్రమ కాస్త ఎక్కువైనా.. చిన్న కోతతోనే సర్జరీ పూర్తవుతుంది కాబట్టి రోగులు చాలా త్వరగా, తేలికగా కోలుకుంటారు. అయితే ఇది అన్ని రకాల గుండె ఆపరేషన్లనూ ఇలా చెయ్యటం కుదరదు, కొన్ని రకాల ఆపరేషన్లకే ఈ విధానం సరిపోతుంది.

చిన్న కోత.. ఏయే సర్జరీలు చెయ్యొచ్చు?

మొత్తం ఛాతీ తెరిస్తే.. గుండెకు ఏ రకమైన సర్జరీ అయినా చెయ్యొచ్చు. కానీ పక్కటెముకల మధ్యగా చిన్న కోత మాత్రమే పెట్టినప్పుడు.. ఎదురుగా, అక్కడికి దగ్గరగా కనబడుతుండే గుండె భాగాలకు మాత్రమే సర్జరీ చేయటం వీలవుతుంది. అందుకే ఈ విధానం కొన్ని రకాల సర్జరీలకే సూటవుతుంది.

- ***కవాటాల మార్పిడి, మరమ్మతు:*** గుండె లోపల ఉండే కీలకమైన అయోటిక్, మైట్రల్, ట్రైకుస్పిడ్ కవాటాలకు మరమ్మతు చెయ్యాలన్నా, లేదూ వాటిని మార్పిడి చెయ్యాలన్నా ఈ విధానం బాగా ఉపయోగపడుతుంది. కుడివైపు రొమ్ము ఎముకల మధ్య చిన్నకోత సరిపోతుంది.
- ***రంధ్రాల మూసివేత:*** కొన్నిసార్లు గుండె గదుల మధ్య ఉండే గోడలకు రంధ్రాలుండి, మంచి-చెడు రక్తం కలిసిపోయి సమస్యలు వస్తుంటాయి. ఆ రంధ్రాలను (ఏఎస్‌డీ మొ॥) మూసివేయటానికి చిన్నకోత ఆపరేషన్ బాగా ఉపయోగపడుతుంది. ఈ సమస్యలు పిల్లల్లో ఎక్కువ. వీరికి ఛాతీ మొత్తం తెరిచి ఆపరేషన్ చేస్తే ఆ మచ్చ జీవితాంతం అలా ఉండిపోతుంది. చిన్నకోత ఆపరేషన్‌తో ఆ ఇబ్బంది కూడా లేకుండా చూడొచ్చు.
- ***బైపాస్:*** గుండెలోని ప్రధాన రక్తనాళాలు పూడుకున్నప్పుడు.. కొత్త రక్తనాళం అతికి, రక్తప్రవాహాన్ని పునరుద్ధరించేందుకు బైపాస్ ఆపరేషన్ చేస్తారు. గుండె మీద ప్రధానంగా మూడు రక్తనాళాలుంటాయి. వీటిలో ఎడమవైపు ఉండే నాళాల్లో పూడికలకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

అయితే...

కొన్నిసార్లు కవాటాల మరమ్మతే కాకుండా దాంతోపాటు గుండె గదులనూ సరిచెయ్యాల్సి వస్తుంది. అలాగే రక్తనాళాల్లో పూడికలు ఎక్కువ ఉండి, ఎక్కువ సంఖ్యలో రక్తనాళాలను అతకాల్సి వస్తుంది. కొందరికి కవాటాల మరమ్మతు, రక్తనాళాల అతుకులు.. రెండూ చెయ్యాల్సి వస్తుంది. ఇలాంటి క్లిష్ట సందర్భాల్లో ఈ విధానం సరిపోదు, వీరికి పూర్తి ఛాతీ తెరిచే 'ఓపెన్' ఆపరేషనే మంచిది.

ప్రయోజనాల ఎన్నో!

ఎవరికి ఈ చిన్నకోత సర్జరీ బాగా ఉపయోగపడుతుందో గుర్తించి.. చక్కటి నైపుణ్యంతో చేస్తే దీనివల్ల రోగులకు ఎన్నో ప్రయోజనాలుంటాయి.

- కోత చాలా చిన్నది, పైగా ఎముకలను ఎక్కడా కట్ చెయ్యరు. కేవలం కండను, అదీ 4-5 సెం.మీ. మేర కట్ చేస్తారు కాబట్టి గాయం చాలా తేలికగా మానిపోతుంది. నొప్పి తక్కువ. రోగులు వేగంగా కోలుకుని, రెండు, మూడు రోజుల్లోనే ఇంటికి వెళ్లిపోతారు.
- ఓపెన్ సర్జరీలో ఛాతీ, ఎదురొమ్ము ఎముకను పెద్దగా కట్ చేస్తారు కాబట్టి వాటికి ఇన్ఫెక్షన్ల బెడద ఎక్కువ. కొన్ని సందర్భాల్లో లోపల గుండె బాగై, చక్కగా పని చేస్తున్నా పైన ఉండే ఆపరేషన్ గాయం మానక ఇబ్బంది పడుతుంటారు. చిన్నకోతతో ఈ సమస్య ఉండదు. ఊపిరితిత్తులను కూడా పెద్దగా నొక్కటం వంటివేమీ చెయ్యరు, మత్తు సమయమూ తక్కువే కాబట్టి వీరిలో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల బాధా చాలాచాలా తక్కువ.
- ఆపరేషన్ సమయంలో రక్తం చాలా తక్కువ పోతుంది. ఛాతీ మీద పెద్ద మచ్చలుండవు. చాలాసార్లు మచ్చ చనుమొనల కింద, రొమ్ముల కిందే ఉంటుంది.
- ప్రస్తుతానికి ఓపెన్ ఆపరేషన్ కంటే చాలా చిన్నకోత నుంచే సర్జరీ చెయ్యాల్సి ఉంటుంది కాబట్టి ఖరీదు కాస్త ఎక్కువ అవుతుంది, అయితే ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండక్కర్లేదు, వేగంగా కోలుకుంటారు కాబట్టి ఆ మేర ప్రయోజనమూ ఉంటుంది.
- ఎక్కువ బరువున్న వాళ్లకు సర్జరీ అంటే సాధారణంగా ఇన్ఫెక్షన్ ఇబ్బందులు ఎక్కువ. వీరికి ఈ చిన్నకోత సర్జరీతో ప్రయోజనం ఎక్కువ. త్వరగా లేచి తిరుగుతారు.

చర్మం పొడిబారకుండా...



శీతాకాలం ఎక్కువగా వేధించే సమస్య పొడిచర్మం. కారణం.. వేడి వేడి నీటితో స్నానం చేయడం, గాఢత ఎక్కువగా ఉండే సబ్బులు వాడటం.. కొంత వరకూ వయసు కూడా! చలికాలం ఒంట్లో తేమ తగ్గి చర్మం దురద, పగిలిపోవడం వంటి సమస్యలు మొదలవుతాయి. అలా కాకుండా చర్మం మృదువుగా ఉండాలంటే...

- మనం ముందుగా చేయాల్సిన పని.. చర్మానికి తేమను అందించడం లేదా చర్మం తేమను కోల్పోకుండా చూడ్డం. పెట్రోలియం జెల్లీ, మినరల్ ఆయిల్స్ వంటివి ఇందుకు సహకరిస్తాయి. వీటిని పైపూతగా ఉపయోగించడం వల్ల చర్మం తేమతో నిగారిస్తుంది.
- చలి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు గదిలో హ్యూమిడిఫైయర్లను ఉంచితే చర్మం పొడవ్వకుండా ఉంటుంది.
- గంటల కొద్దీ స్నానం చేయకుండా పది నిమిషాల్లో, అదీ వేడివేడి నీటితో కాకుండా గోరువెచ్చని నీటితో స్నానం ముగించేయాలి. లేకపోతే చర్మంలోని సహజసిద్ధమైన నూనెలని కోల్పోయే అవకాశం ఎక్కువ. ఆ నూనెలు తొలగిపోతే చర్మం పొడిగా మారుతుంది.
- సబ్బు వాడకాన్ని వీలైనంత వరకూ తగ్గించుకోవడం మంచిది. తప్పనిసరై వాడాల్సి వచ్చినా.. తేమ శాతం ఎక్కువ ఉండేవి ఆల్కహాల్, గాఢత లేనివి వాడాలి.
- స్నానం చేసి వచ్చిన వెంటనే శరీరం పూర్తిగా తడారక ముందే కాళ్లూ, చేతులకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. అలా అయితే తేమ ఎక్కువ సేపు నిలిచి ఉంటుంది.

మధుమేహం

చురుకుగా ఉండండి చాలు!

జీవనశైలిలో చేసుకునే మార్పులు, రోజువారీ వ్యాయామం.. ఈ రెండూ మధుమేహాన్ని అదుపులో ఉంచుతాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. రోజూ వ్యాయామం చేయడం వల్ల బరువు తగ్గడంతో పాటు రక్తపోటు అదుపులో ఉంటుంది. హానికారక ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు నియంత్రణలో ఉంటాయి. ఆందోళన తగ్గుతుంది. కండర పుష్టి పెరిగి ఎముకలు బలపడతాయి. ముఖ్యంగా ఇన్సులిన్ విడుదల స్థాయులు క్రమబద్ధమవుతాయి. వ్యాయామం అంటే మరీ పెద్ద వ్యాయామాలేం చేయాల్సిన అవసరం లేదు. మెట్లు ఎక్కడం, తోటపని చేయడం, కారు కడగడం, ఇంటి పనులు చేయడం వల్ల కూడా క్యాలరీలు కరుగుతాయి. ఇంత చిన్న పనులకే మన శరీరంలో మార్పు వస్తుందా అంటే... ఏదో ఒక రోజు చేసి మమ అనిపించడం కాకుండా రోజూ ఇంటి పనులు స్వయంగా చేయడం వల్ల క్యాలరీలు నియంత్రణలో ఉంటాయి. ఇంటి పనులు చేసుకునే తీరిక లేదు ఉద్యోగం చేస్తున్నా అంటారా? అయితే మీ పని వేళలకు అనుగుణంగా వ్యాయామ వేళలని మార్చుకోండి. పనికి వెళ్లే ముందు, సాయంత్రం తీరిగ్గా... ఇలా మీ ఇష్టం. కానీ రోజువారీ వ్యాయామం మాత్రం తప్పనిసరి. వారంలో 150 నిమిషాల పాటు ఏరోబిక్ వ్యాయామాలు చేయడం వల్ల ఫలితం ఉందంటున్నారు అమెరికా ఆరోగ్య విభాగం నిపుణులు. ఏరోబిక్స్ వంటివి మేం చేయలేం అంటారా.. దానికీ ప్రత్యామ్నాయం ఉంది. వారంలో ఐదుసార్లు 30 నిమిషాల పాటూ నడిస్తే చాలంటున్నారు. అయితే ఓ చిన్న హెచ్చరిక. డయాబెటిక్ రెటినోపతీ కంటి సమస్యతో బాధపడేవారు ఎక్కువ బరువు ఎత్తే వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ వంటి వ్యాయామాలు చేయడం మంచిది కాదు. ఇలా చేస్తే కంటిపై ఒత్తిడి పడే ప్రమాదం ఉంది. అలాగే నాడులు బలహీనపడిన న్యూరోపతి సమస్య ఉన్నవాళ్లు, ముఖ్యంగా అరికాలిలో స్పర్శ తగ్గిన వారు కాళ్ల మీద ఒత్తిడి పడే వ్యాయామాలు చేయకూడదు. బదులుగా ఈత, యోగా వంటివి చేయడం మంచిది.



ఈనాడు సినిమా

'నా.. నువ్వే' ప్రేమికా!




'నా... నువ్వే'లో తమన్నా, కల్యాణ్‌రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా జయేంద్ర దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. తమన్నా కథానాయిక. కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి నిర్మిస్తున్నారు. మహేష్ ఎస్.కోనేరు సమర్పిస్తున్నారు. సోమవారం టీజర్‌ని విడుదల చేయడంతో పాటు, చిత్రానికి 'నా... నువ్వే' అనే పేరును ఖరారు చేస్తున్నట్టు ప్రకటించారు నిర్మాతలు. 'ప్రేమికా...' అంటూ సాగే పాటతో టీజర్‌ని తీర్చిదిద్దారు. ఇందులో తమన్నా మీరా అనే రేడియో జాకీగా కనిపించబోతోంది. టీజర్‌లో వినిపించిన 'వరుణ్ ఇఫ్ యు లిజనింగ్...ఐ మిస్ యు' అనే సంభాషణల్ని బట్టి కల్యాణ్‌రామ్ వరుణ్ అనే యువకుడిగా కనిపించనున్నట్టు తెలుస్తోంది. "కథకు తగ్గట్టుగానే పేరును నిర్ణయించాం. సరికొత్త కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు దర్శకుడు. కల్యాణ్‌రామ్ - తమన్నా కలయిక, వాళ్లిద్దరి లుక్ కొత్తగా ఉంటుంది. పి.సి.శ్రీరామ్ ఛాయాగ్రహణం, శరెత్ సంగీతం చిత్రానికి ప్రధాన బలమ"న్నారు కిరణ్ ముప్పవరపు. మహేష్ కోనేరు మాట్లాడుతూ "అత్యున్నత సాంకేతిక బృందం కలిసి చేస్తున్న చిత్రమిది. ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాల మేళవింపుతో సాగుతుంది. ఈ నెలాఖరుకి దాదాపుగా చిత్రీకరణ పూర్తవుతుంది. వేసవి సెలవుల్లో చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. తనికెళ్ల భరణి, పోసాని కృష్ణమురళి, వెన్నె కిషోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖవాణి తదితరులు నటిస్తున్నారు.

పోలీస్ రంగంలోకి దిగాడు

నాగార్జున కథానాయకుడిగా రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'శివ', 'అంతం', 'గోవిందా గోవిందా' తర్వాత ఆ కలయికలో తెరకెక్కుతున్న నాలుగో చిత్రమిది. మైరా సరీన్ కథానాయికగా నటిస్తోంది. కంపెనీ పతాకంపై రామ్‌గోపాల్ వర్మ, సుధీర్ చంద్ర నిర్మిస్తున్నారు. ఇందులో నాగార్జున శక్తిమంతమైన



నాగార్జున

పోలీసు అధికారిగా కనిపించబోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. సెట్‌లో నుంచే తన స్టిల్‌ని ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ అమెరికాలోని తెలుగు ప్రేక్షకులకు హలో చెప్పారు నాగార్జున. తన తనయుడు అఖిల్ కథానాయకుడిగా నటించిన 'హలో' అమెరికాలో మిలియన్ డాలర్ల మార్కుని అధిగమించింది. ఈ సందర్భంగా ఆయన తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'హలో' విడుదలని పురస్కరించుకొనే రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న తన సినిమాకి కొంచెం విరామం ఇచ్చారు నాగ్. ఆ చిత్రం విడుదలైన వెంటనే మళ్లీ రంగంలోకి దిగాడు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. వేసవికి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. 'గన్', 'సిస్టమ్' అనే పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మరి చిత్రబృందం అధికారికంగా ఎప్పుడు, ఏ పేరును ప్రకటిస్తుందో చూడాలి.



సి.కల్యాణ్, బ్రహ్మానందం, బాలకృష్ణ, నటాషా దోషి, చిరంతన్‌భట్, కె.ఎస్.రవికుమార్, వి.వి.వినాయక్, బోయపాటి శ్రీను

నవరసాలున్న చిత్రం 'జై సింహా'

"నా ప్రయాణంలో రకరకాల సినిమాలు చేశా. ఇప్పుడు కూడా ప్రేక్షకులకు కొత్తదనం అందించాలనే తపనతోనే కథల్ని ఎంపిక చేసుకొంటున్నా" అన్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'జై సింహా'. నయనతార, హరిప్రియ, నటాషా దోషి కథానాయికలు. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. చిరంతన్ భట్ స్వరకర్త. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది చిత్రం. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్, బోయపాటి శ్రీను ముఖ్య అతిథులుగా హాజరై చిత్రబృందానికి ప్లాటినమ్ డిస్క్ జ్ఞాపికల్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "నవరసాలున్న చిత్రం 'జై సింహా'. ఎనిమిదేళ్ల నుంచి కె.ఎస్.రవికుమార్‌తో కలిసి సినిమా చేయాలనుకొంటున్నా. ఆ కల ఈ సినిమాతో, ఈ టైటిల్‌తో నెరవేరడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. నాన్నగారు నిర్మాతగా 'జయ సింహ' పేరుతో సినిమా తీసి విజయాన్ని అందుకొన్నారు. ఈ పేరుకి అంత ప్రాధాన్యం ఉంది. నా దర్శకులందరితో కలిసి ఒకే తాటిమీద ఉంటూ, ఒకే ఉద్దేశంతో సినిమా చేస్తుంటాం. కె.ఎస్.రవికుమార్‌తో కలిసి పనిచేయడం మరిచిపోలేని ఓ అనుభూతి. అభిమానుల నాడిని, నా శైలిని తెలుసుకొని ఈ చిత్రాన్ని తీశారు. చిరంతన్ భట్ కసిగా పనిచేసే సంగీత దర్శకుడు. 'కంచె', 'గౌతమీపుత్ర శాతకర్ణి'కి అద్భుతమైన సంగీతాన్ని ఇచ్చాడు. ఈ సినిమాకి కూడా చక్కటి బాణీల్ని, నేపథ్య సంగీతాన్ని అందించారు. భావనాడుల్ని ప్రేరేపించాల్సి సంగీతం, ప్రస్తుతం పాశ్చాత్య ధోరణికి ప్రభావితమై గాలిలో కలిసిపోతుందా అన్నట్టుగా ఉంది. కానీ నా సినిమాల్లో మాత్రం మాటలు, పాటలు అద్భుతంగా ఉంటాయి. బాలకృష్ణ సంభాషణలు చెప్పాడని కాదు... సన్నివేశాలు పండకపోతే ఏ సినిమా కూడా ఆడదు. 'బ్రహ్మంగారి చరిత్ర' సినిమా సమయంలో నేను స్కూల్‌కి వెళుతున్నా. జీవ సమాధి తర్వాత వచ్చే సన్నివేశాల్లో సమాధికేసి తలకొట్టుకొనే ఓ సన్నివేశం ఉంటుంది. అప్పుడు నాన్నగారు పిలిచి 'రేయ్ ఈ సన్నివేశాన్ని నువ్వు పండిస్తేనే సినిమా విజయవంతం అవుతుంది' అన్నారు. సినిమా అంతా ఎన్టీఆర్‌గారు ఉన్నారు కదా, నేను పండించడమేమిటి అనుకొన్నా. కానీ ఆ తర్వాత తెలిసింది ఒక సన్నివేశానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో. సినిమాలో అన్నీ సందర్భోచితంగా కుదిరినప్పుడే విజయవంతం అవుతుంది. మానసికంగా నేనెప్పటికీ కుర్రాణ్నే. అందరితో కలిసిపోయి పనిచేస్తుంటా. సంక్రాంతికొస్తున్న ఈ చిత్రం సకుటుంబ సపరివారాన్ని మెప్పించేలా ఉంటుంద"న్నారు. కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ "బాలకృష్ణ గురించి తమిళంలో చాలా మంది 'ఆయనకి కోపం ఎక్కువ, ఎలా చేయబోతున్నార'ని అడిగారు. దాంతో మొదట్లో నాక్కూడా కొంచెం భయం ఉండేది. కానీ తర్వాత ఆయనతో జరిగిన కథాచర్చల్లోనూ, చిత్రీకరణలోనూ ఒక్క రోజు కూడా బాలకృష్ణలో కోపం కనిపించలేదు. ఆయనతో పోలిస్తే నాకే ఎక్కువగా కోపం వస్తుంటుంది. చాలామంది కథానాయకులతో నేను సినిమాలు చేశా. సన్నివేశం చెప్పినప్పుడు ఇదిలా మార్చొచ్చు కదా, బాడీ లాంగ్వేజ్ ఇలా పెట్టొచ్చుకదా అన్నవాళ్లే అంతా. అది తప్పు అని నేను చెప్పను. వాళ్ల ఇమేజ్‌కి తగ్గట్టుగా అడుగుతుంటారు. కానీ నా ప్రయాణంలో ఇద్దరే ఇద్దరు హీరోలు మాత్రం ఏ మార్పు కోరలేదు. అందులో అజిత్ ఒకరైతే, బాలకృష్ణ మరొకరు. బాగా పని చేస్తే బాలకృష్ణకి కోపం రాదు. ఆయనలో ఎన్నో గొప్ప లక్షణాలు చూశా. తండ్రిపై ఎంతో ప్రేమని కనబరుస్తుంటారు. ఇంత ప్రేమ పెట్టుకొన్న తనయుడిని ఇప్పటిదాకా చూడలేదు. సెట్‌లోనూ ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుంటారు. సి.కల్యాణ్ అద్భుతమైన నటుల్ని, సాంకేతిక బృందాన్ని ఇచ్చారు. తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది" అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ "పండక్కి సందడి సృష్టించబోతోంది 'జై సింహా'. ప్రేమంటే ఎలా ఉండాలో, అభిమానం అంటే ఎలా ఉండాలో, గురువును ఎలా గౌరవించాలో చెప్పే సినిమా ఇది. మా గురువు దాసరి నారాయణరావుగారికి అంకితం చేస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, వి.ఆనంద్‌ప్రసాద్, జి.ఆదిశేషగిరి రావు, చిరంతన్ భట్, నటాషా దోషి, టి. ప్రసన్నకుమార్, జెమిని కిరణ్, కె.ఎస్.రామారావు, సత్తె రంగయ్య, వీరినాయుడు, ముత్యాల రాందాసు, ప్రసన్నకుమార్, కె.అశోక్‌కుమార్, ఎన్వీ రెడ్డి, బోస్, వి.సాగర్, రామసత్యనారాయణ, రాంప్రసాద్, సత్యనారాయణరెడ్డి, ప్రసాద్, భాస్కరభట్ల రవికుమార్, జానీ, రత్నం, శివలెంక కృష్ణప్రసాద్, జయప్రకాష్‌రెడ్డి, రామజోగయ్య శాస్త్రి, దువ్వాసి మోహన్, శరత్, రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శివాని పరిచయం ఖరారు



సినీ ప్రముఖులు రాజశేఖర్, జీవిత గారాల పట్టి శివాని త్వరలోనే తెరంగేట్రం చేయబోతున్నారు. హిందీలో విజయవంతమైన 'టు స్టేట్స్' తెలుగు రీమేక్‌లో శివాని కథానాయికగా ఎంపికైనట్టు తెలిసింది. అడవి శేష్ కథానాయకుడిగా వెంకట్ కుంచెం దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ నిర్మిస్తోంది. హిందీ చిత్రంలో కథానాయికగా అలియాభట్ నటించి మంచి పేరు సొంతం చేసుకొంది. ఆ పాత్రలోనే ఇప్పుడు శివాని నటించనున్నట్టు సమాచారం. శివానీ సినీరంగ ప్రవేశం కోసం ఎప్పట్నుంచో కసరత్తులు సాగుతున్నాయి. మంచి కథ, పాత్రలతో కూడిన చిత్రం కావడంతో 'టూ స్టేట్స్' రీమేక్‌తో ఆమె పరిచయం అవుతున్నారు. రాజశేఖర్ ఇటీవలే విడుదలైన 'గరుడవేగ'తో ఫామ్‌లోకి వచ్చారు. ఇప్పుడు తన తనయని కథానాయికగా నిలబెట్టే పనిలో ఉన్నారు రాజశేఖర్, జీవిత దంపతులు.


లెక్క తేలాల్సిందే

"ఎవ్వడుపడితే వాడు రావడానికి... ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా?... భాగమతి అడ్డా. లెక్కలు తేలాలి. ఒక్కడ్నీ పోనివ్వను..." అంటోంది 'భాగమతి' అవతారంలో అనుష్క. ఆమె ప్రధాన పాత్రధారిగా అశోక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'భాగమతి'. వంశీ - ప్రమోద్ నిర్మాతలు. ఈ నెల 26న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. అందులో అనుష్క కనిపించిన విధానం, ఆమె చెప్పిన సంభాషణలు ఆకట్టుకొనేలా ఉన్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ "'బాహుబలి' చిత్రాలతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకొన్న అనుష్కతో 'భాగమతి' నిర్మించినందుకు గర్వపడుతున్నాం. ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు తారస్థాయికి చేరాయి. 'భాగమతి' కథ, కథనం తప్పకుండా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది. అనుష్క నటన, తమన్ సంగీతం, మది కెమెరా పనితనం సినిమాకి ప్రధానబలం" అన్నారు. ఉన్ని ముకుందన్, జయరాం, ఆశా శరత్, మురళీశర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవ దర్శిని తదితరులు నటించారు.



'భాగమతి'లో అనుష్క

రూ.300 కోట్లు... మూడోసారి!




సల్మాన్ ఖాన్

బాక్సాఫీసు బరిలో సల్మాన్ ఖాన్ ట్రిపుల్ సెంచరీ బాదేశాడు. అదీ ఒక్కసారి కాదు... ముచ్చటగా మూడుసార్లు. దీంతో ఇంతవరకూ ఏ బాలీవుడ్ హీరోకూ సాధ్యం కాని ఘనత సాధించాడు సల్మాన్. గత డిసెంబరులో విడుదలైన ఆయన చిత్రం 'టైగర్ జిందా హై' వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఇటీవలే ఈ చిత్రం రూ.300 కోట్లు మార్కు దాటేసింది. సల్మాన్ గత చిత్రాలు 'బజరంగీ భాయిజాన్', 'సుల్తాన్' కూడా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించాయి. ఇప్పుడు 'టైగర్..' వాటి సరసన చేరడంతో, రూ.300 కోట్ల క్లబ్‌లో మూడు చిత్రాలున్న ఏకైక కథానాయకుడిగా నిలిచాడు సల్మాన్. ఈ క్లబ్‌లో ఆయన తర్వాత ఉన్న కథానాయకుడు ఆమీర్ ఖాన్. ఆయన నటించిన 'పీకే', 'దంగల్' రూ.300 కోట్ల వసూళ్లు దాటాయి. 'టైగర్..'తో మరిన్ని రికార్డులు సొంతం చేసుకున్నాడు సల్మాన్. వసూళ్ల పరంగా రూ.100 కోట్లు దాటిన చిత్రాలు(12), రూ.200 కోట్లు దాటిన చిత్రాలు(5) తన ఖాతాలో వేసుకుని అందరికన్నా ముందు నిలిచాడు.


తరుణ్ ప్రేమ కథ

తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. ఓవియా కథానాయిక. రమేష్ - గోపీ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్.వి.ప్రకాష్ నిర్మాత. సోమవారం తరుణ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించారు తరుణ్. అనంతరం ఆయన మాట్లాడుతూ "సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా సాగుతుంది. నా పాత్ర మూడు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. ఇందులో నేను ఒకే పాత్రలో కనిపిస్తానా? మూడు పాత్రలు చేశానా? అనేది తెరపైనే చూడాలి. ప్రేమికుల రోజైన ఫిబ్రవరి 14న ఈ సినిమాను విడుదల చేస్తున్నామ"న్నారు. "'నువ్వే కావాలి', 'నువ్వే నువ్వే' తర్వాత... తరుణ్ కెరీర్‌లో ఆ స్థాయి హిట్ అయ్యే సినిమా ఇద"ని చెప్పారు రమేష్ - గోపీ. కార్యక్రమంలో శ్రీనాథ్ విజయ్, ప్రేమ్ గోపీ, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




తరుణ్

పద్మావత్ వర్సెస్ ప్యాడ్‌మ్యాన్



'పద్మావత్'



'ప్యాడ్‌మ్యాన్'

దీపికా పదుకొణె ప్రధాన పాత్రలో నటించిన 'పద్మావతి'ని వివాదాలు చుట్టుముట్టడంతో విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే. రాజ్‌పుత్ మహారాణి పద్మిని జీవితం ఆధారంగా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన ఈ భారీ చారిత్రక చిత్రం ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సెన్సార్ బోర్డు సూచనల మేరకు 'పద్మావత్'గా పేరుమార్చి విడుదల చేయడానికి చిత్రబృందం సిద్ధమైంది. నిర్మాణ సంస్థ వయాకామ్ 18 ప్రతినిధి సమాచారం మేరకు ఈ నెల 25న ఈ చిత్రం విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ట్రేడ్ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ కూడా ఈ నెల 25న 'పద్మావత్' విడుదలవుతున్నట్లు ట్వీట్ చేశారు. ఈ చిత్రంలో రాణి పద్మిని భర్తగా షాహిద్ కపూర్, అల్లా ఉద్దీన్ ఖిల్జీగా రణ్‌వీర్ సింగ్ కీలక పాత్రల్లో నటించారు. కాగా 25నే అక్షయ్ కుమార్ నటించిన 'ప్యాడ్‌మ్యాన్'ను విడుదల చేయనున్నట్లు ఆ చిత్ర నిర్మాతలు గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు 'పద్మావత్' అదే రోజు వస్తున్నా విడుదల విషయంలో వెనక్కి తగ్గేది లేదని 'ప్యాడ్‌మ్యాన్' నిర్మాతలు ప్రకటించారు. దీంతో బాక్సాఫీసు వద్ద ఈ రెండు చిత్రాల మధ్య పోటీ ఆసక్తి రేపుతోంది.

ప్రవాహంలా సాగితేనే...

"వ్యక్తిగత జీవితం ఎప్పుడూ ఓ పద్ధతి, ప్రణాళిక ప్రకారమే సాగాలనుకొంటా. సినిమా కెరీర్ పరంగా ఆ లెక్కలేవీ లేవు. ముందుగానే మనసులో ఒకటి అనుకొని సినిమా చేస్తే ఆ ప్రయాణాన్ని ఆస్వాదించలేం. ఒక కారణం కోసం సినిమాలు చేయకూడదనేది నా సిద్ధాంతం" అంటోంది కాజల్ అగర్వాల్. గతేడాది యాభై సినిమాల మైలురాయిని అధిగమించిన ఆమె ప్రస్తుతం అదే జోరుని కొనసాగిస్తోంది. తెలుగులో 'అ!'తో పాటు, 'ఎమ్.ఎల్.ఎ' చిత్రంలో నటిస్తోంది. వాణిజ్య ప్రధానమైన సినిమాలు చేస్తూనే, మరోవైపు అనుభవానికి తగ్గట్టుగా విభిన్నమైన కథల్ని ఎంపిక చేసుకొంటోంది. యాభై సినిమాల ప్రయాణం పూర్తయిన సందర్భంగా కెరీర్ పరంగా కొత్త నిర్ణయాలు ఏమైనా తీసుకొన్నారా? అని అడిగితే... "సృజనాత్మకతతో కూడుకొన్న ఈ రంగంలో ప్రతి సినిమా ఓ కొత్త విషయాన్ని నేర్పిస్తుంటుంది. అందుకు అనుగుణంగా నటులుగా ఎప్పటికప్పుడు మారుతుంటాం. అంతే తప్ప ఇన్నేసి సినిమాల తర్వాత ఇలా మారాలి? ఇలాంటి కథల్ని ఎంచుకోవాలి అనుకోకూడదు. ప్రవాహంలాగా ముందుకు సాగాలనేదే నా సిద్ధాంతం. ఎప్పట్లాగే ఇప్పుడూ ఆ క్షణంలో నా హృదయం ఏం చెబితే అది వింటూ కథల్ని ఎంపిక చేసుకొంటున్నా" అని చెప్పుకొచ్చింది కాజల్.



కాజల్



నాటి చెత్త చెరువే... నేటి సెల్ఫీలనెలవు!

పర్యావరణ ప్రేమికులు చాలా మందే ఉంటారు. కానీ అందులో మధులిక భిన్నం. ఇక్ఫాయ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసే ఆమె, ప్రకృతి కోసం ఆ ఉద్యోగాన్ని వదిలి ధ్రువాంశ్ అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. ఇరవై ఎకరాల చెరువుని దత్తత తీసుకుంది. మురికి గుంటగా ఉన్న నెక్నాంపూర్ చెరువును పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దింది. ఇప్పుడా చెరువు వందలాది పక్షులు, జీవజాలానికి ఆవాసం. చెప్పాలంటే సెల్ఫీస్పాట్. జైపూర్‌కు చెందిన మధులిక అడుగులు హైదరాబాద్‌లో ఓ మూల ఉన్న ఈ చెరువు వైపు ఎలా పడ్డాయంటే..

నార్సింగి సర్కిల్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది నెక్నాంపూర్ గ్రామం. అక్కడే ఉంది మధులిక దత్తత తీసుకున్న చెరువు కూడా. ఒకప్పుడు అది మంచినీటి కొలను. కాలక్రమేణా చుట్టుపక్కల గ్రామాలకు అదో చెత్తకుండిలా మారింది. అసలక్కడ చెరువుందని తెలిసిన వారికి తప్ప కొత్త వాళ్లు గుర్తించలేని పరిస్థితి. కానీ ఇప్పుడక్కడ 'నీళ్ల పాములున్నాయి జాగ్రత్త', 'కొండచిలువలు రోడ్డు మీద తిరుగుతున్నాయి. వాహనాలు కాస్త నెమ్మదిగా నడపవలెను' అనే బోర్డులు కనిపిస్తాయి. చెరువు చుట్టూ దాదాపు మూడు వేల మొక్కలు. నీళ్లలో తేలే ఫ్లోటింగ్ ఐల్యాండ్లూ, స్ప్రింక్లర్లూ, చుట్టూ రంగులు వేసిన పొడవాటి సిమెంట్ పైపుల అలంకరణ. మొత్తంగా ఓ ఆహ్లాదకరమైన ప్రదేశం. మధులిక ఇదంతా ఒక్కరోజులో చేయలేదు. ఒక్కొక్క పరిష్కారం వెతుక్కుంటూ ఒక్కో మెట్టు ఎక్కింది. ఒక ప్రదేశాన్నే మార్చేసింది. ప్రభుత్వ సాయంతో పదివేల చేపపిల్లలను ఆ చెరువులో వేయించింది. వాటి కోసం జీవులు వస్తాయని ఆలోచించిందామె. ఆమె అనుకున్నట్లుగానే కొన్ని రోజుల్లో నీళ్లపాములూ, కొండచిలువలు సహా 140 రకాల పక్షి జాతుల్ని ఈ ప్రాంతంలో గుర్తించారు. 'కాస్త ఓపిగ్గా పరిశీలిస్తే.. ఎప్పుడూ అక్కడ ఏదో ఒక వింత కనిపిస్తూనే ఉంటుంది...' అని చెబుతుంది మధులిక.

మూడువేల మొక్కలతో మొదలు...

ఆమె పనికి గుర్తింపుగా కిందటేడాది ప్రభుత్వం ఆమెను బయోడైవర్సిటీ అవార్డుతో సత్కరించింది. ఒక రకంగా తానీ చెరువును ఎంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన హరితహారమే కారణం అంటుంది. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఆ తరువాత అదే విభాగంలో పై చదువులు పూర్తి చేసింది. ఆమె స్వస్థలం రాజస్థాన్‌లోని జైపూర్. అక్కడే ప్రొఫెసర్‌గా స్థిరపడింది. పెళ్లి, పిల్లలూ... ఇలాగే రోజులు గడుస్తున్నాయి. వాళ్లబ్బాయి ఐదో తరగతిలో ఉన్నప్పుడు గ్లోబల్ వార్మింగ్ పాఠ్యాంశం ఒకటి వచ్చిందట. 'దాని గురించి వాడికి చెబుతున్నప్పుడు ఆ అక్షరాలన్నీ నా మెదడులో నాటుకుపోయాయి. కొన్ని రోజుల వరకు నేనేం చేయగలను అని ఆలోచిస్తూ



నిద్రపోయేదాన్ని కాదు. ఆ సమయంలోనే అనుకోకుండా ఇక్ఫాయ్ ప్రధాన బ్రాంచి హైదరాబాద్‌కు నన్ను బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్నా నా ఆలోచనలన్నీ ఆ పుస్తకంలోని బొమ్మల పైనే. చివరకు ఉద్యోగం మానేసి ధ్రువాంశ్ అనే స్వచ్ఛంద సంస్థ నాలుగేళ్లక్రితం ప్రారంభించా. 'మై ఎర్త్- మై రెస్పాన్సిబిలిటీ', దీని ప్రధానోద్దేశం. ఇందులో భాగంగా నేను సొంతంగా కొన్ని మోడళ్లు తయారుచేసి విద్యార్థులకు గ్లోబల్ వార్మింగ్ గురించి చెప్పేదాన్ని. ఏడాది తరువాత ప్రభుత్వం హరితహారం ప్రారంభించింది. మొక్కలు నాటాలనుకున్నా. కానీ ఎక్కడా అని ఆలోచిస్తుంటే.. అప్పుడు ఈ చెరువు గురించి తెలిసింది. ఆ చెట్లేదో ఈ చెరువు చుట్టూ పెంచితే అది బాగుపడుతుంది కదా అనిపించింది. అప్పుడే ఆ చెరువును దత్తత తీసుకుని, అయిదు రోజుల్లో మూడువేల మొక్కలు నాటించా. ఇంకా మరిన్ని మొక్కలు నాటడమే నా తర్వాతి లక్ష్యం' అంటుంది మధులిక. అయితే అక్కడి నీళ్లు మొక్కలకు పెట్టడానికి ఉపయోగపడేవి కాదు. దాంతో దాదాపు 11 పాఠశాలలు, రెండు కళాశాలల విద్యార్థులతో మాట్లాడింది. వారంతా మొక్కలు నాటడంతో పాటూ, వాటికి ప్రతి రోజూ చిన్న చిన్న సీసాలతో నీళ్లు తెచ్చి పోసేవారట.





ఆ తరువాత చెరువూ బాగు చేయించింది. ఇప్పటికీ తాను ఏ కార్యక్రమం చేసినా విద్యార్థుల్నీ భాగస్వామ్యులను చేయడానికే ప్రాధాన్యం ఇస్తుంది. 'అయితే మొదట్లో నేను కష్టపడి మొక్కలు నాటితే.. కొన్నిరోజులకే పీకేసేవారు. చెరువును శుభ్రం చేస్తున్నకొద్దీ మళ్లీ చెత్త వేసేవారు. అక్కడి వారికి అర్థమయ్యేలా వివరించడం నాకో సవాలే. అయితే ఇప్పుడు అందరూ సహకరిస్తున్నారు. మార్పు వచ్చింది..' అంటుంది మధులిక.

ఆకట్టుకునేలా మార్చింది..

నాలుగు నెలల క్రితం చెరువు వైపు వస్తున్న రెండు కొండచిలువలు వాహనాల కింద పడి మృతిచెందాయి. దానికి చలించిన మధులిక సరీసృపాలను కాపాడాలంటూ ప్రజల్లో అవగాహన తీసుకురావడంతోపాటు, వివిధరకాల పాములను ప్రత్యక్షంగా తీసుకొచ్చి, జీవజాతి అభివృద్ధి చెందడంలో వాటి ప్రాధాన్యాన్ని వివరిస్తోంది. మరో వైపు పర్యావరణహిత దీపావళి కోసం, గాలిపటాలు ఎగరేసేందుకు ఉపయోగించే మాంజాకు వ్యతిరేకంగా, చెరువుల రక్షణ గురించి చైతన్యం తెస్తోంది. ఎప్పటికప్పుడు చెరువులో పెరుగుతున్న గుర్రపు డెక్కను తొలగించి, దానిని ఎరువుగా మారుస్తోంది. చెరువులో ఫ్లోటింగ్ ఐల్యాండ్లు ఏర్పాటు చేసింది. థర్మాకోల్, ప్లాస్టిక్, జనపనార, వెదురుతో చతురస్రాకారంలో ఉండే షీట్లు తయారు చేయించి చెరువులో తేలేటట్టు ఏర్పాటు చేసి. వాటిపై మొక్కలను పెంచుతోంది. దీంతో నీళ్లలో ఉన్న నైట్రోజన్‌ను ఆ మొక్కలు పీల్చుకుని, చెరువు శుభ్రపడుతుందని ఆమె ఆలోచన. గతంలో అక్కడ వృథాగా పడి ఉండే సిమెంటు పైపులపై అందమైన బొమ్మలు వేయించి, వాటిని చెరువు చుట్టూ ఒక కంచెలా ఏర్పాటు చేసింది. వినాయక చవితి, బతుకమ్మ పండుగలప్పుడు ఈ చెరువు కలుషితం కాకుండా, ప్రభుత్వం నుంచి ఓ కొలను కోసం నిధులు మంజూరు చేయించింది. గతేడాది చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన గణేశ్ నిమజ్జనాలన్నీ ఆ కొలనులోనే జరిగాయి. చెరువు సంరక్షణ కోసం నిరంతర కృషి చేస్తానంటోంది మధులిక.

– **ప్రణయశ్రీ,** ఈనాడు పాత్రికేయ పాఠశాల

రంగవల్లిక



15 చుక్కలు
8 వచ్చేవరకూ
మధ్యచుక్క

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.

కె. కృష్ణ ప్రియ
భద్రాచలం

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
✦ email: vasundhara@eenadu.net

సర్దుకుపోవాలీ...



ఉద్యోగస్తులైన నవదంపతుల మధ్య సమస్యలు రాకుండా ఉండాలంటే.. పెళ్లికి ముందే ఒకరికొకరు అవతలివారి పని విధానం, సమయం వంటివి తెలుసుకుని ఉంటే మేలు. దీనివల్ల ఇద్దరి మధ్య అవగాహన పెరిగి సమస్యల్ని తగ్గించుకోగలుగుతారు.

- ఉద్యోగాల్లో ఒత్తిడి ఉండటం మామూలే. అయితే దాన్ని వీలైనంతవరకూ ఇంటికి తీసుకురాకుండా చూసుకోవాలి. అదేవిధంగా ఆఫీసు పనిని అక్కడే పూర్తి చేసుకుని రావాలి. ఇంటికొచ్చాక కూడా ఇంటిపనుల్నీ కలిసి పూర్తిచేసుకోవాలి. దానివల్ల ఇద్దరికీ కొంత సమయం మిగులుతుంది.
- పెళ్లయిన మొదట్లోనే చిన్నచిన్న మనస్పర్థలు రాకుండా ఉండాలంటే.. డబ్బు విషయంలో ఇద్దరికీ ఓ అవగాహన ఉండాలి. పొదుపూ, ఖర్చుల విషయంలో ఎలా ఉండాలనేది ముందే మాట్లాడుకుంటే.. మనస్పర్థలు రాకుండా ఉంటాయి.
- ఇద్దరికీ నచ్చే అభిరుచులు ఉంటాయి కదా.. వాటిపై దృష్టి పెట్టండి. అప్పుడే ఇద్దరూ కలిసి ఎక్కువ సమయం గడపగలుగుతారు. అలాగే అప్పుడప్పుడూ ఇద్దరూ ఎవరి స్నేహితులతో వాళ్లు గడిపేలా చూసుకోవాలి. ఈ రోజుల్లో ఇది అవసరం అంటారు నిపుణులు. దానివల్ల పెళ్లయ్యాక ఎవరినీ కోల్పోతున్నామనే బాధ ఉండకుండా ఉంటుంది.
- ఏదయినా వాదన వచ్చిందనుకోండి. దాన్ని ఆ సందర్భానికే పరిమితం చేయాలి తప్ప.. గతాన్ని తవ్వకునే ప్రయత్నం చేయకూడదు. కేవలం సమస్యను మాత్రమే చర్చించుకుంటే మనస్పర్థలు పెరగకుండా ఉంటాయి.

బంగారం వెండి



8న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,450	30,490	30,400	30,460
ఆర్నమెంట్	28,460	28,470	28,300	28,300
వెండి (కిలో)	39,800	39,950	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,380	30,400	30,090	30,210
ఆర్నమెంట్	28,160	28,150	28,140	28,250
వెండి (కిలో)	40,000	39,500	39,350	39,500
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,090	30,090	-------	-------
ఆర్నమెంట్	27,980	27,980	2,814	2,825 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	42.00	42.11 గ్రా

ఫేస్‌బుక్ చూస్తే... తప్పేంటి?

? నేను సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉంటాను. త్వరలో ఉద్యోగంలో చేరుతున్నాను. మా నాన్నగారు ఇక అలాంటివన్నీ కట్టిపెట్టి, బాధ్యతగా ఉండాలి అంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండటం తప్పా?

- ఓ సోదరి

✔ సామాజిక మాధ్యమాలన్నింటినీ ఒకే గాటన కట్టొద్దు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, స్నాప్‌చాట్ వంటివి వేరు.. లింక్డిన్ వేరు. ఇందులో కొన్ని వ్యక్తిగత సమాచారం పంచుకునేవి. కొన్ని వృత్తిపరమైన విషయాలు మాత్రమే పంచుకునేవి. నిజానికి సోషల్‌మీడియా వృత్తిపరంగా ఏమాత్రం ఇబ్బంది కలిగించదు. కానీ ఎంత వరకూ? మన వ్యక్తిగత జీవితంలోని విషయాలు వృత్తిపరంగా ఇబ్బంది పెట్టనంత వరకూ. మన వాల్ మీద పూర్తిగా వ్యక్తిగతమైన ఫొటోనో పెడితే.. అది చూసిన బాస్ ఏమన్నా అనుకోవడానికి ఆస్కారం ఉంది. అలాగే రాజకీయం, కుల మతాలకు సంబంధించిన వ్యక్తిగత అభిప్రాయాలు కూడా ఉద్యోగం చేసేవారిని ఇబ్బంది పెడతాయి. సినిమాలపై రివ్యూలు కూడా ఆ కోవకే చెందుతాయి. మీ పోస్టులు చూసిన తర్వాత ఓహో నీకా సినిమా నచ్చిందా... అబ్బా రాత్రి పన్నెండు వరకూ పార్టీలో ఉన్నావా? అని అడగకుండా ఉంటారా? 'నా పోస్టుకు లైక్ చేయలేదు. ఫలానా పోస్టు షేర్ చేశావు'. 'కానీ నాది చేయలేదు'. ఇలాంటి చర్చలు ఉండకూడదు. ఆఫీసులో హుందాగానే ఉండాలి. వ్యక్తిగత విషయాలు ముడిపెట్టకూడదు. అలాగని అసలు సోషల్ మీడియాలో ఉండొద్దు అంటే.. ఓ పని చేయొచ్చు. మీరు వృత్తిపరంగా నెట్‌వర్కింగ్ కోసం ఓ ఖాతా... వ్యక్తిగతంగా స్నేహితుల కోసం మరో ఖాతా తెరవొచ్చు. స్నేహితుల జాబితా కూడా వేర్వేరుగా ఉండాల్సిందే. దేనికి సంబంధించిన పోస్టులు దానికే కచ్చితంగా వేరుగా ఉండాలి. చాలామంది మ్యాప్‌లు, లొకేషన్లు, ప్రయాణ టిక్కెట్లు కూడా పెడుతుంటారు. వీటివల్ల అనవసరపు ముద్రలు పడే అవకాశం ఉంది. మీమీద అంచనాలు పెరగొచ్చు. తగ్గొచ్చు. మీరు జాబ్ ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు కూడా హెచ్‌ఆర్ వాళ్లు మీ ఖాతాలు చూడటానికి అవకాశం ఉంది. అది పద్ధతి కాకపోయినా కూడా.! కాబట్టి ఇకపై ఏ పోస్టు పెట్టే ముందయినా ఆలోచించి పెట్టడం అలవాటు చేసుకోండి.

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నజరానా

పాడిచర్మం ఉన్నవారు కలబంద గుజ్జులో చెంచా చొప్పున పాలూ, తేనె, గులాబీ నీరు, చిటికెడు పసుపు కలిపి ముఖానికి పూతలా వేసుకోవాలి. 20 నిమిషాల తరువాత గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖం తాజాగా, కాంతిమంతంగా మారుతుంది.

పండగరోజు... అదిరే పట్టు!

వర్ణరంజితమైన పూ బంతులూ, ముంగిట రంగవల్లికలూ, గొబ్బెమ్మలూ, భోగిమంటలు.... సంస్కృతీ, సంప్రదాయాల మేళవింపుతో కలగలుపు కూరలూ, పిండివంటలూ, ఇంటినిండా చుట్టాలూ, కొత్త అల్లుళ్లూ.. చెప్పుకొంటూ పోతే.. సంక్రాంతి పండగ అంటేనే ఓ సంబరం. మరి ఇలాంటి వేళ తళుక్కున మెరవాలంటే.. సంప్రదాయానికి ప్రాధాన్యం ఇస్తూనే కాస్త ఆధునికంగా కనిపించేలా చూసుకోవాలి. అదెలాగో వివరిస్తున్నారు డిజైనర్ శ్రీ.

■ **చీర కట్టుకోవాలనుకుంటున్నారా..** అయితే ధోతీ చీరల్ని ప్రయత్నించి చూడండి. సన్నని జరీ అంచుతో పట్టు లేదా జార్జెట్ ధోతీ చీర అదిరిపోతుంది. దానికి బ్లవుజు ఆడంబరంగా ఉండేలా చూసుకోవాలి. ఇంకాస్త ఆధునికంగా కనిపించాలనుకుంటే స్లీవ్‌లెస్, లేదా ఆఫ్ షోల్డర్ బ్లవుజునూ ఎంచుకోవచ్చు. ఇంకా భిన్నంగా ఉండాలనుకుంటే పొడవాటి బ్లవుజునూ ప్రయత్నించొచ్చు. అచ్చంగా చీరనే ఎంచుకోవాలనుకుంటే పట్టుతోపాటూ ఆర్గంజా, జార్జెట్, కోరా రకాలను ప్రయత్నించొచ్చు. అయితే ఇప్పుడు కడ్డీ అంచు ఫ్యాషన్. బ్లవుజు మాత్రం సాదాగా కాకుండా బోట్ నెక్, ఆఫ్ షోల్డర్, కోల్డ్ షోల్డర్‌లో ఉండేలా చూసుకోవాలి. పొడవు తక్కువగా ఉన్నవారు బోట్, కాలర్ నెక్‌కు దూరంగా ఉంటే మంచిది. చీర చాలా తక్కువ డిజైనులో లేదా అసలు లేకుండా ఉంటే భారీ పనితనం ఉన్న బ్లవుజు ఉండేలా ఎంచుకోవచ్చు. సంప్రదాయ వేడుక కాబట్టి బ్లవుజును మోచేతులవరకూ, మెగాస్లీవ్స్, బుట్ట చేతులు ఇలా ఏదో ఒకవిధంగా కుట్టించుకుంటేనే బాగుంటుంది. కొంచెం లావుగా ఉన్నవారు పట్టు సహా జార్జెట్, షిఫాన్ చీరల్ని సన్నటి అంచుతో ఎంచుకుని మెగాస్లీవ్స్, ఎల్ బో చేతుల బ్లవుజును వేసుకుంటే సన్నగా అనిపిస్తారు. ఫ్యాన్సీ, కోటా, భారీ అంచున్న పట్టు, డిజైను ఎక్కువున్న జార్జెట్ చీరల్నీ ఎంచుకోవచ్చు.

■ **పరికిణీ ఓణీ వద్దా...** బదులుగా బెనారస్, కంచి పట్టులో లెహెంగా, క్రాప్ టాప్ వేసుకుని చూడండి. ముదురు లేత వర్ణాల్ని మేళవిస్తే బాగుంటుంది. బెనారస్ బ్రొకేడ్ తరహాలో నీలం రంగు క్రాప్‌టాప్ తీసుకుంటే, బెనారస్‌లోనే దుపట్టా ఎంచుకోవాలి. సిల్కులో సాదాగా లేదా పూల డిజైన్ల లెహెంగా వేసుకుంటుంటే మెడా, చేతులపై డిజైను ఉన్న క్రాప్‌టాప్ అయితే బాగుంటుంది. కోల్డ్ షోల్డర్ లేదా స్లీవ్ లెస్ ఎంచుకోవచ్చు. ముదురు వర్ణాల్లో బ్రొకేడ్ క్రాప్‌టాప్స్‌కి ఇప్పుడు ఆదరణ ఎక్కువ. అలాగే పొడవు స్కర్ట్‌పై పొడవు బ్లవుజు కూడా చూడటానికి ఆడంబరంగా ఉంటుంది. సిల్క్ స్కర్టుపై చందేరీ కాటన్ లేదా జార్జెట్ బ్లవుజును ఎంపిక చేసుకోవాలి. లేదా గోల్డ్ థ్రెడ్ వర్క్ అయినా ఆకట్టుకుంటుంది.

■ **కుర్తా కొనుక్కుంటున్నారా..** ఈ సమయంలో లెగ్గింగే వేసుకోవాలని లేదు. పలాజోనూ ప్రయత్నించొచ్చు. ఇది కూడా ఇప్పుడు పట్టులో రకరకాల రంగుల్లో దొరుకుతోంది. చందేరీ సిల్కు, బాందినీ పట్టులో ప్రింటెడ్ లేదా సాదా కుర్తీ లేదా కుర్తా ఎంచుకుంటే ఆ అందమే వేరు. బాందినీ పట్టు కుర్తాకు కూడా పలాజో నప్పుతుంది. అలాగే డిజైను ఉన్న పట్టు పలాజోకు నప్పేలా పొడవుగా సూట్‌లా కూడా కుట్టించుకోవచ్చు.

■ **అనార్కలీలూ, స్కర్టులూ వద్దనుకుంటే...** ఏకంగా పొడవు గౌనునే ఎంచుకోవచ్చు. లేత,. ముదురు వర్ణాల్లో జార్జెట్‌లో సాదా లేదా రఫెల్స్ డిజైను గౌను బాగుంటుంది. వీటిపై పొడవాటి దుపట్టాలు కూడా వేసుకుంటే ఆ అందమే వేరు. బెనారస్, బాందినీ పట్టు, రా సిల్క్, నెట్టెడ్‌లో రెండు వైపులా అంచులుండేలా లేదా సెల్ఫ్ డిజైన్‌లో దుపట్టాలు ఎంచుకోవాలి. ఒకవేళ గౌను సాదాగా తీసుకుంటే బ్రొకేడ్ లేదా ఎక్కువ చేతి పని ఉన్న దుపట్టాలు నప్పుతాయి.







చదువు

వైవిధ్య

ఈనాడు హైదరాబాద్, మంగళవారం జనవరి 9, 2018 మా చిరునామా: **చదువు** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512 ■ edc@eenadu.net

సైబర్ నేరాలే అతిపెద్ద సమస్య!

భవిష్యత్తులో మనం సీఎన్‌బీసీ అనే నాలుగు రకాల సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సీ-సైబర్ (అంతర్జాల, సమాచార ఆయుధం), ఎన్- న్యూక్లియర్ (అణ్వస్త్రాలు), బీ- బయోలాజికల్ వెపన్స్ (జీవాయుధాలు), సీ- కెమికల్ వెపన్స్ (రసాయన ఆయుధాలు). వీటిలో సైబర్ నేరాలను అతి క్లిష్టమైన, ప్రమాదకరమైన పెద్ద సమస్యగా చెప్పుకోవాలి.

- వారన్ బఫెట్



ఇటీవల ప్రపంచాన్ని గడగడలాడించిన 'వాన్నక్రై' రాన్సమ్ వేర్ గుర్తుందా? అంతర్జాల ఆధారిత వ్యాపార సంస్థలన్నీ అల్లాడిపోయాయి. ఎందుకు?

భారతదేశంపై గత మూడేళ్లలో దాదాపు లక్షన్నర సైబర్ దాడులు జరిగాయని ఒక ప్రశ్నకు సమాధానంగా పార్లమెంటులో సంబంధిత మంత్రి ప్రకటించారు! ఈ దాడులు ఏంటి?

మన వివరాలన్నీ మనకే చెప్పి మనకొచ్చిన ఓటీపీని అడిగి తీసుకొనిమరీ మన సొమ్మంతా కొల్లగొట్టే మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి మనం రోజూ వింటున్నాం! వీటిని తప్పించుకోవడం ఎలా?

ఈ వైరస్‌లు.. దాడులు.. మోసాలన్నీ సైబర్ ప్రమాదాలే!

ఒక పక్క ఇంటర్‌నెట్ వినియోగం ఎక్కువవుతుంటే దాంతో సమానంగా సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి.

వీటిని అరికట్టడంలో భాగంగా కొత్త కొత్త ఉద్యోగాలు, కోర్సులు పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడు సైబర్ ప్రపంచ సంరక్షణ సరికొత్త కీలక ఉద్యోగ బాధ్యతగా అభివృద్ధి చెందుతోంది!



సైబర్ ప్రపంచ సంరక్షణ!

అంతర్జాతీయ వ్యవస్థల నుంచి అతి సామాన్య వ్యక్తుల వరకు అందరూ సైబర్ ప్రమాదాల బారిన పడుతున్నారు. మన సమాచారాన్ని మనకు తెలియకుండానే దొంగిలిస్తున్నారు. అణుయుద్ధాల కంటే సైబర్ యుద్ధాలే ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తగిన రక్షణ వలయాలను ఏర్పాటు చేసుకోవడం కోసం అభివృద్ధి చెందుతున్న కెరియర్ సైబర్ సెక్యూరిటీ.

ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణ్వస్త్రాలే అవసరం లేదు. ఆ దేశ సమాచార వ్యవస్థపై సైబర్ దాడి చేసి ధ్వంసం చేస్తే చాలు. కొన్ని దశాబ్దాలపాటు కోలుకోలేని దెబ్బ తగులుతుంది.

హ్యాక్మగెడ్డాన్ అనే సంస్థ నివేదిక ప్రకారం డిసెంబరు 2017 వరకు జరిగిన ఆన్‌లైన్ నేరాల్లో 84.6 శాతం సమాచార చౌర్యానికి చెందినవే. 9.9 శాతం పోటీ పరిశ్రమల సైబర్ గూఢచర్యం చర్యలు. 4.4 శాతం హ్యాకింగ్ ప్రయత్నాలు. ఇక మిగిలిన 1.1 శాతం సైబర్ యుద్ధాల శకలాలు!

సైబర్ సెక్యూరిటీ అంటే ఏంటి?

సైబర్ నేరగాళ్ల సాంకేతిక సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న వ్యవస్థను రూపొందించి, నిర్మించి, నిర్వహించి నెట్‌వర్క్‌ను భద్రంగా కాపాడుకోవడాన్ని సైబర్ సెక్యూరిటీ అని చెప్పవచ్చు. తద్వారా ఈ-కామర్స్ లావాదేవీలకు ఎలాంటి ఆటంకం లేకుండా చేయడం దీని ప్రధాన లక్ష్యం.

సాధారణంగా కంప్యూటర్, నెట్‌వర్క్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ లక్ష్యంగా సైబర్ నేరాలు (వైరస్, ఎస్క్యూఎల్ ఇంజెక్షన్, డిస్ట్రిబ్యూటెడ్ డినయల్ ఆఫ్ సర్వీస్) జరుగుతుంటాయి. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు, ఇతర వ్యవస్థలు ఇందులో ప్రధాన బాధితులు. అందుకే ప్రోగ్రామింగ్, సురక్షితమైన, దుర్భేద్యమైన నెట్‌వర్క్‌ల అభివృద్ధి ఇప్పుడు మేధావుల, ఉద్యోగుల ప్రధాన లక్ష్యంగా మారింది.

వేగంగా విస్తరణ

కమ్యూనికేషన్ వ్యవస్థ, కంప్యూటర్, నెట్‌వర్క్ రంగాల్లో జరుగుతున్న విప్లవాత్మక మార్పుల ఫలితంగా సమాచారం అందరికీ అందుబాటులో ఉండటం ఒక వరమైతే, అదే సమయంలో ఆ సమాచారానికి భద్రత లేకపోవడం ప్రమాదకరమైన విషయం. అందుకే ఆ భద్రత కల్పనలో భాగంగా నిపుణుల అవసరం రోజురోజుకీ పెరుగుతోంది. సమాచార లభ్యతతోపాటు సమగ్రత, గోప్యతలను కూడా ఎంతో అవసరమైన సేవలుగా వీరు అందించాల్సి ఉంటుంది.



నీలమేఘశ్యామ్ దేశాయ్

ACE ఇంజినీరింగ్ కళాశాల

ఐటీ రంగంలో పలు దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. వాటి ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టాలంటే భౌతిక యుద్ధాలు అవసరం లేదు. వాటి సమాచార వ్యవస్థను ఛేదిస్తే చాలు. అందుకే రోజూ ఎన్నో రకాల సైబర్ దాడులు జరుగుతుంటాయి. మన దేశ భద్రతా వ్యవస్థను పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విధంగా అటు ప్రైవేటు ఇటు ప్రభుత్వ రంగాల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు వస్తున్నాయి.

ఏయే స్థాయిల్లో ఎలాంటి ఉద్యోగాలు?

రోజురోజుకీ విస్తరిస్తున్న సైబర్ సెక్యూరిటీ రంగంలో వివిధ స్థాయిల్లో రకరకాల ఉద్యోగాలు ఉన్నాయి.

ఎంట్రీలెవెల్: కంప్యూటర్ నిపుణులు, పెనెట్రేషన్ టెస్టర్లు - ఎగ్జిక్యూటివ్ మేనేజర్ స్థాయిలో ఉండే ఉద్యోగాలివి. సంస్థ భద్రత వ్యవస్థ, మార్గదర్శకాలకు అనుగుణంగా రోజువారీ భద్రత బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

మిడిల్ లెవెల్: మేనేజర్‌గా భద్రత వ్యవస్థ నిర్వహణ, డేటా రక్షణ, భద్రత విధానం నిర్మాణ-నిర్వహణలు, వ్యాపారాభివృద్ధి చేస్తారు. ప్రమాదాలు, విపత్తులు సంభవించి డేటాకు నష్టం వాటిల్లినప్పుడు దాని పునరుద్ధరణలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తారు.

సీనియర్ లెవెల్:ఈ స్థాయిలో సమాచార వ్యవస్థ రూపకల్పన, రచన, నియంత్రణల అమలు, సమాచార భద్రత నిర్వహణ ముఖ్య బాధ్యతలుగా ఉంటాయి.

హయ్యర్ లెవెల్: భద్రత సలహాదారులు, ఆడిటర్లుగా ఉంటారు. సమాచార భద్రతకు సంబంధించిన వ్యవస్థల నిర్మాణం, విధివిధానాలు, రిస్కుల అంచనా, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాల అమలు లాంటి ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తారు.

మేనేజ్‌మెంట్ లెవెల్: ఈ స్థాయిలో ముఖ్య సమాచార అధికారి (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ - సీఐవో)గా భవిష్యత్తులో సమాచార భద్రతకు పెట్టాల్సిన పెట్టుబడులపై సలహాలు, నిర్ణయాలు; ప్రస్తుత, భవిష్యత్తు పెట్టుబడుల హేతుబద్ధీకరణ వంటి ప్రధాన బాధ్యతలు ఉంటాయి.



ఈ ఉద్యోగాలు కింది విధంగా ఉంటాయి.

■ సెక్యూరిటీ అనలిస్ట్ ■ సెక్యూరిటీ ఇంజినీర్ ■ సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ ■ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్ ■ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ■ క్రిప్టోగ్రాఫర్ ■ క్రిప్టనలిస్ట్ ■ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ ■ సెక్యూరిటీ కన్సల్టెంట్ ■ ఇంట్రూజన్ డిటెక్షన్ స్పెషలిస్ట్ ■ పెనెట్రేషన్ టెస్టర్.

విద్యార్హతలు - ఇతర నైపుణ్యాలు

కనీసం ఏదైనా డిగ్రీ సరిపోతుంది. ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా పీజీ ఉంటే ప్రాధాన్యం ఉంటుంది. విచారించే తత్వం, విశ్లేషణ సామర్థ్యం అదనపు లక్షణాలు. భావప్రకటనపై పట్టు ఉండాలి. అభ్యర్థులకు సహనం చాలా అవసరం.

◆ పైథాన్, రూబీ, జావా స్క్రిప్ట్, బాష్ స్క్రిప్ట్, షెల్ స్క్రిప్ట్ బాగా వచ్చి ఉండాలి. ◆ వివిధ ఆపరేటింగ్ సిస్టంల పట్ల లోతైన, తార్కికమైన అవగాహన అవసరం. ◆ అల్గారిథమ్ అభివృద్ధి చేయగలగడం అదనపు అర్హత. ◆ రిపోర్ట్‌లు తయారు చేయడానికి రైటింగ్ స్కిల్స్ కావాలి.

◆ ఎథికల్ హ్యాకింగ్‌లో సర్టిఫికెట్ తప్పనిసరి. ఇందులో వివిధ స్థాయిల్లో సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. ◆ ఎథికల్ హ్యాకింగ్ శిక్షణలోని 'కలి' వంటి కొన్ని ముఖ్యమైన టూల్స్‌పై మంచి పట్టు ఉండాలి.

ఏ కోర్సులు ఎక్కడెక్కడ?

- ఐఐటీ-భువనేశ్వర్ 2018 విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్ స్థాయిలో నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ స్పెషలైజేషన్‌తో కొత్త కోర్సును ప్రారంభించాలని నిర్ణయించింది.
- ఎన్ఐటీ-కురుక్షేత్ర రెండేళ్ల ఎంటెక్ సైబర్ సెక్యూరిటీ కోర్సును అందిస్తోంది.
- కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సు ఉంది.
- బీటెక్ స్థాయిలో డెహ్రాడూన్‌లోని యూపీఈఎస్ సైబర్ సెక్యూరిటీపై నాలుగేళ్ల కోర్సు అందిస్తోంది.
- చెన్నైలోని హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని బీటెక్ (ఐటీ) కోర్సులో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్ ఉంది.
- న్యూదిల్లీలోని ఇంటర్‌నేషనల్ కాలేజ్ ఫర్ సెక్యూరిటీ స్టడీస్‌లో పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ ఉంది.
- పుణేలోని సైబర్ సెక్యూరిటీ అండ్ రిసెర్చ్‌లో పీజీ డిప్లొమా ఇస్తున్నారు.
- సీడాక్‌లో ఆరు నెలల ఆన్‌లైన్ కోర్సు చేసుకోవచ్చు.
- ఎథికల్ హ్యాకింగ్‌లో హైదరాబాద్ మైత్రీవనంలోని ఎంటర్‌సాఫ్ట్ లాబ్స్ సంస్థ శిక్షణ ఇస్తోంది. అంతేకాకుండా అంతర్జాతీయ సంస్థ సెర్టికాం సర్టిఫికేషన్‌కి సంసిద్ధులను చేస్తోంది. ఈ సంస్థ ఇంటర్న్‌షిప్‌లకు కూడా అవకాశం కల్పిస్తోంది.



- హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని అడెప్ట్ టెక్నాలజీస్ ఎథికల్ హ్యాకింగ్‌లో శిక్షణ ఇస్తోంది.
- గుజరాత్ రాష్ట్రం సైబర్ సెక్యూరిటీ రంగంలో పరిశోధనల కోసం ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించి స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను అందిస్తోంది.
- పుణే, ముంబయి, దిల్లీల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ పలు కోర్సులను ఆఫర్ చేస్తోంది.
- తిరుపతిలోని వేంకటేశ్వర యూనివర్సిటీలో సైబర్ సెక్యూరిటీ పదకొండు నెలల సర్టిఫికెట్ కోర్సు ఉంది.

ఈ కోర్సుల్లో శిక్షణ తీసుకోవడమే కాదు తర్వాత అభ్యాసం చేయడం కూడా చాలా అవసరం. కాబట్టి తగినంత ల్యాబ్ సమయం ఇచ్చే సంస్థలను ఎన్నుకోవాలి. ఫీజులు కొద్దిగా ఎక్కువగానే ఉంటాయి. తగిన నైపుణ్యాలను నేర్చుకొని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

జేఎన్‌టీయూ కాకినాడ

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్

ఖాళీలు: 15

అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.

ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **చివరితేది:** 03.02.2018

వెబ్‌సైట్: http://www.jntuk.edu.in/

ఆదికవి నన్నయ యూనివర్సిటీ

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు: 34

అర్హత: పీజీ/నెట్/ స్లెట్/సెట్/ పీహెచ్‌డీ.

ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ఆఫ్‌లైన్.

చివరితేది: 30.01.2018

వెబ్‌సైట్: www.nannayauniversity.info

ప్రవేశాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్

కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్ **అర్హత:** ఏదైనా డిగ్రీ. **ఎంపిక:** క్యాట్/గ్జాట్/ఐఆర్ఎంఏశాట్ స్కోర్ల ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ **చివరితేది:** 20.01.2018. **వెబ్‌సైట్:** https://www.irma.ac.in/

నాటా - 2018

కోర్సు: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్.

వ్యవధి: 5 సంవత్సరాలు.

అర్హత: ఇంటర్మీడియట్

ఎంపిక: రాతపరీక్ష ద్వారా.

రాతపరీక్ష తేది: 29.04.2018

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

దరఖాస్తు ప్రక్రియ: 2018 జనవరి 16 - మార్చి 2

వెబ్‌సైట్: http://www.nata.in/

అలగప్పా యూనివర్సిటీ

కోర్సు: పీహెచ్‌డీ ప్రోగ్రామ్

విభాగాలు: ఆర్ట్స్, సైన్స్, మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్.

అర్హత: పీజీ.**ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

దరఖాస్తు ఫీజు: రూ.500.

చివరితేది: 05.02.2018.

వెబ్‌సైట్: http://www.alagappauniversity.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

డిజిటల్ మార్కెటింగ్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

కంటెంట్ రైటింగ్

సంస్థ: Dinterio

ప్రదేశం: హైదరాబాద్

స్టైపెండ్: నెలకు రూ.10,000

లింకు: internshala.com/i/8141

గడువు: జనవరి 17, 2018

అర్హులు: ఆంగ్లభాషా నైపుణ్యాలున్నవారు.

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: Nayi Disha Resource Centre

ప్రదేశం: హైదరాబాద్

స్టైపెండ్: నెలకు రూ.3000-రూ.5000

లింకు: internshala.com/i/8142

గడువు: జనవరి 17, 2018

అర్హులు: అడొబ్ ఫొటోషాప్, గూగుల్ ఆడ్‌వర్డ్స్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.



బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: M Farms

ప్రదేశం: హైదరాబాద్

స్టైపెండ్: నెలకు రూ.8000-రూ.15,000

లింకు: internshala.com/i/8143

గడువు: జనవరి 17, 2018

అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

టీఎస్ ట్రాన్స్‌కోలో జూనియర్ లైన్‌మెన్లు



ఐటీఐ లేదా ఇంటర్ ఒకేషనల్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు మంచి అవకాశం. తెలంగాణ ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతోంది. సర్వీసులో ఉన్నవారికి మార్కుల వెయిటేజీ కూడా ఉంది. కేవలం రాత పరీక్ష ఆధారంగానే ఎంపిక జరుగుతుంది.

తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (టీఎస్ ట్రాన్స్‌కో) 1100 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. వీటిలో సదరన్ జోన్‌లో 657, నార్తర్న్ జోన్‌లో 443 ఖాళీలు ఉన్నాయి. సంబంధిత విభాగంలో ఐటీఐ లేదా ఒకేషనల్ కోర్సు పూర్తిచేసినవాళ్లు వీటికి అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.

ఐటీఐ లేదా ఇంటర్ ఒకేషనల్ కోర్సు

పదోతరగతి అనంతరం ఎలక్ట్రికల్ లేదా వైర్‌మెన్ ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి. లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్ ఒకేషనల్ కోర్సు పాసై ఉండాలి.

జులై 1, 2017 నాటికి కనిష్ఠంగా 18, గరిష్ఠంగా 35 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అయిదేళ్లు; దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయఃపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.

రాతపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు. జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పోల్ ఎక్కగలగాలి. స్తంభం ఎక్కలేనివాళ్లు ఈ పోస్టులకు అనర్హులు.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 5 నుంచి ప్రారంభమైంది. **చివరితేదీ:** జనవరి 20.

ఫీజు: దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా రూ.100 ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజుగా చెల్లించాలి. దీంతోపాటు రూ.120 పరీక్ష ఫీజు కట్టాలి. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

హాల్ టికెట్లు: ఫిబ్రవరి 5 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పరీక్ష తేదీ: ఫిబ్రవరి 11, 2018 మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు.

ఇంటర్వ్యూ లేదు

రాతపరీక్ష 80 మార్కులకు జరుగుతుంది. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ రెండు మాధ్యమాల్లో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 80 ప్రశ్నలు వస్తాయి. వీటిలో 65 ప్రశ్నలు ఐటీఐ/ ఒకేషనల్ కోర్సులోని ఎలక్ట్రికల్ సబ్జెక్టుపై ఉంటాయి. మిగిలిన 15 ప్రశ్నలు జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి అడుగుతారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. పరీక్ష కేంద్రాలన్నీ జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటాయి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఓఎంఆర్ పత్రంపై బ్లాక్ పెన్నుతో సరైన సమాధానం ఆప్షన్ వృత్తాన్ని పూరించాలి. వైట్‌నర్ ఉపయోగించకూడదు. పరీక్ష జరిగిన మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 12న ప్రైమరీ కీ టీఎస్ ట్రాన్స్‌కో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. ఇంటర్వ్యూ లేదు.

అర్హత సాధించాలంటే...

రాత పరీక్షలో అర్హత సాధించడానికి ఓసీలు 40, బీసీలు 35, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 30 శాతం మార్కులు పొందాలి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గరిష్ఠంగా 20 మార్కుల వెయిటేజీ వర్తిస్తుంది. వీరు పని చేసిన కాలానికి ప్రతి ఆరు నెలలకు ఒక మార్కు చొప్పున వెయిటేజీలో కలుపుతారు. మొత్తం పోస్టుల్లో 20 శాతం పోస్టులకు అందరూ అర్హులే. వీటికి లోకల్, నాన్ లోకల్ ఎవరైనా పోటీ పడొచ్చు. మిగిలిన 80 శాతం పోస్టులకు కేవలం లోకల్ అభ్యర్థులే అర్హులు. ఉద్యోగానికి ఎంపికైనవాళ్లు రెండేళ్లు ప్రొబేషన్‌లో కొనసాగుతారు. వేతన శ్రేణి: రూ.15585 - రూ.25200

ఈ అంశాల్లో ప్రశ్నలు

విద్యుత్తు, ఎలక్ట్రానిక్స్, ఏసీలో ప్రాథమికాంశాలు, బ్యాటరీలు, అయస్కాంతత్వం, ఏసీ, డీసీ మెషిన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు కొలతలు, ఉత్పత్తి తదితరాంశాల్లో ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పైనా ప్రశ్నలడుగుతారు. ఈ ప్రశ్నలు ప్రాథమిక స్థాయిలోనే ఉంటాయి.

శిశు సంరక్షణ గృహాల తనిఖీకి రాష్ట్ర, జిల్లాస్థాయి కమిటీల నియామకం

ఈనాడు, హైదరాబాద్: శిశు సంరక్షణ సంస్థలు, గృహాలను తనిఖీ చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రస్థాయి కమిటీకి చైర్‌పర్సన్‌గా మహిళాశిశు సంక్షేమ శాఖ సంచాలకులు, సభ్యులుగా బాలలహక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యుడు, యునిసెఫ్ కార్యక్రమ మేనేజర్, డాక్టర్ రమేష్ (ఐఎంఏ), యునిసెఫ్ కార్యక్రమ అధికారి, సామాజిక కార్యకర్త ఫిలిప్ ఉంటారు. జిల్లా కమిటీలో శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, జిల్లా శిశు రక్షణ అధికారి, వైద్యాధికారి, చైల్డ్‌లైన్ ప్రతినిధి, డాక్టర్ రమేష్ లేక ఆతని ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలు సంరక్షణ గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీచేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లా కమిటీలు మూడునెలలకు ఒకసారి తనిఖీ నిర్వహించి మహిళాశిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌కు నివేదిక అందజేయాలి.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు హాజరయ్యే దివ్యాంగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ దివ్యాంగుల సంక్షేమశాఖ సంచాలకులు, డైరెక్టర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు www.tvcc.telangana.gov.in, www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందాలని పేర్కొన్నారు. వీటిని పూర్తిచేసి ఈ నెల 20లోగా జిల్లా సంక్షేమ అధికారులకు అందజేయాలని సూచించారు.

12 నుంచి డీఈడీ తరగతులు

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ(ఎన్ఐఓఎస్) ద్వారా డీఈడీ కోర్సులో చేరిన వారికి ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 24వ తేదీ మధ్య శని, ఆదివారాల్లో కాంటాక్టు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎన్ఐఓఎస్ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకుడు ఆర్.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణ పొందకుండానే ప్రస్తుతం పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి దూర విద్య ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈడీ) పూర్తి చేసేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకు తెలంగాణలో సుమారు 16 వేల మంది ప్రవేశాలు పొందారని, వారికి జిల్లాల్లోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లు, ప్రైవేట్ డీఈడీ కళాశాలల్లో శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన తెలిపారు.

జైళ్ల శాఖ టర్నోవర్ రూ.405 కోట్లు

విడుదలైన ఖైదీలకు ఉపాధి కల్పిస్తున్నాం: డీజీ వీకే సింగ్

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: తెలంగాణ జైళ్లశాఖ ఆధ్వర్యంలో నడిచే పరిశ్రమలు, పెట్రోల్ బంకుల వార్షిక టర్నోవర్ రూ.405.27 కోట్లకు చేరిందని జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. సోమవారం ఐజీ ఆకుల నర్సింహ, డీఐజీ సైదయ్యలతో కలిసి ఆయన 2017 వార్షిక నివేదిక విడుదలచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ జైళ్ల విభాగంలో సంస్కరణలు అమలవుతున్నాయన్నారు. ఇప్పటివరకు 140 మంది విడుదలైన ఖైదీలకు తమశాఖ ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ బంకుల్లో, మైనేషన్ ఔట్‌లెట్, ఆయుర్వేద విలేజ్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు చెప్పారు. మానవతా దృక్పథంతో ఖైదీల పిల్లల విద్య, పెళ్లిళ్లకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నట్లు వివరించారు. జైళ్లలో మరణాల సంఖ్య 2015లో 56గా ఉండగా 2017లో పదహారే నమోదయ్యాయని వివరించారు. రాష్ట్రంలోని జైళ్లలో ఖైదీల సంఖ్య తగ్గుతోందన్నారు. నగరాన్ని యాచకరహితంగా తీర్చిదిద్దేందుకు సామాజిక బాధ్యతగా యాచకుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జైళ్ల అధికారులు, సిబ్బందిపై 2015లో 90 ఫిర్యాదులు రాగా, 2017లో ఆ సంఖ్య 12కి తగ్గిందని ఆయన తెలిపారు. మహిళాఖైదీల కోసం జైళ్లలో ప్రత్యేక గదులను నిర్మించాలని ప్రయత్నిస్తున్నామన్నారు.

12 నుంచి శ్రీశైలంలో మకర సంక్రాంతి మహోత్సవాలు

శ్రీశైలం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 12వ తేదీ నుంచి 18 వరకు మకర సంక్రాంతి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో భరత్ గుప్తా సోమవారం తెలిపారు. 12న యాగశాల ప్రవేశం, ధ్వజారోహణంతో మహోత్సవాలు ప్రారంభమై ప్రతి రోజు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వాహన సేవలు, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 15న మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీగిరి పార్వతీ సమేత మల్లికార్జున స్వామివార్ల లీలా కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. సంక్రాంతి మహోత్సవాల సందర్భంగా 12 నుంచి 18వరకు శాశ్వత, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామన్నారు.



వివరాలు తెలుపుతున్న రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ ఎం.భగవత్ తదితరులు. అరెస్టయిన నిందితులు(ముసుగుల్లో)

విలాసాల కోసం గొలుసు చోరీలు

వేకువజామునే కాలనీల్లోకి వెళ్లి వృద్ధులే లక్ష్యంగా దొంగతనాలు

బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థుల అరెస్టు

54 తులాల బంగారం, ద్విచక్రవాహనాలు స్వాధీనం

రాయదుర్గం, న్యూస్‌టుడే: కాలనీల్లో ఒంటరిగా వాహ్యాళికి వచ్చే వృద్ధులను లక్ష్యంగా చేసుకుని బంగారు దొంగతనాలు చేస్తారు. సాయంత్రం మద్యం, గంజాయి తాగుతూ జల్సాలు చేసుకుంటారు. ఉన్నత విద్య చదువుతున్న నలుగురు విద్యార్థులు ముఠాగా ఏర్పడి సాగిస్తున్న దందా ఇది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ మురళీ ఎం.భగవత్, జాయింట్ కమిషనర్ తరుణ్ జ్యోషి, డీసీపీ వెంకటేశ్వర్‌రావుతో కలిసి సోమవారం వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి రాజీవ్‌నగర్‌కు చెందిన చవాన్ సూరజ్(21), కొమ్ము పవన్‌కుమార్(20)లు ఎల్‌బీనగర్ మన్సూరాబాద్‌లో ఉంటూ నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ, తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన మామిడి రోహిత్‌కుమార్ బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి. వీరంతా పరీక్షలు తప్పి కళాశాల నుంచి బయటికొచ్చారు. మద్యం, గంజాయికి అలవాటుపడ్డారు. వీరు ముగ్గురూ నగరంలోని పూల్‌బాగ్‌లో నివసించే పాలిటెక్నిక్ మధ్యలో మానేసిన మహ్మద్ ఒవైస్ అహ్మద్(19)తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలు, విలాసాలకు అవసరమైన డబ్బుకోసం గొలుసు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. స్నేహితుల ద్విచక్ర వాహనాలు తీసుకుని వేకువజామునే ఎల్‌బీనగర్, చైతన్యపురి, సరూర్‌నగర్, వనస్థలిపురంలోని కాలనీల్లోని నిర్జన ప్రదేశాలకు చేరుకునేవారు. ఒంటరిగా నడకకు వచ్చే వృద్ధులను ఎంపికచేసుకుని గొలుసులు లాక్కుని ఉడాయించేవారు. ఇప్పటివరకు అలా 18 చోరీలకు పాల్పడ్డారు. సరూర్‌గనర్ సాయినగర్ కాలనీలో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. విచారణలో వాళ్లు చేసిన గొలుసు దొంగతనాల చిట్టా వెలుగులోకి వచ్చింది. వారి నుంచి 54 తులాల బంగారు ఆభరణాలు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మురళీ ఎం.భగవత్ తెలిపారు.

16 నుంచి టీఎస్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ - 2017(టీఎస్‌సెట్)లో అర్హత సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల 16నుంచి 21 వరకు నిర్వహించనున్నారు. ఓయూ దూర విద్యా కేంద్రం పీజీఆర్ఆర్‌సీడీలోని సెట్ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు సబ్జెక్టుల వారీగా తేదీల కోసం www.telanganaset.org, www.osmania.ac.in. వెబ్‌సైట్‌లను సందర్శించాలని అధికారులు తెలిపారు.

27 నుంచి ఎల్ఎల్‌బీ పరీక్షలు

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో వాయిదా పడిన ఎల్ఎల్‌బీ పరీక్షలను ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికార వర్గాలు తెలిపాయి.

‘గిట్టుబాటు’కు చట్టం

- పంటలకు ధర నిర్ణయించడమే లక్ష్యం
- రైతు రుణవిముక్తికీ మరో చట్టం
- ముసాయిదా బిల్లులు రూపొందించిన అఖిలభారత రైతు ఉద్యమ సమన్వయ కమిటీ
- పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, రైతులకు రుణ విముక్తి కల్పించడానికి వేర్వేరుగా చట్టాలు తేవాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు, న్యాయవాదులు, వివిధ రంగాలవారితో ఏర్పాటైన అఖిల భారత రైతు ఉద్యమ సమన్వయ కమిటీ ఈ బిల్లులను రూపొందించింది. వ్యవసాయ రంగ సంక్షోభంపై దేశవ్యాప్తంగా వివిధ రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు దేశవ్యాప్తంగా యాత్రలు నిర్వహించాయి. దిల్లీలో మూడు రోజులపాటు వేల మంది రైతులతో ఆందోళన చేపట్టాయి. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, రైతు రుణ విముక్తికి చట్టాలు రావాలని బిల్లులను తయారుచేశాయి. ఈ ముసాయిదా బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చించి, మార్పుచేర్పులతో తుది బిల్లును రూపొందించి పార్లమెంటు సభ్యులకు అందజేయనున్నట్లు కమిటీ తెలిపింది. అధికార పక్షం ఈ బిల్లును ప్రవేశపెట్టినా సరే లేదా విపక్షంతో అయినా ప్రవేశపెట్టించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పింది. అవసరమైతే ప్రైవేటు బిల్లుగా ముందుకు తెచ్చే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

ఇవీ ప్రతిపాదనలు

- జాతీయ స్థాయిలో 11 మంది సభ్యులతో వ్యవసాయ- ఖర్చుల- ధరల కమిషన్ ఏర్పాటు చేయాలి. ఇందులో ఐదుగురు రైతు ప్రతినిధులు ఉండాలి. ఈ కమిషన్ రైతుల ఉత్పత్తి ఖర్చులను లెక్కించి ధరలు నిర్ణయించాలి.
- కేంద్రం ప్రకటించిన గిట్టుబాటు ధరలు అమలయ్యేలా చూడటం, ఆయా రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులను బట్టి అదనపు ధరలు లభించేలా చూడటానికి రాష్ట్ర స్థాయి కమిషన్ ఏర్పాటు చేయాలి.
- ఈ రెండు కమిటీలు స్వతంత్రంగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి.
- వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను రైతులందరికీ చట్టబద్ధ హక్కుగా చేయాలి. ఉత్పత్తి ఖర్చుకు కనీసం 50 శాతం లాభం కలిపి గిట్టుబాటు ధరను సిఫార్సు చేయాలి. ఈ ధరలను ఏటా ఖరీఫ్ కోసం మార్చి 31 నాటికి, రబీకి ఆగస్టు 31కల్లా ప్రకటించాలి.
- గిట్టుబాటు ధర దక్కకపోతే రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి జిల్లా స్థాయిలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలి. వ్యాపారి నిర్ణయించిన ధరకు కొనకపోతే జరిమానా విధించాలి. మూడోసారి కూడా తప్పు చేస్తే జరిమానాతో పాటు లైసెన్సు రద్దు చేయాలి. తగిన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు తెరవకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు జరిమానా విధించడానికి సిఫార్సు చేయాలి.
- కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరల నిధిని కూడా ఏర్పాటు చేయాలి.
- రైతు రుణ విముక్తి బిల్లులో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల రుణాలు, ప్రైవేటు రుణాలకు సంబంధించి మాఫీని సూచించాలి. అదనపు వడ్డీ లేకుండా రీషెడ్యూలు, మూడేళ్ల వరకు రుణాల వసూలును నివారించడం, బలవంతపు రుణాల వసూలును, రైతుల ఆస్తుల జప్తును నిషేధించడం మొదలైన అంశాలతో ఈ బిల్లును ప్రతిపాదించారు.
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఛైర్మన్‌గా 9మంది సభ్యులతో రైతుల రుణ ఉపశమన కమిషన్ ఏర్పాటు చేయాలి.



మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు కేటీఆర్, పోచారం, తుమ్మల, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు తదితరులు

నేరుగా రైతులకే నగదు!

- పంటల పెట్టుబడి అందజేతపై మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: పంటల పెట్టుబడి నిమిత్తం ఎకరాకు రూ.4 వేల చొప్పున నేరుగా రైతులకే నగదు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన... మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్‌లతో కూడిన ఉపసంఘం సోమవారం సచివాలయంలో సమావేశమైంది. రైతులకు నేరుగా నగదు అందించేందుకు అనువైన మార్గాలపై మంత్రులు, అధికారులు చర్చించారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తే, పాతబాకీల కింద జమచేసుకుంటారని రైతులు భావిస్తున్నట్లు మంత్రులు పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి కన్వీనర్‌ను అభిప్రాయం కోరగా- మంగళవారం స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించి, నిర్ణయం చెబుతామన్నారు. రైతులకు నగదు అందజేతపై ఉపసంఘం నాలుగు మార్గాలను పరిగణనలోకి తీసుకుంది.

1) మంగళవారం జిల్లాలకు వెళ్లి, నేరుగా రైతులతో మాట్లాడాలి. వారికి ఏ విధంగా పెట్టుబడులను అందజేయాలన్నది వారి ద్వారానే తెలుసుకోవాలి.
2) తపాల కార్యాలయాల ద్వారా అందించేందుకు గల అవకాశాలను పరిశీలించాలి.
3) గ్రామసభను పెట్టి, ప్రతిరైతుకూ చెక్కు ఇవ్వాలి.
4) టీ-వ్యాలెట్ ద్వారా డబ్బులు పొందేందుకు వీలుగా ప్రీలోడెడ్ కార్డులను రైతులకు పంపిణీ చేయాలి.

వీటిని పరిశీలించి, బుధవారం జరిగే సమావేశంలో తుదినిర్ణయానికి రావాలని భావించారు. ఆర్థిక, వ్యవసాయశాఖల కార్యదర్శులు రామకృష్ణారావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో సమావేశం

పెట్టుబడి డబ్బులను ఎలా అందించాలన్నది రైతులను స్వయంగా అడిగి తెలుసుకోవాలని అన్ని జిల్లాల వ్యవసాయాధికారులను ఆ శాఖ కార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. దృశ్యాత్మక సమావేశంలో ఆయన మాట్లాడుతూ- జిల్లాకో గ్రామాన్ని ఎంచుకుని, మంగళవారం అక్కడి రైతులతో తప్పనిసరిగా సమావేశం కావాలన్నారు. వారి అభిప్రాయాలను క్రోడీకరించి, కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. జిల్లా, మండల స్థాయి వ్యవసాయాధికారులు సమావేశానికి వెళ్లాలన్నారు.

20 మందికి 100 పర్సెంటైల్

వారిలో ఇద్దరు మహిళలు

క్యాట్-2017 ఫలితాలు విడుదల

దిల్లీ: ప్రతిష్ఠాత్మక ఐఐఎంలు సహా దేశంలోని అత్యున్నత బిజినెస్ స్కూళ్లలో ప్రవేశాల కోసం నిర్వహించిన క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్)-2017 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో మొత్తం 20 మంది 100 పర్సెంటైల్ సాధించారు. వారిలో ఇద్దరు మహిళలు, ముగ్గురు ఇంజినీరింగేతర అభ్యర్థులు ఉండటం విశేషం. క్యాట్-2016లో కూడా 20 మంది అభ్యర్థులు 100 పర్సెంటైల్ సాధించినప్పటికీ.. వారంతా ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పురుషులే. క్యాట్-2017 పరీక్షలో 100 పర్సెంటైల్ సాధించినవారిలో ఐఐటీ-మద్రాసుకు చెందిన సాయిప్రణీత్ రెడ్డి, సిద్ధార్థ్ కుమార్(పట్నా), విశాల్ వోహ్రా(కోల్‌కతా), మీత్ అగర్వాల్(సూరత్), ఛవి గుప్తా(దిల్లీ) తదితరులు ఉన్నారు. ఛవి గుప్తా ఐఐటీ-దిల్లీ నుంచి బయోటెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు.

నాలుగుసార్లు 100 పర్సెంటైల్: క్యాట్-2017లో 100 పర్సెంటైల్ సాధించినవారిలో ముంబయికి చెందిన పాట్రిక్ డిసౌజా కూడా ఉన్నారు. 41 ఏళ్ల డిసౌజా క్యాట్‌లో ఈ ఘనత సాధించడం 4వ సారి కావడం గమనార్హం. వాస్తవానికి బిజినెస్ స్కూళ్లు, ఐఐఎంలలో చేరే ఉద్దేశం ఆయనకు లేదు. క్యాట్ ఆశావాహులకు ఆయన శిక్షణ ఇస్తుంటారు. పరీక్ష విధానంపై మరింత పట్టు పెంచుకునేందుకు క్యాట్‌కు హాజరవుతుంటారు. ఇప్పటివరకు ఆయన 14 సార్లు క్యాట్ రాశారు. ఎన్ఐటీ అలహాబాద్‌లో 1997లో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న డిసౌజా.. 2000లో క్యాట్ రాశారు. ఏ ఐఐఎంలోనూ ప్రవేశం పొందలేకపోయారు. అనంతరం ఎంబీఏ పూర్తిచేసిన ఆయన కార్పొరేట్ రంగంలో నాలుగేళ్లపాటు పనిచేశారు. అయితే, బోధన వృత్తిపై మక్కువతో క్యాట్ ఆశావాహులకు ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారు.

సేవ చేయని సర్పంచిపై ఇక చర్యలు

ఈనాడు, హైదరాబాద్: అది చేస్తాం.. ఇది చేస్తామంటూ వాగ్దానాలను కుమ్మరించి తీరా పదవుల్లోకి వచ్చాక తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించే పంచాయతీ రాజ్ పాలకవర్గాలపై ఇక సర్కారు కొరడా ఝుళిపించనుంది. ప్రజల సమస్యలను పట్టించుకోనివారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లక్ష్యంగా తెలంగాణ నూతన పంచాయతీ రాజ్ చట్టం రాబోతుంది. సర్పంచి, వార్డు సభ్యులు, పంచాయతీ అధికారుల బాధ్యతలు ఏవనేది నూతన చట్టంలో మరింత విపులీకరిస్తారు. గ్రామ సభలు ఇక వెంటవెంటనే ఏర్పాటు చేసేలా నిబంధనలు రాబోతున్నాయి. అయిదు రోజుల్లో ముసాయిదా బిల్లు తయారు కానుంది.


తెలంగాణలోని సర్పంచులకు మరిన్ని అధికారాలు అందుబాటులోకి రానున్నాయి. నూతన పంచాయతీరాజ్ చట్టం కోసం నమూనా బిల్లుకు రూపకల్పన చేసేందుకు ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం సోమవారం ఇక్కడ భేటీ అయ్యింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన మరో ఆరుగురు మంత్రుల ఉపసంఘం పలు అంశాలపై చర్చించింది. ప్రస్తుత పంచాయతీరాజ్ చట్టంలో సర్పంచుల విధులు నిర్దేశించి ఉన్నప్పటికీ, వీటిని అమలు చేయకుంటే చేపట్టాల్సిన చర్యలపై స్పష్టత లేదు. సర్పంచులకు పరోక్ష ఎన్నికల పద్ధతిని అమల్లోకి తెస్తే చోటు చేసుకొనే పరిణామాలు, వాటిని అధిగమించేందుకు గల అవకాశాలు తదితరాలపైనా ఆరా తీసినట్టు సమాచారం. మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. భేటీ అనంతరం పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు విలేకర్లతో మాట్లాడుతూ ‘గ్రామాల రూపురేఖల్ని పూర్తిగా మార్చేలా, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసేలా కొత్త చట్టానికి రూపకల్పన చేస్తున్నాం. పంచాయతీల బలోపేతమే కొత్త చట్టం లక్ష్యంగా ఉండబోతోంది. పంచాయతీలకు మరిన్ని నిధులను కేటాయించబోతున్నాం. బడ్జెట్‌లోనే నిధులను కేటాయించటంపై చర్చిస్తున్నాం. వీటిని పారదర్శకంగా పంచాయతీల్లో వినియోగించటంపై కొత్త చట్టంలో నిబంధనలు ఉంటాయి’ అని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై చర్చ

కొత్త పంచాయతీల ఏర్పాటు, తండాలను పంచాయతీలుగా మార్చటం పైనా సమావేశం చర్చించింది. పంచాయతీ ఎన్నికల ప్రక్రియను త్వరగా పూర్తి చేయటం, ఎన్నికల్లో ఖర్చును తగ్గించటంపై పరిశీలించాలని అధికారులకు సూచించింది. పంచాయతీ కార్యవర్గ సమావేశాలు, గ్రామ సభల నిర్వహణకు ప్రస్తుతం అమల్లో ఉన్న గడువులను కొత్త చట్టంలో తగ్గించనున్నారు. దీని వల్ల పంచాయతీ సమావేశాలు త్వరగా నిర్వహించేందుకు, అలా వాటిని ఏర్పాటు చేయనివారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు వీలవుతుంది. మంత్రులు మంగళవారం కూడా భేటీ అవుతారు. మంత్రివర్గ ఉపసంఘంలోని సభ్యుల పేర్లను వెల్లడిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముసాయిదా బిల్లును అయిదు రోజుల్లో అందచేయాలని దానిలో పేర్కొంది. ఇక్కడి ప్రజల ఆశలు సాకరమయ్యే రీతిలో, తెలంగాణ అవసరాల కోణంలో నమూనా బిల్లు ఉండాలని ఉత్తర్వుల్లో తెలిపింది.

పనికి వెళ్లి వస్తూ.. పరలోకాలకు

- వాహనం బోల్తా పడి అయిదుగురు కూలీల దుర్మరణం
- డ్రైవర్ నిద్రమత్తు, అజాగ్రత్త వల్లే ప్రమాదం
- మరో 11 మందికి తీవ్ర గాయాలు



పార్చెర్ల స్టేజీ వద్ద అదుపు తప్పి బోల్తాపడిన వాహనం

ధరూర్, న్యూస్‌టుడే: ఓ డ్రైవర్ నిద్రమత్తు, అజాగ్రత్త అయిదుగురు కూలీల నిండు ప్రాణాలను బలిగొంది. జోగులాంబ జిల్లా కేంద్రం గద్వాలలోని జిన్నింగ్ మిల్లులో పనికి వెళ్లిన ధరూరు మండలం చిన్నపాడుకు చెందిన కూలీలు స్వగ్రామానికి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం(బొలెరో) సోమవారం ఉదయం బోల్తాపడింది. దీంతో అయిదుగురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిన్నపాడుకు చెందిన 33 మంది కూలీలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు గద్వాలలోని జిన్నింగ్ మిల్లులో రాత్రి షిఫ్టులో పని చేయడానికి వెళ్లారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు విధులు ముగియడంతో వాహనంలో తిరిగి వస్తున్నారు. 6 గంటల ప్రాంతంలో గద్వాల-రాయచూరు రహదారిపై పార్చెర్ల స్టేజి సమీపంలోకి రాగానే నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ ఆంజనేయులు అజాగ్రత్తగా వాహనం నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న లోతైన గోతిలోకి బోల్తాపడింది. వాహనం కూలీల పైన పడటంతో చిన్నపాడుకు చెందిన చెందిన దుద్దిని వెంకటన్న(50), కొత్తబాయి వెంకటన్న(48), కమ్మరి లోహిత్(45), కమ్మరి గీత(40), యుమునోపల్లి గ్రామానికి చెందిన అరుణమ్మ(55)లు అక్కడికక్కడే మృతి చెందారు. ఒక బాలిక వాహనం నుంచి దూకి ప్రాణాలతో బయటపడింది. క్షతగాత్రులైన మిగిలిన 27 మంది కూలీలను ప్రైవేటు వాహనాలు, 108లో గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి కొంత మెరుగైనట్లు తెలిసింది. ఎస్పీ విజయకుమార్, డీఎస్పీ సురేందర్‌రావు, సీఐ వెంకటేశ్వర్లు ఘటనాస్థలానికి ప్రమాద వివరాలను సేకరించారు.

రాష్ట్ర అధికారులకు ఐఏఎస్ పదోన్నతులపై వివరణ ఇవ్వండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు క్యాట్ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారులకు ఐఏఎస్ పదోన్నతులు కల్పించే ప్రక్రియపై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర సివిల్ సర్వీసెస్‌ను నిర్వచించకుండా ఉప కలెక్టర్లకు ఐఏఎస్ పదోన్నతులు కల్పించడంపై గ్రూపు-1, జిల్లా పంచాయతీ అధాకారిణి అయిన కె.పద్మజారాణి దాఖలు చేసిన పిటీషన్‌పై సోమవారం వాదనలు విన్న జస్టిస్ కాంతారావు, మిన్నీ మాథ్యూల కమిటీతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించించింది. ఈ సందర్భంగా పిటీషనర్ తరపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ తెలంగాణ ప్రభుత్వం పరిపాలన సర్వీసు (టాస్) ఏర్పాటు కోసం కమిటీని నియమించిందన్నారు. టాస్‌పై నిర్ణయం తీసుకోకుండా తెలంగాణ సివిల్ సర్వీసెస్ అంటే నిర్వచించకుండా పాత పద్ధతుల్లో రెవెన్యూ వారికే పదోన్నతులు కల్పించడం న్యాయ సూత్రాలకు వ్యతిరేకమని చెప్పారు. వాదనలు విన్న క్యాట్ ధర్మాసనం నాలుగో వారాల్లోగా సమాధానం చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యూపీఎస్సీలను ఆదేశించింది.

కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పరిశీలించిన కేంద్ర బృందం



ప్రాజెక్టు పటాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కాళేశ్వరం, మహదేవపూర్, న్యూస్‌టుడే: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కొనసాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సోమవారం కేంద్ర జలవనరులశాఖ ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. ఆ శాఖ చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్ నేతృత్వంలోని సభ్యులు అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు, కన్నెపల్లి పంపుహౌస్ పనులను చూశారు. కన్నెపల్లి పంపుహజ్‌కు గోదావరి నుంచి నీటిని తరలించే విధానం, అక్కడి నుంచి గ్రావిటీ కాలువలో ఎత్తిపోసే పద్ధతిని కాళేశ్వరం ఇంజినీర్లు వారికి వివరించారు. నీటి లభ్యత, మోటర్ల సామర్థ్యం, విద్యుత్తు కేంద్రం పనులపై చర్చించారు. 13.2 కిలోమీటర్ల కాలువ నిర్మాణం కోసం ఒకవైపు పూడిక తీస్తూనే మరోవైపు కాంక్రీట్ పనులు చేపడుతున్నట్లు ఇంజినీర్లు తెలిపారు. జూన్ వరకు ట్రయల్ రన్ నిర్వహిస్తామని ఉన్నతాధికారులు కేంద్ర బృందానికి హామీ ఇచ్చారు. బృందంలో సభ్యులుగా రాజీవ్‌కుమార్, ఎన్ఎన్‌రాజు, ముఖర్జీ ఉండగా ఈఎన్‌సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం బ్యారేజీ చీఫ్ ఇంజినీర్ నల్లవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲ 199	నిఫ్టీ ▲ 65	రూపాయి 63.51 ▼	బంగారం 29,580 ▲	వెండి 38,705 ▼	ముడి చమురు 67.63 ▲
34353	10624	(ఒక అమెరికా డాలరుకు) 14 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 05	ముంబయిలో కిలో రూ.లలో 20	(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,263	−33
నాస్‌డాక్	7,149	+12
నిక్కీ 225 (జపాన్)	23,715	+208
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,512	+23
షాంఘై(చైనా)	3,410	+18
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,697	−28
డాక్స్ (జర్మనీ)	13,368	+48

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.61	66.81
పౌండ్ స్టెర్లింగ్	78.18	90.66
యూరో	69.33	80.40
జపనీస్ యెన్/100	50.91	59.04
ఆస్ట్రేలియా డాలరు	45.22	52.32
సింగపూర్ డాలరు	43.36	51.36
థాయ్ బాత్/100	179.11	214.22
బహ్రెయిన్ దీనార్	156.04	178.82
కువైట్ దీనార్	173.66	216.18
సౌదీ రియాల్	15.32	18.16
యూఏఈ దిర్హమ్	15.68	18.33
మలేషియా రింగిట్	14.14	17.39
చైనీస్ యువాన్	6.91	11.20



సోమవారం నిఫ్టీ కదలికలు



మార్కెట్ కబుర్లు

- ✦ పుణె మెట్రో ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర మెట్రో రైలు కార్పొరేషన్ నుంచి రూ.484 కోట్ల కాంట్రాక్టును తమ సంయుక్త సంస్థ పొందిందని **హెచ్‌సీసీ** వెల్లడించింది.
- ✦ బాండ్ల జారీ ద్వారా అమెరికా డాలరు లేదా ఇతర కరెన్సీ రూపేణా 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.12,600 కోట్లు) వరకు సమీకరించాలని **ఎస్‌బీఐ** భావిస్తోంది.
- ✦ మిఠాయిలు, చాక్లెట్ల (కన్ఫెక్షనరీ) వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు **ఎవరెడీ ఇండస్ట్రీస్** తెలిపింది. ఇందులో భాగంగా మొట్టమొదట జాలీస్‌ను తీసుకొనిరానుంది.
- ✦ కొట్ద్వార్- రామ్‌నడర్ కండి రహదారి నిర్మాణం నిమిత్తం ఎకోటూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ నుంచి రూ.2000 కోట్ల విలువైన ఆర్డరును **ఎన్‌బీసీసీ** చేజిక్కించుకుంది.
- ✦ ప్రభుత్వం సహా వివిధ పారిశ్రామిక, విద్యాసంస్థలు, గృహ సముదాయ సంస్థల నుంచి రూ.1,776.41 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయని **పీఎస్‌పీ ప్రాజెక్ట్స్** తెలిపింది.
- ✦ చెన్నైలోని తమ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించిన అనంతరం ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ నివేదికను (ఈఐఆర్) అమెరికా ఆహార ఔషధ, నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అందజేసిందని **ఆర్చిడ్ ఫార్మా** వెల్లడించింది.
- ✦ తమ సంస్థలో 5 శాతానికి సమానమైన 20,68,31,325 షేర్లను రూ.801 కోట్లతో తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసేందుకు డైరెక్టర్ల బోర్డు అంగీకరించిందని కేంద్రప్రభుత్వం, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సంయుక్త విద్యుదుత్పత్తి సంస్థ **ఎస్‌జేవీఎన్** తెలిపింది.

కొనసాగిన రికార్డుల పర్వం

- తాజా గరిష్ఠాలకు సూచీలు
- 10,600 ఎగువకు నిఫ్టీ



సమీక్ష

సూచీల రికార్డుల పర్వం కొనసాగింది. కంపెనీల త్రైమాసిక ఫలితాలు, వృద్ధి, రాబోయే బడ్జెట్‌పై మదుపర్లు సానుకూల వైఖరి ప్రదర్శించడం ఇందుకు దోహదపడింది. అంతర్జాతీయ సంకేతాలు సైతం దన్నుగా నిలిచాయి. ఐటీ, యంత్ర పరికరాలు, ఆరోగ్య సంరక్షణ, లోహ షేర్లకు కొనుగోళ్లు వెల్లువెత్తడంతో నిఫ్టీ చరిత్రలో తొలిసారిగా 10,600 పాయింట్లను అధిగమించింది. ఆసియా షేర్లలో షాంఘై కాంపోజిట్, హాంగ్‌సెంగ్ రాణించగా, జపాన్ మార్కెట్లు పనిచేయలేదు. ఇక ఐరోపా సూచీలు సైతం మెరుగ్గా ట్రేడయ్యాయి. సూచీల జోరు నేపథ్యంలో మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల విలువ రూ.1.12 లక్షల కోట్లు పెరిగి జీవన కాల గరిష్ఠమైన రూ.154.89 లక్షల కోట్లకు చేరింది.

రోజంతా పరుగులే: సెన్సెక్స్ ఉదయం 32,216.33 పాయింట్ల వద్ద బలంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 34,385.67 పాయింట్ల వద్ద జీవన కాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 198.94 పాయింట్లు పెరిగి 34,352.79 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌కు ఇది రికార్డు ముగింపు కావడం విశేషం. జనవరి 5 ముగింపైన 34,153.85 పాయింట్లను సూచీ అధిగమించింది. ఇక నిఫ్టీ సైతం 10,631.20 పాయింట్ల వద్ద రికార్డు గరిష్ఠాన్ని తాకింది. చివరకు 64.75 పాయింట్ల లాభంతో 10,623.60 దగ్గర స్థిరపడింది. జనవరి 5 తర్వాత సూచీకిదే రికార్డు ముగింపు కావడం విశేషం.

- ✦ ఏపీసీఆర్‌డీఏ నుంచి రూ.2,265 కోట్ల ఆర్డర్లను అనుబంధ విభాగం దక్కించుకున్న నేపథ్యంలో ఎల్ అండ్ టీ షేర్లు దుమ్మురేపాయి. ఒకానొకదశలో 2.35 శాతం పెరిగిన షేరు రూ.1,345.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1.80 శాతం లాభంతో రూ.1,338.10 వద్ద ముగిసింది.
- ✦ పుణె మెట్రో ప్రాజెక్ట్ నిర్మాణ నిమిత్తం మహారాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ నుంచి రూ.484 కోట్ల కాంట్రాక్ట్‌ను సంయుక్త సంస్థ దక్కించుకోవడంతో హెచ్‌సీసీ షేర్లు 3.34 శాతం పెరిగి రూ.43.30 దగ్గర స్థిరపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభాలతో ముగిశాయి. కోల్ ఇండియా అత్యధికంగా 3.26% లాభపడింది. ఇన్ఫోసిస్ 2.33%, సన్‌ఫార్మా 2.28%, ఎల్ అండ్ టీ 1.80%, హీరో మోటోకార్ప్ 1.37%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.16%, ఐటీసీ 0.93%, టీసీఎస్ 0.87%, హిందుస్థాన్ యునిలీవర్ 0.80%లు రాణించిన వాటిలో ఉన్నాయి. భారతీ ఎయిర్‌టెల్ (4.43%), ఓఎన్‌జీసీ (0.28%), ఎస్‌బీఐ (0.18%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో.. ఐటీ సూచీ 1.40% మెరిసింది. యంత్ర పరికరాలు 1.22%, ఆరోగ్య సంరక్షణ 1.20%, స్థిరాస్తి 0.87%, లోహ 0.78%, ఎఫ్ఎమ్‌సీజీ 0.78% చొప్పున రాణించాయి.

నేటి మార్కెట్

సూచీల వరుస లాభాలు కొనసాగే అవకాశం ఉంది. అంతర్జాతీయ వృద్ధిపై ఆశావహ దృక్పథం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత కొన్ని సెషన్లుగా విదేశీ సంస్థాగత మదుపర్లు స్థిరంగా కొనుగోళ్లు కొనసాగించడం సైతం అంతర్లీనంగా సానుకూలతలకు దోహదం చేస్తున్నాయి. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి కంపెనీల ఆర్థిక ఫలితాలు వెలువరించనుండటంతో మదుపర్లు కొంత అప్రమత్తత పాటించొచ్చని, దీంతో లాభాలు పరిమితంగానే ఉండొచ్చనే విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నేడు నిఫ్టీకి 10660- 10700 పాయింట్ల శ్రేణిలో నిరోధం, 10576- 10596 పాయింట్ల శ్రేణిలో మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇండియా వీఐఎక్స్ సూచీ పెరగడం ఒడుదొడుకులను సూచిస్తోందని, అయితే అంతర్లీనంగా సానుకూలతలు కనిపిస్తున్నాయని అంటున్నారు. అమెరికా ఆర్థిక గణాంకాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. అక్టోబరు- డిసెంబరులో ఆదాయం పుంజుకోవచ్చన్న అంచనాలతో ఔషధ షేర్ల జోరు కొనసాగొచ్చు. అంతర్జాతీయంగా ప్రాథమిక లోహాలకు గిరాకీ లభిస్తుండటంతో.. ఈ రంగ షేర్లు రాణించొచ్చు.

ఎన్‌ఎండీసీలో 1.5% వాటా విక్రయం నేటి నుంచి

ఈనాడు, హైదరాబాద్: ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఎన్ఎండీసీలో 1.5 శాతానికి సమానమైన 4,74,58,357 (4.74 కోట్లు) షేర్లను నేటి నుంచి విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇష్యూకు అధిక స్పందన లభిస్తే.. మరో 4.74 కోట్ల షేర్లను కూడా విక్రయించవచ్చు. అధిక స్పందన లభించి 'గ్రీన్ షూ ఆప్షన్'ను కూడా వినియోగించుకుంటే.. మొత్తం 3 శాతం వాటాను విక్రయించినట్లవుతుంది. రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.153.5 కనీస ధరను (ఫ్లోర్ ప్రైస్)ను నిర్ణయించారు. దీని ప్రకారం 1.5 శాతం వాటాను విక్రయిస్తే.. దాదాపు రూ.725 కోట్లు, గ్రీన్ షూ ఆప్షన్ కూడా వినియోగించుకుంటే దాదాపు రూ.1,450 కోట్లు ప్రభుత్వానికి లభిస్తాయి. కనీసం 25 శాతం షేర్లను మ్యూచువల్ ఫండ్‌లు, బీమా కంపెనీలకు, 20 శాతం షేర్లను రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించాలి. నేడు సంస్థాగత మదుపర్లు మాత్రమే బిడ్లను దాఖలు చేయడానికి వీలుంటుంది. రేపు రిటైల్ ఇన్వెస్టర్ల, తమ బిడ్లను క్యారీ ఫార్వర్డ్ చేసిన సంస్థాగత మదుపర్లు బిడ్లను దాఖలు చేయొచ్చు. బీఎస్ఈలో సోమవారం ఎన్ఎండీసీ షేరు ధర రూ.161.85 వద్ద ముగిసింది. దీంతో పోలిస్తే ఆఫర్ ఫర్ సేల్ కనీస ధర రూ.3.35 (2.11 శాతం) తక్కువగా ఉంది. దేశంలోని అతిపెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తి కంపెనీ అయిన ఎన్ఎండీసీలో ప్రస్తుతం ప్రభుత్వానికి 74.94 శాతం వాటా ఉంది.

ఎఫ్ఎంసీజీ కంపెనీలకు ఈ ఏడాది పండగే

- అమ్మకాలు, మార్జిన్లు పెరుగుతాయ్: ఎడెల్‌వైజ్



ముంబయి: రుతుపవనాల వల్ల గ్రామీణ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతో ఈ ఏడాది ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల కంపెనీల అమ్మకాలు, మార్జిన్లు బాగుంటాయని ఎడెల్‌వైజ్ ఒక నివేదికలో పేర్కొంది. కొన్ని రాష్ట్రాల ఎన్నికలు జరగనుండటంతో జనాకర్షక విధానాలను ప్రభుత్వం ప్రకటిస్తుందనే అంచనాలున్నాయని, వాటి వల్ల తొలుత లబ్ధి కలిగేది గ్రామీణ ప్రాంతానికే అని నివేదిక వివరించింది. వరుసగా రెండేళ్ల కరవు తరవాత వర్షాలు బాగా కురవడం వల్ల పంట దిగుబడులు బాగున్నాయని, ఫలితంగా అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో వినియోగ ఉత్పత్తుల అమ్మకాలు పెరిగాయని తెలిపింది. నాలుగు త్రైమాసికాల పాటు ఎఫ్ఎంసీజీ కంపెనీల వృద్ధి మందగించిందని, గత త్రైమాసికంలో మాత్రం అమ్మకాల్లో 10 శాతం వరకు వృద్ధి లభిస్తుందని పేర్కొంది. ఈ పరిస్థితికి ప్రభుత్వ విధానాలు జతకలిసి 2018లో అమ్మకాలు మరింత పెరుగుతాయని వివరించింది. జీఎస్‌టీ అమలు సమయంలో ఏర్పడిన పరిస్థితుల ప్రభావం నుంచి కంపెనీలు సాధారణ స్థితికి వస్తున్నాయని తెలిపింది. అయితే జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వల్ల, ధరలను కంపెనీలను పెంచకపోవడం వల్ల, స్థూల మార్జిన్లలో పెద్దగా మార్పుండదని, ప్రకటనలపై కంపెనీల వ్యయాలూ ఇందుకు కారణమని పేర్కొంది. రంగుల కంపెనీల అమ్మకాలు కూడా 9-10 శాతం వరకు పెరగొచ్చని అంచనా వేసింది.

ముడిసరకుల ధరలు పెరిగాయ్

ఎండుకొబ్బరి, మెంథాల్ వంటి ముడి సరకుల ధరలు పెరిగాయని నివేదిక తెలిపింది. పంచదార, గోధుమపిండి, పాల ధరల్లో పెద్ద మార్పు లేదని, కొన్నిటి ధరలు స్వల్పంగా తగ్గాయని వివరించింది. పెరిగిన ధరలకు అనుగుణంగా కూడా, ఉత్పత్తుల ధరలను కంపెనీలు పెంచకపోవడం వల్లే స్థూల మార్జిన్లపై ఒత్తిడి ఏర్పడిందని పేర్కొంది.

రాణించిన యునికెమ్ ల్యాబ్స్

దిల్లీ: డిసెంబరు 31తో ముగిసిన మూడో త్రైమాసికంలో యునికెమ్ లేబొరేటరీస్ రూ.2,507.03 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.26.10 కోట్లుగా ఉంది. భారత్, నేపాల్‌లలో కంపెనీ దేశీయ ఔషధ వ్యాపారాన్ని టొరెంట్ ఫార్మాకు విక్రయించడమే ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం స్టాండలోన్ ఆదాయం రూ.159.82 కోట్ల ఉంచి రూ.165.82 కోట్లకు పెరిగింది. కంపెనీ షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)కు సైతం ఆమోదం తెలిపింది. రూ.885.80 కోట్లకు సమానమైన 2.06 కోట్ల ఈక్విటీ షేర్లకు తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది.

పెరిగిన వీడియోకాన్ నష్టం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో రుణాల ఊబిలో కూరుకున్న వీడియోకాన్ ఇండస్ట్రీస్ రూ.1,033.69 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.403.66 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇక మొత్తం ఆదాయం రూ.2,700.08 కోట్ల నుంచి 68.30 శాతం క్షీణించి రూ.855.77 కోట్లకు పరిమితమైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.3,212 కోట్ల నుంచి రూ.1,997.35 కోట్లకు తగ్గాయి. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విభాగం ఆదాయం రూ.2,544.24 కోట్ల నుంచి 71.94 శాతం తగ్గి రూ.713.79 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కంపెనీ నికర నష్టం రూ.772.41 కోట్ల నుంచి రూ.1,919.51 కోట్లకు పెరిగింది.

10% ఐటీ ఉద్యోగాలు 'బ్లాక్‌చైన్'లోనే

- వచ్చే అయిదేళ్లపై అంచనా
- అందుబాటులోకి 'జెబి చైన్' సొల్యూషన్



జెబి చైన్ ఉత్పత్తి వివరాలను వెల్లడిస్తున్న సంస్థ ఎండీ బాబు మునగాల


ఈనాడు, హైదరాబాద్: వచ్చే కొద్ది సంవత్సరాల్లో డేటా భద్రతకు ప్రతి రంగంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగించగలరని, దేశీయంగా డేటా రక్షణ, డేటా వినియోగంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఉత్పత్తులకు దాదాపు 500 కోట్ల డాలర్ల మార్కెట్ అవకాశాలు ఉన్నాయని జెబి డేటా ఇండియా వ్యవస్థాపకుడు, ఎండీ బాబు మునగాల తెలిపారు. వచ్చే 5-10 ఏళ్లలో భూమి, ఉద్యోగులు, వేతనాలు, విద్య వంటి రికార్డుల భద్రతకు విరివిగా బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారని చెప్పారు. ఒక సారి ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నమోదు చేసిన డేటాను మార్చడానికి వీలుండదన్నారు. వచ్చే అయిదేళ్లలో ఐటీ రంగంలో లభించే ఉద్యోగాల్లో 10 శాతం ఉద్యోగాలు ఈ సాంకేతిక పరిజ్ఞానంలోనే లభిస్తాయని, విద్యార్థులు బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యాన్ని పొందితే.. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం రావడానికి అవకాశాలు ఉన్నాయని బాబు అన్నారు. భవిష్యత్తులో తగ్గడానికి అవకాశం ఉన్నప్పటికీ.. అంతర్జాతీయంగా బ్లాక్ టెక్నాలజీ నిపుణులకు గంటకు 500 డాలర్ల వరకూ ప్రస్తుతం చెల్లిస్తున్నారని వివరించారు. బిగ్ డేటా కోసం జెబి డేటా ఇండియా వినూత్న బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత భద్రత సొల్యూషన్ (ప్రొడక్ట్)- 'జెబి చైన్'ను అభివృద్ధి చేసింది. భూ రిజిస్ట్రేషన్ రికార్డులు, ఉద్యోగులు, వేతన, పెన్షన్ చెల్లింపు మొదలైన రికార్డులను మార్పులు చేయడానికి వీలు లేకుండా భద్రంగా ఉంచడానికి ఈ ప్రొడక్ట్ దోహదం చేస్తుందన్నారు. 2020 నాటికి దేశంలో ఏడాదికి 3 జెబి బైట్ల డేటా ఉత్పత్తి అవుతుందని అంచనా. డేటా ట్యాంపరింగ్, డేటా హ్యాక్, డేటా లీక్‌ల వంటి వాటి నుంచి ఈ ఉత్పత్తి రక్షణ కల్పిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) పరిధిలోని భూ రికార్డులను జెబి చైన్ సొల్యూషన్ ద్వారా భద్రపరచడానికి కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు అనుగుణంగా అమరావతి బ్లాక్‌చైన్ అసెట్ మేనేజిమెంట్ వ్యవస్థను ప్రారంభించింది. భూ రికార్డులు, ఇతర రికార్డులను బ్లాక్‌చైన్ ఆధారంగా భద్రపరచడానికి తెలంగాణ, మహారాష్ట్ర సహా 5-6 ప్రభుత్వాలు, కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు బాబు చెప్పారు. ఇప్పటి వరకూ రూ.10 కోట్ల నిధులను సమీకరించామని, భవిష్యత్తులో మరిని నిధుల సమీకరణపై కసరత్తు చేస్తున్నామన్నారు. కంపెనీలో బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానంలో ప్రత్యేక నైపుణ్యాలున్నా 28 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

కోల్ ఇండియా



రూ.279 వద్ద ప్రారంభమై రూ.279- 290.60 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.278.75తో పోలిస్తే రూ.8.70 (3.12%) లాభంతో రూ.287.45 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 48,91,781.

భారతీ ఎయిర్‌టెల్



రూ.534.15 వద్ద మొదలై రూ.514.20- 534.15 మధ్య చలించి క్రితం ముగింపు రూ.516.35తో పోలిస్తే రూ.23.65 (4.38%) నష్టంతో రూ.516.35 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 1,10,74.508 షేర్లు చేతులు మారాయి.


52 వారాల గరిష్ఠం (రూ.లలో)			
సీఈఎస్‌సీ	1135.10	శోభా	694.90
భారత్ ఫైనాన్షియల్	1053.90	మైండ్‌ట్రీ	643.20
టాటా ఎలెక్సీ	1018.50	బయోకాన్	564.00
డ్రెడ్జింగ్ కార్పొరేషన్	922.00	టెక్ మహీంద్రా	542.85
బాలాజీ అమైన్స్	772.80	**52 వారాల కనిష్ఠం (రూ.లలో)**	
ఎన్ఐఐటీ టెక్నాలజీస్	705.90	మార్క్స్ ఇండియా	120.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
08/01	5,637	4,944	693	3,710	3,916	−206
05/01	5,812	5,230	581	3,985	3,742	243
04/01	4,624	4,412	212	3,817	3,491	325
03/01	4,529	4,433	96	3,081	3,350	−269
02/01	3,162	2,640	523	3,230	3,166	65

8వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) కోడిగుడ్లు

(100కు రూపాయలలో)



హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	400
బెంగళూరు	405	చెన్నై	405
9న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	400	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 422.90 (423.80) 3447843
AMBUJA CEMEN 274.60 (273.90) 1215089
ASIAN PAINTS 1182.00 (1185.25) 928875
AUROBIND PHA 677.35 (671.15) 2104715
AXIS BANK LT 565.45 (563.25) 3770339
BAJAJ AUTO L 3275.75 (3279.85) 120330
BAJAJ FINANC 1836.85 (1814.50) 825022
BHARTI AIRTE 516.35 (540.00) 11074508
BHARTI INFRA 374.40 (372.60) 1754188
BOSCH LTD 19998.35 (19693.15) 19162
BPCL 497.20 (487.70) 4990626
CIPLA 615.05 (615.15) 1061612
COAL INDIA L 287.45 (278.75) 4891781
DR. REDDYS 2476.60 (2473.40) 585871
EICHER MOTOR 29197.40 (29237.00) 32924
GAIL 497.40 (494.40) 2279620
HCL TECH 900.50 (900.05) 1176584
HDFC 1740.95 (1725.20) 2997037
HDFC BANK 1860.60 (1863.60) 1142577
HERO MOTOCOR 3786.75 (3744.65) 249549
HINDALCO IND 276.15 (276.40) 4157464
HINDUSTAN UN 1368.40 (1356.55) 801796
HPCL 421.15 (415.00) 2147719
ICICI BANK 314.15 (312.90) 7329648
INDIABULLS H 1225.30 (1198.95) 971947
INDIAN OIL 388.55 (383.85) 3732287
INDUSINDBANK 1719.90 (1698.20) 1489032
INFOSYS LTD 1036.05 (1012.00) 2797345
ITC 265.60 (262.90) 14433239
KOTAK MAHIND 1006.10 (1003.05) 1780412
LARSEN & TOU 1338.25 (1314.90) 3513256
LUPIN 923.30 (900.15) 3798830
M&M 759.90 (756.35) 2309604
MARUTI SUZIK 9448.95 (9433.85) 294549
NTPC LTD 177.65 (177.50) 6075105
ONGC 197.40 (198.45) 4858711
POWER GRID C 200.55 (201.25) 6636300
RELIANCE IND 928.55 (923.25) 4035417
SBI 305.80 (306.35) 13557197
SUN PHARMA 591.60 (578.75) 10475190
TATA CONSULT 2714.40 (2689.20) 621110
TATA MOTORS 433.55 (431.60) 4635214
TATA STEEL L 768.75 (770.70) 2584335
TECH MAHINDR 536.30 (525.45) 2795379
ULTRATECH 4425.30 (4395.80) 176265
UPL LIMITED 784.35 (774.20) 1327482
VEDANTA LIMI 340.25 (339.55) 5023286
WIPRO 311.15 (309.55) 1785248
YES BANK LTD 333.60 (332.85) 12747890
ZEE ENTERTAI 593.90 (586.85) 2621722

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1437.60 (1435.10) 130805
ACC 1825.00 (1809.95) 189168
ASHOK LEYLAN 128.45 (127.45) 8807108
AVENUE SUPER 1226.80 (1243.40) 520902
BAJAJ FINSER 5221.25 (5127.20) 181068
BANK OFBAROD 161.65 (161.80) 6316362
BEL 184.05 (182.30) 4068580
BHEL 101.95 (102.35) 5822499
BRITANNIA 4693.75 (4644.10) 88415
CADILA HEALT 452.00 (440.20) 1665935
COLGATE PALM 1117.70 (1100.70) 284048
CONTAINER 1379.95 (1379.30) 260286
CUMMINS INDI 957.55 (957.20) 270149
DABUR INDIA 361.35 (358.20) 1129672
DLF LIMITED 260.25 (259.95) 3945670
EMAMI LIMITE 1336.25 (1327.95) 130495
GLAXOSMI CON 6358.80 (6398.45) 30084
GLAXOSMI PHA 2509.55 (2488.20) 14079
GLENMARK PHA 600.40 (591.60) 2203458
GODREJ CONSU 994.70 (990.05) 250604
HAVELLS INDI 563.10 (566.05) 893255
HINDUSTAN ZI 318.00 (313.80) 1061554
ICICI PRU LI 411.80 (394.15) 2269846
IDEA CELLULR 109.05 (115.80) 37244129
INTERGLOBE A 1225.20 (1198.60) 547692
JSW STEEL LT 286.00 (285.10) 2686737
LIC HOUS.FIN 583.90 (571.25) 3167043
MARICO LIMIT 323.15 (326.95) 1294585
MCDOWELL 3923.50 (3953.25) 327714
MOTHERSON 383.75 (381.00) 1731940
MRF 72610.50 (72905.90) 6757
NHPC LTD 33.15 (33.55) 7970259
NMDC LTD 161.85 (158.55) 5149595
OIL INDIA 379.75 (380.50) 659707
ORACLE FIN S 4110.30 (4101.65) 45766
P&G HYG&HEAL 9299.50 (9326.25) 3432
PETRONET LNG 254.70 (252.15) 4201024
PIDILITE IND 912.15 (910.20) 211898
PIRAMAL ENTE 2909.55 (2853.50) 211623
PNB 175.70 (176.00) 7302294
POWER FIN CO 126.70 (125.05) 3575815
RURAL ELEC C 163.95 (161.45) 3690235
SAIL 98.80 (97.40) 15714606
SHREE CEMENT 19374.35 (18964.50) 12610
SHRIRAM TRAN 1509.90 (1480.05) 558312
SIEMENS 1293.45 (1286.70) 353682
SUN TV LTD 1044.45 (1037.95) 812859
TATA POWER 99.85 (99.55) 5874354
TITAN IND 926.10 (909.70) 2112170
TORRENT PHAR 1433.85 (1420.75) 209934

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 220.05 (215.55) 4586419
ADANI ENTERP 196.45 (193.15) 8253904
ADANI POWER 46.95 (46.40) 14597285
ALL BANK 73.20 (73.05) 1273547
AMARA RAJA 864.90 (862.00) 555183
ANANT RAJIND 79.85 (78.95) 4681299
ANDHRA BANK 58.55 (58.70) 1633175
APOLLO HOSPI 1180.70 (1196.30) 505510
APOLLO TYRES 283.70 (280.60) 2827715
APTECH 375.15 (361.05) 1328548
BAJAJ ELECT. 560.70 (567.65) 510670
BAJAJ HIND 17.65 (17.30) 6999362
BAJAJ HOLDIN 2864.90 (2829.80) 9820
BALAJI TELE 157.75 (160.00) 265345
BALLARPUR IN 18.30 (18.30) 2437832
BALRAMPUR CH 141.55 (139.90) 2095622
BANK OF MAHA 23.55 (23.65) 745829
BANK OFINDIA 170.40 (172.25) 1859110
BATA INDIA 761.55 (764.80) 461682
BGR ENERGY S 141.60 (140.40) 139940
BHARAT FORGE 742.40 (738.85) 1218813
BHUSHAN STEE 70.10 (68.95) 1918144
BIOCON LTD 555.35 (540.95) 2156482
BOMBAY DYE 295.50 (277.90) 13020834
CANARA BANK 364.75 (364.85) 1215250
CEAT LIMITED 1958.10 (1977.50) 332955
CENTRAL BANK 75.45 (76.05) 1113674
CHAMBAL FERT 156.75 (159.15) 404128
CHENNAI PETR 425.85 (422.85) 318959
CITY UNIBANK 175.65 (176.00) 244565
CORPO BANK 40.85 (41.15) 246094
COX & KINGS 274.15 (272.60) 301115
D B REALTY L 78.45 (74.75) 285036
DELTA CORP L 305.90 (303.40) 1225009
DENA BANK 26.70 (26.70) 2321462
DHANALAKBANK 30.45 (30.45) 1257426
DIVIS LAB 1116.20 (1107.65) 468360
EDELWEISS CA 288.15 (292.70) 1751146
EID PARRY 383.60 (382.80) 70201
EIH 184.10 (154.00) 1960957
ESSAR SHIPPI 32.15 (31.65) 194765
ESTER INDUST 64.95 (60.90) 1213841
EXIDE INDUST 225.70 (227.10) 1134128
FEDERAL BANK 115.55 (112.10) 14341872
FINOLEX CABL 741.50 (713.60) 89554
G E SHIP LTD 410.15 (411.65) 36370
GAMMON INFRA 3.85 (3.50) 13021533
GATI LIMITED 141.50 (139.25) 2675175
GAYATRI PROJ 213.80 (215.30) 312622
GITANJALIGEM 79.30 (73.70) 7412224
GMR INFRASTR 22.00 (21.20) 78370420
GODREJ IND 609.95 (616.30) 612348
GRASIM IND 1203.00 (1214.20) 895318
GUJ ALK&CHEM 797.55 (790.60) 143538
GUJ NRE COKE 1.55 (1.50) 11045972
HCL INFOSYS 63.00 (59.80) 9711081
HDFC BANK 1866.00 (1865.00) 110000
HEXA TECH 363.85 (358.70) 1218446
HIMACHAL FUT 33.25 (33.10) 11846025
HINDU MOTORS 10.05 (9.25) 2482076
HOUSING DEV 64.55 (63.95) 17343331
IDBI 63.20 (63.80) 2418363
IDFC 66.65 (64.45) 18626347
IFCI 31.10 (30.60) 22585293
IL&FS TRANS 91.95 (94.35) 766800
INDBULLS REL 229.25 (221.25) 13018484
INDIA CEM 196.15 (199.05) 3693968
INDIAN BANK 380.70 (379.25) 772552
INDO RAMA SY 50.75 (47.65) 1530829
INDRAPRASTHA 328.20 (329.85) 2384896
INGERSOLL-R 886.80 (888.60) 17735
IOB 23.95 (24.15) 2183857
IPCA LAB 586.35 (583.55) 122742
IRB INFRA DE 245.05 (243.60) 1008807
J&K BANK 81.50 (81.65) 481227
JAI CORP 209.60 (205.20) 5617823
JAIN IRRIGAT 134.20 (134.85) 8982376
JAYPEE INFRA 24.70 (23.25) 11500734
JET AIRWAYS 866.05 (870.55) 2125441
JINDAL SAW 161.85 (159.75) 2119338
JINDAL STEEL 256.45 (239.05) 38180155
JK LAKSHMI C 450.60 (447.60) 34937
JK PAPER LIM 165.70 (162.60) 1592626
JM FINANCIAL 160.15 (157.35) 1075682
JP ASSOCIATS 25.35 (25.10) 69122045
JSW ENERGY L 91.45 (91.60) 3562661
JUBILANT FOO 1931.00 (1904.35) 719531
JUBILANT ORG 777.80 (770.30) 352837
JYOTHY LABS 384.60 (385.15) 82819
JYOTI STRUC 12.85 (13.40) 1891901
KARNATA BANK 159.00 (157.70) 2554836
KEC INTL LTD 379.05 (373.50) 377249
KOLTE PATIL 373.20 (372.70) 704993
KPIT CUMMINS 199.10 (202.25) 2269171
L&TFIN.HOLD 183.80 (175.15) 8704092
LAK VIL BANK 147.60 (148.60) 491329
M & M FINANC 491.65 (484.30) 1580169
MANAPPURAM G 123.90 (120.00) 10939386
MMTC LIMITED 70.55 (70.85) 2151961
MOSER-BEAR 6.45 (6.10) 6285473
MPHASIS LTD 715.60 (714.00) 170912
MRPL 133.65 (128.55) 3131974
MTNL 29.55 (28.95) 4782108
NAGARJUNA OI 5.15 (4.60) 3211597
NCC LIMITED 134.10 (132.05) 4263815
NETWORK18 FI 61.00 (60.60) 2009593
NEULAND LAB 853.95 (845.65) 63856
NIIT LTD 114.70 (111.85) 2318474
NIIT TECHNOL 704.05 (669.50) 909477
OMAXE LTD 229.80 (228.80) 644131
ONMOBILE GLO 61.80 (62.50) 456184
ORIENT PAPER 173.65 (163.45) 2309294
ORIENTALBANK 125.35 (124.30) 1596161
PARSVNATH DE 28.80 (29.00) 379959
PATEL ENGG 82.10 (83.15) 736701
PFIZER 2045.90 (2049.50) 17320
POLARIS SOFT 402.10 (394.85) 239170
POWERTRADING 120.95 (119.75) 1739264
PRAJ IND 124.40 (122.85) 4363328
PRISM CEMENT 135.05 (134.90) 2135097
PUNJ LLOYD 26.65 (26.50) 2722144
PUNJAB & SIN 49.95 (50.05) 89504
PURAVANKARA 168.25 (163.05) 486474
PVP VENTURES 8.00 (8.15) 628688
PVR LIMITED 1460.20 (1419.00) 311868
RADICO KHAIT 316.80 (319.10) 1959929
RAJESH EXPOR 820.35 (820.55) 613479
RALLIS INDIA 272.50 (274.65) 508315
RAMCO IND 305.05 (297.30) 202303
RAMCO SYS 543.60 (541.00) 50625
RAMKY INFRA 237.50 (226.20) 270024
RAYMOND 1088.70 (1109.50) 490039
RELIANCE CAP 614.65 (600.80) 9551655
RELIANCE COM 33.90 (34.00) 145445206
RELIANCE INF 582.50 (578.15) 3847016
RELIANCE POW 61.30 (58.70) 58204783
ROLTA INDIA 80.00 (78.90) 6343607
SAGAR CEMENT 1098.20 (1083.45) 47314
SAREGAMA 816.55 (832.70) 147080
SHANTHI GEAR 169.00 (167.55) 145768
SHIPPNG CORP 95.70 (96.25) 1035000
SHREE RENUKA 16.90 (16.90) 4391356
SINTEX IND 27.55 (27.00) 11332916
SOBHA DEVELO 599.80 (605.55) 6182003
SOUTHINDBANK 33.90 (32.90) 25819494
SRS LIMITED 1.65 (1.70) 4694418
STERLITE TEC 348.25 (341.00) 1632397
SUN PHARMA 513.35 (508.15) 504217
SUND FASTNER 577.75 (566.05) 95188
SUZLON ENERG 15.65 (15.55) 19319440
SYND. BANK 79.40 (79.50) 1843890
TATA CHEM 767.10 (757.60) 1412638
TATA COFFEE 167.55 (167.70) 679041
TATA COMMUN 678.05 (672.20) 390232
TATA GLOBAL 317.60 (312.95) 2171903
TATA METALIK 859.40 (849.35) 324108
TATA MOT DVR 255.20 (253.70) 2819737
THE INDIAN H 140.60 (132.80) 4818014
TORRENT POWE 283.75 (280.45) 1634150
TRIVENI ENGG 79.15 (77.85) 701795
TTK PRESTIGE 7962.10 (8042.40) 3993
TV TODAY NET 442.35 (429.55) 307430
TV18 BROADCA 64.25 (63.60) 9496860
TVS MOTOR 767.05 (766.95) 506381
UCO BANK 32.60 (32.80) 861259
UNION BANK 145.65 (145.30) 2094620
UNITECH 9.95 (9.95) 62953598
UNITED BANK 18.40 (18.45) 1030820
UNITED BREWE 1155.55 (1151.35) 542395
USHA MARTIN 26.00 (25.35) 2659339
VADILAL INDU 977.45 (972.55) 32054
VENKYS 2659.40 (2731.75) 58569
V-GUARD IND 239.25 (237.85) 956659
VIJAYA BANK 67.90 (68.00) 1420915
VIP 356.55 (352.05) 241424
VOLTAS 638.65 (646.35) 899786
ZEE LEARN LI 44.70 (45.15) 517940
ZUARI GLOBAL 248.25 (246.70) 94459
ZYDUS WELLNE 1040.15 (1033.95) 23511

ఘనం (+) నిఫ్టీ	8న	మార్పు %	గ్రహణం (-) నిఫ్టీ	8న	మార్పు %
COAL INDIA	287.45	3.12	BHARTI AIRTEL	516.35	-4.38
LUPIN	923.30	2.57	ONGC	197.40	-0.53
INFOSYS	1036.05	2.38	POWER GRID CORP.	200.55	-0.35
SUN PHARMA	591.60	2.22	ASIAN PAINTS	1182.00	-0.27
INDIABULLS HSG	1225.30	2.20	TATA STEEL	768.75	-0.25
TECH MAHINDRA	536.30	2.06	ADANI PORT	422.90	-0.21
BPCL	497.20	1.95	SBI	305.80	-0.18

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 936.80 (931.90) 4285
AMAR RAJA BA 865.55 (862.30) 36795
ANDHRA BANK 58.55 (58.65) 120109
ANDHRA CEMEN 15.26 (14.54) 349428
ANDHRA PAPER 351.10 (346.55) 19555
ANDHRA PETRO 67.45 (64.25) 534720
ANDHRA SUGAR 582.90 (551.25) 20992
ASTRA MICROW 120.35 (121.30) 68432
AUROBINDO PH 677.95 (671.10) 142658
AVANTEL SOFT 547.80 (530) 14092
AVANTI FEEDS 2678.70 (2694.10) 11811
AVON ORG 17.52 (17.10) 108322
BALAJI AMIN 752.80 (660.45) 170062
BARTRONICS 16.68 (16.71) 130036
BHAGIRA CHEM 362.30 (357.85) 2437
BRILLIANT SE 14.13 (13.46) 72270
CONT COFFEE 303.90 (302.75) 20729
COROMAN FERT 578.35 (568) 16131
CYBERMATE 3.56 (3.62) 141279
CYIENT LIMIT 582.05 (576.40) 5329
DECCAN CEMEN 645.65 (644.45) 5029
DIVI'S LAB 1114.15 (1105.15) 33796
DR REDDY 2465.80 (2467.35) 46145
GATI CORPN 141.45 (138.85) 432034
GAYATRI PROJ 213.55 (214.95) 38262
GMR INFRASTR 22 (21.25) 5308357
GOLDST INFRA 229.95 (209.05) 230603
GOLDSTONE EN 14.80 (14.10) 6808
GRANULES (I) 140.15 (139.35) 191865
GSS AMERICA 36.35 (32.85) 334881
GVK POWER 21.10 (20.10) 1355419
HBL NIFE POW 73.45 (73.50) 158421
HERITAGE FOO 836.60 (830.95) 2697
HYD INDUS 1603.65 (1608.05) 2793
IDL INDUSTRS 600.25 (587.75) 2322
INNAREDY COM 5.22 (4.98) 132929
IVRCL INFRAS 6.45 (6.19) 489142
KAKATIYA CEM 409.05 (413.25) 16382
KAVERI SEED 538.45 (538.85) 104997
KCP LTD 156.65 (157.95) 60563
KNR CONSTRUC 315.15 (313.30) 21405
LANCO INDUS 402.85 (401.30) 40220
LANCO INFRAT 1.78 (1.70) 1901903
LAURUS LABS 560.95 (551.40) 15719
MADHUCON PRO 38.45 (36.85) 267118
MIC ELECTRON 9.41 (9.38) 149640
MOLD-TEK.TEC 75.80 (76.65) 6951
MOLDTK PLA 333.25 (327.50) 4183
NAGARJAGRICH 67.10 (63.90) 205155
NATCO PHARMA 1003.40 (998.90) 25856
NAVA BH VENT 173.15 (172.80) 271905
NCC 134.30 (131.90) 465067
NCL IND 269.80 (278) 23145
NEHA INTER 10.28 (10.56) 89362
NETTLINX 89.20 (88.55) 74018
NEULAND LAB 851.70 (845.40) 5367
NIHAR INFO 14.01 (13.60) 1750
OIL COUNTRY 61.45 (62.25) 25156
PANYAM CEMEN 66.55 (65.60) 68962
PENNER IND 76.30 (76.70) 483366
PITTI LAMIN 103.10 (103.75) 23141
POKARNA 258.20 (247.60) 58943
PREMIER EXPL 511.60 (446.90) 76319
PRISM CEMENT 135.70 (135.40) 156315
PRUDENTL PHA 6.16 (6.10) 462239
RAIN INDUSTR 461.35 (421.20) 1235974
SAGAR CEM 1108.25 (1095.80) 15066
SAMKRG PIST 350.90 (354.10) 5567
SATVAH. ISPA 37.70 (37.25) 41316
SMS PHARMA 107.60 (100.20) 115040
SREE RAYAL A 86.40 (82.45) 1028116
SRINIVASA SH 98.55 (92.50) 173493
STEEL EXCHAN 42.15 (43.95) 205410
SUJANA METAL 1.69 (1.69) 89657
SUJANA TOWER 5.60 (5.37) 36299
SURYALAKSH.C 103.70 (107.50) 21837
SUVEN PHARMA 218.15 (215.10) 77053
TAJ GVK HOTE 186.90 (181.35) 59963
TANLA 40.25 (41.20) 128227
TERA SOFTWAR 70.40 (70.90) 2070
VBC FERRO 47.05 (45.05) 2824
VICEROY HOTE 21.35 (20.40) 322198
VIJAY TEXTIL 43.70 (44.80) 15474
VIMTA LABS 170.95 (173.25) 7273
VIVIMED LABS 108.25 (105.95) 442632
YBRANT DIGIT 6.68 (5.99) 3203425
ZENTECH 151.45 (153.60) 46473



తితిదే భాగస్వామ్యంతో కేన్సర్ ఆసుపత్రి నిర్మాణం తలపెట్టడం అదృష్టంగా భావిస్తున్నామని రతన్ టాటా సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు మందిరంలోని అద్దాల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. చిత్రంలో టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్, ఎంపీ కేశినేని నాని తదితరులు – న్యూస్‌టుడే, తిరుమల

నెక్ అధ్యక్షురాలిగా అనూరాధ

ఈనాడు డిజిటల్, చిత్తూరు: జాతీయ గుడ్ల సమన్వయ సంఘం(నెక్) అధ్యక్షురాలిగా అనూరాధా జే దేశాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పుణెలో జరిగిన జాతీయ స్థాయి ఎన్నికలకు దేశం నలుమూలల నుంచి నెక్ జోనల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు హాజరయ్యారు. జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అనూరాధా జే దేశాయ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, కేవీఎస్ సుబ్బారావు, సందీప్ మెహతాలతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సత్యనారాయణ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోళ్ల సమాఖ్య అధ్యక్షుడు సుందరనాయుడు అభినందించారు. దేశంలో కోళ్ల పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించుకున్నారు. కోడిగుడ్డు ధర గిట్టుబాటు అయ్యేలా ప్రణాళికలను రచించుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జోనల్ ఛైర్మన్లు సమన్వయంతో ముందుకెళుతూ గుడ్డుకు గిట్టుబాటు ధర లభ్యమయ్యేలా చూడాలని నూతన అధ్యక్షురాలు అనురాధ సూచించారు. చిత్తూరు జోనల్ ఛైర్మన్ నెక్ రమేష్ బాబు, ఈశ్వరరావు, శ్రీనివాసులు నాయుడు, లంబోదర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నెక్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనూరాధ, వెంకటేశ్వరరావులను అభినందిస్తున్న సుందర నాయుడు

అందుబాటు ధర గృహ రుణాలతో ముప్పు

- బ్యాంకులకు వాటితోనూ భయం
- మూడీస్-ఇక్రా నివేదిక



ముంబయి: అందుబాటు ధర గృహాలపై ఆసక్తి అధికంగా ఉన్నప్పటికీ, ఈ విభాగానికి అందించే రుణాల నుంచి నిరర్థక ఆస్తులుగా మారే వాటి నుంచి బ్యాంకులకు తదుపరి నష్టభయం ఉంటుందని మూడీస్-ఇక్రా నివేదిక పేర్కొంది. ఈ రంగంలో పోటీవల్ల ఎదురయ్యే ఒత్తిళ్లకు తోడు స్వయం ఉపాధి పొందేవారికి అధికంగా రుణాలివ్వడం వల్ల బ్యాంకులకు ఇబ్బందులు ఏర్పడవచ్చని మూడీస్, ఇక్రా సంస్థలు సంయుక్తంగా రూపొందించిన నివేదికలో అభిప్రాయ పడ్డాయి. 'సంప్రదాయ గృహరుణాల్లో ఆస్తుల నాణ్యత స్థిరంగానే ఉంటుంది. అయితే 2018లో అందుబాటు ధర గృహ రుణ విభాగంలోనే ఒత్తిళ్లు ఎదురయ్యే పరిస్థితి రావచ్చు' అని ఇక్రా నిర్మాణ రుణ విభాగాధిపతి విభోర్ మిత్తల్ తెలిపారు. 2017 సెప్టెంబరు నాటికే అందుబాటు ధర గృహ రుణ విభాగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 1.8 శాతానికి చేరినట్లు వివరించారు. సాధారణ గృహ రుణాలతో పోలిస్తే, అందుబాటు ధర గృహ రుణ విభాగంలో 90 రోజులకు మించి బకాయి పడుతున్న మొత్తాలు 7 రెట్లు ఎక్కువగా ఉంటున్నట్లు తెలిపారు.

ఇవీ కారణాలు

- ✦ పోటీ ఎక్కువగా ఉండటం వల్ల, రుణ వితరణలో ప్రమాణాల సడలింపు
- ✦ స్వయం ఉపాధి పొందేవారికి ఎక్కువగా రుణాలివ్వడం
- ✦ పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రభావాలు

ఇప్పటికీ గృహరుణ విభాగమే భేష్

అయితే రిటైల్ రుణాలకు సంబంధించి స్థిరంగా రాణిస్తున్న వాటిలో గృహ విభాగమే ఉందని పేర్కొంది. ఆస్తులు తనఖా పెట్టుకోవడం, స్థిరాస్తుల విలువలో అనూహ్య మార్పులు రాకపోవడం, విలువకు తగిన విధంగానే రుణం ఇవ్వడం కారణాలని విశ్లేషించింది.

ఈనాడు బిజినెస్

ఎస్సార్ పోర్ట్స్ రూ.3,250 కోట్ల పెట్టుబడులు

ముంబయి: దేశీయంగా సామర్థ్య విస్తరణతో పాటు మొజాంబిక్‌లో కొత్తగా బొగ్గు టెర్మినల్ నిర్మాణానికి రాబోయే రెండున్నరేళ్లలో సుమారు రూ.3,250 కోట్లు (500 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెడతామని ఎస్సార్ గ్రూప్‌నకు చెందిన ఎస్సార్ పోర్ట్స్ తెలిపింది. దేశంలోని హజీరా, సలయా పోర్టుల్లో సామర్థ్యం పెంపుతో పాటు, మొజాంబిక్‌లో కొత్తగా బొగ్గు టెర్మినల్‌ను ఈ నిధులతో నిర్మిస్తామని ఎస్సార్ పోర్ట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ అగర్వాల్ తెలిపారు. ఇవి పూర్తయితే సంస్థ వార్షిక సామర్థ్యం ప్రస్తుత 110 మిలియన్ టన్నుల నుంచి 150 మిలియన్ టన్నులకు పెరుగుతుందని తెలిపారు. మొజాంబిక్‌లో బొగ్గు ఎగుమతి కోసం తాము నిర్మించే టెర్మినల్ వరకు అక్కడి ప్రభుత్వం 550 కిలోమీటర్ల పొడవునా రైలు మార్గం నిర్మించిందన్నారు.

ఫ్లాట్ కొనే ముందు..

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో రాముకు 600 చదరపు గజాల స్థలం ఉంది. ఈ స్థలంలో కృష్ణ అనే నిర్మాణదారు (బిల్డర్) 12 ఫ్లాట్లతో ఓ గృహ సముదాయాన్ని నిర్మించేందుకు రాముతో సంయుక్త అభివృద్ధి ఒప్పందం (జేడీఏ) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం 12 ఫ్లాట్లలో ఏడింటిని స్థల యజమాని రాముకు కృష్ణ అప్పగిస్తారు. మిగిలిన 5 ఫ్లాట్లు కృష్ణ సొంతం అవుతాయి. ఆ తర్వాత వీళ్లు ఈ ఫ్లాట్లను వేరే వాళ్లకు విక్రయించవచ్చు. ఇక్కడి వరకు సరే. మరి ఈ తరహా లావాదేవీలకు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వర్తిస్తుందా? లేదా? ఒకవేళ వర్తిస్తే ఎవరు ఎవరికి చెల్లించాల్సి ఉంటుంది? వీళ్లిద్దరి దగ్గరి నుంచి ఫ్లాట్లు కొనుగోలు చేసే కొనుగోలుదార్లపై పడే పన్ను భారమెంత..? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందుగా జేడీఏ అంటే ఏమిటో తెలిసుండాలి.



సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

స్థిరాస్తి ప్రాజెక్టుల క్రయవిక్రయాల స్వరూపం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటేమో.. నిర్మాణదారే సొంత స్థలంలో నిర్మాణం చేసి విక్రయించడం. రెండోది.. వేరే వ్యక్తికి చెందిన స్థలంలో నిర్మాణం చేసి అమ్మడం. ప్రస్తుతం మనం రెండో సందర్భం పైనే చర్చిద్దాం. ఎందుకంటే జేడీఏను కుదుర్చుకునేది ఈ సందర్భంలోనే. వాస్తవానికి జేడీఏ కింద జరిగే లావాదేవీలకు జీఎస్‌టీ వర్తింపుపై అటు నిర్మాణదార్లు, స్థల యజమానులకే కాదు.. కొనుగోలుదార్లు, సాధారణ ప్రజానికంలోనూ ఇప్పటికీ అనేక సందేహాలు నెలకొన్నాయి. ఈ సందేహాల నివృత్తికి ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

మూడు కోణాల్లో..

జేడీఏ కింద జరిగే లావాదేవీలకు జీఎస్‌టీ వర్తింపును మూడు రకాల లావాదేవీల ద్వారా అర్థం చేసుకోవచ్చు. మొదటిది బిల్డర్ల ఫ్లాట్ల అమ్మకం. రెండోది.. బిల్డర్, స్థల యజమాని మధ్య లావాదేవీ. మూడోది.. స్థల యజమాని ఫ్లాట్ల అమ్మకం. అయితే వీటికి సంబంధించి ఈ కింద వివరించే అంశాలకు జులై 1వ తేదీ తర్వాత జేడీఏను కుదుర్చుకున్నట్లుగా అనుకుందాం. అలాగే పూర్తి ప్రాజెక్టుకు జీఎస్‌టీ వర్తిస్తుందని భావిద్దాం.





1 నిర్మాణదార్ల ఫ్లాట్లు అమ్మకం

నిర్మాణదార్లు ఫ్లాట్లు నిర్మించి విక్రయించడం వ్యాపార లావాదేవీ కిందకు వస్తుంది. 'గృహ సముదాయాల నిర్మాణ' కార్యకలాపాలు సహా ఈ తరహా సేవలకు రెండు రకాల పన్ను రేట్లు వర్తిస్తాయి. అవి.. 18%, 12%. అవిభాజ్య స్థల వాటా (అన్‌డివైడెడ్ షేర్ ఆఫ్ ల్యాండ్) విలువను కలిపితే 12% జీఎస్‌టీ వర్తిస్తుంది. అదే స్థలం విలువను కలపకుంటే పన్ను రేటు 18%.

పన్ను వర్తింపు..

'కంప్లీషన్ సర్టిఫికేట్' లేదా 'బిఫోర్ ఫస్ట్ ఆక్యుపెన్సీ' పొందడానికంటే ముందే ఫ్లాట్ల విక్రయానికి బిల్డర్ అంగీకరించడం, ఫ్లాట్ల విక్రయానికి ముందస్తు డబ్బులు (అడ్వాన్స్) తీసుకున్న సందర్భంలో అమ్మకం విలువలో స్థల విలువను కలపడం లేదా కలపకపోవడం ఆధారంగా 18% లేదా 12% పన్ను రేటు చెల్లించాల్సి ఉంటుంది.

పన్ను మినహాయింపు

'కంప్లీషన్ సర్టిఫికేట్' లేదా 'బిఫోర్ ఫస్ట్ ఆక్యుపెన్సీ' పొందిన తర్వాతే ఫ్లాట్ల విక్రయానికి నిర్మాణదారు అంగీకరించడం, ఫ్లాట్ల విక్రయానికి కొనుగోలుదార్ల నుంచి ముందస్తు డబ్బులు (అడ్వాన్స్) తీసుకోని సందర్భంలో ఎలాంటి జీఎస్‌టీ వర్తించదు. నిర్మాణదారు స్థిరాస్తిని విక్రయిస్తున్న కారణంతో ఇక్కడ పన్ను మినహాయింపు లభిస్తుంది.

2 బిల్డర్, స్థల యజమాని మధ్య లావాదేవీ

ఫ్లాటుతో కలిసి స్థల బదలాయింపు అనేది సరఫరా నిర్వచనం కిందకు వస్తుంది. స్థల యజమానికి బిల్డర్లు నిర్మాణ సేవలు అందించడం జీఎస్‌టీ నిబంధనల ప్రకారం పన్ను పరిధిలోకి వస్తుంది. ఇలాంటప్పుడు నిర్మాణం పూర్తి లేదా కంప్లిషన్ సర్టిఫికేట్‌ను పొందిన తర్వాత స్థల యజమానికి బిల్డర్ ఫ్లాట్లను అప్పగించినా కూడా ప్రాజెక్టు స్థితితో సంబంధం లేకుండా జీఎస్‌టీ వర్తిస్తుంది.

ఎంతెంత ఉండాలి?

బిల్డర్లు, స్థల యజమానుల మధ్య జరిగే లావాదేవీలకు జీఎస్‌టీ వర్తింపుపై వివిధ వర్గాల్లో భిన్న అభిప్రాయాలు నెలకొన్నాయి. స్థల యజమాని దగ్గర నుంచి ఫ్లాట్లను కొనుగోలు చేసే కొనుగోలుదార్లపై విధించే పన్నును పరిగణనలోకి తీసుకుంటే జీఎస్‌టీ 12% ఉండాలన్నది నా అభిప్రాయం. అదే స్థల యజమానికి కేటాయించిన ఫ్లాట్లకు అయిన నిర్మాణ వ్యయంపై వసూలు చేయదలిస్తే 18% జీఎస్‌టీ విధించాలి.

ఎప్పుడు వసూలు చేయాలి..

జేడీఏలో విధించుకున్న షరతులకు అనుగుణంగా స్థల యజమాని, నిర్మాణదారు మధ్య జరిగే లావాదేవీలకు పన్నులు వర్తిస్తాయి. ఒకవేళ జీఎస్‌టీ అంశం జేడీఏలో లేకుంటే, స్థల యజమానికి నిర్మాణదారు ఫ్లాట్లను స్వాధీనం చేసిన సమయంలో ఆ స్థల యజమాని నుంచి నిర్మాణదారు పన్నులు వసూలు చేయాలి.

3 స్థల యజమాని ఫ్లాట్ల విక్రయం

ఫ్లాట్ల విక్రయం విషయంలో బిల్డర్లతో పోలిస్తే స్థల యజమానిది భిన్న పరిస్థితి. స్థిరాస్తిని అమ్మాలన్నదే స్థల యజమాని ముఖ్య ఉద్దేశం. స్థల యజమాని ఫ్లాట్లను విక్రయించడం వ్యాపార లావాదేవీ కిందకు రాదు. 'సరఫరా' నిర్వచనమూ వర్తించదు. అంతేకాకుండా స్థల యజమాని ఎలాంటి నిర్మాణ సేవలను అందించడు. పై కారణాల రీత్యా స్థల యజమానులు ఫ్లాట్లు విక్రయిస్తే దానికి జీఎస్‌టీ ఉండదు. నిర్మాణ దశలో ఉన్నప్పుడు అమ్మినా కూడా జీఎస్‌టీ వర్తించదు. స్థల యజమానులు విక్రయించే ఫ్లాట్లకు అంతకంటే ముందే బిల్డర్లు, ఆ స్థల యజమాని మధ్య పన్ను లావాదేవీ జరుగుతుంది. అందువల్ల స్థల యజమానులు విక్రయించినప్పుడు మళ్లీ పన్ను విధిస్తే పన్ను మీద పన్నుకు దారి తీస్తుంది.

పైవన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే సర్టిఫికెట్ ఆఫ్ కంప్లిషన్ లేదా బిఫోర్ ద ఫస్ట్ ఆక్యుపెన్సీని పొందడానికి కంటే ముందు బిల్డర్లు అమ్మిన మొత్తం ఫ్లాట్ల ద్వారా ప్రభుత్వానికి పన్ను ఆదాయం వస్తుంది. అలాగే బిల్డర్లు స్థల యజమానికి స్వాధీనం చేసే ఫ్లాట్ల ద్వారా కూడా పన్ను ఆదాయం లభిస్తుంది.

స్పష్టత ఇవ్వాలి..

వివిధ రకాల పనులు, పాత (సెకండ్ హ్యాండ్) వస్తువుల విక్రయం లాంటి కొన్ని వ్యాపార కార్యకలాపాలకు జీఎస్‌టీ వర్తింపుపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అయితే జేడీఏలకు జీఎస్‌టీ వర్తింపుపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదు. అందుకే జేడీఏ కింద జరిగే వివిధ లావాదేవీలకు జీఎస్‌టీ ఏవిధంగా వర్తిస్తుందనే విషయంపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయాలని ఈ వ్యాసం ద్వారా కోరుతున్నాను.

గమనిక: జేడీఏలకు జీఎస్‌టీ వర్తింపుపై పైన తెలిపిన అభిప్రాయాలు పూర్తిగా వ్యాసకర్త కోణంలోనివి. వీటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. ఈ వ్యాసంలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా ఎవరైనా నిర్ణయం తీసుకోదలిస్తే చట్టంలో సంబంధిత నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోవడం మంచిది.

ఎగుమతి రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు

మంత్రి సురేశ్ ప్రభు

దిల్లీ: ఎగుమతుల వృద్ధికి తోడ్పడుతున్న రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇస్తామని కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. ఎగుమతుల వల్ల రాష్ట్రాలకు తద్వారా, దేశ ఆర్థిక ప్రగతికి ఊతం లభిస్తుంది కనుక ఈ నిర్ణయం తీసుకున్నామని, దీనిపై రాష్ట్రాల అభిప్రాయాలను స్వీకరిస్తామని వెల్లడించారు. దేశ పారిశ్రామిక వృద్ధికి ఉపకరించేలా, అన్ని రంగాల్లో ఎగుమతులను ప్రోత్సహించేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వాణిజ్య అభివృద్ధి, ప్రోత్సాహక మండలి మూడో సమావేశంలో ఇవి చర్చకు వచ్చాయని మంత్రి తెలిపారు. గుజరాత్ ఉపముఖ్యమంత్రి, 11 రాష్ట్రాల మంత్రులు, సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జీఎస్‌టీ రిఫండ్ ఆలస్యంపై ఎగుమతిదార్ల ఆందోళనను పరిష్కరించేందుకు, ఇ వాలెట్ పద్ధతిని అమల్లోకి తేబోతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇ వాలెట్‌లోని నగదు నిల్వను ఎగుమతిదార్లు రన్నింగ్ ఖాతాగా వినియోగించుకోవచ్చు. ఎగుమతుల వృద్ధిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పాత్రపైనా చర్చిస్తామని మంత్రి తెలిపారు. అన్ని రాష్ట్రాలు ఎగుమతుల ప్రోత్సాహక విధానాలు రూపొందించాలని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ సూచించారని, ఇప్పటివరకు తమిళనాడు, గుజరాత్, త్రిపుర, జమ్ముకశ్మీర్ సహా 14 రాష్ట్రాలు రూపొందించాయని సురేశ్ ప్రభు వివరించారు. ఎగుమతుల ప్రోత్సాహక పథకం కింద వాణిజ్య మౌలిక సదుపాయాలు (టైస్) కల్పించడంలో పాల్గొనాలని రాష్ట్రాలను వాణిజ్య శాఖ కోరిందని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, త్రిపుర మాత్రమే సవివర ప్రాజెక్ట్ నివేదికలు అందించాయని మంత్రి వెల్లడించారు.

జీవీకే చేతికి నవీ ముంబయి విమానాశ్రయం

కన్సెషన్ ఒప్పందంపై సంతకాలు

ఈనాడు, హైదరాబాద్: నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి 30 ఏళ్ల పాటు జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (జీవీకేపీఐఎల్) నిర్వహించనుంది. ఈ మేరకు కన్సెషన్ ఒప్పందం కుదిరిందని తెలిపింది. అనుబంధ కంపెనీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఎంఐఏఎల్) ద్వారా నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఎన్‌ఎంఐఏఎల్)కంపెనీలో జీవీకే పవర్‌కు 74 శాతం వాటా ఉంటుంది. మిగిలిన 26 శాతం వాటా మహారాష్ట్ర నగర, పారిశ్రామికాభివృద్ధి సంస్థ (సిడ్కో)కు దక్కుతుంది. నవీ ముంబయి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి నిర్వహించడానికి ఎంఐఏఎల్, సిడ్కోలు కలిసి ఎన్‌ఎంఐఏఎల్‌ను ఏర్పాటు చేశాయి. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందంపై ఎంఐఏఎల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జి.వి.కె.రెడ్డి, సిడ్కో వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) భూషణ్ గాగ్రానీ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హాజరయ్యారు. నవీ ముంబయి విమానాశ్రయం ప్రాజెక్టులో మహారాష్ట్ర ప్రభుత్వం తరపున సిడ్కో నోడల్ ఏజెన్సీగా ఉంది. కన్సెషన్ ఒప్పందంతోపాటు, వాటాదారుల ఒప్పందం, రాష్ట్ర మద్దతు ఒప్పందం కూడా కుదిరాయని జీవీకే పవర్ తెలిపింది. 30 ఏళ్ల తర్వాత నిర్వహణ బాధ్యతలను మరో 10 ఏళ్లు పొడిగించడానికి వెసులుబాటు ఉంది. విమానాశ్రయాల అభివృద్ధిలో సాంకేతిక, నిర్వహణ పరంగా జీవీకే పవర్‌కు ఉన్న సామర్థ్యాలు మరో సారి నిరూపితం అయ్యాయని, ఇది సంతోషకర అంశమని జి.వి.కె.రెడ్డి అన్నారు.

మౌలికం.. మరింత బలోపేతం

- విమానాశ్రయాలపై జీఎంఆర్, జీవీకే దృష్టి!
- కొత్త ఏడాదిలో సరికొత్త ఆశలు

ఈనాడు – హైదరాబాద్



ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన మార్పులు, కీలక పరిణామాలు వల్ల కొత్త సంవత్సరంలో మౌలిక సదుపాయాల రంగం ఊపందుకోనుంది. మౌలిక రంగంలోని సానుకూల పరిణామాలు, కంపెనీలు చేపట్టిన వ్యాపార పునర్‌వ్యవస్థీకరణ చర్యలు 2018లో హైదరాబాద్‌లోని మౌలిక సదుపాయాల కంపెనీలు మరింతగా బలపడేందుకు దోహదం చేయనున్నాయి. ఔషధ రంగంలో అరబిందో ఫార్మా, లారస్ ల్యాబ్స్, నాట్కో ఫార్మా తదితర కంపెనీలు అమెరికా మార్కెట్‌లో మరిన్ని జనరిక్ ఔషధాలను విడుదల చేయడానికి అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్ల (ఏఎన్‌డీఏ) దాఖలను కొనసాగించే అవకాశం ఉంది. ఇంజెక్టబుల్స్ విభాగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించే వీలుంది. మొత్తం మీద కొత్త సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు కొత్త మైలురాళ్లను చేరేందుకు సన్నద్ధమవుతున్నాయి.

- ✦ 2017లో ఫిలిప్పీన్స్‌లోలోని క్లార్క్ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణ పనులను మనీలాకు చెందిన మెగవిడే కన్‌స్ట్రక్షన్ కంపెనీతో కలిసి చేజిక్కించుకున్న జీఎంఆర్ గ్రూప్ కొత్త సంవత్సరంలో దేశీయంగా, అంతర్జాతీయంగా మరి కొన్ని విమానాశ్రయాల అభివృద్ధి పనులను చేజిక్కించుకోవడంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. గోవాలోని మోపా అంతర్జాతీయ విమానాశ్రయం పనులను జీఎంఆర్ వేగిరం చేయొచ్చు. అంతర్జాతీయ విమానాశ్రయాల అభివృద్ధికి విదేశీ భాగస్వాములతో జీఎంఆర్ జట్టు కట్టొచ్చు. విద్యుత్ తదితర వ్యాపారాల పునర్‌వ్యవస్థీకరణ ద్వారా గత ఏడాదిలో రుణ భారాన్ని తగ్గించుకున్న జీఎంఆర్. . కొత్త సంవత్సరంలో కూడా రుణ భారాన్ని మరింతగా తగ్గించుకునే ప్రయత్నాలు చేయొచ్చు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పూర్తిగా బయటకు వచ్చిన జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మహారాష్ట్రలోని నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులను చేజిక్కించుకుంది. వచ్చే ఏడాది జీవీకే పవర్ కూడా మరిన్ని విమానాశ్రయాల అభివృద్ధి పనులపై దృష్టి పెట్టొచ్చు. ఇప్పటికే ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి ఆసక్తి వ్యక్తం చేసింది. జీఎంఆర్, జీవీకే కంపెనీలు భవిష్యత్తులో ప్రధానంగా విమానాశ్రయాల అభివృద్ధి వ్యాపారానికి పెద్ద పీట వేయొచ్చు.
- ✦ ఎన్‌సీసీ, గాయత్రీ ప్రాజెక్ట్స్, రామ్‌కీ ఇన్‌ఫ్రా తదితర కంపెనీలు ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాజెక్టులు, రహదారులపై 2018లో మరింతగా దృష్టి పెట్టే వీలుంది. గాయత్రి ప్రాజెక్ట్స్‌కు ఇటీవల జమ్ము అండ్ కశ్మీర్‌లో జమ్ము చుట్టు బాహ్యావలయ రహదారి నిర్మాణ పనులు దగ్గాయి. రూ. 1,339 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును పబ్లిక్ జాయింట్ స్టాక్ కంపెనీ కివ్‌మెట్రోబడ్‌తో కలిసి పొందింది. తాజాగా ఒడిస్సాలో రహదారి అభివృద్ధికి రూ. 583 కోట్ల పనులు తగ్గాయి.

బీఎస్‌ఈలో హైదరాబాద్‌కు చెందిన మౌలిక, ఔషధ కంపెఈనీల షేర్ల ధరలు (రూ.)

కంపెనీ	2017, జనవరి 2	2018, జనవరి 8
ఎన్‌సీసీ	83.70	134.30
గాయత్రీ ప్రాజెక్ట్స్	131.73	213.55
జీఎంఆర్ ఇన్‌ఫ్రా	12.08	22
జీవీకే పవర్	5.56	21.10
రామ్‌కీ ఇన్‌ఫ్రా	63.90	237.45
ఐవీఆర్‌సీఎల్	4.61	6.45
ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్	3.66	1.78
దివీస్ ల్యాబ్స్	796.85	1114.15
నాట్కో ఫార్మా	586.45	1003.40
అరబిందో ఫార్మా	674.80	677.95
డాక్టర్ రెడ్డీస్	3,087.45	2,465.80

- ✦ అప్పుల భారంతో కుంగిపోతున్న ఐవీఆర్‌సీఎల్, ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్‌లు గత ఏడాది జాతీయ కంపెనీ చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గడప తొక్కాయి. భారీగా బకాయిలు పడిన కంపెనీల నుంచి రుణాలను వసూలు చేసుకోవడానికి, మొండి బకాయిల సమస్యలను పరిష్కరించుకోవడానికి బ్యాంకులు ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ న్యాయ స్థానాలను ఆశ్రయించాలని రిజర్వు బ్యాంకు సూచించడంతో భారీగా బకాయిలు పడిన 12 కంపెనీలపై బ్యాంకులు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాయి. వాటిలో ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ ఒకటి. 2018లో ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్, ఐవీఆర్‌సీఎల్ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. రుణదాతలకు, కంపెనీకి మధ్యే మార్గంలో పరిష్కారాన్ని చూపేందుకు ఆయా కంపెనీల కోసం నియమించిన ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ నిపుణులు (ఐఆర్‌పీ) కసరత్తు చేస్తున్నారు. ఎన్‌సీఎల్‌టీకి చేరిన దక్కన్ క్రానికల్ వ్యవహారం కూడా ఒక కొలిక్కి వచ్చే వీలుంది.
- ✦ 2017 ఔషధ రంగం కంపెనీలకు పెద్ద ఆశాజనకంగా లేనప్పటికీ.. ఏఎన్‌డీఏల దాఖలులో హైదరాబాద్ కంపెనీలు తమ హవా కొనసాగించాయి. 2018లో కూడా అమెరికా మార్కెట్‌లో ఔషధాల విడుదలకు మరిన్ని ఏఎన్‌డీఏలను దాఖలు చేసే వీలుంది. గత ఏడాది పబ్లిక్ ఇష్యూకు వచ్చిన లారస్ ల్యాబ్స్ 2018లో అమెరికా జనరిక్ మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది. గత ఏడాది మొత్తం యూఎస్ఎఫ్‌డీఏలతో సతమతమయిన దివీస్ ల్యాబొరేటరీస్, డాక్టర్ రెడ్డీస్ తదితర కంపెనీలు 2018లో ఊపిరి పీల్చుకునే వీలుంది.
- ✦ రష్యా వంటి కంపెనీలు దేశీయంగా ఔషధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నందున హైదరాబాద్ ఔషధ కంపెనీలు ఔషధాల ఎగుమతులకు బదులు విదేశాల్లో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడానికి కొత్త సంవత్సరంలో సన్నాహాలు చేసే అవకాశం ఉంది. అమెరికా వంటి కీలక మార్కెట్లలో తమకు అనుకూలంగా ఉన్న కంపెనీలను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపొచ్చు.
- ✦ ముడి ఔషధాల దిగుమతులను తగ్గించడానికి అరబిందో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వంటి కంపెనీలు ప్రత్యేక చర్యలు తీసుకోవచ్చు.



ఐసీయూని పరిశీలిస్తున్న గవర్నర్

గవర్నర్‌కు 'గాంధీ'లో వైద్య పరీక్షలు

ఈ ఆసుపత్రి అంటే ప్రత్యేక అభిమానమన్న నరసింహన్

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సోమవారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సామాన్యుడిలా ఓపీ విభాగానికి వచ్చిన ఆయన ర్యాంప్‌పై నడుచుకుంటూ రెండో అంతస్తులోని ఈఎన్‌టీ విభాగానికి వెళ్లారు. రెండు చెవుల్లో ఉన్న జిబిలి(డస్ట్)ని ప్రొఫెసర్ ఏవీఎస్ హనుమంతరావుతో శుభ్రం చేయించుకున్నారు. అనంతరం మూడో అంతస్తులో ఉన్న కొత్త ఐసీయూ కేంద్రానికి వెళ్లి పరిశీలించారు. రోగులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది రబ్బరు చెప్పులు కాకుండా వాడి పడేసే స్లిప్పర్లు వాడాలని సూచించారు. గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ మంజుల, డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహారావుతో మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయికి దీటుగా వైద్యసేవలు అందిస్తున్నారని గవర్నర్ కితాబిచ్చారు. పడకల పెంపు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో కంటే పారిశుద్ధ్యం మెరుగుపడిందన్నారు. ఈ ఆసుపత్రి అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని, నిష్ణాతులైన వైద్యనిపుణులతో మంచి వైద్యం అందుతుందన్న నమ్మకంతోనే తాను తరుచూ ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో అరగంట గడిపిన గవర్నర్ మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించి నేరుగా నివాసానికి వెళ్లిపోయారు.

ఆచితూచి.. అవకాశం

- కొత్త చేరికలపై తెరాస అధిష్ఠానం నిర్ణయం
- పార్టీ శ్రేణులకు సంకేతాలు

ఈనాడు, హైదరాబాద్: స్వప్రయోజనాలు, రాజకీయ లబ్ధి లక్ష్యంగా తెరాసలో చేరేందుకు వచ్చే వారికి అడ్డుకట్ట వేయాలని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. వివాదాస్పదులు, పాత లొల్లాలు, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతో వచ్చే వారిని పార్టీలోకి తీసుకోకూడదనే సంకేతాలను ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ నేతలకు ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంచి పేరు, సామాజికంగా ప్రజా పలుకుబడి, భవిష్యత్తులో పార్టీకి, రాష్ట్రానికి ఉపయోగపడుతారనే నమ్మకం గల వారిని మాత్రమే ఆహ్వానించాలని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో కొందరు ఇతర పార్టీల నేతలు తెరాసను బూచిగా చూపి సొంత పార్టీలో ప్రయోజనాలు పొందాలనే పథకాలు వేస్తున్నారు. హైదరాబాద్‌లో మరో పార్టీకి చెందిన ఓ నియోజకవర్గ నేత సొంత పార్టీలో ప్రాధాన్యం లభించడం లేదు. ఆ పార్టీ మీద ఒత్తిడి తెచ్చి, అందరిని తనవైపు తిప్పుకోవాలనే భావనతో ఆయన తాను తెరాసలో చేరుతున్నానని, తన అనుకూల వర్గాల ద్వారా ప్రచారం చేశారు. దీంతో ఆ పార్టీ నేతలు ఆయనను బుజ్జగించి పార్టీలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ ప్రచారం తెరాసలో కలకలం రేపింది. సదరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే తమకే టికెట్టు ఆశిస్తున్న నేతలు బహిరంగా దీటా పద్మా. పార్టీ అధిష్ఠానానికి ఈ సమాచారం చేరడంతో వెంటనే వారికి పార్టీ సమస్యలకర్తల ద్వారా సమాచారం అందించింది. పార్టీ మార్పిడి పేరిట జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దని, అలాంటి వారిని తీసుకునే ప్రసక్తే లేదని తెలిపింది. తాజాగా పార్టీ ఎమ్మెల్యే ఉన్న ఒక నియోజకవర్గం నుంచి మరో పార్టీ నేత తెరాసలో చేరుతున్నట్లు ప్రచారం జరిగింది. దీనిని కొంతమంది అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లగా ఆ నేతకు పార్టీలో చేరికకు అనుమతి ఇవ్వలేదని పార్టీ నేతలు స్పష్టం చేసినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని నియోజకవర్గాల్లో ఇలాంటి పరిణామాలు వస్తున్నాయి. పదవీ విరమణ వయస్సులో ఉండి, పెద్దగా ప్రభావం చూపని వారికి ప్రాధాన్యం ఇవ్వరాదని అధిష్ఠానం సంకేతాలు ఇచ్చింది.



అఖిలభారత విప్‌ల సదస్సులో కేంద్రమంత్రులు అనంత్‌కుమార్, విజయ్‌గోయల్‌తో రాష్ట్రప్రతినిధి బృందం సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, నగేశ్, పాతూరి సుధాకర్‌రెడ్డి, గంపా గోవర్ధన్, నర్సింహాచార్యులు

సభ్యులను చైతన్యపరిచే బాధ్యత విప్‌లదే

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్

ఉదయ్‌పూర్: పార్టీ సభ్యులను పర్యవేక్షించడానికే పరిమితం కాకుండా వారిని చైతన్యపరచాల్సిన బాధ్యతను కూడా విప్‌లు తీసుకోవాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ సూచించారు. సోమవారం ఇక్కడ 18వ అఖిల భారత విప్‌ల రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సదస్సులో అన్ని రాష్ట్రాలు, కేంద్రానికి చెందిన 90 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన, క్రమశిక్షణను పరిశీలించాల్సింది విప్‌లేనని మంత్రి చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికే ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే మాట్లాడుతూ చట్టసభల్లో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరగాలని కోరారు. వివిధ పార్టీలకు చెందిన విప్‌లు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. మంగళవారం ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు నిర్వహించే ఈ-విధాన్‌సభ విధానంపై చర్చలు జరుగుతాయి.

దేశానికి ఆదర్శంగా తెలంగాణ శాసనసభ, మండలిల నిర్వహణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం శాసనసభ, మండలిలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అర్థవంతమైన చర్చల ద్వారా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయని మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసనసభ విప్ సునీతా మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ప్రారంభమైన అఖిలభారత విప్‌ల సదస్సులో పల్లా, సునీత, మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీ నగేశ్, ఉభయ సభల విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, గంపా గోవర్ధన్, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. ప్రారంభ సదస్సులో పల్లా మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు దేశంలోనే ఎక్కువ రోజులు, ఎక్కువ పనిగంటలు నడుస్తూ చరిత్ర సృష్టించాయన్నారు. గిలెటిన్ లేకుండా అన్ని పద్దులపై చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. గోవా, విశాఖపట్నంలలో జరిగిన విప్‌ల సదస్సు తీర్మానాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సభల నిర్వహణలో విప్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని సునీత తెలిపారు. సదస్సులో పాల్గొన్న తెలంగాణ ప్రతినిధి బృందం కేంద్ర మంత్రులు అనంతకుమార్, విజయ్ గోయల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరరాజెను కలిసి, రాష్ట్రప్రగతి ఇతర అంశాలను వివరించింది.

సమష్టి కృషితోనే సహకార సంఘాలకు ఖ్యాతి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం, అధికారుల కృషి వల్లనే తెలంగాణలోని సహకార సంఘాలు దేశంలోనే విశేష ఖ్యాతి పొందుతున్నాయని సహకార శాఖ కమిషనర్ ఎం.వీరబ్రహ్మయ్య ప్రశంసించారు. సహకార సంఘాలను అధికారులు బలోపేతం చేయడంతో రైతులకు మేలు జరుగుతోందన్నారు. సోమవారం తన కార్యాలయంలో సహకార శాఖ టీజీవోల దైనందినిని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో నేతలు, అధికారులు సురేందర్, సుమిత్ర, భాస్కరాచారి, శ్రీనివాస్‌రావు, అశోక్‌రెడ్డి, రాజేశ్, ఓం ప్రకాశ్, విఠల్, నాగేశ్వర్‌రావు, వెంకటరెడ్డి, ఆనంద్‌రావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

టమాటా రైతు దివాలా

- కిలోకు రూ. 7 పెట్టుబడి
- మార్కెట్లో రూ. 2 కూడా ఇవ్వని వ్యాపారులు
- లబోదిబోమంటున్న టమాటా రైతులు
- దేశవ్యాప్తంగా 18.25 లక్షల టన్నుల అధిక దిగుబడి
- అత్యధికంగా దిగుబడి వచ్చిన పంటల్లో రెండో స్థానం
- ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వరదలా రాక

ఈనాడు - హైదరాబాద్

టమాటా రైతులకు తీవ్ర నష్టం! పంట ధర పాతాళానికి పడిపోవడంతో... కనీసం సాగు వ్యయమైనా దక్కక అల్లాడుతున్నారు. తెలంగాణ మార్కెట్లలో కనిష్ఠ టోకు ధర రూపాయి నుంచి రెండు రూపాయల్లోపే ఉంది! చిల్లర మార్కెట్లలో మాత్రం రూ.10కి అమ్ముతున్నారు. కిలో టమాటాలను పండించడానికి రూ. 7 వరకూ ఖర్చవుతుందని స్వయానా ఉద్యానశాఖ నిరుడు ప్రభుత్వానికి నివేదించింది. పంటల సాగు విస్తీర్ణం ఎంత పెరుగుతోంది, దిగుబడి పరిస్థితేంటి అన్న విషయాలను పట్టించుకోకపోవడం... మార్కెటింగ్ అవకాశాలను పెంచడానికి, కనీస మద్దతు ధర ఇప్పించడానికి చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు నష్టాలు తప్పట్లేదు. గత సెప్టెంబరు, అక్టోబరు నెల్లో కిలో టమాటా రూ.50 కి చేరింది. అప్పుడు పంట పెద్దగా లేకపోవడంవల్ల ధర ఆకాశానికెగిసింది. తెలంగాణలో ప్రస్తుతం 50 వేల ఎకరాల్లో పంట సాగులో ఉందని ఉద్యానశాఖ తెలిపింది. సాధారణ సాగు విస్తీర్ణం కన్నా ఇది 5 వేల ఎకరాలు ఎక్కువ. దేశవ్యాప్తంగా సాగువిస్తీర్ణం 10వేల ఎకరాలు పెరిగినట్లు కేంద్ర ఉద్యానశాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో టమాటాలను అధికంగా పండిస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు టమాటాలు వరదలా వస్తున్నాయి. దేశంలో అత్యధికంగా టమాటాలు పండేది తెలుగు రాష్ట్రాల్లోనే. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి టోకు మార్కెట్‌కు సోమవారం 6,665 క్వింటాళ్ల టమాటాలొస్తే... అందులో 1,270 క్వింటాళ్లు ఏపీలోని అనంతపురం నుంచి తెచ్చారు. కర్ణాటక నుంచి రెండు లారీలొచ్చాయి. ఇక్కడ టోకు ధర కిలో రూ.2-6 మధ్య ఇస్తున్నారు. చుట్టుపక్కల జిల్లాల రైతులు తెచ్చిన టమాటాలకు మాత్రం రూ.2 కూడా దక్కట్లేదు!

సంవత్సరం	దిగుబడి
2015-16	1,87,00,000
2016-17	2,07,08,000
2017-18	2,23,37,000

దేశంలో టమాటాల దిగుబడి ఇలా (టన్నుల్లో)..

సామాన్యులకు ఉల్లి మంట.. రైతులకు టమాటా తంటా!

ఉల్లిగడ్డల ధర మండుతుంటే కొనలేక సామాన్యులు, టమాటాల ధర పడిపోవడంతో వాటిని విక్రయించలేక రైతులు అల్లాడుతున్నారు. ఈ రెండింటి మధ్య విచిత్రమైన వ్యతిరేక బంధం ఏర్పడటంతో ధరల్లో బాగా తేడా వచ్చిందని జాతీయ ఉద్యాన మండలి తాజా నివేదికలో విశ్లేషించింది. దేశవ్యాప్తంగా అన్నిరకాల కూరగాయలు కలిపి ఈ ఏడాది 18.06 కోట్ల టన్నుల దిగుబడి రావచ్చని అంచనా. దిగుబడిలో ఎప్పుడూ ఆలుగడ్డ అగ్రస్థానం, ఉల్లిగడ్డ రెండో స్థానంలో ఉండేవి. తొలిసారి ఈ ఏడాది ఉల్లిగడ్డను మూడోస్థానానికి నెట్టి టమాటా రెండో స్థానానికి ఎగబాకింది! గతేడాది రెండోస్థానంలో ఉన్న ఉల్లి (2.24 కోట్ల టన్నుల దిగుబడి)... ఈ ఏడాది మూడో స్థానానికి (2.14 కోట్ల టన్నులు) చేరింది. దీంతో వాటి ధరలు మండుతున్నాయి. నిరుడు మూడో స్థానంలో ఉన్న టమాటా (2.07 కోట్ల టన్నుల దిగుబడి)... ఇప్పుడు రెండోస్థానం (2.23 కోట్ల టన్నులు) చేరింది. దీంతో వీటి ధరలు అమాంతం పడిపోయాయి.



టమాటాలకు కనీస ధర ఇవ్వాలని జడ్చర్లలో అన్నదాతల ఆందోళన

కూలీ ఖర్చులైనా రాకపోతే.. మేమెలా బతకాలి?



రెండెకరాల్లో టమాటా వేశా. పెట్టుబడి రూ.60 వేలు దాటింది. ఐదు రోజులుగా 20 క్వింటాళ్లను మార్కెట్‌కు తెచ్చా. కిలోకు రూపాయైనా రాలేదు. కూలీ ఖర్చులైనా రాకపోతే, ఇక పెట్టుబడి ఎలా తిరిగొస్తుంది! కిలోకు రూ.10 ఇచ్చినా మాకేమైనా మిగులుతుంది. అందులో నాలుగో వంతు కూడా ఇవ్వకపోతే మేమెలా బతకాలి?

- డోలు శ్రీనివాస్, టమాటా రైతు, కొత్తపల్లి గ్రామం, మిడ్జిల్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

ఇతర రాష్ట్రాల నుంచి రానివ్వకూడదు

తెలంగాణ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలంటే, ఇతర రాష్ట్రాల నుంచి టమాటాలు రాకుండా అడ్డుకోవాలి. కూరగాయల సాగు పెంపునకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. గిట్టుబాటు ధర రాకపోతే రైతులు సాగును తగ్గించే ప్రమాదముంది.

- వెంకట్రామిరెడ్డి, సంచాలకులు, తెలంగాణ మార్కెటింగ్‌శాఖ

ట్రాఫిక్ జరిమానాల్లో మార్పులు

- వాహనాల ఆధారంగా హెచ్చుతగ్గులు
- కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్న పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ప్రమాదాల నియంత్రణ పేరిట ట్రాఫిక్ పోలీసులు ఇష్టారాజ్యంగా జరిమానాలు విధిస్తున్నారంటూ వాహనచోదకుల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఒకరకంగా, సైబరాబాద్, రాచకొండ పరిధిలోని ఠాణాల్లో మరోరకంగా చలానాల మొత్తం ఉంటోందనీ, గ్రేటర్‌లో ఉంటున్నా వేర్వేరు జరిమానాలు ఎందుకు కట్టాలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు నెటిజన్లు దృశ్యాలతో వ్యాఖ్యల్ని పోస్ట్ చేస్తుండడంతో జరిమానాల వ్యవహారంపై దృష్టి కేంద్రీకరించారు. జరిమానాలు హేతుబద్ధంగా ఉండాలంటే నిబంధనలల్లో మార్పులు చేయాలని యోచించారు. ఈ మేరకు వాహనం ఆధారంగా జరిమానాలు విధించాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

వాహనాల తీరు ఆధారంగా..

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, నగరాల్లో ఎం.వి.చట్టం ప్రకారం కారు, లారీ, బస్సు, ద్విచక్ర వాహనం, ఆటో.. వాహనమేదైనా ఒకే తరహా జరిమానా విధిస్తున్నారు. కూడలిలో సంకేతాల్ని అధిగమించినా, తప్పుగా వాహనం నిలిపినా, అపసవ్య దిశలో వెళ్లినా.. వాహనమేదైనా చట్టప్రకారం ఒకే జరిమానా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం సెల్‌ఫోన్ వాడుతూ వాహనం నడపడం, తప్పుగా వాహనం నిలపడం, లైసెన్సు లేకుండా నడపడం, వేగంగా నడపడం వంటి ఉల్లంఘనలకు రూ.500 నుంచి రూ.1000 వరకూ పెంచింది. దీంతోపాటు రిజిస్ట్రేషన్ లేకుండా వాహనం నడిపినా, లైసెన్స్‌ను పునరుద్ధరించుకోకున్నా రూ.2 వేల నుంచి రూ.5 వేల జరిమానా విధిస్తున్నారు. వాహన బీమా చెల్లించకపోతే రూ.1000 చలానా రాస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకుడు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అనివార్య పరిస్థితుల్లో ఆలస్యం చేసి నెలలో ఐదుసార్లు పట్టుబడితే... రూ.10 వేలు జరిమానా చెల్లించక తప్పదు. కూడళ్ల వద్ద తెల్లగీతలు కనిపించకపోయినా అస్పష్టంగా ఉన్న గీతలపై నిలిపినా, పచ్చరంగు దీపం ఉండగానే కూడలి దాటినా.. చివరి క్షణంలో ఎర్రదీపం ఉందంటూ నెలలో పదిసార్లు ఈ-చలానాలు వస్తే రూ.10 వేలు చెల్లించాలి. గ్రేటర్ పరిధిలో ద్విచక్ర వాహన చోదకుల్లో 30 శాతం నుంచి 45 శాతం వరకూ రుణ వాయిదాలు చెల్లించే వారే.. దీనికితోడు జరిమానాలు చెల్లించాలంటే కొత్త కష్టాలు వచ్చినట్లే. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ఈ స్థాయిలో జరిమానాలు కాకుండా కొంత తగ్గించడం, తరచూ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాన్ని స్వాధీనం చేసుకోకవడంతో పాటు చోదకుడి లైసెన్సు రద్దు చేయడం వంటి చర్యల దిశగా పోలీసు అధికారులు యోచిస్తున్నారు.

సైబరాబాద్, రాచకొండల్లో అధికం..

గ్రేటర్ పరిధిలో ఉన్న హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏటా సగటున 30 లక్షల జరిమానాలు విధిస్తున్నారు. స్పీడ్ లేజర్ గన్‌తో గుర్తించిన జరిమానాలు, చరవాణితో మాట్లాడుతూ వాహనాలు నడుపుకొంటూ వెళ్తున్న వారిపై మాత్రమే పెంచిన జరిమానాలు విధిస్తున్నారు. శిరస్త్రాణం లేకుండా వెళ్తున్నా, తప్పుగా వాహనం నిలిపినా పాత పద్ధతుల్లో చలానాలు రాస్తున్నారు. సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు మాత్రం రూ.వెయ్యికి తక్కువ కాకుండా చలానాలు రాస్తున్నారు. గతేడాది రాచకొండ పోలీసు కమిషనరేట్ పోలీసులు 7.37 లక్షల చలనాలు రాస్తే.. జరిమానా మొత్తం రూ.25.50 లక్షలు విధించారు. సైబరాబాద్ పరిధిలో ఏకంగా రూ.96.32 కోట్ల విలువైన చలానాలు రాశారు. హైదరాబాద్‌లో మాత్రం ఈ మొత్తం రూ.32 కోట్లకే పరిమితమైంది. ద్విచక్ర వాహనాలు, ఆటోవాలాల ఆర్థిక పరిస్థితుల ఆధారంగా జరిమానాల్లో మార్పులు చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

పరిశోధనలకు అధిక నిధులు అవసరం

- కేంద్రం కేటాయిస్తేనే దేశ ప్రగతిపథంలో ముందంజ
- దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో కడియం

ఈనాడు, హైదరాబాద్: పరిశోధనలకు, శాస్త్ర సాంకేతికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని, లేకుంటే దేశం ప్రగతిపథంలో ముందంజ వేయలేదని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆకర్షణ, ఆసక్తి పెంచేందుకు మరిన్ని పరిశోధన సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్ ఉన్నత పాఠశాలలో సోమవారం దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనను ఉపముఖ్యమంత్రి మహమ్మద్ అలీ, హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే సాయన్నలతో కలిసి కడియం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనకు కేంద్రం ఇస్తున్న నిధులు పెంచాలని కోరారు. సైన్స్, సాంకేతిక విభాగం(డీఎస్‌టీ) నిధుల విడుదల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అబ్దుల్‌కలాం ఓ పేద కుటుంబంలో పుట్టి మిస్సైల్ మ్యాన్‌గా ఎదిగి.. రాష్ట్రపతి అయ్యారని, అందుకు ఆయన శ్రమే కారణమని పేర్కొన్నారు. మీరూ కష్టపడితే ఆ స్థాయికి ఎదగవచ్చని విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఇప్పుడు మీకొచ్చిన ఓ చిన్న ఆలోచన భవిష్యత్తులో సాంకేతికంగా మారి సమస్యలకు పరిష్కారం చూపవచ్చన్నారు. అయిదు రోజుల ప్రదర్శనలో భాగంగా ఈనెల 10 లేదా 11 తేదీల్లో ఇతరరాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు నగర పర్యటన చేసే అవకాశం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ, హోం మంత్రి నాయిని నరసింహారెడ్డిలు మాట్లాడుతూ విద్యకు రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ హైదరాబాద్ లేదా చుట్టుపక్కల 15-20 ఎకరాలు స్థలమిస్తే కేంద్రం నుంచి మరో ప్రాంతీయ వైజ్ఞానిక కేంద్రాన్ని మంజూరు చేయించే బాధ్యత తనదని చెప్పారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, కమిషనర్ జి.కిషన్, ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకురాలు శేషుకుమారి, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం(వీఐటీఎం-బెంగళూరు) సంచాలకుడు మదన్‌గోపాల్ పాల్గొన్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన ఆయా ప్రాజెక్టులను మంత్రులు వీక్షించారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రయోగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ తదితరులు

హాస్యనటుడు గుండు హనుమంతరావుకు రూ. 5 లక్షల సాయం

సీఎం సహాయనిధి నుంచి మంజూరు

ఈనాడు, హైదరాబాద్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హాస్యనటుడు గుండు హనుమంతరావుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తన సహాయనిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. హనుమంతరావు దుస్థితిని పలువురు నటులు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. కేసీఆర్ వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆ పత్రాన్ని ఆసుపత్రి యాజమాన్యానికి పంపించారు.

జోనల్ వ్యవస్థ కీలకం

- ప్రయోజనాలన్నీ తెలంగాణ వారికే దక్కేలా ప్రతిపాదనలు రూపొందించండి
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రి కడియం

ఈనాడు, హైదరాబాద్: జోనల్ వ్యవస్థ కీలకమైనదని, తెలంగాణ వారికే అన్ని ప్రయోజనాలు కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. కొత్త జోనల్ వ్యవస్థపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి ముఖ్యమంత్రికి త్వరలో సమర్పిస్తామన్నారు. అందుకు అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుంటామన్నారు. సోమవారం సచివాలయంలో జోనల్ విధానంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించగా.. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఉన్నతాధికారులు సురేశ్‌చందా, అథర్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకు వివిధ వర్గాల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. చర్చల అనంతరం వచ్చే వారం మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు.

'వజ్ర' సంకల్పం!

ప్రయోగశాలలో వజ్రాల తయారీకి భారత్‌లో కసరత్తు

దిల్లీ: వజ్రాల పట్ల భారత్‌లో మక్కువ అంతా ఇంతా కాదు. ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుగా మన దేశం ఉంది. అయితే నేల నుంచి వజ్రాలను వెలికి తీయడం చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. దీనికి చాలా సమయం పడుతుంది. ఖర్చు కూడా ఎక్కువే. అందువల్ల అభివృద్ధి చెందిన అనేక దేశాల తరహాలో వజ్రాలను ప్రయోగశాలలో అభివృద్ధి చేయడంపై భారత్ కూడా కసరత్తు మొదలుపెట్టింది. ప్రయోగశాలలో వజ్రాల తయారీ. . కొత్త విషయమేమీ కాదు. భిన్న పద్ధతుల్లో వీటిని తయారుచేసేందుకు అనేక మంది శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. 18వ శతాబ్దం చివర్లో, 19వ శతాబ్దం మొదట్లో అనుసరించిన అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత (హెచ్‌పీహెచ్‌టీ) విధానాన్ని ఇవి కొంత మేర పోలి ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా, ఐరోపా సంఘం, రష్యా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్‌లు ఇప్పటికే పలు రకాల పరిజ్ఞానాలను అభివృద్ధి చేసి, ల్యాబ్‌లో వజ్రాలను ఉత్పత్తి చేస్తున్నాయి. సహజసిద్ధ వజ్రాలకు అతిపెద్ద వినియోగదారుల అయ్యినప్పటికీ భారత్ ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. కృత్రిమ వజ్రాలపై ఇక్కడ ఇంకా అవగాహన పెరగలేదు. సహజసిద్ధ వజ్రాలతో పోలిస్తే కృత్రిమ వజ్రాల ఖరీదు 15-20 శాతం తక్కువ ఉంటుంది. వీటి తయారీ పరిజ్ఞానం చాలా సంక్లిష్టమైనది కావడంతో సాధారణ వినియోగదారుడిని ఇవి ఇంకా చేరలేదు. భారత్‌లోని పలు ప్రయోగశాలలు కెమికల్ వేపర్ డిపాజిషన్ విధానంపై కసరత్తు చేస్తున్నాయి. పరికరాల ఖర్చు తక్కువ కావడం, సులువుగా కార్యకలాపాల నిర్వహణ, స్ఫటికాల మెరుగైన నాణ్యత, తయారీ ప్రక్రియ చౌకైనది కావడం వల్ల దీనిపై మొగ్గు కనపడుతోంది. అయితే ఇది ఇంకా పరిశోధన దశలో ఉంది. 1954లో అమెరికా శాస్త్రవేత్తలు హెచ్‌పీహెచ్‌టీ విధానం ద్వారా కృత్రిమ వజ్రాన్ని సృష్టించారు. ఈ ప్రక్రియలో సాధారణ వాతావరణ పీడనానికి దాదాపు 50 వేల రెట్లు ఎక్కువ పీడనాన్ని, అధిక ఉష్ణోగ్రతను ఉపయోగించారు. అయితే ఆభరణాల్లో ఉపయోగించడం కోసం కోరుకున్న పెద్ద వజ్రాల స్ఫటికాలను తయారుచేయడం ఇప్పటికీ సంక్లిష్టమైన ప్రక్రియే. కృత్రిమ వజ్రాలు సహజ వజ్రాల స్థానాన్ని సమీప భవిష్యత్‌లో అధిగమించే అవకాశం లేదు. రెండింటి మధ్య ధరలో ఎక్కువ వైరుధ్యం లేకపోవడమే ఇందుకు కారణం.

పనితీరు ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు

- 15లోగా ప్రతిపాదనలివ్వాలి: సీఎస్

ఈనాడు, హైదరాబాద్: శాఖల పనితీరు, నిధుల వెచ్చింపు అవసరాల ప్రాతిపదికన 2018-19 వార్షిక బడ్జెట్ కేటాయింపులుంటాయని రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ తెలిపారు. అన్ని శాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను ఈ నెల 15 నాటికి రాష్ట్ర ఆర్థిక శాఖకు సమర్పించాలని ఆదేశించారు. కేంద్ర 15వ ఆర్థిక సంఘం మొదటిసారిగా రాష్ట్రాల పురోగతి ఆధారంగా ప్రోత్సాహక గ్రాంట్లను ఇవ్వనుందని, రాష్ట్రానికి అత్యధిక నిధులు పొందేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సచివాలయంలో ప్రభుత్వ కార్యదర్శులతో కొత్త బడ్జెట్, ఇతర అంశాలపై సీఎస్ సోమవారం సమీక్షించారు. బడ్జెట్ ప్రతిపాదనలు పకడ్బందీగా ఉండాలని, ప్రతిశాఖ ప్రభుత్వ నిధులు జమ చేస్తున్న బ్యాంక్ ఖాతాల వివరాలను సమర్పించాలన్నారు. ప్రతి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు సీజీజీ పోర్టల్‌లో పెట్టాలన్నారు. ఇంజినీరింగ్ శాఖల్లో పనిచేసే వర్క్‌చార్జ్‌డ్, దినవేతన, ఫుల్‌టైమ్, తాత్కాలిక, అంగన్‌వాడీ, హోంగార్డులు, వీఆర్ఏల వివరాలను పొందుపరచాలన్నారు. '15వ ఆర్థిక సంఘానికి అధికారులు సమర్పించే నివేదికలు కీలకం. ఆర్థిక సంఘం వచ్చే ఏప్రిల్ నుంచి వివిధ రాష్ట్రాల్లో పర్యటించి, 2019 అక్టోబరు 30 నాటికి కేంద్రానికి నివేదిక సమర్పిస్తుంది. కాబట్టి వచ్చేనెల ఏడో తేదీ నాటికి అన్ని శాఖలు తమ ప్రగతి, లక్ష్యాలు, పనుల వివరాలను సమర్పించాలి' అని సీఎస్ చెప్పారు. ఆర్థిక శాఖ సలహాదారు జీఆర్ రెడ్డి కేంద్ర ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన మెమోరాండంలో పొందుపరచాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఉన్నతాధికారులు అజయ్‌మిశ్రా, రాజేశ్వర్‌తివారి, చిత్రా రామచంద్రన్, రామకృష్ణారావు, అథర్‌సిన్హా, రజత్‌కుమార్, శాలినీ మిశ్రా, సోమేశ్‌కుమార్, శశాంక్‌గోయల్, రాజీవ్‌త్రివేది, వికాస్‌రాజ్, జయేశ్‌రంజన్, వెంకటేశం, పార్థసారథి, దానకిశోర్, ఆర్వీ చంద్రవదన్ పాల్గొన్నారు.



సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈ నెల 26న పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. సోమవారం గణతంత్ర వేడుకలపై సచివాలయంలో ఆయన సమీక్షించారు.

బీసీ నివేదిక అమలుకు రూ.5 వేల కోట్లు అవసరం

ప్రతిపాదించనున్న అధికారులు

ఈనాడు, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధికి మంత్రుల కమిటీ నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదికను అమలు చేసేందుకు దాదాపు రూ. 5 వేల కోట్లు అదనంగా అవసరమని అంచనా వేస్తోంది. దీనికి అదనంగా నిధుల కోసం బీసీ సంక్షేమశాఖ బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేస్తోంది. తొలిబ్యాచ్ కింద 140 మంది నాయిబ్రాహ్మణులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసింది. మార్చి నెలాఖరులోగా 625 మందికి శిక్షణ పూర్తిచేయనుంది. నాయిబ్రాహ్మణులు, రజకులు, విశ్వకర్మ వర్గీయులకు స్వయం ఉపాధి పథకాల్లో వ్యాపార విస్తరణ కోసం రుణాలు ఇవ్వనుంది. వీరికి పనిముట్లు, నవీకరణ తదితరాల కింద రూ.50 వేల వరకు సహాయం అందించాలని భావిస్తోంది. కొత్తగా దుకాణాలు పెట్టేవారికి అవసరమైన పనిముట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.2 లక్షల వరకు వెచ్చించాలని ఆలోచిస్తోంది. ఇక సంచారజాతుల వారికి చిన్న వస్తువులు అమ్ముకునేందుకు వీలుగా రూ.50 వేల మొత్తంతో రుణాలివ్వనుంది. సంక్రాంతి తరువాత దరఖాస్తులు తీసుకుని ఒక్కో కేటగిరీ నుంచి కనీసం 2 వేల మందికి స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని ఆలోచిస్తోంది.

ఛాంపియన్



బుమ్రా 3/39

షమి 3/28

వందకు అటు ఇటుగా ముగిసిపోతుందనుకున్న తొలి ఇన్నింగ్స్‌ను పాండ్య పోరాటం 200 దాటించింది. ఆపై ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ జోరుమీదుండగా చకచకా 2 వికెట్లు పడగొట్టి పాండ్యానే కళ్లెం వేశాడు. ఒక రోజంతా వర్షం పడి పిచ్ మరింతగా బౌలర్లకు అనుకూలంగా మారింది. మరుసటి రోజు భారత పేసర్లు పరిస్థితుల్ని సద్వినియోగం చేసుకుంటూ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థిని కుప్పకూల్చారు. అనంతరం ఛేదన కూడా బాగానే ఆరంభమైంది.

ఇలా కేప్‌టౌన్‌లో అద్భుతం చేయడానికి భారత్‌కు అన్నీ కలిసొచ్చాయి! ఐతే మ్యాచ్ ఎన్ని మలుపులు తిరిగితేనేం.. ఎన్ని అవకాశాలొస్తేనేం.. ఎంతగా ఆశలు రేగితేనేం.. చివరికి ఈ పర్యటనకు ముందున్న ఆందోళనే నిజమైంది. అనుకున్న ఫలితమే వచ్చింది. దక్షిణాఫ్రికా గడ్డపై చెత్త రికార్డును కొనసాగిస్తూ పరాజయంతో పర్యటనను ఆరంభించింది కోహ్లీ సేన! దక్షిణాఫ్రికాలో భారత జట్టుకు కొంచెం అనుకూల పరిస్థితులుండే కేప్‌టౌన్‌లో ఎదురైన ఫలితమిది. మరి పేసర్ల స్వర్గధామాలు సెంచూరియన్, జొహానెస్‌బర్గ్‌ల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో?



కోహ్లి 28

కూల్చి.. కూలిపోయారు!

- చేతులెత్తేసిన బ్యాట్స్‌మెన్
- లక్ష్యం 208.. 135కే భారత్ ఆలౌట్
- తొలి టెస్టు దక్షిణాఫ్రికాదే
- ఓటమితో సఫారీ పర్యటన ఆరంభం

కేప్‌టౌన్

గతంలో పోలిస్తే ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చినా.. విజయావకాశాలు కూడా సృష్టించుకున్నా.. చివరికి ఫలితం మాత్రం మారలేదు. ఈసారి కూడా దక్షిణాఫ్రికా పర్యటనను భారత జట్టు ఓటమితోనే ఆరంభించింది. కేప్‌టౌన్‌లో మూడు రోజుల్లోపే ముగిసిపోయిన తొలి టెస్టులో భారత్ 72 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. బౌలర్ల అద్భుత ప్రదర్శన పుణ్యమా అని భారత్ ముందు 208 పరుగుల స్వల్ప లక్ష్యమే నిలిచినా.. ఛేదన అసాధ్యమే అయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రధాన బ్యాట్స్‌మన్ ఘోరంగా విఫలమవడంతో 135 పరుగులకే టీమ్‌ఇండియా కుప్పకూలింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఫిలాండర్ (6/42) భారత్ పతనాన్ని శాసించాడు. టీమ్‌ఇండియా ఆ మాత్రం స్కోరైనా చేసిందంటే రవిచంద్రన్ అశ్విన్ (37; 53 బంతుల్లో 5×4), భువనేశ్వర్ కుమార్ (13)ల చలవే. అంతకుముందు 65/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. మహ్మద్ షమి (3/28), జస్ప్రీత్ బుమ్రా (3/39)ల ధాటికి అనూహ్యంగా 130 పరుగులకే కుప్పకూలింది. రెండో టెస్టు సెంచూరియన్‌లో శనివారం ఆరంభమవుతుంది.

ఆశలు రివ్వున ఎగిసె..: నాలుగో రోజు అటు దక్షిణాఫ్రికా, భారత్ రెండు ఇన్నింగ్స్‌లూ కలిపి పడింది 64 ఓవర్లు మాత్రమే. ఇన్ని ఓవర్లలోనే 18 వికెట్లు నేలకూలడం విశేషం. దీన్ని బట్టే బౌలర్ల ఆధిపత్యం ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. తొలి రోజు నుంచి పిచ్ పేసర్లకు అనుకూలిస్తుండగా.. మూడో రోజు పూర్తిగా మైదానాన్ని వర్షం ముంచెత్తడంతో మరింతగా పరిస్థితులు బౌలర్లకు అనుకూలంగా మారాయి. ఉదయం ఆరంభంలోనే వికెట్ల వర్షం కురిసింది. 65/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికాను భారత పేసర్లు మహ్మద్ షమి, జస్ప్రీత్ బుమ్రా చుక్కలు చూపించారు. ఆట మొదలైన రెండో ఓవర్లోనే ఆమ్లా (4)ను స్లిప్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చి, వికెట్ల వేటకు తెర తీశాడు షమి. మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ రబాడ (5)ను కూడా అతనే ఔట్ చేశాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో అంతగా ప్రభావం చూపని అరంగేట్ర బౌలర్ బుమ్రా.. సోమవారం చాలా ప్రభావవంతంగా కనిపించాడు. లైన్ అండ్ లెంగ్త్‌తో, చక్కగా బౌన్స్ రాబడుతూ సఫారీ బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. అతను అద్భుతమైన బంతులతో డుప్లెసిస్ (0), డికాక్ (8)లను ఔట్ చేసి దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బ తీశాడు. ఆ తర్వాత కూడా వికెట్ల పతనం అలాగే కొనసాగింది. ఐతే స్టార్ ఆటగాడు డివిలియర్స్ (35; 50 బంతుల్లో 2×4, 2×6) ఒక ఎండ్‌లో ధాటిగా ఆడుతూ.. విలువైన పరుగులు సాధించాడు. లక్ష్యం 200 దాటేలా చూశాడు.

బౌలర్లు అంచనాల్ని మించి రాణించి లక్ష్యం సాధ్యమైనంత తక్కువుండేలా చూస్తే.. ఓపెనర్లు తొలి వికెట్‌కు 30 పరుగులు జోడించి ఆశలు రేకెత్తించారు. 10 వికెట్లు చేతిలో ఉండగా.. ఇక చేయాల్సింది 178 పరుగులే. ప్రధాన బ్యాట్స్‌మెన్‌లో ఒకరిద్దరు నిలబడ్డా పనైపోతుంది. అందులోనూ దక్షిణాఫ్రికా స్టెయిన్ సేవల్ని కోల్పోయింది.. ముగ్గురు పేసర్లే దాడిని కొనసాగించాలి. పిచ్ ఎంత కఠినంగా ఉన్నప్పటికీ.. క్రీజులో నిలదొక్కుకుని పేస్ త్రయాన్ని అలసిపోయేలా చేయగలిగితే విజయం సాధ్యమే! భారత అభిమానులు ఇలాంటి ఆలోచనలు, విశ్లేషణల్లో ఉండగానే.. కథ మారిపోయింది!

30/0 నుంచి 39/3..: తొలి వికెట్‌కు 30 పరుగులైతే జోడించారు కానీ.. విజయ్, ధావన్ ఏమంత సౌకర్యంగా కనిపించలేదు. ముఖ్యంగా విజయ్ (13) అయితే ఆరంభం నుంచి తడబడుతూనే ఉన్నాడు. అతను ఒకటికి రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్నాడు. ఒకసారి ఎల్బీడబ్ల్యూగా, ఇంకోసారి క్యాచ్ ఔట్‌గా ఫీల్డ్ అంపైర్ ప్రకటించినప్పటికీ సమీక్ష కోరి నాటౌట్‌గా నిలిచాడు విజయ్. కానీ ఈ అవకాశాల్ని అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఫిలాండర్ బంతిని బ్యాట్‌తో ముద్దాడి స్లిప్‌లో చిక్కాడు. అంతకంటే ముందు ధావన్ (16) మోర్కెల్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఐతే భారత్‌కు అసలు దెబ్బ తగిలింది 13వ ఓవర్లో. ఇలాంటి స్థితిలో నమ్మదగ్గ ఆటగాడైన పుజారా (4)ను మోర్కెల్ బోల్తా కొట్టించాడు. కొద్దిగా ఔట్ స్వింగ్ అయిన బంతి అతడి బ్యాట్ అంచును తాకి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దీంతో భారత్ 30/0 నుంచి 39/3కు చేరుకుంది. భారత్‌కు ఓటమి భయం మొదలైంది అక్కడే.

మళ్లీ ఒక ఆశ..: పుజారా ఔటయ్యాక కోహ్లి (28; 40 బంతుల్లో 4×4), రోహిత్ (10) కొంతసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. దాదాపు పది ఓవర్ల పాటు వికెట్లు కాపాడుకున్నారు. కొంచెం కుదురుకున్నాక కోహ్లి బ్యాట్ ఝులిపించాడు. చకచకా పరుగులు రాబట్టాడు. దీంతో భారత్ 71/3తో కొంచెం పుంజుకున్నట్లే కనిపించింది. మళ్లీ గెలుపు ఆశలు చిగురించాయి. వీళ్లిద్దరిలో ఒకరు నిలిచినా మ్యాచ్ సొంతమవుతుందనిపించింది. కానీ ఆశ బలపడుతుండగానే భారత ఇన్నింగ్స్‌ను కకావికలు చేశారు ఫిలాండర్, రబాడ. క్రీజులో నిలదొక్కుకుంటున్న కోహ్లి, రోహిత్‌లిద్దరినీ ఫిలాండర్ వరుస ఓవర్లలో ఔట్ చేశాడు. బంతిని వికెట్‌కు అడ్డంగా ఆడి ఎల్బీగా దొరికిపోయాడు విరాట్. సమీక్ష కోరినా ఫలితం లేకపోయింది. రోహిత్ ఔట్‌స్వింగర్‌ను వికెట్ల మీదికి ఆడుకున్నాడు. ఇక తొలి ఇన్నింగ్స్ హీరో పాండ్యను ఈసారి ఒక్క పరుగుకే పెవిలియన్ చేర్చాడు రబాడ. సాహా (8)ను కూడా అతనే వికెట్ల ముందు బలిగొన్నాడు. 11 పరుగుల తేడాలో 4 వికెట్లు పడిపోయాయి. స్కోరు 82/7.

ఆ ఇద్దరిలా ఆడి ఉన్నా..: ఓటమి ఖాయమైపోయింది. స్కోరు వందైనా దాటుతుందా అన్నదే సందేహం. ఇలాంటి స్థితిలో అశ్విన్, భువనేశ్వర్ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌కు పాఠాలు నేర్పేలా బ్యాటింగ్ చేశారు. ఈ జోడీ గొప్ప పట్టుదలతో, సంయమనంతో బ్యాటింగ్ చేశారు. గంటకు పైగా 13 ఓవర్ల పాటు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. స్కోరును 130 దాటించారు. అంతకుముందు ప్రధాన బ్యాట్స్‌మెన్‌ను వణికించిన సఫారీ పేస్ త్రయాన్ని వీరు అసహనానికి గురిచేశారు. భాగస్వామ్యం 49కి చేరుకోవడం, ఒక విజయానికి అవసరమైన పరుగులు 77 మాత్రమే కావడంతో ఈ జోడీ అద్భుతాలేమైనా చేస్తుందేమో అన్న చిగురాశ రేగింది. కానీ ధాటిగా ఆడుతూ లక్ష్యాన్ని కరిగిస్తున్న అశ్విన్‌ను ఔట్ చేసిన ఫిలాండర్ ఆ ఆశలకు తెరదించాడు. ఇక ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు. మిగతా రెండు వికెట్లు కూడా ఫిలాండరే పడగొట్టాడు. చివరి 3 వికెట్లు 4 పరుగుల తేడాలో పడ్డాయి.

స్టెయిన్ స్థానంలో ఒలివర్: భారత్‌తో తొలి టెస్టులో గాయపడిన పేసర్ డేల్ స్టెయిన్ స్థానంలో యువ పేసర్ డ్యున్ ఒలివర్‌ను దక్షిణాఫ్రికా సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఈ నెల 13న సెంచూరియన్‌లో మొదలయ్యే రెండో టెస్టుకు అతను అందుబాటులో ఉంటాడు. పాదం గాయం కారణంగా స్టెయిన్ ఈ సిరీస్ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. ఒలివర్‌తో పాటు మరో ఫాస్ట్ బౌలర్ లుంగి గిడిని కూడా దక్షిణాఫ్రికా జట్టులోకొచ్చాడు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286

భారత్ తొలి ఇన్నింగ్స్: 209

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34; ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్య 25; రబాడ (సి) కోహ్లి (బి) షమి 5; ఆమ్లా (సి) రోహిత్ (బి) షమి 4; డివిలియర్స్ (సి) భువనేశ్వర్ (బి) బుమ్రా 35; డుప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0; డికాక్ (సి) సాహా (బి) బుమ్రా 8; ఫిలాండర్ ఎల్బీ (బి) షమి 0; కేశవ్ మహరాజ్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 15; మోర్నీ మోర్కెల్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 2; స్టెయిన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (41.2 ఓవర్లలో ఆలౌట్) **130; వికెట్ల పతనం:** 1-52, 2-59, 3-66, 4-73, 5-82, 6-92, 7-95, 8-122, 9-130; **బౌలింగ్:** భువనేశ్వర్ 11-5-33-2; బుమ్రా 11.2-1-39-3; షమి 12-3-28-3; పాండ్య 6-0-27-2; అశ్విన్ 1-0-3-0

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (సి) డివిలియర్స్ (బి) ఫిలాండర్ 13; ధావన్ (సి) మోరిస్ (బి) మోర్కెల్ 16; పుజారా (సి) డికాక్ (బి) మోర్కెల్ 4; కోహ్లి ఎల్బీ (బి) ఫిలాండర్ 28; రోహిత్ (బి) ఫిలాండర్ 10; సాహా ఎల్బీ (బి) రబాడ 8; పాండ్య (సి) డివిలియర్స్ (బి) రబాడ 1; అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 37; భువనేశ్వర్ నాటౌట్ 13; షమి (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 4; బుమ్రా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 0; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (42.4 ఓవర్లలో ఆలౌట్) **135; వికెట్ల పతనం:** 1-30, 2-30, 3-39, 4-71, 5-76, 6-77, 7-82, 8-131, 9-135; **బౌలింగ్:** ఫిలాండర్ 15.4-4-42-6; మోర్నీ మోర్కెల్ 11-1-39-2; రబాడ 12-2-41-2; కేశవ్ మహరాజ్ 4-1-12-0



ఫిలాండర్ 6/42

ఏ సెషన్లో ఎన్ని?

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్

లంచ్‌కు ముందు

ఓవర్లు	:	21.2
పరుగులు	:	65
వికెట్లు	:	8

భారత్ ఇన్నింగ్స్

లంచ్ తర్వాత

ఓవర్లు	:	29
పరుగులు	:	82
వికెట్లు	:	7

టీ తర్వాత

ఓవర్లు	:	13.4
పరుగులు	:	53
వికెట్లు	:	3

130

భారత జట్టులో తొలి ఐదుగురు బ్యాట్స్‌మెన్ కలిసి రెండు ఇన్నింగ్స్‌ల్లో చేసిన పరుగులు. తొలి ఇన్నింగ్స్‌లో 59, రెండో ఇన్నింగ్స్‌లో 71 పరుగులు చేశారు.

- తొలి టెస్టులో భారత జట్టులో అత్యధిక వికెట్లు తీసింది, అత్యధిక బంతులాడింది భువనేశ్వరే. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 6 వికెట్లు పడగొట్టి, 127 బంతులాడాడు భువి.
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడో స్థానంలో వచ్చిన పాండ్య (93) టాప్‌స్కోరర్‌గా నిలిస్తే.. రెండో ఇన్నింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఆడిన అశ్విన్ (37) అత్యధిక పరుగులు చేశాడు.
- భారత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఎనిమిదో వికెట్ భాగస్వామ్యమే అత్యధికం. తొలి ఇన్నింగ్స్‌లో పాండ్య, భువనేశ్వర్ కలిసి 99 పరుగులు జోడిస్తే.. రెండో ఇన్నింగ్స్‌లో అశ్విన్, భువనేశ్వర్ 49 పరుగులు జత చేశారు.

అందుకే రోహిత్‌ను తీసుకున్నాం

"ప్రస్తుత ఫామ్ ఆధారంగా తొలి టెస్టుకు తుది జట్టును ఎంచుకున్నాం. రోహిత్ శర్మ తాను ఆడిన గత మూడు టెస్టుల్లో మెరుగైన ప్రదర్శన చేశాడు. శ్రీలంకతో సిరీస్‌లోనూ చక్కగా బ్యాటింగ్ చేశాడు. అయినా ఇదే మేం సరైన మేళవింపు అనుకున్నాం. కచ్చితంగా ప్రస్తుత ఫామే ఎంపికకు అర్హతగా తీసుకున్నాం" – కోహ్లి

రహానెను తప్పించడం ఆశ్చర్యం కలిగించింది

"భారత్.. రహానెను ఆడించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. బుమ్రా, రోహిత్ జట్టులో ఉంటారనుకోలేదు. వన్డే క్రికెట్లో ఫామ్‌లో ఉండడంతో వారిని తీసుకుని ఉంటారు. ఇక మ్యాచ్‌లో క్లిష్ట దశలను ఎదుర్కొన్న ప్రతిసారీ మేం అద్భుతంగా స్పందించాం" – డుప్లెసిస్



పది క్యాచ్‌లతో సాహా రికార్డు

కేప్‌టౌన్: ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత వికెట్ కీపర్‌గా సాహా రికార్డు సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో ముగిసిన తొలి టెస్టులో అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి పది క్యాచ్‌లు అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు క్యాచ్‌లు పట్టిన సాహా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు క్యాచ్‌లు అందుకున్నాడు. ధోని 2014లో ఆస్ట్రేలియాపై తొమ్మిది క్యాచ్‌లతో నెలకొల్పిన రికార్డును అతను అధిగమించాడు. మొత్తంగా ప్రపంచ క్రికెట్లో రసెల్ (ఇంగ్లాండ్), డివిలియర్స్ (దక్షిణాఫ్రికా) చెరో 11 క్యాచ్‌లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఉన్న బాబ్ టేలర్, గిల్‌క్రిస్ట్ (ఆస్ట్రేలియా)లను సాహా సమం చేశాడు. సాహా 32 టెస్టుల్లో 75 క్యాచ్‌లు అందుకుని, 10 స్టంపింగ్‌లు చేశాడు. టెస్టుల్లో అత్యధిక ఔట్లలో పాలుపంచుకున్న భారత వికెట్‌కీపర్లలో ఐదో స్థానంలో ఉన్న ఫరూక్ ఇంజినీర్ (82) అతను వెనక్కి నెట్టాడు.

ఎంపీ కొడుకా మజాకా!

దిల్లీ టీ20 జట్టు ఎంపికపై దుమారం

దిల్లీ: దిల్లీ టీ20 జట్టుకు బిహార్ రాజకీయ నాయకుడు పప్పు యాదవ్ కొడుకు శార్థక్ రంజన్‌ను ఎంపిక చేయడంపై వివాదం చెలరేగింది. దిల్లీ సెలక్షన్ కమిటీ.. అండర్-23 టాప్ స్కోరర్‌గా నిలిచిన హితెన్ దలాల్‌ను రిజర్వ్‌ల్లో పెట్టి మరీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని శార్థక్‌కు జట్టులో చోటు కల్పించడం గమనార్హం. పప్పు యాదవ్ మాధేపురా నుంచి ఎంపీ. అతడి భార్య రంజీత్ రంజన్ కాంగ్రెస్ ఎంపీ. బాగా ఆడిన వాళ్లను కాదని, పలుకుబడి ఉన్న వ్యక్తి కొడుకును ఎంపిక చేశారంటూ అతుల్ వాసన్, హరి గిద్వాని, రాబిన్ సింగ్ జూనియర్‌లతో కూడిన సెలక్షన్ కమిటీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీజన్ ఆరంభంలో దిల్లీ రంజీ ట్రోఫీ ప్రాబబుల్స్‌లో కూడా శార్థక్‌కు చోటు దక్కింది. కానీ స్వయంగా అతడే ప్రాబబుల్స్ నుంచి తప్పుకున్నాడు. అతడు ఆటపై ఆసక్తి కోల్పోయాడని, బాడీ బిల్డింగ్‌పై దృష్టి పెట్టాడని వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో శార్థక్ ఎంపిక దిల్లీ క్రికెట్లో దుమారం రేపుతోంది.

సుశీలే ప్రధానాకర్షణ

నేటి నుంచే ప్రొ రెజ్లింగ్ లీగ్

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్ సీజన్-3 మంగళవారం ఇక్కడ ఆరంభమవుతోంది. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత సుశీల్ కుమారే లీగ్‌లో ప్రధాన కర్షణ. తొలి మ్యాచ్‌లో దిల్లీ సుల్తాన్స్, ముంబయి మహారథి జట్లు తలపడతాయి. సుశీల్ (74కేజీ) సుల్తాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సాక్షి మలిక్ ముంబయి తరఫున బరిలోకి దిగనుంది.



ఇంగ్లాండ్ చిత్తు...

యాషెస్ సిరీస్ 4-0తో ఆస్ట్రేలియా వశం

సిడ్నీ: యాషెస్‌లో ఇంగ్లాండ్ చిత్తుగా ఓడిపోయింది. ఐదో టెస్టులో ఇన్నింగ్స్ 123 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఆస్ట్రేలియా ప్రత్యర్థిని 4-0తో చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 93/4తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 180 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రూట్ (58), బెయిర్‌స్టో (38) నిలవడంతో ఒక దశలో 121/4తో మెరుగ్గానే కనిపించిన ఇంగ్లాండ్.. ఆసీస్ బౌలర్లు కమిన్స్ (4/39), లైయన్ (3/54) విజృంభించడంతో క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. క్రీజులో పాతుకుపోయిన రూట్ కడుపునొప్పి కారణంగా రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగడం కూడా ఇంగ్లాండ్‌ను దెబ్బతీసింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా 649/7 స్కోరు వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆసీస్ 4-0తో కైవసం చేసుకుంది. తొలి మూడు టెస్టులను ఆసీస్ గెలవగా.. నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. ఈ సిరీస్‌లో అన్ని టెస్టులు ఐదో రోజే ముగియడం విశేషం.

ఊతకర్రను లాగేస్తున్నారు

- సొంత సంతానం చేతిలోనే వృద్ధులకు తీవ్ర ఇక్కట్లు
- బంధువుల్లో, బహిరంగ ప్రదేశాల్లోనూ అవమానాలే
- భరణం, సంక్షేమం కోసం కుప్పలుగా కేసులు


☛ **అటు మొన్న-** రాజ్‌కోట్‌లో జబ్బు పడిన తల్లిని అపార్ట్‌మెంట్ పైనుంచి తోసి చంపేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్

☛ **మొన్న-** ఆస్తిని తమ పేరిట రాయకుంటే చంపేస్తామని బెదిరించిన తనయులు 'కృషి' వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌లపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

☛ **నిన్న-** ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరులో డబ్బు కోసం తల్లికి ఎలుకల మందు పెట్టి. . ఆ తర్వాత గొంతు నులిమి కిరాతకంగా చంపిన తనయుడు.

...సొంత సంతానం, కుటుంబీకుల చేతిలో హింస, అవమానాలు, నమ్మకద్రోహాలు ఎదుర్కొంటున్న ఇలాంటి వృద్ధుల సంఖ్య దేశంలో కోకొల్లలు. మానవత్వం మటుమాయమై.. పెద్దల్ని గౌరవించే భారతీయ సంప్రదాయం తుడిచిపెట్టుకుపోతోందనడానికి బోలెడన్ని ఉదాహరణలు.

అమ్మ నాన్నలు.. రెండక్షరాల కమ్మని పదాలు. తమ కడుపున పుట్టిన వారి కోసం అహరహం శ్రమించి.. జీవితాల్ని ధారబోసే త్యాగమూర్తులు. అలాంటి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో వారి సొంత పిల్లల నుంచి, కుటుంబంలోని ఇతరుల నుంచి, బహిరంగ ప్రదేశాల్లోనూ తీవ్ర అవమానాల్ని, ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. దేశంలో వృద్ధుల సంక్షేమానికి పాటుపడుతున్న 'హెల్ప్‌ఏజ్ ఇండియా' ఆరునెలల కిందట ఒక మారు, తాజాగా మరోసారి జరిపిన సర్వే- దేశంలో వృద్ధులు ఎంతటి ఘోర అవమానాల్ని ఎదుర్కొంటున్నారో కళ్లకు కట్టాయి. తాము వేధనలకు గురవుతున్నామని సర్వేలో పాల్గొన్న దాదాపు సగం మంది వృద్ధులు



ఎవరెవరు వేధిస్తారు?

కోడళ్లు	61%
కొడుకులు	59%
కూతుళ్లు	7%
అల్లుళ్లు	6%
బంధువులు	3%
సేవకులు	3%

చెప్పారు. కోడలు లేదా కొడుకు వద్ద అవమానాల్ని ఎదుర్కొంటున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. తల్లిదండ్రులు, వృద్ధులకు జీవనభృతి, సంక్షేమానికి ఉద్దేశించిన చట్టం అడుగడుగునా ఉల్లంఘనలకు గురవుతున్న దృష్టాంతాలు అనేకం బయటపడ్డాయి. ఇలాంటి ఉల్లంఘనలపై అత్యధికంగా కేసులు నమోదైన పంజాబ్, హరియాణ, కేరళ, తమిళనాడుల్లోని 8 జిల్లాల్లో జరిపిన సర్వే వివరాల్ని హెల్ప్‌ఏజ్ ఇండియా సోమవారం విడుదల చేసింది.

- పంజాబ్‌లో దాదాపు 70 శాతం కేసుల్ని 80 ఏళ్ల పైబడిన వృద్ధులు తమ సొంత కొడుకులపై వేశారు.

వీరంతా శారీరక దాడులకు, అవమానాలకు గురైన వారు.

- తమిళనాడు, హరియాణ, కేరళల్లో 21 శాతం కేసుల్ని కూతుళ్లపై వేశారు.
- జీవనభృతి కేసులు పంజాబ్‌లో ఎక్కువగా నమోదయ్యాయి.
- ఆస్తుల సంబంధ పిటిషన్లు తమిళనాడు, కేరళల్లో ఎక్కువగా ఉన్నాయి.
- పిటిషన్లు వేసిన దాదాపు 83 శాతం మంది ఇప్పటికే ఆస్తుల్ని తమ పిల్లల పేరిట బదలాయించారు.
- పిల్లలు తమను నిర్లక్ష్యం చేయడం వల్లే కేసులు వేశామని 57 శాతం మంది, శారీరక, మానసిక హింసను భరించలేక వేశామని 36 శాతం మంది చెప్పారు.



ఎలాంటి వేధింపులుంటాయి?

దూషణలు, శారీరక దాడులు..	41%
అమర్యాద..	30%
నిర్లక్ష్యం..	29%

వేధింపులు ఎందుకు?

- చేతకాని వయసులో.. పిల్లలపై ఆర్థికంగా ఆధారపడటం, సమాజంలో మారిన పరిస్థితులు వృద్ధులపై వేధింపులకు ప్రధాన కారణం.
- భావోద్వేగాలతో ఆధారపడటం వల్ల 46 శాతం మంది, ఆర్థిక కారణాల వల్ల 45 శాతం మంది, మారిన పరిస్థితుల వల్ల 38 శాతం మంది వేధింపుల్ని ఎదుర్కొంటున్నారు. ఎక్కువ సంవత్సరాలు బతకడం వల్ల మరింత సంరక్షణ అవసరమై 9 శాతం మంది ఈ బాధను భరిస్తున్నారు.
- వృద్ధులపై వేధింపుల్లో 59.47 శాతం కేసులు ఫిర్యాదు దాకా వెళుతున్నాయి. మరో 40.53 శాతం మంది ఫిర్యాదు చేయట్లేదు.

వృద్ధులు ఎవరితో ఉంటున్నారు?

కుటుంబాలతో	77%
జీవిత భాగస్వామితో	14%
ఒంటరిగా	7%
బంధువులతో	2%

బహిరంగ ప్రదేశాల్లోనూ అవమానాలే

వయోవృద్ధులు బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లినపుడు సైతం తీవ్ర అవమానాలు, వివక్షను ఎదుర్కొంటున్నారని ఆరునెలల కిందట హెల్ప్‌ఏజ్ ఇండియా 19 నగరాల్లో జరిపిన సర్వేలో తేలింది.

కొన్ని నగరాల్లో అవమానాలు ఎదుర్కొంటున్న వృద్ధుల సంఖ్య ఇలా ఉంది...

నగరం	వృద్ధుల శాతం
బెంగుళూరు	70
హైదరాబాద్	60
గౌహతి	59
కోల్‌కతా	52
చెన్నై	49
ముంబయి	33
దిల్లీ	23

- దాదాపు 44 శాతం మంది వృద్ధులు తమను బహిరంగ ప్రదేశాల్లో ఘోరంగా చూస్తున్నారని చెప్పారు.
- భారత సమాజం తమ పట్ల వివక్షను చూపుతోందని మరో 53 శాతం మంది తెలిపారు.



వృద్ధ జనాభా గణనీయంగా పెరుగుదల

దేశంలో 60 ఏళ్ల పైబడిన వారి జనాభా గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది.

- 2001లో దేశ జనాభాలో 7.66 కోట్లు(5.6 శాతం) ఉన్న వృద్ధుల సంఖ్య 2011 జనాభా లెక్కల ప్రకారం 10.38 కోట్లకు(8.6 శాతం) పెరిగింది. ఇప్పుడు ఆ సంఖ్య మరింతగా పెరిగి ఉండొచ్చని అంచనా.
- పల్లెల్లో 71 శాతం మంది వృద్ధులు, పట్టణాలు, నగరాల్లో 29 శాతం మంది వృద్ధులు ఉంటున్నారు.
- వృద్ధ వయసులో ఇతరులపై ఆధారపడే శాతం నగరాల్లో 15.1, పట్టణాల్లో 12.4 శాతం ఉంది.

కొన్ని రాష్ట్రాల్లో 60 ఏళ్ల పైబడిన వారు

రాష్ట్రం	వృద్ధుల శాతం
ఆంధ్రప్రదేశ్	10
తెలంగాణ	10
తమిళనాడు	10
కర్ణాటక	9
కేరళ	13
మహారాష్ట్ర	10
దిల్లీ	7

-ఈనాడు ప్రత్యేక విభాగం

రాత్రిపూట ఉద్యోగాలతో మహిళలకు క్యాన్సర్ ముప్పు!



బీజింగ్: మహిళలూ జాగ్రత్త..! రాత్రిపూట ఉద్యోగాలుచేస్తే క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. చైనాలోని సిచుయాన్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. ఇదివరకు నిర్వహించిన 61 పరిశోధనల ఫలితాలను వారు విశ్లేషించారు. మొత్తంగా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఆసియా ప్రాంతాలకు చెందిన 39,09,152 మంది సమాచారం పరిశీలించారు. వీరిలో 1,14,628 మంది క్యాన్సర్ బాధితులున్నారు. దీర్ఘకాలం రాత్రిపూట ఉద్యోగాలతో చుట్టుముట్టే 11 రకాల క్యాన్సర్ల ముప్పుపై పరిశోధకులు ప్రధానంగా దృష్టికేంద్రీకరించారు. దీంతో మిగతావారితో పోలిస్తే రాత్రిపూట ఉద్యోగాలుచేసే మహిళల్లో 19 శాతం క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటోందని వెలుగులోకి వచ్చింది. ఈ ముప్పుల్లో 41 శాతంతో చర్మ క్యాన్సర్ మొదటి స్థానంలో ఉంది. రొమ్ము (32 శాతం), జీర్ణాశయ (18 శాతం) క్యాన్సర్ ముప్పులూ గణనీయంగానే పెరుగుతున్నట్లు తేలింది. రొమ్ము క్యాన్సర్ ముప్పు మాత్రం ఉత్తర అమెరికా, ఐరోపాల్లో ఎక్కువగా కనిపిస్తోందని పరిశోధకులు తెలిపారు.

ఆకారాన్ని మార్చుకునే.. సూక్ష్మ రోబోలు!



న్యూయార్క్: పరిస్థితులకు అనుగుణంగా ఆకారాన్ని మార్చుకునే సూక్ష్మ రోబోలు త్వరలో మనముందుకు రాబోతున్నాయి. వీటికి బాటలు పరిచే ఎలక్ట్రానిక్ బాహ్య అస్థిపంజరం (ఎక్సోస్కెలిటెన్)ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రసాయనిక, ఉష్ణోగ్రతల్లో మార్పులకు అనుగుణంగా ఆకారం మారిపోవడం దీని ప్రత్యేకత. దీనిలోకి ఎలక్ట్రానిక్, ఫోటోనిక్, రసాయనిక పదార్థాలను చొప్పించే వీలుంది. 'బైమోర్ఫ్'గా పిలిచే మోటారు సాయంతో ఇది కదులుతోంది. దీని ఆధారంగా సూక్ష్మజీవుల పరిమాణంలో రోబోలు తయారుచేయొచ్చని అమెరికాలోని కార్నెల్ వర్సిటీ నిపుణులు తెలిపారు. 'గాజు, గ్రాఫీన్‌తో ఈ ఎక్సోస్కెలిటెన్‌ను తయారుచేశాం. ఈ రెండు పదార్థాలూ ఉష్ణోగ్రతకు భిన్నంగా స్పందిస్తాయి. దీంతో రోబోలు భిన్న ఆకారాల్లోకి మారే వీలుంది. అంతేకాదు ఇవి విద్యుత్ వాహక గుణాన్ని కలిగివుంటాయి'అని పరిశోధకులు పాల్ మెక్‌యూన్ తెలిపారు.

వ్యాయామంతో గుండె గాయాలు మాయం!



లండన్: వయసు పైబడటంతో గుండెను చుట్టుముట్టే గాయాలకు వ్యాయామంతో చెక్ పెట్టొచ్చని తాజా అధ్యయనంలో తేలింది. వారానికి కనీసం నాలుగు నుంచి ఐదు సార్లు చొప్పున 65ఏళ్లలోపు వయసు వారు వ్యాయామం మొదలుపెడితే మంచి ఫలితాలుంటాయని వివరిస్తోంది. బ్రిటన్‌లోని సౌథంప్టన్ మెడికల్ సెంటర్, అమెరికాలోని టెక్సాస్ హెల్త్ ప్రెస్బిటేరియన్ హాస్పిటల్ నిపుణులు సంయుక్తంగా దీన్ని చేపట్టారు. 45 నుంచి 64ఏళ్ల మధ్యవయసున్న 50 మంది దీనిలో పాల్గొన్నారు. వీరిని రెండు వర్గాలుగా విభజించారు. ఓ వర్గానికి రోజూ మూడుసార్లు 30 నిమిషాల చొప్పున మూడు నెలలు ఓ మోస్తరుగా వ్యాయామం చేయమని సూచించారు. తర్వాత ఏరోబిక్స్‌నూ దీనికి జతచేశారు. రెండో వర్గానికి యోగా చేయమన్నారు. రెండేళ్ల అనంతరం వీరి గుండె ఆరోగ్యాన్ని పరీక్షించారు. దీంతో వ్యాయామం చేస్తున్నవారి గుండెకు అందుతున్న ఆక్సిజన్ స్థాయిలు 18 శాతం మెరుగుపడినట్లు వెలుగులోకి వచ్చింది. గుండె కణజాలం బిగుసుకుపోయే ముప్పు 25 శాతం వరకూ తగ్గినట్లు తేలింది.

నీటిలోని హానికర నైట్రేట్‌లకు చెల్లుచీటీ

- కొత్త శుద్ధీకరణ విధానం అభివృద్ధి



వాషింగ్టన్: మంచినీటిలోని ప్రమాదకర నైట్రేట్‌లను తొలగించే కొత్త విధానాన్ని పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీనిలో పల్లాడియం సమ్మేళనాలను ఉత్ప్రేరకాలుగా ఉపయోగించారు. ఇవి నైట్రేట్‌లను నీరు, నత్రజని వాయువుగా విడగొట్టడం విశేషం. శిశువులు, గర్భిణులకు నైట్రేట్లు విపరీతమైన చేటు చేస్తాయి. ఒక్కోసారి క్యాన్సర్‌కూ ఇవి కారణం అవుతాయి. నీటిలో వీటి అవశేషాలను తొలగించేందుకు ఇదివరకు సూక్ష్మ బంగారం గోళాలను ఉపయోగించారు. అయితే ఇవి నైట్రేట్‌లను నైట్రైట్, ఆక్సీజన్‌లుగా విడగొట్టాయి. నైట్రేట్‌ల కంటే నైట్రైట్‌లు మరింత ప్రమాదకరం. దీంతో నైట్రేట్‌లను సురక్షితంగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా అమెరికాలోని రైస్ వర్సిటీ నిపుణులు తాజా పరిశోధన చేపట్టారు. వీరు ఇండియం పూతపూసిన పల్లాడియం గోళాలను ఉత్ప్రేరకాలు ఉపయోగించారు. దీంతో నైట్రేట్‌లను నత్రజని వాయువుగా మార్చడం సాధ్యపడింది.

జీవం పుట్టుకపై సరికొత్త సిద్ధాంతం

★ భారత సంతతి పరిశోధకుడి నేతృత్వంలో అభివృద్ధి

వాషింగ్టన్: భూమిపై జీవం పుట్టుక గుట్టువిప్పే సరికొత్త సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. ఈ పరిశోధనకు అమెరికాలోని స్క్రిప్స్ పరిశోధన సంస్థ(టీఎస్ఆర్ఐ) అధ్యాపకులు, భారత సంతతికి చెందిన రామనారాయణన్ కృష్ణమూర్తి నేతృత్వం వహించారు. దీనిలో 'సిట్రిక్ ఆమ్ల వలయం'(సీఏసీ) చర్యలపై ప్రధానంగా దృష్టికేంద్రీకరించారు. ఆక్సీజన్‌ను తీసుకునే జీవులన్నీ కణాల్లో నిల్వచేసిన శక్తిని విడుదల చేసేందుకు సీఏసీ చర్యలపైనే ఆధారపడతాయి. ఈ చర్యలను 400 కోట్ల ఏళ్ల క్రితం అప్పుడు అందుబాటులోవున్న పదార్థాలే జరిపినట్లు ప్రస్తుతం పరిశోధకులు చెబుతున్నారు. మెలనేట్ వలయం, హెచ్‌కేజీ వలయంగా పిలిచే రెండు జీవయేతర వలయాలు సీఏసీ చర్యలకు బాటలు పరిచినట్లు ప్రయోగపూర్వకంగా వారు నిరూపించారు. ఈ రెండు వలయాలూ క్రమంగా కొత్త పదార్థాలకు చర్యల్లో భాగం కల్పిస్తూ కార్బన్‌డైఆక్సైడ్, అమైనో ఆమ్లాలను ఉత్పత్తి చేశాయనీ వారు చెబుతున్నారు. సీఏసీ చర్యలో అంతిమంగా ఉత్పత్తయ్యేది అమైనో అమ్లాలే. ఈ రెండు వలయాల చర్యలను క్రమంగా ఎంజైమ్‌ల్లాంటి జీవ అణువులు భర్తీచేసినట్లు వారు భావిస్తున్నారు.

రేపు ఆర్థికవేత్తలతో ప్రధాని మోదీ భేటీ

దిల్లీ: కేంద్ర బడ్జెట్ సమర్పణకు ఇంకా మూడు వారాల సమయమే ఉన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఆర్థికవేత్తలతో సమావేశం కానున్నారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్, ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. అభివృద్ధి మందగించిందని గణాంకాలు వెల్లడించిన దృష్ట్యా ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఉద్యోగాల కల్పన, ఆర్థిక ప్రగతి ఉద్దీపనపై చర్చించనున్నారు.

ఈపీఎస్-95 పింఛనుదారులకు పెరగనున్న నెలసరి మొత్తం!

దిల్లీ: ఈపీఎస్-95 కింద పింఛను పొందుతున్న వారందరికీ తాత్కాలిక వెసులుబాటుగా నెలకు కనీసం రూ.5 వేలు లభించే అవకాశం ఉంది. ఆఖరుకు ఈ మొత్తం రూ.7,500లకు చేరుకోవచ్చు. కేంద్ర కార్మికశాఖ ఇచ్చిన హామీల నేపథ్యంలో ఈ దిశగా కసరత్తు చేస్తున్నట్లు 'ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో)' సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈపీఎఫ్ నిర్వహిస్తున్న 'పింఛను పథకం 1995' (ఈపీఎస్-95) ప్రస్తుతం నెలకు రూ.1000లను పింఛనుగా ఇస్తున్నారు.

పాత్రికేయుల భావస్వేచ్ఛను కొనసాగనీయాలి: సుప్రీం

దిల్లీ: పాత్రికేయుల భావ స్వేచ్ఛ హక్కును కొనసాగించాలని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. కొన్నిసార్లు కొన్ని రకాల తప్పుడు వార్తలు వచ్చినప్పటికీ ఈ స్వేచ్ఛను హరించకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీనియర్ జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయి, రాఘవ్ బహల్ తదితరులపై బిహార్ మాజీ మంత్రి కుమార్తె అయిన రహమత్ ఫాతిమా అమానుల్లా దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్య చేసింది. తనకు వ్యతిరేకంగా టీవీలో వార్తలు ప్రసారం చేశారంటూ ఆమె పట్నా హైకోర్టును ఆశ్రయించగా దానిని ఆ న్యాయస్థానం కొట్టివేసింది. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా ఆ కోర్టు కూడా తిరస్కరించింది.

పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాం

న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్

పత్రికా స్వేచ్ఛకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. అదే సమయంలో ఆధార్ సమాచారం సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కొందరు వ్యక్తులు ఆధార్ సమాచారాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారంటూ వార్త ఇచ్చిన విలేకరిపై కేసు పెట్టడంపైన ఆయన ట్వీట్ ద్వారా స్పందించారు. 'గుర్తు తెలియని' వ్యక్తులపై కేసు పెట్టారని తెలిపారు. నిజమైన దోషులను పట్టుకొనేందుకు సహకరించాల్సిందిగా వార్త ప్రచురించిన ట్రిబ్యూన్ పత్రికను, ఆ విలేకరిని కోరాలని ఆయన కేసు పెట్టిన ఉడాయ్ సంస్థకు సూచించారు. ఈ సూచనను పాటిస్తామని ఉడాయ్ తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేశామంటే సమాచారం తెచ్చినవారిని కాల్చినట్లు కాదని పేర్కొంది. విలేకరిపై కేసు పెట్టడాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ న్యూస్ పేపర్ అండ్ న్యూస్ ఏజెన్సీ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్స్ ఖండించింది. విలేకరిపై కేసు పెట్టడం ఏమిటని భాజపా ఎంపీ శత్రుఘ్న సిన్హా ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఏఎంయు పరిశోధక విద్యార్థి బషీర్ వని బహిష్కరణ

అలీగఢ్(యూపీ): అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం (ఏఎంయు)లో పరిశోధక విద్యార్థిగా ఉన్న కశ్మీరు యువకుడు మన్నాన్ బషీర్‌వని (26) సోమవారం బహిష్కరణకు గురయ్యారు. తీవ్రవాద సంస్థ 'హిజ్‌బుల్ ముజాహిదీన్'లో చేరాడన్న అనుమానాల నేపథ్యంలో అతడిని వర్సిటీ నుంచి బహిష్కరించారు. ఏకె-47 రైఫిల్‌ను చేత ధరించి ఉన్న బషీర్‌వని ఫోటో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమైనారు. వర్సిటీఆవరణలోని అతడి గదిని సీల్ చేశారు.

ట్రంప్ భవనంలో అగ్నిప్రమాదం!

న్యూయార్క్: ఇక్కడి ట్రంప్ టవర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సోమవారం ఉదయం ఏడుగంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక విభాగం తెలిపింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసం, వాణిజ్య కార్యాలయాలున్న ఈ భవంతిలోని ఉష్ణ, ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థల్లో అగ్నిప్రమాదం జరిగింది. తక్షణం రంగంలోకి దిగిన అగ్నిమాపక, ఇతర అధికారులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

మహాత్ముని మరణంపై పునర్విచారణ అవసరం లేదు

- సుప్రీంకోర్టుకు తెలిపిన సీనియర్ న్యాయవాది

దిల్లీ: గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పుల వల్లనే మహాత్మాగాంధీ చనిపోయారన్న వాదనలకు ఎలాంటి ఆధారం లేదని సీనియర్ న్యాయవాది అమరేంద్ర శరాన్ సోమవారం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పునర్విచారణ అవసరం లేదని తెలిపారు. మహాత్మాగాంధీ హత్యపై పునఃవిచారణ జరిపించాలని కోరుతూ ఐటీ సలహాదారు డాక్టర్ పంకజ్ కుముద్ చంద్ర ఫడ్నీస్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఆయన కోర్టు మిత్రునిగా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావులతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. గుర్తుతెలియని వ్యక్తి జరిపిన నాలుగో బుల్లెట్ కారణంగానే మహాత్ముడు మరణించాడని, ఈ వ్యవహారంలో బ్రిటన్‌కు చెందిన ప్రత్యేక నిఘా సంస్థ 'ఫోర్సు 136'కు ప్రమేయం ఉందన్న వాదనలకు ఆధారాలు లేవని తెలిపారు. నాథూరాం గాడ్సే తుపాకీతో కాల్చిన మూడు తూటాల కారణంగా గాంధీ చనిపోయినట్లు నిర్ధరణ జరగగా, దీనిపై మళ్లీ విచారణ జరపాలని పిటిషన్‌దారు కోరారు. తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది.

నేరగాళ్లు పార్టీలు నడపకుండా నిరోధించడంపై ఆలోచించండి

శిక్ష పడ్డ వ్యక్తులు పార్టీలు నడపకుండా, పార్టీల్లో పదవులు చేపట్టకుండా నిరోధించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై శ్రద్ధతో ఆలోచించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోరింది. దీనిపై నోటీసులు పంపినా కేంద్రం, ఎన్నికల సంఘాలు సమాధానం ఇవ్వకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. విచారణను ఈనెల 12కు వాయిదా వేసింది.

థియేటర్లలో జాతీయ గీతాలాపన ఆదేశాలను సవరించండి

సినిమా థియేటర్లలో ప్రతి ప్రదర్శనకు ముందు జాతీయ గీతం ఆలాపనను తప్పనిసరి చేస్తూ న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం కోరింది. 'జనగణమన' ప్రదర్శన/ఆలాపనకు సంబంధించిన నిబంధనల ఖరారుకు అంతర్ మంత్రిత్వశాల సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేసింది. సంప్రదింపులకు, సిఫార్సులు రూపొందించేందుకు ఈ సంఘానికి ఆరు నెలల గడువు అవసరమని పేర్కొంది. జాతీయ గీతాలాపన అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం ముందు మంగళవారం విచారణ జరుగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రమాణ పత్రం (అఫిడవిట్) దాఖలుచేసింది. అన్ని సినిమా థియేటర్లలో జాతీయగీతాన్ని ఆలపించాలని, ఆ సమయంలో ప్రేక్షకులు నిలబడి దేశభక్తిని చాటాలని 2016 నవంబరు 30న సుప్రీం కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులకు మార్పులు అవసరమనే అభిప్రాయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గత అక్టోబరులో అభిప్రాయపడింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయమేమిటో తెలియజేయాలని కోరింది. దీనిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ప్రమాణ పత్రాన్ని దాఖలు చేసింది.

స్వలింగ సంపర్కం తీర్పుపై పునఃసమీక్ష

- సుప్రీం కోర్టు నిర్ణయం

దిల్లీ: పరస్పర ఆమోదంతో ఇద్దరు వయోజనులు స్వలింగ సంపర్కానికి పాల్పడడాన్ని నేరంగా పరిగణించరాదని కోరుతూ దాఖలైన విజ్ఞాపన (పిటిషన్)ని విస్తృత ధర్మాసనానికి బదలాయించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. తద్వారా- ఇది నేరమేనంటూ 2013లో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించనుంది. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా స్త్రీ, పురుషుడు, లేదా జంతువులతో అసహజ లైంగిక చర్యకు ఉపక్రమించేవారికి జైలుశిక్ష, జరిమానా విధించాలని పేర్కొంటున్న ఐపీసీ 377 సెక్షన్‌ను విస్తృత ధర్మాసనం పరిశీలించడమే సబబని అభిప్రాయపడింది. ఈ సెక్షన్‌ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని నవ్‌తేజ్‌సింగ్ అనే వ్యక్తి విజ్ఞాపన చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం దీనిని విచారించింది. పరస్పర ఆమోదంతో అసహజ లైంగిక చర్యకు పాల్పడినవారిని జైల్లో పెట్టడం తగదనీ, లైంగిక భాగస్వామిని ఎంచుకునే హక్కు ప్రాథమిక హక్కేనంటూ ఇటీవల తొమ్మండుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం కూడా పేర్కొందనీ సింగ్ తరపు న్యాయవాది అరవింద్ దటార్ గుర్తుచేశారు. సామాజిక నైతికత అనేది కాలంతో పాటు ఎప్పటికప్పుడు మారుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2013 నాటి తీర్పును సవరించాల్సిందిగా కోరుతూ దాఖలైన విజ్ఞాపన ప్రస్తుతం అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం వద్ద ఉందనీ, తాజా పిటిషన్‌నూ అదే ధర్మాసనం విచారిస్తుందనీ తెలిపింది. స్వలింగ సంపర్కం శిక్షార్హమా కాదా అనే తుది నిర్ణయం అక్కడే వెలువడుతుందని పేర్కొంది. జంతువులతో, పిల్లలతో లైంగిక చర్య విషయాన్ని మాత్రం విస్తృత ధర్మాసనానికి నివేదించడం లేదని స్పష్టంచేసింది.

ఆహ్వానించిన న్యాయకోవిదులు: స్వలింగ సంపర్కంపై మునుపటి తీర్పును సమీక్షించాలన్న నిర్ణయాన్ని రాజీవ్ ధావన్, ఆనంద్ గ్రోవర్, దుష్యంత్ దవే, కామిని జైస్వాల్ తదితర న్యాయకోవిదులు ఆహ్వానించారు. సామాజికంగా, న్యాయపరంగా ఇది అత్యంత ప్రాధాన్యం ఉన్న అంశమని పేర్కొన్నారు. ఐపీసీ 377 సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమనీ, ఎవరూ ఎలాంటి పరిస్థితుల్లోనూ దీనికి సమర్థించలేరని దవే చెప్పారు. ఇలాంటి సెక్షన్‌కు 21వ శతాబ్దంలో చోటు లేదని కాంగ్రెస్ పేర్కొంది.



నెహ్రూ రాసిన పుస్తకాలను బహ్రెయిన్ యువరాజుకు బహూకరిస్తున్న రాహుల్‌గాంధీ

బహ్రెయిన్ యువరాజుతో రాహుల్ భేటీ

మనామా: బహ్రెయిన్ యువరాజు షేక్ సల్మాన్ బిన్ హమద్ అల్ ఖలీఫాతో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం నాడిక్కడ సమావేశమయ్యారు. రెండు దేశాలకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తొలిసారి విదేశీ పర్యటనకు ప్రభుత్వ అతిథిగా వచ్చిన రాహుల్... బహ్రెయిన్ విదేశాంగ మంత్రి షేక్ ఖలీద్ బిన్ అహ్మద్ అల్ ఖలీఫాతో కూడా భేటీ అయ్యారు. రాజు హమాస్ బిన్ ఇసా అల్ ఖలీఫానూ ఆయన కలుసుకునే అవకాశాలున్నాయి.

రూపాయి నాణేన్ని ఇక తీసుకోం.. యూపీలో యాచకుల నిర్ణయం

రామ్‌పుర్: పరిమాణం చిన్నదిగా ఉందంటూ ఉత్తర్ ప్రదేశ్‌లోని రామ్‌పుర్‌లో యాచకులు రూపాయి నాణేన్ని తీసుకోరాదని నిర్ణయించారు. "నాడు ప్రధాని మోదీ పెద్దనోట్లను రద్దుచేస్తే.. ఇప్పుడు మేము రూపాయి నాణేన్ని అంగీకరించవద్దనుకున్నాం." అని ఓ యాచకుల బృందం తెలిపింది. 50 పైసల నాణెమంత ఉన్న రూపాయిని దుకాణదారులు, రిక్షావాళ్లు సైతం తీసుకోవడం లేదని చెబుతున్నారు.

బెంగళూరు బార్‌లో అగ్నిప్రమాదం

ఐదుగురు కార్మికుల సజీవదహనం

ఈనాడు, బెంగళూరు: బెంగళూరులోని కైలాశ్ బార్‌లో సోమవారం తెల్లవారు జామున సంభవించిన అగ్ని ప్రమాదంలో నిద్రిస్తున్న ఐదుగురు సిబ్బంది సజీవ దహనమయ్యారు. మృతులను తుమకూరు జిల్లా గుబ్బికి చెందిన స్వామి (23), ప్రసాద్ (20), మహేష్ (35), హసన్ నివాసి మంజునాథ్ (45), మండ్య నివాసి కిర్తి (24)గా గుర్తించారు. సోమవారం ప్రమాదం సంభవించిన పానశాల భవంతి ఏడు దశాబ్దాల కిందట కట్టింది. బార్‌లోకి వెళ్లేందుకు, వచ్చేందుకు ఒక్కటే మార్గం ఉంది. అగ్ని మాపక, విద్యుత్తు శాఖలు సూచించిన భద్రత చర్యల్ని అమలు చేయక పోవటమే ప్రమాదానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ప్రమాదాలు సంభవించినపుడు కాస్త హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత పట్టించుకోపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.